ఈనాడు

విజయవాడ 18-11-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 98
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పవిత్ర యాత్రలో పెను విషాదం

ఉమ్రా యాత్రకు వెళ్లిన 45 మంది హైదరాబాదీల సజీవ దహనం

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం

- డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న యాత్రికుల బస్సు
- మదీనాకు 25 కి.మీ. దూరంలో ఘటన
- ప్రాణాలతో బయటపడిన డ్రైవర్, మరో యువకుడు



డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు

ఈనాడు, హైదరాబాద్: భార్యాభర్తలు... తాతామనవళ్లు.. యువతీ యువకులు... పెద్దలూపిల్లలు కలిసి... కుటుంబసమేతంగా బయలుదేరిన ఉమ్రా పవిత్ర యాత్ర... అంతిమయాత్రగా మారింది. సౌదీ అరేబియాలోని మక్కాలో పవిత్ర స్థలాలను దర్శించుకుని, ప్రార్థనా మందిరాల్లో ప్రార్థనలు చేసి... మదీనాకు బయలుదేరగా మార్గంమధ్యలో అంతులేని విషాదం చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్ వాసులు సజీవదహనమయ్యారు. మక్కా నుంచి ప్రయాణిస్తున్న బస్సు భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు) మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలోని ముఫ్రిహత్ ప్రాంతంలో ముందు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఒక్కసారిగా బస్సంతా మంటలు వ్యాపించడంతో క్షణాల వ్యవధిలో దగ్ధమైంది. 45 మంది కాలిపోయారు. డ్రైవర్‌తో పాటు షోయబ్ అనే యువకుడు బస్సు అద్దాలు బద్దలు కొట్టి... కిందికి దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. ఘటనపై ఓ కారు డ్రైవర్ పోలీసులకు సమాచారమిచ్చాడు. వారు వచ్చేలోపు బస్సు, ట్యాంకర్ (మిగతా 3లో)

బస్సు ప్రమాద ఘటనపై ప్రధాని, పలువురు ప్రముఖుల దిగ్భ్రాంతి 3లో



మక్కా వెళ్లడానికి ముందు శంషాబాద్ విమానాశ్రయంలో నజీరుద్దీన్ కుటుంబం తీసుకున్న చిత్రం

మూడు తరాలు బుగ్గి


ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి

ఈనాడు, హైదరాబాద్: ఒక్క ప్రమాదం... మొత్తం మూడు తరాలను తుడిచిపెట్టింది. సౌదీ అరేబియాలో జరిగిన ఘోర ప్రమాదం హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి నజీరుద్దీన్ కుటుంబానికి అంతులేని విషాదం మిగిల్చింది. అమెరికాలో ఉంటున్న నజీరుద్దీన్ పెద్ద కుమారుడు సిరాజుద్దీన్ ఒక్కడే మిగిలాడు. ఈ ప్రమాదంలో (మిగతా 3లో)

'పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ'

నిధుల విడుదల రేపే

- కమలాపురంలో కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు
- 46.86 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135 కోట్లు



ఈనాడు, అమరావతి: పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ నిధులు ఈ నెల 19న విడుదల కానున్నాయి. రైతుల ఖాతాల్లోకి కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేల చొప్పున జమ చేయనున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 46.86 లక్షల మంది కర్షకుల ఖాతాలకు రూ.7 వేల చొప్పున మొత్తం రూ.3,135 కోట్లు జమ చేస్తామని ప్రభుత్వం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ కింద ఆగస్టులో మొదటి విడతగా రూ.3,174 కోట్లు విడుదలయ్యాయి. రెండు విడతల్లో కలిపి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి రూ.6,309.44 కోట్లు వెచ్చిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొనాలని సీఎం చంద్రబాబు సూచించారు.

రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం

నిధుల విడుదల కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 10 వేలకు పైగా రైతు సేవా కేంద్రాల్లో(ఆర్ఎస్‌కే) ప్రత్యక్ష ప్రసారం చేయాలని సీఎం చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. 'రైతుల ఖాతాల్లోకి నిధులు మాత్రమే కాకుండా.. వ్యవసాయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు కూడా అందులో వివరించేలా కార్యక్రమం రూపొందించి ప్రసారం చేయాలి. అగ్రిటెక్, డిమాండ్ ఉన్న పంటల సాగు, మార్కెట్ సౌకర్యాల పెంపు, ప్రకృతి సేద్యం, భూసార పరీక్షలు, పంట ఉత్పత్తులకు (మిగతా 3లో)

జాబ్ క్యాలెండర్‌పై కసరత్తు

- విభాగాల వారీగా ఖాళీల వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- నేరుగా నియామకాలకు వచ్చే పోస్టుల్లో 99 వేల ఖాళీలు
- 24 శాఖల వివరాలు పెండింగ్

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. విభాగాల వారీగా ఖాళీల సమాచారాన్ని తీసుకుంటోంది. ఆయా శాఖల్లో మంజూరైన పోస్టులు, ఖాళీలు, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను సేకరిస్తోంది. ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని నిధి హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయిస్తోంది. ఇప్పటికే కొన్ని విభాగాలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా.. మరికొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయి. మంజూరు పోస్టులు, ఖాళీల వివరాలను పోర్టల్‌లో పెట్టారు. వీటిని ఆయా విభాగాధిపతులు నిర్ధారించాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం మేరకు అన్ని శాఖల్లో కలిపి 30% వరకు ఖాళీలుండగా.. వీటిలో కొన్ని పోస్టుల్లో కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇప్పటి వరకు 157 విభాగాల మంజూరు పోస్టులు, ఖాళీల వివరాలను నిర్ధారించాయి. (మిగతా 3లో)

షేక్ హసీనాకు మరణశిక్ష

- బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ తీర్పు
- ఆమె అమానవీయంగా నేరాలకు పాల్పడ్డారని వ్యాఖ్య
- మాజీ ప్రధానిని తమకు అప్పగించాలంటూ భారత్‌ను కోరిన యూనస్ ప్రభుత్వం

ఢాకా

ఏడాదిన్నరగా అంతర్గత అల్లర్లతో అట్టుడుకుతోన్న బంగ్లాదేశ్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. విద్యార్థుల ఉద్యమం కారణంగా గతేడాది ఆగస్టు 5న ప్రధాని పదవిని వదలి భారత్‌కు పరారైన షేక్ హసీనాకు.. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ (ఐసీటీ) సోమవారం మరణశిక్ష విధించింది. విద్యార్థుల తిరుగుబాటు సమయంలో ఆమె అమానవీయంగా నేరాలకు పాల్పడ్డారని, హింసను ప్రేరేపించారని, విద్యార్థులపై దాడులు చేయించారని, హత్యలకు ఆదేశాలిచ్చారని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం మోపిన అభియోగాలను 453 పేజీల తీర్పులో ట్రైబ్యునల్ నిర్ధారించింది.



హసీనాపై మోపిన ఐదు కేసులను విచారించిన ముగ్గురు సభ్యుల ఐసీటీ.. రెండింటిలో ఆమెకు మరణశిక్షను ఖరారు చేసింది. హసీనాతో పాటు.. నాటి ప్రభుత్వంలో హోంమంత్రిగా పనిచేసిన అసదుజ్జమాన్ ఖాన్ కమాల్‌కు కూడా మరణ శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించింది. వీరిద్దరి ఆస్తులను జప్తు చేయాలని కూడా ఆదేశించింది. విచారణలో ప్రభుత్వ సాక్షిగా మారిన అప్పటి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్.. చౌధరీ అల్ మామూన్‌కు మాత్రం ఐదేళ్ల జైలు శిక్షతోనే సరిపెట్టింది. తనకు మరణశిక్ష విధించడంపై 78 ఏళ్ల హసీనా మండిపడ్డారు. ఇది రాజకీయ ప్రేరిత తీర్పు అని వ్యాఖ్యానించారు. (మిగతా 3లో)

రిజర్వేషన్ల పరిమితి 50% మించొద్దు

అతిక్రమిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్ని రద్దు చేస్తాం

మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హెచ్చరిక

దిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్ల పరిమితిని పాటించాల్సిందేనని మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ పరిమితిని ఉల్లంఘిస్తే వచ్చే నెలలో జరగనున్న ఎన్నికలను రద్దు చేస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం హెచ్చరించింది. 2022లో బంఠియా కమిషన్ నివేదిక సమర్పణకు ముందున్న పద్ధతి ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని తెలిపింది. ఓబీసీ కేటగిరీ కింద 27శాతం సీట్లు కేటాయించాలని ఆ కమిషన్ నివేదిక సిఫార్సు చేసింది. అయితే, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50శాతాన్ని మించరాదు. రాజ్యాంగ ధర్మాసనం (మిగతా 3లో)

డిజిటల్ అరెస్ట్ బెదిరింపులతో రూ.32.83 కోట్ల దోపిడీ!

మహిళా టెకీ నుంచి కొల్లగొట్టిన మాయగాళ్లు

ఆరేళ్లలో 21 వేల సినిమాలు పైరసీ

నిందితుల వద్ద ఐబొమ్మ, బప్పం వీక్షించిన 50 లక్షల మంది డేటా

రూ.లక్షలు ఖర్చు చేసి కరేబియన్ దేశ పౌరసత్వం

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి మాస్టర్‌మైండ్: హైదరాబాద్ సీపీ సజ్జనార్

12లో

మొబైల్ ఐఎంఈఐ నంబర్ మారిస్తే మూడేళ్ల జైలు

రూ.50 లక్షల జరిమానా: డాట్



దిల్లీ: సెల్‌ఫోన్ గుర్తింపునకు కీలకమైన 15 అంకెల ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) వంటివి మార్చడం నాన్‌బెయిలబుల్ నేరాల కిందకు వస్తుందని టెలికాం విభాగం (డాట్) సోమవారం తెలిపింది. ఈ నేరాలకు పాల్పడిన వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా లేక రెండు శిక్షలు కలిపి విధించొచ్చని హెచ్చరించింది. ఐఎంఈఐ విషయంలో చట్ట నిబంధనలకు కట్టుబడి ఉండాలని సెల్‌ఫోన్ తయారీసంస్థలు, బ్రాండ్ యజమానులు, (మిగతా 3లో)

అమరావతిలో... క్వాంటమ్ కంప్యూటర్ పెడతాం

- అప్లికేషన్స్, అల్గారిథమ్స్ రూపొందిస్తాం
- క్వాంటమ్ సప్లై చైన్‌కి విడిభాగాలు తయారుచేస్తాం
- 'ఈనాడు' ముఖాముఖిలో.. పాస్కల్ కంపెనీ ఆసియా-పసిఫిక్ సీఈఓ రాబర్టో మావ్రో వెల్లడి



ఈనాడు - అమరావతి

అమరావతిలో నెలకొల్పనున్న క్వాంటమ్ వ్యాలీలో తమ సొంత క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తామని ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ సంస్థ 'పాస్కల్' ఆసియా-పసిఫిక్ సీఈవో రాబర్టో మావ్రో చెప్పారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వంతో కలసి పనిచేసేందుకు ఇటీవల విశాఖ భాగస్వామ్య సదస్సులో పాస్కల్ ఒప్పందం చేసుకున్న సందర్భంగా 'ఈనాడు'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలివీ...

భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు..

న్యూట్రల్-ఆటమ్ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల్లో మాదీ ఒకటి. మా కంపెనీ సహ వ్యవస్థాపకుల్లో ఒకరు భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత. మా కేంద్ర కార్యాలయం ఫ్రాన్స్‌లో ఉంది. (మిగతా 3లో)

తదుపరి దర్యాప్తునకు అభ్యంతరం లేదు

వివేకా హత్య కేసులో సునీల్‌యాదవ్ వాదన

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలంటూ ఆయన కుమార్తె సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తమకు అభ్యంతరం లేదని రెండో నిందితుడు యాదాటి సునీల్‌యాదవ్ సీబీఐ కోర్టుకు సోమవారం నివేదించారు. అయితే ఎన్ఐఏ సహకారంతో పారదర్శకంగా అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించాలని, అలా జరిగితే తాను నిర్దోషిగా బయటపడతానని తెలిపారు. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలంటూ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం సోమవారం విచారణ చేపట్టారు. సునీల్‌యాదవ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ వివేకా హత్యకు కుటుంబసభ్యులు, సన్నిహితుల సహకారం ఉందని, అంతేగాకుండా ఆయన వ్యక్తిగత జీవితంలోని అంశాలు, ఆర్థిక లావాదేవీలు కూడా కారణమని, వాటన్నింటిపై దర్యాప్తు జరపాలని కోరారు. సాక్షులకు రక్షణ కల్పించకపోవడం, జైలులో దస్తగిరికి కొందరు ముడుపులు ఇవ్వజూపడం సహా అన్ని అంశాలపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడో నిందితుడైన గజ్జల ఉమాశంకర్‌రెడ్డి వాదనల నిమిత్తం విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. సునీత తరఫున న్యాయవాది ఎస్.గౌతం హాజరయ్యారు.

డిసెంబర్ 31 వరకు బెలూన్ ప్రయోగాలు

ఈనాడు, అమరావతి: టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్), అణుశక్తి విభాగం, ఇస్రో సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 31 వరకూ శాస్త్రీయ బెలూన్ ప్రయోగాలు నిర్వహించనున్నట్టు హైదరాబాద్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ శాస్త్రవేత్త డా.టి.వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన పరికరాలు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, వైఎస్సార్ కడప, విశాఖ జిల్లాల్లో పడొచ్చని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా వీటిని గమనిస్తే సమీపంలోని పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్, జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజల్ని కోరారు. అలా ఇచ్చిన వారికి తగిన నగదు బహుమతి, రవాణా ఖర్చులు చెల్లిస్తామన్నారు.



తిరుచానూరులో ప్రారంభమైన కార్తిక బ్రహ్మోత్సవాలు

అమ్మవారి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు సోమవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి సకల దేవతలను ఉత్సవాలకు ఆహ్వానించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన గజపటాన్ని ఎగురవేశారు. యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. స్నపన తిరుమంజనం కనువిందుగా సాగింది. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ అవకాశం దక్కడాన్ని పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు.



పట్టు వస్త్రాలతో వస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సతీష్‌కుమార్ ఫోన్‌లో ఏముంది?

- 6వ తేదీ విచారణ తర్వాత ఎవరెవరితో మాట్లాడారు?
- తితిదే మాజీ ఏవీఎస్వో హత్య కేసులో తాడిపత్రి పోలీసుల దర్యాప్తు

ఈనాడు, అనంతపురం: తితిదే మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ హత్య కేసును సోమవారం తాడిపత్రి పోలీసులకు బదిలీ చేశారు. ఘటనలో సతీష్‌కుమార్ సెల్‌ఫోన్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో అందులోని డేటాను సేకరించడం పోలీసులకు వీలుపడలేదు. ఆ ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పరకామణిలో జరిగిన చోరీ కేసులో సతీష్‌కుమార్ ఈ నెల 6న విచారణకు హాజరయ్యారు. విచారణలో ఆయన ఇచ్చిన సమాచారం వైకాపాలోని కొందరి మెడకు చుట్టుకునే అవకాశం ఉందనే ప్రచారం అప్పట్లో జరిగింది. ఈ నేపథ్యంలో 14న మరోసారి విచారణకు హాజరుకావాల్సిన ఆయన రైలు పట్టాల పక్కన శవమై కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. పరకామణి కేసు కోణంలోనే పోలీసులు సతీష్‌కుమార్ మొబైల్ డేటాను విశ్లేషిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. 6 నుంచి 13వ తేదీ అర్ధరాత్రి వరకు సతీష్ ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారు? మెసేజ్‌లు, వాట్సప్, ఇంటర్నెట్ కాల్స్ డేటాను పరిశీలిస్తున్నారు. మరోవైపు ఆ రోజు రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన పాత నేరస్థులను పోలీసులు విచారిస్తున్నారు. మొత్తం 13 మందిని గుర్తించినట్లు తెలిసింది.

2 గంటల ముందే బయలుదేరారు

పరకామణి కేసులో 14న విచారణకు హాజరు కావాలనే సందేశం అందిన వెంటనే సతీష్‌కుమార్ గుంతకల్లు నుంచి తిరుపతికి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకున్నారు. 13న అర్ధరాత్రి ఒంటి గంటకు రైలెక్కారు. అయితే ఆయన అంతకు రెండు గంటల ముందే ఇంటి నుంచి బయలుదేరినట్లు పోలీసుల విచారణలో తేలింది. గుంతకల్లు హనుమాన్‌నగర్ సర్కిల్‌లోని ఓ కేఫ్‌కు ఆ రోజు రాత్రి 11.21 గంటలకు వచ్చి 5 నిమిషాల వరకు టీ తాగిన దృశ్యాలను పోలీసులు సేకరించారు. గుంతకల్లులోనే నివాసం ఉంటున్న సతీష్‌కుమార్ రెండు గంటల ముందే రైల్వేస్టేషన్‌కు ఎందుకు బయలుదేరారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.



13వ తేదీ రాత్రి 11.25 గంటల సమయంలో గుంతకల్లులోని ఓ టీ కేఫ్‌లో సతీష్‌కుమార్

పోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పోక్సో కేసులో నేరం రుజువైన దోషికి 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ విజయవాడ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. పోలీసుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా ముస్తాబాదకు చెందిన పులివర్తి ప్రశాంత్.. కిరాణా దుకాణం నిర్వహించేవాడు. గతేడాది తన దుకాణం వద్దకు సామగ్రి కోసం వచ్చే బాలిక(17)ను లోబర్చుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆ బాలికను కుటుంబీకులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించగా గర్భిణి అని తేలింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై పోక్సో కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో ప్రశాంత్‌కు 20 ఏళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ విజయవాడ పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి వి.భవాని తీర్పు చెప్పినట్లు ఎస్సై శ్రీధర్ వెల్లడించారు.

జాతీయ క్రీడా పోటీల్లో గిరిజన విద్యార్థుల సత్తా

- 36 బంగారు, 42 వెండి, 40 కాంస్య పతకాలు కైవసం

ఈనాడు, అమరావతి: ఒడిశాలోని రవూర్కెలాలో జరిగిన నాలుగో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) జాతీయ క్రీడా మహోత్సవంలో రాష్ట్ర గిరిజన విద్యార్థులు అదరగొట్టారు. 36 బంగారు, 42 వెండి, 40 కాంస్య పతకాలు కలిపి మొత్తం 118 పతకాలు సాధించి సత్తా చాటారు. ఖోఖో అండర్-19 విభాగంలో బంగారు పతకాన్ని పొందారు. ఇదే కేటగిరీలో వాలీబాల్ ఆటలో బాలురు, బాలికలు వేర్వేరుగా వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ నెల 11 నుంచి 15 వరకు జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి 210 మంది బాలికలు, 218 మంది బాలురు మొత్తం 20 ఈవెంట్లలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రతిభ చూపడం పట్ల గిరిజన గురుకుల సొసైటీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.



ఖోఖో అండర్-19 విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన రాష్ట్ర గిరిజన విద్యార్థులతో చింతూరు ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపల్ దలీప్ సింగ్, అరకు స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ పీఎస్ఎన్ మూర్తి, బుట్టాయగూడెం ఈఎంఆర్ఎస్ పీడీ ఎస్.రాధిక, జీలుగుమిల్లి ఈఎంఆర్ఎస్ పీడీ వై.సత్యనారాయణ

రాజమహేంద్రవరంలో పైలట్ల శిక్షణ కేంద్రం

రూ.100 కోట్లతో ఏర్పాటుకు ముందుకొచ్చిన జార్విస్ సంస్థ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పైలట్ల శిక్షణ కేంద్రాన్ని రూ.100 కోట్లతో జార్విస్ ఏవియేషన్ సంస్థ ఏర్పాటు చేయనుంది. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ కంపెనీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. సోమవారం రాజమహేంద్రవరంలో.. అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో నిర్వహించిన సమావేశంలో జార్విస్ ఏవియేషన్ సంస్థ అధినేత ఫణీంద్ర ఆరుమిల్లి ఈ వివరాలు వెల్లడించారు. మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు దీనికి సంబంధించి సహకారం అందించారన్నారు. విశాఖలో తమ సంస్థ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నట్లు చెప్పారు. రాజమహేంద్రవరంలో శిక్షణ కేంద్రం కార్యకలాపాలు జనవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఏప్రిల్, మే నాటికి 40 మందితో మొదటి బ్యాచ్ ప్రారంభిస్తామని తెలిపారు. శిక్షణ కేంద్రానికి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులో స్థలం కేటాయించిందన్నారు. రూ.100 కోట్లతో పది విమానాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా 600 మందికి ఉపాధి కలుగుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.



ఎంవోయూను చూపుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఫణీంద్ర ఆరుమిల్లి

బ్యాంకు గ్యారంటీతో స్థిరాస్తి పత్రాల విడుదలకు అనుమతి

జగతి, జనని, ఇందిరా టెలివిజన్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: వైకాపా అధినేత జగన్ అక్రమాస్తుల కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ స్తంభింపజేసిన జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్ కరెంట్ ఖాతాల నిర్వహణ నిమిత్తం హామీగా సమర్పించిన రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన స్థిరాస్తి పత్రాలను రూ.4.95 కోట్లకు బ్యాంకు గ్యారంటీ తీసుకుని విడుదల చేయాలంటూ సీబీఐ కోర్టును తెలంగాణ హైకోర్టు సోమవారం ఆదేశించింది. బెంగళూరు సమీపంలో నల్లూరులోని రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన రూ.6.30 కోట్ల విలువైన 9 ఎకరాల స్థిరాస్తి పత్రాలకు బదులుగా నిందితులుగా ఉన్న కంపెనీల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని ఆదేశాల్చింది. 2012లో ఇదే కోర్టు ఆదేశాలతో హామీగా సమర్పించిన రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన మూడు స్థిరాస్తులను విడుదల చేయాలంటూ జగతి పబ్లికేషన్స్, జనని ఇన్‌ఫ్రా, ఇందిరా టెలివిజన్‌లు పిటిషన్లు వేశాయి. వీటిపై జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదిస్తూ తమ ఖాతాలకు రేవన్ ఇన్‌ఫ్రా ఇచ్చిన హామీ ఉపసంహరించుకుంటున్నందున ప్రత్యామ్నాయంగా బ్యాంకు గ్యారంటీ లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను గ్యారంటీగా ఇస్తామన్నారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదిస్తూ, సండూర్ కంపెనీ నుంచి క్లాసిక్ రియాల్టీ, దాన్నుంచి రేవన్ ఇన్‌ఫ్రాకు నిధులు వచ్చాయన్నారు. అందువల్ల ఇది జగన్ అక్రమాస్తుల కేసులో నేరపూరిత సొమ్మేనని, కేసు విచారణ పూర్తయ్యేదాకా ఆస్తుల పత్రాలను విడుదల చేయరాదని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రేవన్ ఇన్‌ఫ్రా ఆస్తులకు ప్రత్యామ్నాయంగా పిటిషనర్ కంపెనీలు బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తున్నందున దర్యాప్తు సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. పిటిషనర్ల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకుని రేవన్ ఇన్‌ఫ్రా స్థిరాస్తి పత్రాలు విడుదల చేయాలని ఆదేశించారు.

సచివాలయ ఉద్యోగులకు అంతర్ జిల్లా బదిలీలు

- స్పౌజ్ కోటాలో చేపట్టేందుకు అనుమతి
- ఈ నెల 30 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో అంతర్ జిల్లా బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భార్య/భర్త ఆధారంగా స్పౌజ్ కోటా కింద ఉద్యోగులకు స్థానచలనం కల్పించనుంది. బదిలీల ప్రక్రియను ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. కోరుకున్న స్థానంలో ఖాళీలు ఉంటేనే బదిలీ వర్తించనుంది. ఈ మేరకు రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాలశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకట్రెండు రోజుల్లో బదిలీల షెడ్యూల్ విడుదల చేయనుంది.

మార్గదర్శకాలివి...

◆ అభ్యర్థన ఆధారంగా పరిశీలన. ◆ ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయాలి. ◆ జిల్లా అధికారులు ఖాళీల వివరాలు స్పష్టంగా ప్రకటించాలి. ◆ ఖాళీలు ప్రకటించడం ద్వారా ఉద్యోగులు తమకు కావాల్సిన మండలాలు, మున్సిపాలిటీలు ఎంపిక చేసుకునే వీలుంటుంది. ◆ ఏసీబీ, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు అనర్హులు. ◆ ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల నుంచి ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలూ లేనట్లుగా ధ్రువీకరణపత్రం తప్పనిసరి. ◆ దరఖాస్తులపైనా అధికారులిద్దరి ధ్రువీకరణతోనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ◆ దరఖాస్తుల పరిశీలన తరవాత ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను పోర్టల్‌లో పెడతారు. ◆ అభ్యంతరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ◆ పరిశీలన అనంతరం సీనియారిటీ ఫైనల్ జాబితా ప్రకటిస్తారు.

వీరు అర్హులు...

◆ భార్యాభర్తలు ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న వారికే బదిలీ వర్తిస్తుంది. ◆ ఒకరు ప్రభుత్వ, మరొకరు ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్నట్లయితే వర్తించదు. ◆ వివాహ ధ్రువీకరణ, ఉద్యోగ గుర్తింపు పత్రం (ఐడీ కార్డు) తప్పనిసరి. ◆ ఖాళీలు ఉన్నప్పుడే బదిలీ చేస్తారు. ◆ మెరిట్ ర్యాంక్ ఆధారంగా క్రమపద్ధతి పాటిస్తారు. ◆ టై అయిన చోట సీనియారిటీ, పుట్టిన తేదీ ఆధారంగా బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

గ్రహం అనుగ్రహం

18-11-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం

త్రయోదశి: ఉ. 6-35 తదుపరి చతుర్దశి; స్వాతి: పూర్తి

వర్జ్యం: ఉ. 11-41 నుంచి 1-26 వరకు; **అమృత ఘడియలు:** రా. 10-12 నుంచి 11-57 వరకు **దుర్ముహూర్తం:** ఉ. 8-24 నుంచి 9-08 వరకు తిరిగి రా. 10-28 నుంచి 11-19 వరకు; **రాహుకాలం:** సా. 3-00 నుంచి 4-30 వరకు

సూర్యోదయం: ఉ.6.10; సూర్యాస్తమయం: సా.5.21

మాస శివరాత్రి, కృష్ణాంగారక చతుర్దశి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.7	27.8
విజయనగరం	17.0	28.0
శ్రీకాకుళం	17.0	29.0
కర్నూలు	17.2	30.7
విశాఖపట్నం	18.4	30.2
విజయవాడ	18.5	29.5
అనంతపురం	19.0	31.3
నరసాపురం	20.0	31.2
ఒంగోలు	21.4	30.7
రాజమహేంద్రవరం	21.5	33.5
గుంటూరు	22.0	29.0
కడప	22.0	29.0
తిరుపతి	22.6	29.8
నెల్లూరు	22.7	28.5
తాడేపల్లిగూడెం	26.0	30.0

లారీ మెకానిక్ కుటుంబంలో విషాదం



మృత్యువాతపడిన మహ్మద్ మస్తాన్, ఆయన భార్య జకియాబేగం, కుమారుడు మహ్మద్ సోహెల్

హైదరాబాద్, న్యూస్‌టుడే: సౌదీ ప్రమాదంలో పాతబస్తీ ఫలక్‌నుమా ఫాతిమానగర్‌కు చెందిన లారీ మెకానిక్ మహ్మద్ మస్తాన్‌తోపాటు ఆయన భార్య జకియాబేగం, కుమారుడు మహ్మద్ సోహెల్ మృత్యువాతపడటంతో స్థానికంగా విషాదం నెలకొంది. పాతబస్తీ తాడుబన్ చౌరస్తా సమీపంలో మెకానిక్ షెడ్‌ను నిర్వహించే మస్తాన్‌కు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. పెద్దకుమారుడు మహ్మద్ అమెరికాలో ఉద్యోగిగా స్థిరపడ్డాడు. మస్తాన్, అతని భార్య జకియాబేగం, బీటెక్ చదువుతున్న చిన్నకుమారుడు మహ్మద్ సోహెల్, తమ బంధువులతో కలిసి ఈ నెల 9న ఉమ్రాయాత్రకు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున సౌదీ నుంచి తమకు ప్రమాద సమాచారం తెలిసిందని మస్తాన్ అల్లుడు మహ్మద్ అయూబుద్దీన్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ మొబీన్ పరామర్శించారు.

తండ్రి మృత్యువాత.. తల్లడిల్లిన పసిహృదయాలు



విషాదంలో సలీం కుమారులు రెహన్‌ఖాన్, ఫైజాన్

చార్మినార్, న్యూస్‌టుడే: పాతబస్తీ మిస్రీగంజ్ సమీపంలోని చందులాల్ బారాదరికి చెందిన మహ్మద్ సలీం ఖాన్(42)తోపాటు ఆయన తల్లి సారా బేగం(60) సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పురానీహవేలీలోని చెప్పుల దుకాణంలో పనిచేస్తున్న సలీంకు ఇద్దరు కుమారులు రెహన్‌ఖాన్(13), ఫైజాన్(11) ఉన్నారు. తండ్రి సలీంతోపాటు నానమ్మ సారాబేగం ఉమ్రాయాత్రకు వెళ్లి సౌదీలో మృతి చెందడంతో పిల్లలు తల్లడిల్లుతున్నారు. తమ బావ, అత్తను ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లడానికి ముందు ఘనంగా సన్మానించామని, ఇప్పుడు కానరాని లోకానికి వెళ్లారంటూ సలీం బావమరిది హమీద్ కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబాన్ని దూద్‌బౌలి కార్పొరేటర్ మహ్మద్ సలీంతో కలిసి బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ మొబీన్ పరామర్శించారు.

పవిత్ర యాత్రలో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

కాలిపోయాయి. తలకు తీవ్ర గాయమైన షోయబ్‌ను సమీపంలోని ఆసుపత్రిలో చేర్చారు. ప్రమాదంపై భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్‌లో పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందింది. దీంతో మృతుల కుటుంబీకులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుల్లో రెండేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల వయసున్న వారున్నారు. ఉమ్రా యాత్రకు వెళ్లినవారిలో మరో 8 మంది మక్కాలోనే ఉండిపోవడంతో వారికి ప్రమాదం తప్పినట్లయింది. ఉమ్రా యాత్రకు వెళ్లిన 45 మంది హైదరాబాద్‌వాసులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని 'తెలంగాణ హజ్ కమిటీ' అధికారులు అధికారికంగా ప్రకటించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వం సచివాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబ సభ్యులను మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్ మొహియుద్దీన్, మాజిద్ హుస్సేన్ పరామర్శించారు. మృతులను గుర్తించేందుకు ప్రతి కుటుంబం నుంచి కనీసం ఇద్దరిని మదీనాకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఘటనపై ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

మక్కా నుంచి మదీనాకు వెళ్తుండగా..

హైదరాబాద్ నగరంలోని టోలీచౌకీ, మురాద్‌నగర్, జిర్రా, అడిక్‌మెట్, నల్లకుంట, విద్యానగర్, బోరబండ, మూసారాంబాగ్ ప్రాంతాలకు చెందిన 54 మంది ఉమ్రా యాత్రకు వెళ్లాలని గత నెలలోనే నిర్ణయించుకున్నారు. ఈ నెల 9న హైదరాబాద్ నుంచి బయలుదేరి 23న తిరిగి చేరుకునేలా షెడ్యూలు రూపొందించుకున్నారు. 9న శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి జెడ్డాకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఈ నెల 10న మక్కాకు వెళ్లారు. అక్కడ ప్రార్థనల అనంతరం చుట్టుపక్కల ప్రాంతాల్లోని పవిత్ర స్థలాలను సందర్శించారు. ఈ నెల 10 నుంచి 16 వరకూ అక్కడే ఉన్నారు. ఆదివారం రాత్రి మదీనాకు బస్సులో బయలుదేరాలనుకున్నారు. 54 మందిలో నలుగురు తమకు ఆరోగ్యం బాగాలేదని, మరుసటి రోజు వస్తామంటూ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. మరో నలుగురు కారులో వస్తామన్నారు. దీంతో డ్రైవర్ సహా 47 మంది బస్సులో బయలుదేరారు. మరికొద్దిసేపట్లో మదీనాకు చేరుకుంటామనగా ముఫ్రిహత్ వద్ద ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను వీరు ప్రయాణిస్తున్న బస్సు వేగంగా ఢీకొనగా... క్షణాల్లో మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి.

గుండెలవిసేలా రోదనలు..


ప్రమాదంతో హైదరాబాద్‌లోని టోలీచౌకీ, నటరాజ్‌నగర్, జిర్రా ప్రాంతాల్లో మృతుల నివాసాల వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు గుండెలవిసేలా రోదించారు. బజార్‌ఘాట్‌లోని అల్‌మీనా ట్రావెల్స్ కార్యాలయానికి, మెహిదీపట్నంలోని ఫ్లైజోన్ కార్యాలయానికి వెళ్లగా... అవి మూసి ఉండటంతో పోలీసులను సంప్రదించారు. తమకేం తెలీదని వారు చెప్పడంతో కనీసం ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలంటూ ప్రాధేయపడ్డారు. ఆదివారం రాత్రే తమతో మాట్లాడారని, మదీనాకు వెళ్లాక ఫోన్ చేస్తామని చెప్పారని జిర్రాకు చెందిన మునీర్ తెలిపారు. ఘటన గురించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, జెడ్డాలోని భారత రాయబార కార్యాలయం అధికారులను సంప్రదిస్తున్నామని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో బంధువును కోల్పోయిన వ్యక్తిని ఓదారుస్తున్న తెలంగాణ మంత్రి అజారుద్దీన్

మృతులను గుర్తించాకే అంత్యక్రియలు!

ప్రమాదంలో మరణించిన 45 మందికి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మరణించగా.. వారందరికీ సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. బస్సులో భారీగా మంటలు చెలరేగడంతో కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల డీఎన్ఏతో మృతుల డీఎన్ఏను పోల్చడం ద్వారా గుర్తించే అవకాశం ఉంది. జెడ్డాలోని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు.. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు. కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు మృతదేహాలను భారత్‌కు పంపించడం లేదా వారు అంగీకరిస్తే స్థానిక ఆచారాల ప్రకారం మదీనాలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామని సమాచారమిచ్చినట్లు తెలిసింది. మృతదేహాలను మదీనాలోని అల్ మీఖత్, కింగ్ ఫహాద్, కింగ్ సల్మాన్ ఆసుపత్రుల్లో భద్రపరిచారు.



మూడు తరాలు బుగ్గి

(మొదటి పేజీ తరువాయి)

నజీరుద్దీన్ కుటుంబంలోని రెండేళ్ల నుంచి 12 లోపు చిన్నారులంతా ప్రాణాలు వదిలారు. నజీరుద్దీన్ దక్షిణ మధ్యరైల్వేలో ట్రైన్‌గార్డుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య అక్తర్‌బేగం, కుమారులు సిరాజుద్దీన్, అమెజాన్‌లో మేనేజర్‌గా పనిచేసే సల్లావుద్దీన్, ముగ్గురు కుమార్తెలు అమీనాబేగం, షబానా బేగం, రిజ్వానా బేగం ఉన్నారు. ఉమ్రాయాత్రకు కుటుంబమంతా కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సిరాజుద్దీన్ అమెరికాలో ఉండడంతో రాలేకపోయారు. ఆయన భార్య సనాబేగం, కుమార్తెలు మెహరీష్, ఉమైజా ఫాతిమా, కుమారుడు ఉజైరుద్దీన్... సల్లావుద్దీన్, ఆయన భార్య ఫర్హానా సుల్తానా, వారి కుమారుడు షేక్ జైనుద్దీన్, కుమార్తెలు రిదా తాజీన్, తస్మియా తెహ్రీన్... రిజ్వానా బేగం కుమార్తె మరియం ఫాతిమా, కుమారుడు ఎండీ షాజిన్... షబానా కుమారుడు హుజైఫా జాఫర్... అమీనాబేగం కూతురు అనీస్ ఫాతిమా తదితరులంతా కలిసి ఈ నెల 9న ఉమ్రా యాత్రకు బయల్దేరారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఫొటో తీసుకున్నారు. ఆదివారం రాత్రి నజీరుద్దీన్ మక్కా నుంచి హైదరాబాద్‌లోని బంధువులకు ఫోన్ చేశారు. యాత్ర పూర్తవుతోందని.. మదీనా వెళ్లాల్సి ఉందని చెప్పారు.

కుటుంబమంతా కలిసి వెళ్లొద్దన్నా..

ప్రమాదంపై నజీరుద్దీన్ సోదరుడు సయ్యద్ రషీద్ మాట్లాడుతూ... ''అంతా ఉమ్రా యాత్రకు వెళ్తుంటే శంషాబాద్ విమానాశ్రయం వరకు వెళ్లి వీడ్కోలు పలికా. అంతకుముందు కుటుంబమంతా కలిసి ఒకేసారి ప్రయాణాలు చేయొద్దని నజీరుద్దీన్‌కు చెప్పా. పిల్లలందర్నీ ఒకేసారి తీసుకెళ్లొద్దని సూచించా. ఒక్కరోజులో అంతా తలకిందులైపోయింది. ప్రమాదంలో నజీరుద్దీన్, ఆయన భార్యతోపాటు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లతో కలిసి మొత్తం 18 మంది చనిపోయారు'' అంటూ కన్నీంటిపర్యంతమయ్యారు. నజీరుద్దీన్ బావమరిది వహీద్, అహ్మద్ సౌదీ అరేబియాకు వెళ్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న బంధుమిత్రులు... నజీరుద్దీన్ ఇంటి వద్దకు తరలివచ్చి కన్నీటిసంద్రంలో మునిగిపోయారు.



హైదరాబాద్ విద్యానగర్‌లోని నజీరుద్దీన్ నివాసం వద్దకు తరలివచ్చిన బంధుమిత్రులు

సౌదీ ప్రమాదంలో కన్నడిగుడి మృతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: సౌదీ అరేబియాలో ప్రమాదంలో మృతిచెందిన వారిలో కర్ణాటకలోని ధార్వాడ జిల్లాకు చెందిన అబ్దుల్ గనీ షిరాహట్టి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హుబ్బళ్లి గణేశపేటకు చెందిన ఆయన దుబాయి నుంచి సౌదీకి ఉమ్రాకు వెళ్లారు. ఆయన మృతదేహం సౌదీలో ఉందని హుబ్బళ్లిలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. దుబాయిలో ఒక హోటల్‌లో గత కొన్నేళ్లుగా అబ్దుల్ పని చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం

ఈనాడు, హైదరాబాద్: సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడి... పూర్తి వివరాలు తెలుసుకోవాలని, తగిన సహాయ చర్యలు అందించడానికి తక్షణమే రంగంలోకి దిగాలని సీఎస్‌కు, డీజీపీకి సోమవారం ఉదయం ఆదేశాలు జారీచేశారు. సచివాలయంలో సోమవారం సాయంత్రం సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం... సౌదీ బస్సు ప్రమాద మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని క్యాబినెట్ తీర్మానించింది.

బస్సు ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

ఈనాడు, దిల్లీ : బస్సు ప్రమాదంలో తెలంగాణవాసులు మృతి చెందడంపై ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. 'ప్రమాదానికి సంబంధించి రియాద్‌లోని దౌత్యకార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ కావాల్సిన సహాయం అందిస్తున్నాయి. సౌదీ అరేబియా ప్రభుత్వ అధికారులతో భారత ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు' అని 'ఎక్స్'లో ప్రధాని పేర్కొన్నారు. 'బస్సు ప్రమాద ఘటన తనను ఎంతో కలచివేసింది' అని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్ర విషాదకరమన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

ప్రమాదం దిగ్భ్రాంతికరం: సీఎం చంద్రబాబు

సౌదీ అరేబియా ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన పలువురు యాత్రికులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అత్యంత బాధాకరం: పవన్‌కల్యాణ్

'ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వారి మృతికి సంతాపం ప్రకటిస్తున్నా. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

సౌదీ ప్రమాదంపై లోకేశ్ దిగ్భ్రాంతి

సౌదీ అరేబియాలో జరిగిన రహదారి ప్రమాదంలో పలువురు హైదరాబాదీలు మృతి చెందిన ఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు 'ఎక్స్' వేదికగా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

షేక్ హసీనాకు మరణశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా మద్దతు లేని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రైబ్యునల్ విధించిన శిక్ష చెల్లదని ఆమె పేర్కొన్నారు. తనపై తప్పుడు అభియోగాలు మోపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాన్ని నడుపుతున్న యూనస్ తీర్పును స్వాగతించారు. చట్టానికి ఎవరూ అతీతులు కారన్న ప్రాథమిక సూత్రాన్ని..ఈ తీర్పు రుజువు పరిచిందని అన్నారు. తీర్పు వెలువడిన అనంతరం బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. హసీనా తండ్రి, బంగ్లాదేశ్ జాతిపిత, దివంగత షేక్ ముజిబుర్ రెహమాన్‌కు సంబంధించిన ఢాకా నివాసాన్ని కూల్చటానికి ప్రయత్నించిన ఆందోళనకారులపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు.

మాకు అప్పగించండి: మరణశిక్ష పడిన హసీనా, అసదుజ్జమాన్ ఖాన్ కమాల్‌ను తక్షణమే అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సోమవారం భారత్‌ను అభ్యర్థించింది. ప్రస్తుతం భారత్, బంగ్లా మధ్య ఉన్న ద్వైపాక్షిక నేరస్థుల అప్పగింత ఒప్పందం ప్రకారం.. ఆ ఇద్దరిని అప్పగించాల్సిన బాధ్యత న్యూదిల్లీపై ఉందని తెలిపింది. భారత్ కూడా స్పందించింది. ''మాజీ ప్రధాని హసీనాకు సంబంధించి బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ వెలువరించిన తీర్పును పరిగణనలోకి తీసుకున్నాం. పొరుగుదేశంగా మేం బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం. ఆ దేశంలో శాంతి, ప్రజాస్వామ్యం, స్థిరత్వాన్ని కోరుకుంటున్నాం. ఆ దిశగా భాగస్వాములందరితోనూ మేం నిర్మాణాత్మక చర్చలు జరుపుతాం'' అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. హసీనాను అప్పగించాలంటూ ఢాకా చేసిన అభ్యర్థనపై మాత్రం ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.

అమరావతిలో.. క్వాంటమ్ కంప్యూటర్ పెడతాం

(మొదటి పేజీ తరువాయి)

కెనడా, ఉత్తర అమెరికా, సౌదీ అరేబియా, దక్షిణ కొరియాల్లోనూ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధిలో ఏపీ ప్రభుత్వంలో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాం. భారతీయ మార్కెట్‌లో ప్రవేశించేందుకు ఇది మాకు ఓ మంచి అవకాశం. ఐబీఎం, దసాల్ట్... మాకు అంతర్జాతీయ భాగస్వామ్య సంస్థలు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ గురించి ఆ సంస్థల ద్వారా తెలుసుకుని వచ్చాం.

దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నాం

క్వాంటమ్ కంప్యూటర్స్‌కు సంబంధించిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాలు రెండింటిలోనూ మాకు విశేష అనుభవం, నైపుణ్యం ఉన్నాయి. న్యూట్రల్-ఆటమ్ క్వాంటమ్ కంప్యూటర్స్‌ను మేం సొంతంగా డిజైన్ చేసి, తయారు చేస్తున్నాం. అమరావతిలో మా కార్యకలాపాల కోసం దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నాం. భారతీయ భాగస్వాములతో కలిసి అప్లికేషన్స్, హైబ్రిడ్ అల్గారిథమ్స్‌ను అభివృద్ధి చేస్తాం. క్వాంటమ్ టెక్నాలజీల్లో శిక్షణ ఇస్తాం. భారతదేశ క్వాంటమ్ సప్లై చైన్‌కి అవసరమైన విడి భాగాల్ని తయారు చేస్తాం. దశలవారీగా కార్యకలాపాలు విస్తరిస్తాం.

ఇప్పటికే 3 క్వాంటమ్ కంప్యూటర్లు..

మా కంపెనీ ఇప్పటికే మూడు క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేసింది. ఫ్రాన్స్, జర్మనీలకు చెందిన హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సెంటర్‌లకు, సౌదీ అరేబియాకు చెందిన చమురు, సహజవాయువు కంపెనీ సౌదీ ఆరామ్‌కోకు వాటిని సరఫరా చేశాం. మరో రెండు సిద్ధమవుతున్నాయి. వాటి తర్వాత అమరావతిలో ఏర్పాటు చేసేందుకు క్వాంటమ్ కంప్యూటర్ తయారు చేస్తాం. దాన్ని మా కంపెనీనే నిర్వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్లయింట్‌లు పాస్కల్ ప్రైవేట్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ అజూర్, గూగుల్ క్లౌడ్ ద్వారా మా క్వాంటమ్ కంప్యూటర్ సేవల్ని వినియోగించుకోవచ్చు. త్వరలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారానూ మా సేవలు అందుబాటులోకి వస్తాయి.

దీర్ఘకాలం కొనసాగుతాం

అమరావతిలో ఎంత పెట్టుబడి పెడతామన్న విషయాన్ని ఇప్పుడే చెప్పలేం. ఆర్థికపరమైన అంశాల్ని ముందస్తుగా వెల్లడించం. కెనడా, దక్షిణకొరియా, అమెరికాల్లో స్థానిక భాగస్వాములతో కలిసి మా ప్రాజెక్టులు నెలకొల్పాం. భారత్‌లోనూ భాగస్వామి కోసం చూస్తున్నాం. భాగస్వామి ఖరారయ్యాక పెట్టుబడిపై స్పష్టత వస్తుంది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధికి ఇంత విస్తృత ప్రణాళిక రూపొందించడం మమ్మల్ని ఆకట్టుకుంది. ప్రముఖ కంపెనీలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములవడం, నైపుణ్యం గల మానవ వనరుల లభ్యత, ప్రభుత్వ నిబద్ధత మమ్మల్ని ఆకర్షించాయి. అమరావతిలో దీర్ఘకాలం కార్యకలాపాలు కొనసాగించగలమన్న నమ్మకాన్నిచ్చాయి.

ఉపాధ్యాయులకు ఈ నెల 29 నుంచి క్రీడా పోటీలు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. మండల స్థాయిలో 29, 30 తేదీల్లో, డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14, జిల్లా స్థాయిలో డిసెంబరు 20, 21, 22, రాష్ట్ర స్థాయిలో జనవరి 2, 3, 4 తేదీల్లో పోటీలు నిర్వహిస్తారు.

రిజర్వేషన్ల పరిమితి 50% మించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీర్పు పరిధిలోకి బఠిండా కమిషన్ సిఫార్సు కూడా వస్తుందని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం తెలిపింది. 'ఇప్పటికే నామినేషన్లు ప్రారంభమయ్యాయి కనుక ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోరాదని వాదిస్తే మాత్రం మొత్తంగా ఎన్నికలనే నిలిపివేస్తాం. కోర్టు అధికారాలను పరీక్షించొద్దు' అని పేర్కొంది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థన మేరకు ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. నామినేషన్ల గడువు సోమవారంతో ముగిసిందని, మే 6వ తేదీనాటి సుప్రీంకోర్టు ఉత్తర్వు ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసిందని మెహతా తెలిపారు. 'ఆ విషయం మాకు తెలుసు. అలా అని రాజ్యాంగ ధర్మాసనం తీర్పును అతిక్రమించరాదు. కమిషన్ నివేదికకు ముందున్న పరిస్థితి ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలి' అని మహారాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇప్పటికే 70శాతానికి చేరాయని పిటిషనర్లు తెలుపగా...ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

జాబ్ క్యాలెండర్‌పై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

దీని ప్రకారం నేరుగా నియామకాల (డీఆర్)కు వచ్చే ఖాళీలు 99 వేల వరకు ఉండనున్నాయి. మరో 24 విభాగాలు ఖాళీల వివరాలను నిర్ధారించలేదు. ఇంకో 21 శాఖల వివరాల నమోదు ప్రాసెస్‌లో ఉంది. ఇవన్నీ పూర్తయితేనే మొత్తం ఖాళీల లెక్క తేలనుంది. నేరుగా నియామకాలకు వచ్చే వాటిని నిరుద్యోగ యువతతో భర్తీ చేయనుండగా.. నిబంధనల ప్రకారం కొన్ని పోస్టులను ఇన్ సర్వీసు పదోన్నతులతో నింపుతారు.

రెవెన్యూలో 13 వేల ఖాళీలు

- ఆర్థిక శాఖ వద్దనున్న వివరాల ప్రకారం రెవెన్యూ శాఖలో మొత్తం ఖాళీలు 13 వేలు. ఈ శాఖలోని ఏడు హెచ్‌ఓడీలు ఇప్పటి వరకు 4,787 ఖాళీలను నిర్ధారించాయి. వీటిలో నేరుగా నియామకాలకు వచ్చేవి 2,552.
- ఉన్నత విద్యా శాఖలో 7 వేల పోస్టులు ఖాళీ. విశ్వవిద్యాలయాల్లో 3 వేలకు పైగా ఉన్న ఖాళీలను.. కోర్టు కేసులు తొలగించి భర్తీ చేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టింది.
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఉన్న 27 వేల ఖాళీల్లో దాదాపు 23 వేలకు నేరుగా నియామకాలు చేపట్టాలి.
- నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగంలో 4 వేలకు పైగా ఖాళీలు నిర్ధారించారు. వీటిలో నేరుగా నియామకాలకు వచ్చేవి 2,600 అని తేల్చారు.
- వ్యవసాయ శాఖలో 3 వేలకు పైగా ఖాళీలుండగా.. వీటిలో డీఆర్ పోస్టులు 2,400.
- పంచాయతీరాజ్ శాఖలో నేరుగా నియామకాలకు వచ్చే పోస్టులు 26 వేల వరకు ఉండొచ్చని నిర్ధారించారు. మరో మూడు వేల పోస్టులను ఇన్‌సర్వీస్ పదోన్నతులతో భర్తీ చేస్తారు.
- మహిళ, శిశు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ విభాగంలో 2,400 ఖాళీలున్నాయి. వీటిలో నేరుగా నియామకాలకు వచ్చేవి 1,820.

కొన్ని శాఖల్లో పూర్తికాని వివరాల నమోదు

పాఠశాల విద్య శాఖతో సహా కలిపి 24 విభాగాలు మంజూరు పోస్టులు, ఖాళీల వివరాలను నిర్ధారించలేదు. పాఠశాల విద్యలో బోధన, బోధనేతర అన్ని రకాల ఖాళీలు కలిపి 30 వేల వరకు ఉండొచ్చని ప్రాథమిక అంచనా. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ విభాగంలో నేరుగా నియామకాలకు వచ్చే పోస్టులు 10 వేల వరకు ఉండనున్నాయి. ఏపీఎస్పీ, ఇంటర్మీడియట్ విద్య, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, కర్నూలు జలవనరుల ప్రాజెక్టులు, దేవాదాయ, కడప జలవనరుల శాఖ ప్రాజెక్టులు, ప్రజా గ్రంథాలయాలు, ఏపీ భవన్, ఎన్‌సీసీ, ప్రింటింగ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్‌లాంటి విభాగాలు ఆన్‌లైన్ నమోదు ఇంకా పూర్తి చేయలేదు.

'పీఎం కిసాన్- అన్నదాతా సుఖీభవ'

నిధుల విడుదల రేపే

(మొదటి పేజీ తరువాయి)

ఆహారశుద్ధి ద్వారా అధిక ధర లభించేలా చేయడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలి' అని సూచించారు.

రైతుల ఫోన్లకు ముందే మెసేజ్‌లు పంపండి: అచ్చెన్నాయుడు

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం: పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ నిధుల విడుదలకు సంబంధించి రైతుల ఫోన్లకు ఒకరోజు ముందే మెసేజ్‌లు వెళ్లాలని అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి సోమవారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'రైతుల సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉంచాలి. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యుటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలి. తొలి విడతలో నగదు జమ కాని రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి అర్హత ఉన్నవారికి అందేలా చూస్తాం'' అని అచ్చెన్నాయుడు చెప్పారు.

మొబైల్ ఐఎంఈఐ నంబర్ మారిస్తే మూడేళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతిదారులు, విక్రయశాలల నిర్వాహకులను ఆదేశించింది. ధ్రువీకరణలు మార్చిన సెల్‌ఫోన్, మోడెమ్, మాడ్యూల్, సిమ్ బాక్స్ వంటివి ఉద్దేశపూర్వకంగా కలిగి ఉండటమూ నేరమేనని స్పష్టం చేసింది. ఐఎంఈఐని మార్చేందుకు ఉపయోగపడే పరికరాలను కలిగి ఉండటం చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. దేశీయంగా తయారు చేసి విక్రయించే సెల్‌ఫోన్, మోడెమ్, మాడ్యూల్, సిమ్ బాక్స్‌ల ఐఎంఈఐ నంబరును ప్రభుత్వం దగ్గర తప్పనిసరిగా నమోదు చేయాలని; దిగుమతిదార్లు కూడా డివైస్ సేతు పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపింది.

వోల్ట్‌సన్ ల్యాబ్స్‌పై వైకాపా దుష్ప్రచారం

- భూముల కోసమే సంస్థ ఏర్పాటైందనడాన్ని ఖండించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్రముఖ ఆర్‌జే గ్రూప్ సంస్థల్లో ఒకటని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. భూములు, ఇతర ప్రోత్సాహకాల కోసమే వోల్ట్‌సన్ ల్యాబ్స్ సంస్థను ఏర్పాటు చేశారంటూ వైకాపా ఆరోపించడాన్ని ఖండించింది. రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. దాన్ని అడ్డుకునేందుకు వైకాపా కుట్రలు చేస్తోందని పేర్కొంది. రాష్ట్రానికి కంపెనీలు రాకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించింది. 'ఆర్‌జే గ్రూప్‌లో భాగమైన వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏదో అనామక కంపెనీలా చిత్రీకరించేందుకు వైకాపా ప్రయత్నిస్తోంది. భారత్, యూఏఈ, థాయ్‌లాండ్, మొరాకో దేశాల్లోనూ ఆర్‌జే గ్రూప్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 90 వేల కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థ 37 ఎకరాల కోసం వోల్ట్‌సన్ అనే సంస్థను స్థాపించిదని వైకాపా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది' అని ప్రభుత్వం పేర్కొంది.

ఈనాడు

ప్రాణాలు తీయడంలో పరువేముంటుంది!?

విశాల దృక్పథంతో ఆలోచిస్తూ సాటి మనుషుల పట్ల వివక్ష చూపకపోవడం, అయినవారి ఇష్టాయిష్టాలను మన్నించడం నాగరిక సమాజ లక్షణం. దాని స్థానంలో కుల దురహంకారాన్ని తలకెక్కించుకున్న కొందరు కిరాతకులు హేయ నేరాలకు ఒడిగడుతున్నారు. కులాంతర వివాహాలు, ప్రేమలను సహించలేక కన్నబిడ్డలు, వారు ఇష్టపడిన వ్యక్తులు, వారి బంధుమిత్రుల ప్రాణాలను నిలువునా బలిగొంటున్నారు. తన కుమార్తె వేరే సామాజికవర్గ యువకుణ్ని పెళ్లిచేసుకుందన్న కోపంతో వరుడి సోదరుడిని వధువు తండ్రి సజీవదహనం చేశాడు. ఈ అమానుషం తాజాగా మహబూబ్‌నగర్ జిల్లాలో వెలుగుచూసింది. వేరే కులం వ్యక్తితో ప్రేమపెళ్లికి సిద్ధపడిన కూతురు చేతిలో బలవంతంగా ఉరితాడు పెట్టి ఆమె మరణాన్ని కళ్లారా చూసి వికృతానందం పొందాడు ఓ తండ్రి. ఈ అమానవీయ ఘటన మొన్న మార్చిలో అనంతపురం జిల్లాలో జరిగింది. తమ అమ్మాయిని కులాంతర వివాహం చేసుకున్నాడన్న ద్వేషంతో సూర్యాపేటలో ఓ కుర్రాణ్ని కడతేర్చిందో కుటుంబం. తనకు ఇష్టంలేని కులం అమ్మాయి కోడలిగా వచ్చిందన్న కోపంతో నిండు గర్భిణి అయిన ఆమెను ఇటీవల నరికి చంపేశాడో మామ. మిర్యాలగూడలో ప్రణయ్, హైదరాబాద్‌లో హేమంత్... తదితరుల హత్యలన్నీ సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలాన్ని, కుల వివక్షను కళ్లకు కడుతున్నాయి. జాతికి తలవంపులు తెస్తున్నాయి.

అధికారిక లెక్కల ప్రకారం 2017-23 మధ్య దేశవ్యాప్తంగా 259 పరువు హత్యలు నమోదయ్యాయి. వెలుగులోకొస్తున్న వాటితో పోలిస్తే చాలా దారుణాలు ఆత్మహత్యలూ ఇతర ప్రమాదాల మాటున తెరమరుగు అవుతున్నాయన్నది కాదనలేని సత్యం. అన్ని వర్గాల యువత చక్కగా చదువుకుని ఉద్యోగ ఉపాధుల్లో కుదురుకుంటోంది. ఇలా సమాజం అభివృద్ధివైపు పరుగుపెడుతున్న కొద్దీ విభిన్న సామాజికవర్గ వ్యక్తుల మధ్య ప్రేమ వివాహాలు పెరుగుతున్నాయి. అలాంటి జంటల ఉసురుపోసుకునే పెద్దల దాష్టీకాలు కలవరపరుస్తున్నాయి. ఉత్తరాదిన ఖాప్ పంచాయితీల మాటున సాగే ఈ దురాగతాలు ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలకూ పాకుతుండటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. వేరే కులం వ్యక్తిని ప్రేమపెళ్లి చేసుకుందని మహారాష్ట్రలో ఒక అన్న తన చెల్లి తల నరికి సెల్ఫీలు దిగాడంటేనే విష భావాలతో కొందరి మెదళ్లు ఎలా పుచ్చిపోతున్నాయో అర్థమవుతుంది. ఆత్మీయుల మనోభావాలకు కనీస విలువ ఇవ్వకుండా అన్యాయంగా ప్రాణాలను హరించడంలో పరువేముంటుంది... రాక్షసత్వం తప్ప!

రాజ్యాంగం ప్రసాదించిన జీవన, సమానత్వ, స్వేచ్ఛా హక్కులను పరువుహత్యలు కాలరాస్తున్నాయి. ముఖ్యంగా మహిళల ఆకాంక్షలను అవి అణచివేసి వారి పురోగతిని దెబ్బతీస్తున్నాయి. పరువు పేరుతో సాగుతున్న ఈ మారణకాండను సుప్రీంకోర్టు సైతం ఈసడించింది. అలాంటి అమానుషాలకు పాల్పడే క్రూరులు కఠినశిక్షలకు అర్హులని స్పష్టం చేసింది. కులపరమైన హింస ఉన్మాద స్థాయికి చేరి సమాజాన్ని అశాంతిలోకి నెట్టకుండా ప్రభుత్వాలు జాగ్రత్త వహించాలి. కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య సమానత్వ భావాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలి. కులాంతర వివాహాల విషయంలో పోలీసులు మానవీయతతో వేగంగా స్పందించేలా వారికి తగిన శిక్షణ అందించాలి. 'సుప్రీం' ఉద్ఘాటించినట్లు మనసుపడిన వ్యక్తిని మనువాడటం వయోజనుల హక్కు. దాన్ని గౌరవిస్తూ పిల్లల అభిరుచులకు తల్లిదండ్రులు తగిన విలువ ఇవ్వాలి. అలా కాకుండా వివక్షాపూరిత పైశాచిక ఆలోచనలతో హత్యలకు ఒడిగడితే అంతిమంగా అది తమ కుటుంబ పతనానికే దారితీస్తుందని గుర్తుంచుకోవాలి!

పిల్లలకు ఏం నేర్పిస్తున్నాం?

పిల్లలు మనసు ముద్దలాంటివారు. పెద్దలు తమ పెంపకంతో వారిని ఎలా మలిస్తే అలా తయారవుతారు. మరి తల్లిదండ్రులు ఆ అవగాహనతోనే పిల్లల్ని పెంచుతున్నారా? స్కూళ్లలో పిల్లలు తోటి పిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నారో ఉపాధ్యాయులూ అమ్మానాన్నలూ గమనిస్తున్నారా? విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, టీచర్లకు ఎదురు తిరగడం లాంటి సంఘటనలు ఎందుకు పెరుగుతున్నాయి?

ఆ మధ్య కౌన్ బనేగా కరోడ్‌పతి కార్యక్రమంలో జరిగిన సంఘటన పిల్లల పెంపకం మీద సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చనే లేవనెత్తింది. పిల్లలు అసహనంగా, అమర్యాదకరంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు అనే విషయంమీద రకరకాల వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. పెద్దవాళ్లతోనే ఇలా ప్రవర్తించే పిల్లలు ఇక తోటి పిల్లలతో ఎలా ఉంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకు తరచూ వెలుగులోకి వస్తున్న బుల్లీయింగ్ కేసులే నిదర్శనం. ఈ నవంబరులోనే మన దేశంలో తీవ్రమైన బుల్లీయింగ్ కేసులు వెలుగులోకి వచ్చాయి. మైసూరులో తోటి విద్యార్థుల దాడిలో గాయపడిన పదమూడేళ్ల కుర్రాడికి అత్యవసర శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ముగ్గురు పిల్లలు ఆ అబ్బాయిని డబ్బు, ఫోన్లు తెమ్మని బెదిరించేవారు. వాటిని లెక్కచేయనందుకు కాక భౌతిక దాడికి దిగడంతో పిల్లాడు ఆస్పత్రిలో చేరాల్సివచ్చింది. ఏడాదిగా వేధింపులు ఎదుర్కొంటూ స్కూలుకు వెళ్లనని మారాం చేసిన తొమ్మిదేళ్ల బాలిక జైపూర్‌లో స్కూలుభవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లో పన్నెండేళ్ల పిల్లాడి ఆత్మహత్యకు దారితీసిన బుల్లీయింగ్ కేసులో ముగ్గురు సిబ్బంది అరెస్టయ్యారు. కొద్ది నెలల క్రితం కోల్‌కతా పాఠశాలలో రంగు కారణంగా అవమానించి ఒక విద్యార్థి ఆత్మహత్యకు కారణమయ్యారు తోటి విద్యార్థులు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సమస్య చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఇటీవల వచ్చిన ఒక వెబ్ సిరీసు గుర్తుచేసే సంఘటన ఒకటి నగరంలోని స్కూల్లో వెలుగులోకి వచ్చింది. తొమ్మిది తరగతి విద్యార్థి ఒకరు స్కూల్లో 'ఆల్ఫా' పేరుతో ఒక గ్రూపు తయారుచేశాడు. 'అసలు సిసలు మగాళ్లు' అన్నది దానికి ట్యాగ్‌లైన్. పిల్లలంతా హడావుడిగా అందులో చేరిపోయారు. వాళ్లంతా కలిసి, తాము చేరకుండా ఉన్న మిగిలిన పిల్లల్ని అసభ్య పదజాలంతో వేధించేవారు. వారి మధ్య నిత్యం గొడవలు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ అమ్మానాన్నలను పిలిపించాడు. జరుగుతున్నది తెలుసుకుని అందరూ తలలు పట్టుకున్నారు. మతం పేరుతో, కులం పేరుతో తోటి పిల్లల్ని ఏడిపించడం, రంగు, రూపాలను వెక్కిరించడం, అభిమాన నటులు, క్రికెటర్ల పేరుతో గ్రూపులు కట్టి గొడవలు పడటం... ఇవన్నీ మన చుట్టూ ఉన్న పాఠశాలల్లోనే జరుగుతున్నాయని ఎంతమంది తల్లిదండ్రులకు తెలుసు?

మన దేశంలోనే ఎక్కువ

బుల్లీయింగ్ విత్అవుట్ బోర్డర్స్ సంస్థ ప్రపంచవ్యాప్త అధ్యయనాల్లో భాగంగా మన దేశంలో పరిస్థితిని అంచనా వేసింది. దాని ప్రకారం ప్రతి పదిమందిలో ఆరుగురు పిల్లలు బుల్లీయింగ్ బాధితులేనట. వారిలో సగం పేదపిల్లలే ఎక్కువని తేల్చింది. మెకాఫీ సంస్థ అధ్యయనం ప్రకారం సైబర్ బుల్లీయింగ్‌లో మనదేశం మొదటిస్థానంలో ఉంది. 36 శాతం పిల్లలు స్కూలు ఆవరణలోనే వేధింపులను ఎదుర్కొంటున్నారని యునిసెఫ్ అధ్యయనం పేర్కొంటోంది. ప్రపంచ సగటు కన్నా ఇది ఎక్కువ. మరో పరిశోధన ప్రకారం- పెద్దల్లో మానసిక సమస్యలకు ప్రధాన కారణం వారు బడి వయసులో ఎదుర్కొన్న బుల్లీయింగేనట.

ఇంత తీవ్రమైన సమస్యకి ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఎవరూ ఇవ్వడం లేదు. తల్లిదండ్రుల్లో సహజంగానే ఒక అభిప్రాయం ఉంటుంది... ఇలాంటివన్నీ ఎక్కడో జరుగుతాయి, మన పిల్లల స్కూల్లో కాదు... అని. ఆ భ్రమలోనుంచి బయటపడి వాస్తవాలను గమనించాలి. పదిహేను సంవత్సరాలైనా నిండని పిల్లల మధ్య కులమతాల ప్రస్తావన ఎందుకు వస్తోంది? ఇంకా మూతి మీద మీసం మొలవని పిల్లల మనసుల్లో 'ఆల్ఫా' అనే ఆలోచన ఎలా తట్టింది? ఏ మాత్రం పరిచయం లేని నటుల గురించి కొట్టుకునేవరకూ ఎందుకు వెళ్తోంది? అమాయకంగా ఆడిపాడాల్సిన బాలల నోట అసభ్య పదాలు ఎలా వస్తున్నాయి? పిల్లల్లో దూకుడు, ద్వేషం, విపరీతధోరణులు ఎందుకు పెరుగుతున్నాయి? ఈ పరిస్థితులకు ప్రేరణ ఏంటి అంటే- సామాజిక మాధ్యమాలు, సినిమాలు, చుట్టూ ఉన్న వాతావరణం, పెద్దల ప్రభావం... ఇలా ఎన్నో అంశాలవైపు వేలు చూపించాల్సి వస్తుంది.

విదేశాల్లో సహానుభూతి పాఠాలు

బుల్లీయింగ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. చాలా దేశాలు దాని తీవ్రతను గుర్తించి నివారించడానికి రకరకాలుగా చర్యలు తీసుకుంటున్నాయి. ఇంగ్లండ్‌లో కొన్ని స్కూల్స్ కథలను అందుకు మార్గంగా ఎంచుకున్నాయి. ఒక మంచి కథ చెప్పి ఆ కథలోని పాత్రల గురించి చర్చించడం ద్వారా పిల్లలు సమస్యను అర్థంచేసుకునేలా ప్రోత్సహిస్తున్నాయి. కొన్నిచోట్ల పిల్లలతోనే చిన్న చిన్న నాటకాలు వేయిస్తున్నారు. స్వీడన్ స్కూళ్లలో యాంటీ బుల్లీయింగ్ యూనిట్స్ ఉంటే కెనడా, నార్వేలాంటి చోట్ల జీరో టాలరెన్స్ పాలసీ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలున్నాయి. డెన్మార్క్, ఫిన్లాండ్ లాంటి దేశాలు స్కూల్లో తప్పనిసరిగా ఎంపతీ క్లాస్ నిర్వహిస్తున్నాయి. డెన్మార్క్ మూడు దశాబ్దాల క్రితం చేసిన చట్టం ప్రకారం 6-16 ఏళ్ల మధ్య స్కూలు పిల్లలు తప్పనిసరిగా వారానికి ఒకరోజు గంటసేపు సాగే 'ఎంపతీ క్లాస్'కి హాజరు కావాలి. అక్కడ పిల్లలు తమ భావోద్వేగాల గురించి మనసు విప్పి మాట్లాడుకుంటారు. ఇతరుల పట్ల సహానుభూతి చూపడం, అభిప్రాయ భేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం... ఇలాంటివన్నీ టీచర్లు చర్చిస్తారు. పిల్లల మధ్య స్నేహం, సహానుభూతులను పెంచడం ద్వారా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. డెన్మార్క్ కొన్నేళ్లుగా ప్రపంచంలోని ఆనందకరమైన దేశాల్లో ఒకటిగా ఉండటానికి ఇదీ ఒక కారణమని అక్కడి మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు.

సహానుభూతి అనేది పుట్టుకతో వచ్చే గుణమా నేర్చుకుంటే అలవడేదా అన్న సందేహం ఉండేది ఇంతకాలం. ఈ గుణం పదిశాతం మాత్రమే జన్యుపరంగా వస్తుందని, మిగిలిన తొంభై శాతం నేర్చుకుంటే అలవడేదేనని... ఇటీవలి అధ్యయనం ఒకటి వెల్లడించింది. కాబట్టి పిల్లల్లో ఆ గుణాన్ని పాదుకొల్పడానికి తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ కలిసికట్టుగా కృషిచేస్తేనే బుల్లీయింగ్ సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు.



– డి.పద్మశ్రీ



విను... ఆలోచించు... మార్చుకో!

జీవితమనే రంగస్థలం మీద ఎవరికి కేటాయించిన పాత్రను వారు పోషించక తప్పదు. పాత్రను బట్టి ప్రవర్తన ఉంటుంది. కానీ ఆశ్చర్యమేంటంటే ఈ ప్రపంచంలో ఏ ఇద్దరు మనుషుల ఆలోచనలు ఒకలా ఉండవు. స్వరూపాల్లాగే స్వభావాలు కూడా వేరుగానే ఉంటాయి. ఈనాటి ఉరుకుల పరుగుల ప్రపంచంలో మనిషి మనిషికో కథ ఉంటుంది. అలలు లేని సముద్రం కష్టాలు లేని జీవితం ఎక్కడా ఉండదు. అలాగే చేసే పనుల్లో అనేక రకాల అవాంతరాలు రావడమూ సహజమే. కానీ మన పని మనకు కరెక్టుగానే కనిపిస్తుంది. ఎవరైనా విమర్శించినా, మనం చేస్తున్నది తప్పని చెప్పినా... గబుక్కున స్వీకరించలేం. విమర్శల్ని తట్టుకోలేం.

తెలిసో తెలియకో తప్పులు చేయని వ్యక్తులు ఎవరూ ఉండరు. ఒకోసారి మన తప్పేమీ లేకపోయినా మాట పడాల్సి రావచ్చు. కానీ మనం గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే- ప్రశంసల్ని ఎలాగైతే మనసారా స్వీకరించి ఆస్వాదిస్తామో విమర్శల్నీ అలాగే సహృదయంతో స్వీకరించగలగాలి. 'స్వీయలోపంబులెఱుగుట పెద్ద విద్య' అన్నారు పెద్దలు. మన తప్పులూ బలహీనతలు మనం తెలుసుకోగలగడం చాలా గొప్ప విషయం. అందుకు ఎదుటి వారి అభిప్రాయాలూ దోహదం చేస్తాయి. ఆత్మవిమర్శ చేసుకుని లోపాల్ని సరిదిద్దుకోడానికి అవకాశం లభిస్తుంది. ఇష్టంగానో, కష్టంగానో మనని మనం మెరుగుపరచుకోవడానికి మార్గం ఏర్పడుతుంది.

అన్నింటిని చూసే కన్ను తనను తాను చూసుకోలేదు. అదే విధంగా అందరి తప్పుల్ని వేలెత్తి చూపే వ్యక్తికి తన తప్పులు తెలియవు. అవి తెలుసుకోవాలంటే- ఎదుటి వారి అభిప్రాయానికి విలువివ్వాలి, అది సరైనదా కాదా అని తెలుసుకోడానికి నిజాయతీగా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అప్పుడే వ్యక్తిత్వం వికసిస్తుంది. మంచి విమర్శను గుర్తించి స్వాగతించినట్లే; స్వార్థంతోనో, ఈర్ష్యతోనో చేసే కువిమర్శలను పసిగట్టగలగాలి. ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అలాంటి విమర్శకులకు దూరంగా ఉండాలి.

సాధారణంగా మనిషి నైజం ఎలా ఉంటుందంటే, ఎదుటివారిని విమర్శించటానికి ఎంతో ఉత్సాహం చూపుతాడు కానీ అదే తనదాకా వస్తే ఆవేశానికి లోనవుతాడు. అయితే విమర్శించేవాళ్లయినా, విమర్శను స్వీకరించేవాళ్లయినా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటుంది... విమర్శ మెదడుమీద పనిచేయాలి కానీ, హృదయం మీద కాదు. ఆలోచింపజేయాలి కానీ బాధపెట్టకూడదు. ఆ ఆలోచన ఆత్మవిమర్శకు దారితీస్తుంది. దానివల్ల పంతానికి పోకుండా ఒక మెట్టు కిందికి దిగి అయినా తనను తాను సంస్కరించుకునే అవకాశం ఉంటుంది. పుట్టుకతోనే ఎవరూ మహానుభావులు కారు. ఒక్కో ఇటుకా పేర్చి ఇల్లు కట్టుకున్నట్లే ఒక్కో సద్గుణాన్నీ అలవరచుకుంటూ వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటాడు మనిషి. అందుకే విమర్శను ప్రతి విమర్శతో తిప్పి కొట్టి విజయం సాధించామని విర్రవీగకుండా, సద్విమర్శను సహృదయంతో స్వీకరించి లోపాలను అధిగమించినప్పుడే వ్యక్తిత్వం మరొక మెట్టు పైకి ఎదుగుతుంది. విమర్శకు సరైన సమాధానం- మనల్ని మనం సరిదిద్దుకోవడమే.

– కె.పి.దాస్




మనందరికీ రెండు చేతులు ఉన్నాయి. ఒకటి మన కోసం పని చేసుకోవడానికి, రెండోది ఇతరులకు సహాయపడటానికి. చదవనూ రాయనూ వచ్చినంత మాత్రాన విద్యావంతులు కారు. జీవిత పాఠాలు నేర్చుకుని మరొకరికి ఆసరా కాగలిగినప్పుడే జీవితానికి సార్థకత.

– సింధుతాయి సప్కాల్

గెలవగలం..!

మనసు నిశ్చలంగా ఉన్న సరస్సులాంటిది. గాలివీచినా చిన్న రాయి విసిరినా సరస్సులో కదలిక వస్తుంది. మనసూ అంతే. కొన్ని సంఘటనలు దాన్ని కదిలిస్తాయి. అనేక ఆలోచనలు పుడతాయి. కొన్ని అంతరంగాన్ని కలచివేస్తాయి. మరికొన్ని అలజడి సృష్టిస్తాయి. కోపం తపస్సును చెడగొడుతుందని, సద్గుణాలను నాశనం చేస్తుందని, ధర్మకార్యాలను ఆటంకపరుస్తుందని భారతోక్తి. కోపమునను ఘనత కొంచెమైపోవునన్నాడు వేమన.

ఒక ఇంట్లో నిప్పు పుడితే ముందు ఆ ఇల్లు కాలిపోయాకే పక్కింటికి పాకుతుంది. ఎవరి మనసులో క్రోధం ఆవిర్భవిస్తే ముందు వారికే హాని కలుగుతుంది. కోపం అగ్ని వంటిది. అది అవమానం అనే అరణిని మథించగా పుడుతుంది. పుట్టినది ఎగసి మండటానికి చెడు మాటలనే కట్టెలు తోడ్పడతాయి. అంతే సెగలు పొగలు వ్యాపిస్తాయి. తాను ఎదుటివాడు ఇద్దరూ కాలి బూడిదవ్వాల్సిందే. మనిషి కొంచెం ఆలోచన, జ్ఞానం ఉన్నవాడైతే తెలివి అనే నీటిని కుండలతో కుమ్మరించి దాన్ని చల్లార్చగలుగుతాడు... అంటుంది ఒక శ్లోకం. కోపం వివేకాన్ని కాల్చేస్తుంది. మంచి చెడుల తేడాను తెలియనివ్వదు. ఒళ్లు తెలియని కోపంలో మనుషులు ఎటువంటి దారుణాలకు పాల్పడుతున్నారో చూస్తున్నాం.



అంతర్యామి

కోపం సహజమైన ఉద్వేగమైనా అది బలీయమైనప్పుడు వినాశకర శక్తిగా రూపుదాలుస్తుంది. కొందరికది అలంకారం. నాయకత్వ లక్షణంగానూ పరిగణిస్తుంటారు. పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టడానికి, కింది ఉద్యోగులతో బాధ్యతాయుతంగా పనిచేయించుకోవడానికి తగు మాత్రం కోపం అవసరం కావచ్చు. అయితే అది పాము బుసకొట్టే రీతిలో ఉండాలిగానీ కాటేసే స్థాయిలో కాదు. కోపిష్టి విచక్షణా జ్ఞానాన్ని వివేచనను కోల్పోతాడు. దానివల్ల ఆ వ్యక్తి ప్రవర్తనలో దౌష్ట్యం చోటుచేసుకుంటుంది. కొన్ని సందర్భాల్లో మునులూ క్రోధానికి అతీతులు కారు. భిక్ష దొరకకపోతే కాశీ వాసుల్ని శపించబోయిన వ్యాసుణ్ని పరమ శివుడు ఆ నగరం నుంచి బహిష్కరించడం పురాణ ప్రసిద్ధం. దుర్వాసముని కోపాన్ని గురించి ఎన్నో ఉదంతాలు పురాణాల్లో, కావ్యాల్లో కనిపిస్తాయి. కౌశికుడనే ముని తనపై కొంగ రెట్ట వేసిందని ఆగ్రహంతో చూస్తే అది కాలి బూడిదైంది. కోపం మనకు శత్రువని గుర్తించాలి. శత్రువును గుర్తించినపుడే అంతం చేయగలం. కోపం రజోగుణం నుంచి ఉద్భవిస్తుంది. మనిషి స్వభావంలో సత్వగుణం బలంగా ఉంటేనే కోపాన్ని అధిగమించగలుగుతాడు. భక్తి, ఆధ్యాత్మిక చింతన, యోగాభ్యాసం వంటివి మనిషిని క్రోధమనే ప్రవృత్తికి దూరంగా ఉంచుతాయి. కోరికలు దుఃఖానికి, దుఃఖం ఆగ్రహానికి దారితీస్తాయి. కోపానికి ఒక కారణమంటూ ఉండదు. కొందరిది ప్రథమ కోపం. ఇట్టే కరిగిపోతుంది. అది మనసులో గూడుకట్టుకుని ద్వేషంగా మారే వ్యక్తులతోనే సమస్య. యోగసాధన కోపాన్ని నియంత్రించగలుగుతుంది.

గౌతమబుద్ధుడు సహనమూర్తి. ప్రతికూలతల్ని ప్రశాంతంగా ఎదుర్కొన్నాడు. అంగుళిమాలుడు వంటి దుష్టుల్ని ప్రసన్నవదనంతో ఎదుర్కొని పరివర్తన తేగలిగాడు. కోపాన్ని జయించాలనుకున్నవారు మంచి సంస్కారాలు అలవరచుకోవాలి. నైతికజీవనం, సౌజన్యం, మనోవికాసం ఉన్నవారిలో క్రోధం అంత సులభంగా మెంపొందదు.

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు



తెమిలేదెన్నడు?

కేసులు ఒక పట్టాన తెమలక పోతుండటం కక్షిదారులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. దేశవ్యాప్తంగా అన్ని స్థాయుల్లోని న్యాయస్థానాల్లో అయిదు కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో పడి ఉన్నాయి. అందులో 87శాతం సబార్డినేట్ కోర్టుల్లోనే అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిలోనూ మూడేళ్లకు పైబడిన కేసులు ఏపీలో 33.5శాతం, తెలంగాణలో 36.2శాతం ఉంటే, కొన్ని రాష్ట్రాల్లో వాటి సంఖ్య సగానికన్నా ఎక్కువగా ఉంది. ఈ ఏడాది జనవరి నాటికి ఆయా రాష్ట్రాల్లోని సబార్డినేట్ కోర్టుల్లో పెండింగ్ కేసుల శాతం...

బిహార్	70.7
ఒడిశా	58.5
పశ్చిమ్ బెంగాల్	55.8
ఉత్తర్ ప్రదేశ్	52.9
మేఘాలయ	51.6
మహారాష్ట్ర	47.7
అరుణాచల్ ప్రదేశ్	45.8
రాజస్థాన్	45.7
కేరళ, మధ్యప్రదేశ్	38.5
కర్ణాటక	35.5
తమిళనాడు	35.1

(ఆధారం: ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025)

పేదరికంపై పోరాటం... కేరళ ఆదర్శం!

పేదరికం సామాజిక ఆర్థిక సమస్య. అదొక విష వలయం. సమాజాన్ని రెండు వర్గాలుగా విడదీసే ఒక దుస్థితి. అందుకని పేదరిక నిర్మూలనే ప్రభుత్వాల అంతిమ లక్ష్యం కావాలి. ఈ లక్ష్య సాధనలో కేరళ ముందడుగు వేసింది. దుర్భర దారిద్ర్యంపై విజయం సాధించినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది.

భారతదేశంలో పేదరిక నిర్మూలన నినాదం అయిదో పంచవర్ష ప్రణాళిక కాలం నుంచే ప్రారంభమైంది. అయినప్పటికీ ఇరవై కోట్లకుపైగా పేదలు ఉన్న దేశంగా భారత్ పరువు మాస్తుండటం విచారకరం. మన దేశంలో వివిధ రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం విభిన్న నమూనాలను అనుసరిస్తున్నాయి. ఆ క్రమంలో అక్షరాస్యత మెరుగుదలలో, మానవాభివృద్ధి సూచీలో, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో, జీవన ప్రమాణాలలో ముందున్న రాష్ట్రంగా కేరళ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది. నవంబర్ ఒకటిన కేరళ అవతరణ దినోత్సవం నాడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ శాసనసభలో మాట్లాడుతూ- అత్యంత పేదరికాన్ని పారదోలినట్లు ప్రకటించారు. దీంతో కేరళ మరొక మైలురాయిని అందుకుని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినట్లయింది.

స్థానిక సంస్థల భాగస్వామ్యం

ఆహారం, ఆరోగ్యం, ఆవాసం, విద్య, తాగునీరు లాంటి ప్రాథమిక అవసరాలు కూడా అందని దుస్థితినే అత్యంత పేదరికంగా భావిస్తారు. ప్రతి అయిదేళ్లకు ఒకసారి ప్రభుత్వాల్ని మార్చే సంప్రదాయం ఉన్న కేరళలో 2021లో విజయన్ నేతృత్వంలో ఎల్‌డీఎఫ్ వరసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. పేదరిక నిర్మూలన కోసం పలు కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేసింది. 0.55 శాతం దారిద్ర్యంతో దేశంలో అతి తక్కువ పేదరికం కలిగిన మొదటి రాష్ట్రంగా కేరళ నిలిచిందని 2023లో నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. కొట్టాయం వంటి జిల్లాల్లో పేదరిక ఛాయలు పూర్తిగా కనుమరుగు కావడం విశేషం. ప్రభుత్వం దుర్భర దారిద్ర్యాన్ని నిర్మూలించడానికి ఎంపిక చేసిన మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో పైలట్ ప్రాజెక్టును అమలు చేసి సానుకూల ఫలితాలు సాధించింది. ఆ తరవాత ఆదాయం, ఆహారం, ఆరోగ్యం, ఆవాసం, అవిద్య, ఉపాధి ప్రమాణాలుగా రాష్ట్రవ్యాప్తంగా అత్యంత పేదరికంలో ఉన్న 64,006 కుటుంబాలను గుర్తించారు. ఆపై ప్రణాళికాబద్ధంగా శ్రమించి 1,03,099 మందిని దుర్భర దారిద్ర్యం నుంచి బయటపడేశారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఒక్కో సూక్ష్మ ప్రణాళికను రూపొందించి పక్కా ఇళ్లు, భూ పంపిణీ, రేషన్ కార్డులు, పింఛన్లు, ప్రజారోగ్య కేంద్రాల ఏర్పాటు, ఉచిత వైద్య బీమా, పరిశుద్ధమైన తాగునీరు వంటి సౌకర్యాలు అందజేసింది. తద్వారా కేరళ దేశంలోనే దుర్భర దారిద్ర్యాన్ని నిర్మూలించిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ ఘనతను సాధించడంలో స్థానిక సంస్థల పాలనా వ్యవస్థ సమర్థంగా పనిచేసిందని చెప్పాలి. సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌తోనే కేరళ అనేక సామాజిక, ఆర్థిక సూచీలలో మెరుగైన స్థానాల్లో ఉంటూ అత్యంత పేదరికంపై విజయం సాధించడం అభినందనీయం. అంతకన్నా అధిక బడ్జెట్ ఉండే తెలుగు రాష్ట్రాల్లో పేదరికం గణనీయంగా తగ్గుతున్నా, కేరళ స్థాయిలో ఫలితాలు సాధించేందుకు ముందడుగు వేయాల్సి ఉంది. గృహ నిర్మాణ పథకాల అమలులో వైఫల్యం, విద్య ఆరోగ్య రంగాలను కింది వర్గాలకు చేరువ చేయలేకపోవడం, స్థానిక సంస్థలకు కేరళ తరహాలో సరైన అధికారాలు ఇవ్వకపోవడం, అవి సమర్థంగా పనిచేయలేకపోవడం తదితర సమస్యలతో మిగిలిన రాష్ట్రాలు దుర్భర దారిద్ర్యాన్ని నిర్మూలించలేకపోతున్నాయి.



సమానత్వంతోనే ప్రగతి

వివిధ సర్కారీ పథకాల కారణంగా మన దేశంలో 17 కోట్ల మంది ప్రజలు అత్యంత పేదరికం నుంచి బయట పడినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. సంక్షేమ పథకాల అమలుతో ప్రజలకు తాత్కాలిక ఉపశమనం దక్కవచ్చు కానీ దీర్ఘకాలిక ప్రయోజనాలను సాధించలేమనే వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. దుర్భర దారిద్ర్యం తగ్గడం సంతోషించదగిన విషయమే. కానీ, ఇంకోవైపు దేశంలో పేదరికాన్ని ఎగదోసే ఆదాయ అసమానతలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలోని 40 శాతం సంపద ఒక్క శాతం సంపన్నుల దగ్గరే కేంద్రీకృతమైందని 2023 ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. నానాటికీ తీవ్రతరమవుతున్న ఆర్థిక అసమానతలు సమ్మిళిత ప్రజాశ్రేయానికి విఘాతకరమవుతున్నాయి. ఈ దురవస్థను రూపుమాపడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. పేదరికం లేని సమాజాన్ని, సమానత్వంతో కూడిన ప్రగతిని సాధించడమే నిజమైన అభివృద్ధి!

– డాక్టర్ తిరునహరి శేషు

ఇళ్లు... ఎలా మొదలయ్యాయి?

నేస్తాలూ.. రోజూ మనం రకరకాల ఇళ్లు చూస్తుంటాం కదా. మరి, ఈ ఇళ్లు కట్టుకోవడం ఎలా మొదలైందో తెలుసా? ఆ విషయాలన్నీ తెలుసుకోవడం ఆసక్తికరమే కదా! ఇతర ప్రాణుల్లాగే మనుషులూ సురక్షితంగా ఉండటం కోసమే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రాచీన కాలంలో రక్షణ కోసం, భద్రంగా, సౌకర్యంగా ఉండేందుకు నివాస ప్రదేశాన్ని ఎంచుకోవడం మొదలుపెట్టడంతో ఇళ్ల వేట మొదలైందన్న మాట! మరి, ఎలాంటి రకం ఇల్లు మొదటగా వచ్చిందనేది సరిగ్గా తెలియదు. చెట్లపై కట్టుకునే ట్రీ హౌస్, కేవ్ హౌస్ మాత్రం చాలా పాతవని చెబుతారు. అప్పట్లో వేడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని ప్రిమిటివ్ మనుషులు చెట్లపై నివసించడం మొదలుపెట్టారు. చెట్ల కొమ్మలను వంచి నివాసానికి వీలయ్యేలా అల్లుకునేవారు. గూడుగా తీర్చిదిద్దుకునేవారు. తరవాత దశలో పైభాగంలో గడ్డితో కప్పడం మొదలైంది. ప్రాచీన మానవుడు ఇలాంటి వాటిలో తలదాచుకోవడం ద్వారా ఎండలు, వానలు, వరదలు, జంతువుల నుంచి రక్షణ పొందేవాడు.



చలి వాతావరణంలో ఉండేవారికి ట్రీ హౌస్ పనికిరాదు. అందుకని గుహల్లో నివసించడం అలవాటు చేసుకున్నారు. వాటి ముందు మంట వేసుకునేవారు. రాళ్లతో గోడలా పేర్చడం అనేది బహుశా కేవ్ మ్యానే మొదలుపెట్టి ఉండొచ్చు. వారు నివసించే గుహలకు రక్షణగా ప్రవేశద్వారంలాంటి చిన్నసైజు రాళ్లను పేర్చుకునేవారు. తరవాతి దశలో కొండల అంచుల్లో తవ్వడం ద్వారా గుహలను తయారు చేసుకోవడం మొదలైంది. ఆ తరవాత కాలంలో మైదాన ప్రాంతాల్లో సహజమైన గోతులను ఎంచుకున్నారు. వాటిని ఇంకొంచెం తవ్వి, సైజు పెంచి, అంచుల వెంబడి రాళ్లతో గోడలు కట్టడం ప్రారంభించారు. అలా అలా వివిధ ప్రాంతాల్లో ఉండేవారు.. వాతావరణం, తాము చేసే పనులను బట్టి ఇళ్లు కట్టుకున్నారు. అవి రకరకాల ఆకృతుల్లోకి మారుతూ ఇప్పుడున్న ఆధునిక ఇళ్లు వచ్చాయన్న మాట!

– శ్రీజన్

హాయ్! బుజ్జీ

అవునా.. కాదా..?

1. తాబేలు నీళ్లలో మాత్రమే జీవించగలదు.
2. వెనకకు ఎగరగల ఏకైక పక్షి హమ్మింగ్‌బర్డ్.
3. అరటిపండు నీలం రంగులో కూడా ఉంటుంది.
4. థర్మామీటర్‌ని ఉష్ణోగ్రత కొలవడానికి ఉపయోగిస్తారు.

జవాబులు: 1.తప్పు 2.ఒప్పు 3.తప్పు 4.ఒప్పు

నాటి జమానా.. జల రవాణా..


పడవలు వెళ్లడానికి కేఈబీ కెనాల్లో లాకుల వద్ద ఏర్పాటు చేసిన దారి

బ్రిటీషు కాలంలో కాలువల ద్వారానే సరకుల రవాణా జరిగేది. కాలానుగుణంగా జల రవాణాకు అంతరాయం ఏర్పడి ఆగిపోయింది. తోట్లవల్లూరు గ్రామ పరిధిలో విజయవాడ నుంచి అవనిగడ్డ వరకు కేఈబీ కెనాల్ ప్రవహిస్తోంది. ఈ కెనాల్ 1935లో నిర్మాణం జరిగింది. దీనికి తోట్లవల్లూరు మండలంలోని వల్లూరుపాలెం, గుర్విందపల్లి గ్రామాల వద్ద, చల్లపల్లి మండలం నిమ్మగడ్డ వద్ద లాకులు ఏర్పాటు చేశారు. ఈ లాకుల వద్ద పడవలు వెళ్లడానికి ఒక గేటు ఏర్పాటు చేశారు. సుమారు 1939 నుంచి ఈ కేఈబీ కెనాల్లో పడవలు, లాంచీల ద్వారా సరకులు, వరి ధాన్యం రవాణా చేసేవారని అప్పట్లో పనిచేసిన లస్కర్లు చెబుతున్నారు. నాడు రోడ్డు రవాణా విస్తరించకపోవడంతో జల రవాణానే ఎక్కువగా జరిగిందని చెబుతున్నారు. అందుకే కేఈబీ కెనాల్ ఒడ్డునే రైస్‌మిల్లులు ఏర్పాటు చేశారట. పడవలు ప్రయాణానికి అనుగుణంగానే లాకుల వద్ద గేట్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ రవాణా సుమారు 1972 వరకు జరిగిందని పెద్దలు చెబుతున్నారు.

\- న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

కృత్రిమ అవయవం.. దివ్యాంగులకు వరం


పంపిణీకి సిద్ధంగా కృత్రిమ అవయవాలు

భారత్ వికాస్ పరిషత్ ఉమ్మడి రాష్ట్రాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వాటిలో అత్యున్నత కార్యక్రమం వికలాంగ్ పునరావాస్ యోజన. దీని ద్వారా దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా వారికి కృత్రిమ అవయవాలు అందజేస్తారు. 1993 నుంచి సుమారు 50 వేల కృత్రిమ అవయవాలను దివ్యాంగులకు అందజేశారు.


రూప్‌చంద్ జైన్

కృత్రిమ అవయవాల కోసం 365 రోజులు సంప్రదించండి.. దివ్యాంగులు ఎవరైనా 365 రోజులూ కృత్రిమ అవయవాల కోసం భారత్ వికాస్ పరిషత్‌ను సంప్రదించవచ్చని సేవా విభాగం దక్షిణ భారత ప్రాంతీయ కార్యదర్శి రూప్‌చంద్ జైన్ పేర్కొన్నారు. 'గుడివాడలో 1994 నుంచి నేటి వరకూ 2500 మందికి కృత్రిమ అవయవాలు అందించాం. ఏటా వికలాంగ్ పునరావాస్ యోజన శిబిరం నిర్వహించి దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తాం. వాటిని హైదరాబాద్‌లో తయారు చేయిస్తాం. కృత్రిమ అవయవాలు కావాల్సినవారు 9848984899 నంబరులో సంప్రదించి పొందవచ్చని' జైన్ పేర్కొన్నారు. అవయవాల కొలతలు తీసుకున్న నెల రోజుల్లోగా ఉచితంగా అందిస్తామని, అత్యవసరం అయితే హైదరాబాద్ పంపి వెంటనే అందిస్తామన్నారు.

\- న్యూస్‌టుడే, గుడివాడ

విశాఖపట్నం-కొల్లాం ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం విశాఖపట్నం-కొల్లాం మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 08539/08540 ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీ నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం, తిరుగు ప్రయాణంలో ఈ నెల 19 నుంచి జనవరి 21 వరకు ప్రతి బుధవారం రాకపోకలు సాగిస్తుందని పేర్కొన్నారు.

కొలిక్కిరాని నున్న విద్యుత్తు టవర్ల వివాదం

వచ్చే సోమవారానికి వాయిదా వేసిన న్యాయస్థానం

ఈనాడు, అమరావతి: పశ్చిమ బైపాస్ విద్యుత్తు టవర్ల వివాదం ఇంకా కొలిక్కి రాలేదు. సోమవారం న్యాయస్థానంలో తీర్పు వస్తుందనుకున్న నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారుల అభ్యర్థన మేరకు వచ్చే సోమవారానికి విచారణ వాయిదా పడింది. ఇప్పటికే జక్కంపూడి టవర్ల విషయంలో పాత ఎలైన్‌మెంట్‌లోనే టవర్ల ఎత్తు పెంచాలని న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఇదే పరిస్థితులున్న నున్న వివాదంలోనూ తీర్పు లాంఛనమే అని అందరూ భావించినా గత రెండు వారాల నుంచి వాయిదా పడుతూ వస్తోంది. టవర్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాలేదని, మరో వారం వ్యవధి కావాలని ఎన్‌హెచ్ అధికారులు కోరడంతో న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేర్వేరు ప్రాంతాల్లో టవర్లు ఉన్నా వివాదం ఒకటే అయినప్పుడు వేరువేరుగా ఎన్‌హెచ్ అధికారులు కేంద్రానికి అనుమతులు కోరుతూ ప్రతిపాదనలు పంపడం వల్లే జాప్యం అవుతోందన్న వాదనాలు వినిపిస్తున్నాయి.

ఉత్తరం రాయండి.. బహుమానం పొందండి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం



సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న క్రమంలో నేటి తరం ఉత్తరాలు రాయడమే మానేసింది. యువత, విద్యార్థులు, పౌరుల్లో రచనా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తపాలా శాఖ 'ఢాయి ఆఖర్' పేరుతో పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో 18 ఏళ్లలోపు, 18 ఏళ్లు పైబడిన విభాగాల్లో లేఖ రచన పోటీలు నిర్వహించి ఉత్తమ రచనలకు రాష్ట్ర స్థాయి పోటీలో మొదటి మూడు స్థానాలు. . జాతీయ స్థాయిలో అయితే మొదటి మూడు విభాగాల్లో ఒక్కో విభాగంలో నలుగురు చొప్పున 12 మందికి బహుమతులు అందిస్తారు.

పోటీ ఇలా..

రెండు కేటగిరీలు ఉంటాయి. ఇన్‌ల్యాండ్ లెటర్, కార్డు కేటగిరీలో 500 పదాలు.. ఎన్వలప్ కేటగిరీలో ఏ4 పేపర్‌పై వెయ్యి పదాలు మించకుండా 'నీ రోల్ మోడల్'కు తెలుగు, హిందీ, ఆంగ్లం వచ్చిన భాషలో లేఖ రాయాలి. సొంతంగా రాయాలి. వయసు, విద్యార్హత పరిమితి లేదు.

★ ఉత్తరంతో పాటు 2025 జనవరి నాటికి ఎంత వయసు అన్న డిక్లరేషన్ జత చేయాలి.

ఆఖరు తేదీ డిసెంబరు 8.. రాసిన లేఖను ఐఎల్‌సీ/ఎన్వలప్ కవర్‌లో పెట్టి 'ఎంట్రీ ఫర్ ఢాయి ఆఖర్ 2025-26' అని రాసి స్పీడ్ పోస్ట్‌లో డిసెంబరు ఎనిమిదిలోగా మీకు దగ్గరలోని మచిలీపట్నం, గుడివాడ డివిజన్ తపాలా కార్యాలయాలకు పంపాలి.

బహుమతి	రాష్ట్ర	జాతీయ
ప్రథమ	రూ.25వేలు	రూ.50వేలు
ద్వితీయ	రూ.10వేలు	రూ.25వేలు
తృతీయ	రూ.5వేలు	రూ.10వేలు

నచ్చినట్టు తూచెయ్.. అడగకుంటే దోచెయ్

- ఎంఎల్ఎస్ పాయింట్ల కేంద్రంగా తరుగు
- దుకాణానికి 3 క్వింటాళ్ల బియ్యం మాయం

ఈనాడు, అమరావతి

ఇదీ ఉయ్యూరులో ఓ రేషన్ దుకాణానికి సరఫరా అయిన ఓ బస్తా తూకం. సంచితో కలిపి బస్తా 50.6 కేజీల బరువుండాలి. ఇక్కడ మాత్రం 37.42 కేజీలే ఉంది. 13.18 కేజీలు మాయమయ్యాయి.



ఎంఎల్ఎస్ పాయింట్ల కేంద్రంగా రేషన్ సరఫరాలో మాయాజాలం చేస్తున్నారు. అక్కడి నుంచి రేషన్ షాపులకు వెళ్లే బియ్యం తూకాల్లో భారీగా వ్యత్యాసాలుంటున్నాయి. బస్తాకు రెండు నుంచి 5 కేజీల వ్యత్యాసం ఉండడంతో కార్డుదారులకు సరఫరా చేయడం డీలర్లకు కత్తిమీద సాములా మారింది. ప్రభుత్వం సవ్యంగా సరఫరా చేస్తున్నా ఎంఎల్ఎస్ పాయింట్ల కేంద్రంగానే దందా జరుగుతోందని డీలర్లు చెబుతున్నారు.

★ గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా అవుతున్న బియ్యం బరువులో భారీగా వ్యత్యాసం ఉంటోందని డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. బస్తాకు 2-5 కేజీల వరకు వ్యత్యాసం వస్తోందని అక్కడి నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చాలా దుకాణాలకు డీలర్లు బరువు చూసుకోకుండానే బియ్యం పంపేస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డులు : 11,07,933
- మొత్తం దుకాణాలు : 2,016
- నెలకు పంపిణీ చేసే బియ్యం (మె.ట) : దాదాపు 17,000
- ఎంఎల్ఎస్ పాయింట్ల సంఖ్య : 14

ఒక్కో దుకాణానికి 100 నుంచి 150 క్వింటాళ్లు సరఫరా అవుతాయి. దాదాపు 90శాతం డీలర్లకు పూర్తి స్థాయిలో రేషన్ సరఫరా కావడం లేదు. డీలర్లకు ముందే సమాచారం ఇచ్చి వారి ముందే తూకం వేసి సంతకం తీసుకోవాలి. డీలర్లు రావడానికి ముందే తూకం వేసి లోడ్ సిద్ధం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి అర్ధరాత్రి, తెల్లవారు జామున, తూకం వేసే 15 నిమిషాల ముందు సమాచారం ఇచ్చి తిప్పలు పెడుతున్నారు. నెలకు ఒక్కో డీలర్ 3-5 క్వింటాళ్ల బియ్యం నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకు 8వేల క్వింటాళ్లకు పైగా బియ్యం బొక్కేస్తున్నారు. 'బియ్యం సరఫరాలో ఎంఎల్ఎస్ పాయింట్ల నిర్వాహకులే దందా చేస్తున్నారు. మిగుల్చుకున్న బియ్యాన్ని నల్లబజార్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి' అని రాష్ట్ర ఈపాస్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు కాగిత కొండ(జేమ్స్) ఆరోపించారు. దీనిపై కృష్ణా జేసీ నవీన్, ఎన్టీఆర్ డీఎం సతీశ్ వివరణ కోరగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

8వేల క్వింటాళ్లు స్వాహా

చక్కని రూపు.. తిప్పుకోలేరు చూపు!


మేరీమాత ఆలయ థీమ్‌తో నిర్మించిన గుణదల రైల్వేస్టేషన్ ముందు భాగం


విశాలమైన ప్లాట్‌ఫాం

విజయవాడ రైల్వేస్టేషన్‌లో ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ప్లాట్‌ఫారాలు లేకపోవడంతో రైళ్లను నగర శివారులో ఎక్కువ సేపు నిలుపుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు గుణదల రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద రూ.60 కోట్లతో మేరీమాత ఆలయ థీమ్‌తో శాటిలైట్ స్టేషన్‌గా తీరిదిద్దారు. విశాలమైన ప్లాట్‌ఫాంను అందుబాటులోకి తీసుకొచ్చారు. విశ్రాంతి మందిరాలను మార్బుల్స్, టైల్స్‌తో అందంగా తీర్చిదిద్దారు.

\- ఈనాడు, అమరావతి

ఆగలేరా నిమిషం.. తిరిగిరాదు ప్రాణం

ఒక్క నిమిషం ఆగితే ఏమైంది.. ప్రాణాలంటే లెక్క లేదా.. గమ్యం చేరాలనే తొందరలో అడ్డ దిడ్డంగా వెళుతున్నారు. ఇందుకు ఈ చిత్రాలే తార్కాణం. దూసుకొచ్చే వాహనాలకు ఎదురెళ్లి చోదకులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిలో ఇలాంటి విన్యాసాలు నిత్యకృత్యంగా మారాయి. గొల్లపూడి, గుంటుపల్లి, రాయనపాడు, తుమ్మలపాలెం, దాములూరు, దొనబండ వరకు కూడళ్లలో అస్తవ్యస్తంగా రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం కళ్లెదుటే ప్రమాదాలు జరుగుతున్నా, ట్రాఫిక్ పోలీసులు అవగాహనలు కల్పించినా చోదకుల్లో మార్పు రావడం లేదు.


జూపూడి సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదానికి ఎదురెళ్తూ..


గుంటుపల్లి వద్ద అడ్డదిడ్డంగా ఇలా..

\- ఈనాడు, అమరావతి

జోగి చుట్టూ.. మరో ఉచ్చు?

- ఏకంగా మడ, పంచాయతీ భూమి బేరం
- కృత్తివెన్ను ఠాణాలో ఐదుగురు అనుచరులపై కేసు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే, పెడన

మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ గత ప్రభుత్వంలో అధికారం అండతో అడ్డగోలుగా చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. జోగి మంత్రిగా ఉన్నప్పుడు కృత్తివెన్ను మండలం ఇంతేరులోని మడ, పంచాయతీ భూములను ప్రైవేటు భూములని చెప్పి పలువురు నుంచి రూ.90లక్షలు వసూలు చేసిన వైనంపై ఆయన అనుచరులు ఐదుగురిపై కృత్తివెన్ను ఠాణాలో కేసు నమోదైంది. నరసాపురానికి చెందిన తమ్ము కళ్యాణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కృత్తివెన్ను జడ్పీటీసీ మైలా రత్నకుమారి, జోగి ప్రధాన అనుచరుడు శ్రీనివాసరెడ్డి, మైలా రమేశ్, మైలా మహేశ్‌రాజు, వై.వెంకటరాజుపై ఐపీసీ సెక్షన్లు 420, 386, 506 రెడ్ విత్ 34 కింద కేసు కట్టారు.



12 మంది నుంచి రూ.90 లక్షలు లాగేశారు

ఇంతేరులో సర్వే నం.94లోని 30 ఎకరాల మడ, పంచాయతీ భూమిని ప్రైవేటు భూమి అని చెప్పి ఎకరం రూ.3లక్షలకే ఇస్తున్నామంటూ బేరం పెట్టారు. ఒక్కొక్కరికి 2.5 ఎకరాలు అగ్రిమెంట్ చేస్తామని 12 మంది నుంచి రూ.7.50లక్షలు చొప్పున వసూలు చేశారు. భూమి తమదేనని నమ్మించేందుకు అగ్రిమెంట్లు చేసుకొని తొలుత అడ్వాన్స్ తీసుకుని జోగి వద్దకు వెళ్లి మాట్లాడాక మిగిలిన డబ్బులు తీసుకున్నారని బాధితులు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయట్లేదని కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయంలో భూముల గురించి విచారించారు. అవి మడ భూములని తేలడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని జోగి, ఆయన అనుచరులను అడితే ప్రభుత్వం తమదేనని, ఏదో విధంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇబ్బంది లేకుండా చూస్తామని నమ్మించారు.

అప్పటి అగడాలపై వివరాల సేకరణ? మరోవైపు జోగి హయాంలో సాగిన జూదాలు, మట్టి మాఫియా, అక్రమ విద్యుత్తు కనెక్షన్లు, చెరువుల తవ్వకాలు తదితర వాటిపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం. త్వరలో ఈ అక్రమాలపై డీఎస్పీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేస్తున్నారని పోలీసు వర్గాల్లో చర్చలు వినిపిస్తున్నాయి.

చంపుతామంటూ బెదిరింపులు..

2021లో ఘటన జరిగినా అప్పుడు జోగి మంత్రిగా ఉండడం, డబ్బులు అడిగితే చంపుతామంటూ అనుచరులు బెదిరింపులకు దిగడంతో ఎక్కడా ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వం మారాక తమ డబ్బులు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. దీంతో జోగి రమేష్, ఆయన అనుచరుల అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. ఆధారాలను బాధితుడు పోలీసులకు అందించారు. త్వరలో జోగిపైనా కేసు నమోదు కానుందని సమాచారం.

ముఖం చాటేస్తున్న అద్విక ఏజెంట్లు

ఈనాడు, అమరావతి: అద్విక ట్రేడింగ్ కేసులో మింగిన సొమ్మును తిరిగి రాబట్టేందుకు పోలీసులు ఇస్తున్న నోటీసులకు ఏజెంట్లు ముఖం చాటేస్తున్నారు. అయాచితంగా లబ్ధి పొందిన సొమ్మును తిరిగి చెల్లించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపించడం లేదు. తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలన్న పోలీసుల తాఖీదులను పట్టించుకోవడం లేదు. తమకు కొంత సమయం కావాలని కొందరు కోరుతున్నారు. తాజాగా సోమవారం పోలీసుల ఎదుట హాజరుకావాల్సిన ఏజెంట్లు సుధాకర్, కళ్యాణ్‌చక్రవర్తి, రాజేంద్రప్రసాద్‌లు డుమ్మా కొట్టారు. అదనంగా పొందిన రూ.3కోట్ల సొమ్మును తిరిగి చెల్లించేందుకు అంగీకరించని ఒంగోలుకు చెందిన ఏజెంట్ సురేష్‌ను పోలీసులు గత వారం అరెస్టు చేశారు. మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది ఎక్కువ ప్రయోజనం పొందారు. రూ.54 కోట్లు పెట్టుబడికి రూ. 105 కోట్లు మేర ప్రయోజనం పొందారు. రూ.49కోట్లు ఎక్కువగా దక్కించుకున్నారు. వీరందరికీ పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. గడువు దాటిన తర్వాత కూడా స్పందించకపోతే అరెస్టు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కొండారెడ్డితో కలిసి ఎండీఎంఏ తీసుకునే వాళ్లం

- ఇంటరాగేషన్‌లో వెల్లడించిన లోహిత్ యాదవ్
- నెల్లూరు కారాగారంలో ప్రశ్నించిన పోలీసులు

ఈనాడు, అమరావతి

'**వై**కాపా నేత కొండారెడ్డి, నేను, మరికొంత మంది కలిసి తరచూ డ్రగ్స్, మత్తు పదార్థాలను తీసుకునే వాళ్లం. దాదాపు 20 మంది వరకు విశాఖలో తరచూ కలుస్తుంటాం. దొరికితే ఎండీఎంఏతో పార్టీ చేసుకుంటాం. లేని పక్షంలో గంజాయి, మద్యం తీసుకుంటాం.' అని ఎండీఎంఏ కేసులో అరెస్టు అయి నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు సోమవారం ప్రశ్నించినప్పుడు వెల్లడించాడు. బెంగళూరు నుంచి మధుసూదన్ అలియాస్ మ్యాడీ నుంచి డ్రగ్స్‌ను తెప్పించుకునే వారమని చెప్పాడు. తన పుట్టిన రోజు వేడుకలో డ్రగ్స్‌ను వినియోగించేందుకే బెంగళూరు నుంచి శ్రీవాత్సవ్, హవీలా ద్వారా తెప్పించుకుంటుండగా వారు విజయవాడలో పోలీసులకు పట్టుబడ్డారని వివరించినట్లు తెలిసింది.



సన్నీ, హరీష్ ద్వారా మ్యాడీ పరిచయం.. బెంగళూరులో ఉంటున్న మ్యాడీ ఎలా పరిచయం అయ్యాడని పోలీసులు లోహిత్ యాదవ్‌ను ప్రశ్నించారు. తనకు సన్నీ, హరీష్ ద్వారా పరిచయం అయ్యాడని చెప్పాడు. నెల్లూరుకు చెందిన హరీష్.. విశాఖపట్నంలో చదువుతున్నాడు. శ్రీవాత్సవ్‌కు విశాఖలో పరిచయమై స్నేహితుడిగా మారాడు. నెల్లూరుకు చెందిన సన్నీకి హరీష్‌తో గతంలో పరిచయం ఉందని విచారణలో చెప్పాడు. ఎండీఎంఏను మ్యాడీ సరఫరా చేస్తుంటాడని.. సన్నీ ద్వారా హరీష్ తెలుసుకున్నాడు. ఇలా పలుసార్లు శ్రీవాత్సవ్ బెంగళూరు వెళ్లి ఎండీఎంఏ తీసుకొచ్చేవాడని సమాధానమిచ్చాడు. తాను విశాఖ నుంచే యూపీఐ ద్వారా మ్యాడీకి డబ్బులు బదిలీ చేసేవాడినని.. తర్వాత బెంగళూరు నుంచి తెప్పించేవారమన్నాడు. గతంలో చాలాసార్లు తెప్పించామని, తొలిసారిగా దొరికిపోయింది ఇప్పుడే అని విచారణలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు. ఇటీవల బెంగళూరులో పోలీసులు వీరికి డ్రగ్స్ సరఫరా చేసిన మ్యాడీని అరెస్టు చేయడంతో పలు కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మరింత లోతుగా విచారించేందుకు కోర్టు అనుమతితో లోహిత్ యాదవ్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు నెల్లూరు జైలులో పోలీసులు ప్రశ్నించారు. ఈ విచారణలో మరికొన్ని కీలకమైన అంశాలను కూడా వెల్లడించినట్లు సమాచారం. మరికొందరి పాత్ర గురించి బయటకు వచ్చినట్లు తెలిసింది.

కీలక వివరాలు వెల్లడించని సతీష్

- తనకేమీ తెలియదని.. రంగయ్యకే తెలుసని బుకాయింపు
- ముగిసిన కస్టడీ, కోర్టులో హాజరు.. ఈనెల 25 వరకు రిమాండ్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో వివిధ బ్రాండ్ల లేబుళ్ల డిజైన్, ప్రింటింగ్‌కు సంబంధించి కీలక వివరాలేవీ నిందితుడు సతీష్ (ఏ17) వెల్లడించలేదు. ఐదు రోజుల కస్టడీ సోమవారంతో ముగిసింది. నిందితుడికి వైద్య పరీక్షలు చేయించి సోమవారం సాయంత్రం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో సిట్ అధికారులు హాజరుపర్చారు. నిందితుడికి న్యాయాధికారి.. ఈనెల 25వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. హైదరాబాద్ దిల్‌సుక్‌నగర్‌లోని ఆర్‌జే డిజైన్స్‌లో జనార్దనరావు ఆదేశం మేరకు నిందితుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు తమను సంప్రదించాడని చెప్పాడు. ఆయన వాట్సాప్‌లో మద్యం కంపెనీ లేబుళ్ల డిజైన్లను పంపించాడని, వాటిని యథాతథంగా హైదరాబాద్‌లో డిజైన్ చేసి.. తిరిగి ఆయన ఆమోదం కోసం వాట్సాప్‌లో పంపించామన్నాడు. ఆయన నుంచి వచ్చిన ఆర్డర్ మేరకు లేబుళ్లను ముద్రించి ఇచ్చామన్నాడు.

★ సాధారణంగా ఇచ్చే ధర కంటే ఒక్కో దానికి రూ.15 అధికంగా ఇచ్చారని, దీంతో డిజైన్, ముద్రణకు అంగీకరించామని విచారణలో వెల్లడించాడు. దీనికిగాను తిరుమలశెట్టి శ్రీనివాసరావు.. యూపీఐ ద్వారా డబ్బులు బదిలీ చేశారని చెప్పాడు. ఇంతకుమించి తనకు ఏమీ తెలియదని, మిగిలిన వ్యవహారాలను తలారి రంగయ్య చూసుకునేవారని ఇంటరాగేషన్‌లో చెప్పాడు. గత ఏడాది నవంబరు వరకు నకిలీ లేబుళ్లను సరఫరా చేశామని, ఆ తర్వాత మరోచోట ముద్రణకు ఆర్డర్ ఇచ్చారన్నాడు.

అత్యాశ కొంపముంచింది

- సోదరుడితో కలిసి ఉద్యోగం చేసే సంస్థకే రూ.87 లక్షలకు టోకరా
- చివరకు పట్టుబడిన నిందితులు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే



స్వాధీనం చేసుకున్న నగదుతో రైల్వే డీఎస్పీ రత్నరాజు, జీఆర్పీ సీఐ రమణ, ఆర్పీఎఫ్ సీఐ అలీ తదితరులు

పెద్ద మొత్తంలో సొమ్ము చోరీచేసి అప్పులు తీర్చేసి త్వరగా సెటిలై పోదామని భావించిన ఓ వ్యక్తి.. సోదరుడితో కలిసి పనిచేస్తున్న సొంత సంస్థ సొమ్మునే చోరీ చేశాడు. చివరకు అన్నదమ్ములిద్దరూ అడ్డంగా దొరికిపోయి కటకటాల పాలయ్యారు. ఈ కేసు వివరాలను సోమవారం విజయవాడలో రైల్వే డీఎస్పీ రత్నరాజు, జీఆర్పీ సీఐ జేవీ రమణ వెల్లడించారు. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం దుగ్గిరెడ్డిపాలెంకు చెందిన బూదల లలిత్‌బాబు (ఏ2).. విజయనగరం జిల్లా కర్లాంలోని ఓ పౌల్ట్రీఫామ్స్‌లో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీ కేంద్ర కార్యాలయం గుంటూరులో ఉంది. అతని సోదరుడు బూదల అశోక్‌కుమార్ (ఏ1) హైదరాబాద్‌లో ఉంటూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. తరచూ వ్యాపారం నిమిత్తం ఉత్తరాది రాష్ట్రాలకు వెళుతుంటాడు. కర్లాం బ్రాంచి నుంచి గుంటూరులోని కేంద్ర కార్యాలయానికి నగదు తెచ్చేందుకు గత నెల 30న.. గుంటూరు నుంచి బెజవాడ నాగరాజు అనే ఉద్యోగి బయలుదేరారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే విషయాన్ని లలిత్‌బాబు.. తన సోదరుడు అశోక్‌కుమార్‌కు చెప్పాడు. ఇద్దరూ కలిసి ఆ డబ్బును ఉద్యోగి నుంచి కొట్టేసేందుకు ప్రణాళిక వేశారు. గుంటూరు నుంచి కర్లాం వెళ్లిన నాగరాజు.. అక్కడ బ్రాంచి కార్యాలయంలో రూ.87లక్షలు తీసుకుని బ్యాగులో పెట్టుకుని అక్టోబరు 31న విశాఖపట్నం చేరుకున్నాడు. అక్కడ రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో నాగరాజు బీ1 బోగీ ఎక్కాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నాగరాజుతో కలిసి రైల్లో వెళ్లేలా సోదరులు పథకాన్ని రూపొందించారు. అతనితో పాటు అశోక్‌కుమార్ ఆ బోగీ ఎక్కాడు. డబ్బు బ్యాగును నాగరాజు తన బెర్తు కింద పెట్టుకుని నిద్రపోయాడు. తెల్లవారుజామున 3.10 గంటలకు మెలకువ వచ్చి చూసేసరికి బ్యాగు కనిపించలేదు. రైలు విజయవాడ స్టేషన్ దాటిపోయింది. గుంటూరులో దిగిన తర్వాత విజయవాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీసీ కెమెరాల పరిశీలన

రంగంలోకి దిగిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు.. ఆర్పీఎఫ్ కమాండ్ కంట్రోల్‌లోని సీసీ టీవీ కెమెరాల్లోని దృశ్యాలను పరిశీలించారు. ఆ సమయంలో ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై నుంచి టోపీ, మాస్క్ ధరించి, సిమెంటు రంగు బ్యాగు ఉన్న ఒక వ్యక్తి వెళ్తున్నట్లు గుర్తించారు. ఫిర్యాది ఇచ్చిన సమాచారం ప్రకారం దొంగిలించిన బ్యాగు, అనుమానిత వ్యక్తి తీసుకున్న బ్యాగు ఒకటేనని నిర్ధారించుకున్నారు. స్టేషన్ నుంచి బయటకు వస్తున్న అతని కదలికలను ట్రాక్ చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి వారధికి, అక్కడి నుంచి బస్సులో వెళ్లినట్లు గుర్తించారు. అంతకు మించి ఆధారాలు దొరకలేదు.

కాల్ డేటా విశ్లేషణతో వీడిన చిక్కుముడి

పౌల్ట్రీ సంస్థలో పనిచేసే మొత్తం 400 మంది ఫోన్ నంబర్లను పోలీసులు తీసుకుని వాటి కాల్ డేటా రికార్డులను తెప్పించి విశ్లేషించారు. పది రోజులు దాటినా ఒక్క ఆధారమూ దొరకలేదు. చివరకు లలిత్‌బాబుపై దృష్టి సారించారు. గత ఆరు నెలల కాలంలో అతను ఉపయోగించే మూడు సిమ్‌ల తాలూకూ కాల్ డేటాను తీసుకుని విశ్లేషించగా.. ఓ నంబరుకు ఆగస్టు 19, అక్టోబరు 4న మాట్లాడినట్లు గుర్తించారు. దీనిపై ఆరా తీయగా అది అతని సోదరుడు అశోక్‌కుమార్‌కు చెందిన నంబరుగా గుర్తించారు. అతను మొత్తం రెండు నంబర్లు వాడుతున్నట్లు తేలింది. టెలికామ్ సంస్థ సర్వర్‌లో పరిశీలించగా అతని పేరున మరో మూడు సిమ్‌లు ఉన్నట్లు గుర్తించారు. మధ్యప్రదేశ్‌లో తీసుకున్న సిమ్‌తో డేటా రీఛార్జి చేసుకుని ఉపయోగిస్తున్నాడు. సాధారణ కాల్స్ కాకుండా పూర్తిగా సిగ్నల్ యాప్ ద్వారా సోదరులు ఇద్దరూ మాట్లాడుకున్నట్లు గుర్తించారు.

అప్పులు తీర్చేసి.. ఈఎంఐలు కట్టేసి..

ఆధారాలు దొరకడంతో లలిత్‌బాబు, అశోక్‌కుమార్‌లను పోలీసులు ఈ నెల 15న అరెస్టు చేశారు. రైలులో నాగరాజు నుంచి దొంగిలించిన రూ.87 లక్షల్లో.. రూ.2.50 లక్షలు ఇద్దరూ ఖర్చు చేశారు. బాకీలు తీర్చి, ఈఎంఐలు కట్టారు. మిగిలిన రూ.84.50 లక్షల సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

దుర్గాఘాట్‌లో జల్లు స్నానాలు.. దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో నగరంలో పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పెద్ద సంఖ్యలో మహిళలు దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు చేసి దీపాలు వెలిగించి పూజలు చేశారు. - ఈనాడు, అమరావతి

పాతశివాలయంలో శివలింగానికి అభిషేకం

సైబర్ మోసాలపై 'యుద్ధం' చేద్దాం

విజయవాడలో సైబర్ సురక్ష‌కు శ్రీకారం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సైబర్ మోసాలపై యుద్ధం చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్‌శాఖ వినూత్నంగా 'సైబర్ సురక్ష' పేరుతో ఓ వినూత్న కార్యక్రమం చేపట్టింది. బ్యాంకుల్లో అవగాహనా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. దీనిపై సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పోలీసు సిబ్బందికి, అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. సీపీ మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. పొదుపు ఖాతాల నుంచి కరెంటు ఖాతాలకు సైబర్ నేరగాళ్లు డబ్బులు పంపమంటున్నారని, అందుకే బ్యాంకు సిబ్బంది సాయంతో ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. మంగళవారం (నేడు) విజయవాడ నగరంలోని 227 బ్యాంకు శాఖల్లో ఈ కార్యక్రమం చేపడతామన్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు బదిలీ చేయమని ఎవరైనా వస్తే.. వారికి చదివి వినిపించాల్సిన ప్రశ్నావళిని విడుదల చేశారు. ఈ కరపత్రాలను సదరు ఖాతాదారులకు అందిస్తామని తెలిపారు. అలాగే మొబైల్ అప్లికేషన్ తయారు చేస్తున్నామని.. వీటిలోని ఎరుపు రంగులో ఉన్న ప్రశ్నావళికి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని, అన్నీ ఆకుపచ్చగా మారిన తర్వాత ఒక స్లిప్ వస్తుందని.. అది ఇస్తేనే బ్యాంకు సిబ్బంది నగదు బదిలీ చేస్తారని తెలిపారు. ఇది ప్రయోగాత్మక దశలో ఉందని.. త్వరలో తుది రూపు ఇస్తామని వివరించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు సరిత, కృష్ణప్రసన్న, లక్ష్మీనారాయణ

పెట్టుబడుల మోసాలపై ప్రత్యేక దృష్టి: ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వాటిలో ప్రకటనలు గుప్పించి పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని సీపీ పేర్కొన్నారు. ఈ తరహా నేరాలను కట్టడి చేస్తామని, తర్వాత మ్యూల్ ఎకౌంట్స్, కాల్ సెంటర్ల పేరులో మోసాలపై దృష్టి పెడతామని ఆయన చెప్పారు. సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ప్రకటన చూసి పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. పెట్టుబడులకు ప్రత్యేకంగా డి మాట్ ఖాతా ఉంటుందని, దీని ద్వారా పెట్టాలని చెప్పారు. దేనిలో పెట్టుబడులు పెట్టాలో 'సెబి'లో జాబితా ఉంటుందని.. దాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. చిన్న మొత్తాలకు పెద్ద లాభాలు వస్తున్నాయని ఆశ పడితే.. మీరు కూడా నిందితులు అవుతారని ఆమె హెచ్చరించారు. డీసీపీ కె.జి.వి.సరిత సైబర్ నేరాల కట్టడికి రూపొందించిన ప్రశ్నావళిని చదివి వినిపించారు. రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరుతో నకిలీ తితిదే లేఖలు

విజయవాడ సైబర్ క్రైమ్ స్టేషన్‌లో కేసు నమోదు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వైద్య, [illegible] కూడిన లేఖ అందింది. అదే రోజుకు మరికొన్ని వీఐపీ బ్రేక్ దర్శనం లేఖలు కూడా రావడంతో అక్కడి పీఏ.. అమరావతిలోని మంత్రి పేషీని సంప్రదించడంతో నకిలీ సిఫార్సు లేఖ బాగోతం బయట పడింది. దీనిపై మంత్రి సత్యకుమార్ ఆదేశం మేరకు.. ఆయన పీఏ [illegible]

మాజీ ఉద్యోగి నిర్వాకమేనా.. [illegible] హారం వెనుక అతనే ఉండి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఈ మేరకు అతడికి నోటీసు ఇచ్చి విచారణకు పిలిపించే యోచనలో సైబర్ పోలీసులు ఉన్నారు. ఇప్పటి వరకు దాదాపు 15 నకిలీ సిఫార్సు లేఖలు జారీ అయినట్లు భావిస్తున్నారు.

సమగ్ర కులగణన చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: స్థానిక [illegible]



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి వినతిపత్రం అందిస్తున్న శంకరరావు, నాయకులు

[illegible] రని గుర్తుచేశారు. వీటిని చట్టబద్ధంగా అమలు చేయాలంటే ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సరైన ఎంపిరికల్ డేటా సేకరించాలని, తర్వాత సమగ్రంగా బీసీ కులాల జనగణన చేయాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో చైతన్యకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘం ప్రతినిధులు

వీఆర్ఏల డిమాండ్లు తీర్చాలని వినతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: [illegible] లైన వీఆర్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఏళ్ల తరబడి రూ.10500 వేతనంతో పనిచేస్తున్న తమకు.. కుటుంబ పోషణ భారమైందన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన వీఆర్ఏలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి అవసరం

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జేసీ ఇలక్కియా సూచించారు. ముఖ్యంగా [illegible] పోలీస్ 23, విభిన్న ప్రతిభావంతులు 13, పంచాయతీరాజ్ 12, పురపాలక 11, విద్య 9, డీఆర్‌డీఏ 9, ఆరోగ్య శాఖ 6, సర్వే, విద్యుత్తు శాఖలకు నాలుగేసి, కళాశాల విద్య 3, గృహ నిర్మాణం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్‌కు రెండేసి చొప్పున వినతులు వచ్చాయి. మిగిలినవి వివిధ శాఖలవి [illegible]



జేసీ ఇలక్కియాకు వివరిస్తున్న [illegible] నాయకులు

[illegible]

- [illegible]
- రవాణా శాఖ నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్స్, విద్యాసంస్థల బస్సులు.. వాటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు కోరారు. నగర కమిటీ సభ్యులతో కలిసి డీఆర్వోకు వినతిపత్రం అందించారు.

రాష్ట్రానికి వెల్లువలా పెట్టుబడులు

పటమట, న్యూస్‌టుడే : రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చే లక్ష్యంగా వైజాగ్‌లో నిర్వహించిన సీఐఐ సమ్మిట్- 2025 విజయవంతమైందని.. సీఎం చంద్రబాబు అంటే ఒక అభివృద్ధి మంత్రమని, ఆయన మీద నమ్మకంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాంతాతయ్య అన్నారు. సీఐఐ సమ్మిట్ విజయవంతంపై గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారితో పాటు, మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కె. నాగుల్ మీరా మాట్లాడారు. సమ్మిట్ విజయవంతం చేయడంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి ఎనలేదన్నారు. సమ్మిట్‌లో రాష్ట్రానికి 613 ఒప్పందాల ద్వారా సుమారు రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాబోతున్నాయని, తద్వారా ఏర్పాటు చేసే పరిశ్రమల ద్వారా సుమారు 16 లక్షల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో ఆ పార్టీ నేతల వేధింపులు తట్టుకోలేక, ముడుపులు చెల్లించలేక అనేక కంపెనీలు రాష్ట్రం వదిలి వెళ్లాయని విమర్శించారు. నాయకులు కొట్టేటి హనుమంతరావు, మాదిగాని గురునాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, చిత్రంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న

అందరికీ హయ్యర్ పింఛను ఇవ్వాల్సిందే

దుర్గాఅగ్రహారం (సీతారాంపురం), న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కనీస పింఛను రూ.9వేలు, అందరికీ హయ్యర్ పింఛను ఇవ్వాల్సిందేనని ఏపీఆర్‌పీఏ (ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్) కృష్ణా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. దుర్గా అగ్రహారంలోని జిల్లా పీఎఫ్ కార్యాలయం వద్ద సోమవారం పింఛనుదారుల విద్రోహదినం పాటించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ వంటి కేంద్ర ప్రభుత్వ రంగాలకు సంబంధించిన ఫోరమ్ ఫర్ సివిల్ పెన్షనర్ల సంఘం నాయకులు, ఈపీఎఫ్ పింఛనర్లకు సంబంధించిన ఆర్టీసీ, డెయిరీ, పత్రికా, గిరిజన కో-ఆపరేటివ్, ఏపీసీవో, వీటీపీఎస్, ఇతర ప్రైవేటు రంగాలకు సంబంధించిన పింఛనర్లు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. ఏపీఆర్‌పీఏ రాష్ట్ర కార్యదర్శి కె.సత్తిరాజు, అధ్యక్షుడు ఎన్.ఎ.శాస్త్రి మాట్లాడారు. కేంద్రం మోసపూరిత పద్ధతులు అనుసరించి పింఛను వ్యవస్థను నాశనం చేసిందని, రాజ్యాంగ విరుద్ధంగా పింఛనర్లకు అన్యాయం చేస్తోందన్నారు. పార్లమెంటును పక్కదారి పట్టించి పెన్షన్ వాలిడేషన్ చట్టం-2025ని తీసుకువచ్చిందన్నారు. ఈపీఎఫ్ పింఛనర్లకు హయ్యర్ పెన్షన్ అమలులో దామాషా పద్ధతిలో లెక్కించి.. పెన్షన్ 30 నుంచి 35 శాతం తగ్గించి మోసాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ అక్రమ విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే నెల 9, 10వ తేదీల్లో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎం.ఎన్.పాత్రుడు, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవనిగడ్డ పున్నారావు, పి.శ్రీనివాసరావు, బీడీఆర్ రెడ్డి పాల్గొన్నారు.



పీఎఫ్ కార్యాలయం వద్ద శాస్త్రి, సత్తిరాజు తదితరుల నిరసన

పింఛను ధ్రువపత్రాల అందజేత నేడు

విజయవాడ వైద్యం: జిల్లాలో రూ.15 వేల పింఛనుకు అర్హులైన దరఖాస్తుదారులకు నేడు (మంగళవారం) విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్‌లో ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు సోమవారం తెలిపారు. గతంలో జారీ చేసిన సదరన్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన కోరారు.

చెవిరెడ్డి, వెంకటేష్‌నాయుడు బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడుల బెయిల్ పిటిషన్లపై విచారణ ఏసీబీ కోర్టులో వాయిదా పడింది. ఈ పిటిషన్లు సోమవారం విచారణకు వచ్చాయి. తదుపరి వాదనల నిమిత్తం మంగళవారానికి వాయిదా వేశారు. ఈ కేసులో బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు సోమవారం బెయిల్ పిటిషన్లు వేశారు. సాంకేతిక కారణాలతో వీటిని కోర్టు తిరస్కరించింది.

అనుచిత పోస్టుల కేసులో విజయ్‌భాస్కర్‌రెడ్డి..

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో కూటమి నేతలు.. మహిళలు, న్యాయమూర్తులపై అనుచిత పోస్టులతో రెచ్చిపోయి అరెస్టు అయ్యి రిమాండ్‌లో ఉన్న వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ మంగళవారానికి వాయిదా పడింది. భాస్కర్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో మరింత లోతైన విచారణ చేసేందుకు వారం రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని దాఖలైన పిటిషన్ సైతం వాయిదా వేశారు. మరోవైపు పోలీసులు అరెస్టు చేసేందుకు వెళ్లిన క్రమంలో వారిపై దాడి చేసిన కేసులోనూ భాస్కర్‌రెడ్డికి రిమాండ్ విధించేందుకు పీటీ వారెంట్ ఇవ్వాలని కోర్టును కోరారు. దీనిపై తదుపరి విచారణలో స్పష్టత రానుంది.

నిడిగుంట అరుణ: విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ వృద్ధుడి నుంచి రూ.24.5 లక్షలు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణ బెయిల్ పిటిషన్ విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు. విజయవాడ, సూర్యారావుపేట పోలీసులు గత నెల 13న ఆమెపై కేసు నమోదు చేసిన విషయం విదితమే. మరిన్ని వివరాలు రాబట్టేందుకు అరుణను సూర్యారావుపేట పోలీసులు రెండు రోజులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ కేసులో అరెస్టైన అరుణకు బెయిల్ ఇవ్వాలంటూ ఆమె తరఫు న్యాయవాది.. విజయవాడలోని ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం విచారణకు వచ్చింది. తదుపరి విచారణ నిమిత్తం ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. నిందితురాలు ప్రస్తుతం నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

19న ఎన్టీఆర్ వర్సిటీ మహిళా వాలీబాల్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం మహిళా వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు 19న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తామని వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న వైద్య, దంత, ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, బీఎన్‌వైఎస్, ఫిజియోథెరపీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ కళాశాలల విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు వచ్చే నెల 15 నుంచి 19 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల మహిళా వాలీబాల్ పోటీల్లో డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారిణులు అర్హత పత్రాలతో అదే రోజు ఉదయం 10 గంటలకు ఆశ్రం వైద్య కళాశాల వ్యాయామ సంచాలకుని వద్ద రిపోర్టు చేయాలని సూచించారు.

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అధికం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 85 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల వద్దకే వెళ్లి.. ఫిర్యాదులు స్వీకరించారు. భూ, ఆస్తి, నగదు లావాదేవీలపై 32, వివిధ మోసాలు 15, మహిళా సంబంధ నేరాలు 10, కుటుంబ కలహాలు 5, కొట్లాటలు 4, దొంగతనం 1, చిన్న చిన్న వివాదాలపై 18 చొప్పున అర్జీలు వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి.. సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.



మహిళ సమస్య తెలుసుకుంటున్న డీసీపీ ఉదయరాణి

అనారోగ్యంతో నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ మృతి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపా నేత, ఏపీ నగరాల అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్వరరావు(59) మృతి చెందారు. కొద్ది రోజులుగా విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటూ ఇంటి వద్దనే ఉంటున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు నివాళులర్పించారు. నాలుగు నెలల కిందటే ప్రభుత్వం ఆయన్ను నగరాల అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించింది.



తిరుమలేశ్వరరావు (పాత చిత్రం)

అద్దేపల్లి సోదరులకు రెండో విడత కస్టడీ

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో కీలక నిందితులైన అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావులకు రెండో విడత పోలీసు కస్టడీకి అనుమతించింది. ఈ మేరకు ఈనెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కస్టడీకి ఇస్తూ ఎక్సైజ్ కోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది. నిందితులను మరింత లోతుగా విచారించాల్సి ఉందని, కస్టడీకి ఇవ్వాలని ఇటీవల సిట్, ఎక్సైజ్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాములు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లు సోమవారం విచారణకు వచ్చాయి. తదుపరి వాదనల నిమిత్తం 20వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో అరెస్టు కాకుండా అజ్ఞాతంలో ఉన్న నిందితుడు తలారి రంగయ్య వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడికి ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని, నకిలీ లేబుళ్ల తయారీ, ప్రింటింగ్‌కు సంబంధించి మరింత విచారణ చేపట్టాల్సి ఉందని అందులో పేర్కొన్నారు. దీనిపై వాదనల నిమిత్తం న్యాయాధికారి 19వ తేదీకి వాయిదా వేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఆశాజనకంగా పన్నుల చెల్లింపు

కొండపల్లి, న్యూస్‌టుడే: ఇంటి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపులకు సంబంధించి కొండపల్లి పురపాలికలోని రెండు ప్రాంతాల్లో మొత్తం 15175 అసెస్‌మెంట్లు ఉన్నాయి. మొదటి అర్ధ సంవత్సరానికి పురపాలికకు రూ.8 కోట్ల పన్నులు రావాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే రూ.4.75 కోట్లు చెల్లించారు. మిగిలిన మొత్తాలు మార్చి-26లోగా వసూలు చేయాలని అధికారులు చెబుతున్నారు. పురపాలక సంఘం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా.. ఇంత వరకు పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం జరగలేదు. అయినప్పటికీ రాష్ట్రంలోని మిగిలిన పురపాలికల కన్నా.. మిన్నగా పన్ను వసూలు కావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనేక మంది తమ అసెస్‌మెంట్ నంబర్ చెప్పి మరీ పన్నులు చెల్లిస్తున్నారని కమిషనర్ రమ్యకీర్తన తెలిపారు.

ఆధార్ శిబిరాలు ప్రారంభం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట, నరసాపురం, వేమిరెడ్డి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం నుంచి ఆధార్ శిబిరాలు ప్రారంభమయ్యాయి. అవి ఈ నెల 26 వరకు కొనసాగుతాయని ఎంఈవో-1 విస్సన్నపేట శంకరరావు తెలిపారు. ఆధార్‌లో సవరణలుంటే చేసుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య సేవలు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలో సోమవారం మదాల హరిజన్‌కర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన రెండు ప్రైవేటు వైద్యశాలలకు చెందిన వైద్యులు హాజరై.. కంటి, దంత, ఎముకలు, గుండె సంబంధిత రోగులు 500 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు.

స్పందన వందనం

❖ పట్టణంలోని రెండో వార్డులో డ్రైనేజీలో మురుగు నిలిచి దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుడు రమణమూర్తి 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందితో దోమల మందు చల్లించారు.

❖ పట్టణంలోని తొమ్మిదో వార్డులో డ్రైనేజీలో పూడిక పేరుకుపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికుడు ఇస్మాయిల్ 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. శుభ్రం చేయించారు. **-తిరువూరు టౌన్, న్యూస్‌టుడే**

❖ గడ్డమణుగు ఎస్సీ కాలనీలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. ఎంపీడీవో రామకృష్ణనాయక్ స్పందించారు. బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. **-జి.కొండూరు, న్యూస్‌టుడే**

❖ కొండపల్లి విద్యుత్తు వినియోగదారుల కేంద్రం బజారులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికుడు రాములు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కౌన్సిలర్ వాసు స్పందించారు. కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు. **-కొండపల్లి, న్యూస్‌టుడే.**

స్తంభాలు వాడితే.. పన్ను కట్టాల్సిందే..!

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇప్పటి వరకు పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలను ప్రైవేటు వ్యక్తులు ఏవైనా తీగలు కడితే ఎవరూ పట్టించుకోలేదు. కానీ.. ఇకపై కుదరదు. వాటిని ఎవరు ఉపయోగించుకున్నా నెలవారీ పన్ను వసూలు చేయాలని విద్యుత్తు శాఖ నిర్ణయించింది. గతంలో కూడా ఈ విధానం ఉన్నా సరిగా అమలవ్వలేదు. మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, పూర్తి స్థాయిలో పన్ను వసూలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో ఐదేళ్లుగా విజయవాడ విద్యుత్తు సర్కిల్ పరిధిలోని కేబుల్ ఆపరేటర్లు, అంతర్జాల ప్రొవైడర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

గుట్టలుగా..: నియోజకవర్గంలో పలు గ్రామాలు, మైలవరం పట్టణంలోని స్తంభాలను పరిశీలిస్తే వాటికి విద్యుత్తు సరఫరా చేసే వాటితో పాటు కేబుల్ టీవీ, అంతర్జాల తీగలు ఒకదానికొకటి కలిసిపోయి గుట్టలుగా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో కేబుల్, అంతర్జాల ఆపరేటర్లు నెల రోజుల లోపు వారి కేబుళ్లను సక్రమంగా ఉంచుకోవాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. చాలా మంది కేబుల్ ఆపరేటర్లు తమ కనెక్షన్లను ఇతరులకు విక్రయిస్తున్నారు. కొత్తగా కొనుగోలు చేసిన వారు ఎలాంటి పన్ను చెల్లించకుండా సేవలు అందిస్తున్నారు.

★ ఇబ్రహీంపట్నం విద్యుత్తు సెక్షన్ కార్యాలయం పరిధిలోని గ్రామాల్లో ఎనిమిది మంది కేబుల్ ఆపరేటర్లు, అంతర్జాల ప్రొవైడర్లు కలిసి 848 స్తంభాలను వినియోగించుకుంటుండగా ఆ శాఖ ఏడాదికి దాదాపు రూ.57 వేల వరకు పన్ను చెల్లిస్తున్నట్లు విద్యుత్తు రెవెన్యూ విభాగం గణాంకాలు పేర్కొంటున్నాయి.



కొండపల్లి మెయిన్‌బజారులో స్తంభానికి అమర్చిన తీగలు

సర్వేకు ప్రణాళిక

ప్రైవేటు వ్యక్తులు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాన్ని వాడితే నెలకు రూ.50, పట్టణంలో రూ.75, పురపాలక, జిల్లా కేంద్రాల్లో రూ.100 చెల్లించాల్సి ఉంది. ఈ విధానం చాలా రోజుల నుంచి అమల్లో ఉంది. అయితే ఆపరేటర్లు నామమాత్రంగా పన్ను చెల్లిస్తున్నారని తెలిసింది. దీంతో మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో టీవీ ఆపరేటర్లు, అంతర్జాల ప్రొవైడర్లు ఎన్ని స్తంభాలను వాడుతున్నారో సర్వే చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

మరమ్మతులకు ఇబ్బంది

విద్యుత్తు స్తంభాలను ప్రైవేటు ఆపరేటర్లు వాడితే తప్పకుండా పన్ను చెల్లించాలి. లేకుంటే తీగలను తొలగిస్తాం. స్తంభం చుట్టూ చిక్కుముళ్లతో తీగలు ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో మరమ్మతులకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

-వెంకన్న, ఏఈ, ఇబ్రహీంపట్నం



విజేతలతో ప్రిన్సిపల్ రమణకుమార్, ఉపాధ్యాయులు నాగరాజు, షాలిని, సంధ్య తదితరులు

ప్రతిభా పాటవ పోటీలతో సృజన వెలికితీత

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని శ్రీసిద్ధార్థ విద్యా సంస్థల ఛైర్మన్ మేడా మోహన్‌రావు అన్నారు. స్థానిక శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాధాగుప్తా(తొమ్మిదో తరగతి), పి.జస్వంత్‌రెడ్డి(తొమ్మిదో తరగతి), మిద్దె కార్తిక(పదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు విద్యా సంస్థల ఛైర్మన్ మేడా మోహన్‌రావు, ప్రిన్సిపల్ వి.రమణకుమార్ బహుమతులు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు మేడా శ్రీహర్ష, దీప్తి, ఉపాధ్యాయులు పి.నాగరాజు, షాలిని, జె.సంధ్య పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

విస్సన్నపేట, న్యూస్‌టుడే: చనిపోయిన స్నేహితుడు ముసుకు కుటుంబానికి ఆర్థికసాయం అందించి విస్సన్నపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1996-97లో చదివిన పూర్వ విద్యార్థులు.. రూ.25000, దుస్తులు, బియ్యం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లలిత రామకృష్ణ, డాక్టర్ వీరకర్ణ, మల్లెంపాటి వంశీ, మురుగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వితరణ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు

గోనె సంచుల్లో తెండి.. మద్దతు ధర పొందండి



మైలవరం యార్డులో పత్తి కొనుగోలు కాటాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

మైలవరం, రైతులు పండించిన పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో కాకుండా గోనె సంచుల్లో లేదా లూజుగా తెస్తేనే నాణ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ ఛైర్మన్ పి.నర్సింహారావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తేమ ఏవిధి అధిక ఎండలతో పత్తి దెబ్బతిందని, నాణ్యత విషయంలో సీసీఐ సడలింపులు ఇవ్వాలన్నారు. రైతులు కూడా పూర్తిగా ఎండబెట్టుకుని నిబంధనల మేరకు తేమశాతం ఉండేలా చూసుకోవాలన్నారు. తేమ 12 శాతం లోపు ఉంటే క్వింటాకు రూ.8110 లభిస్తుందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం

గతంలో ప్రమాణ స్వీకారం చేసిన ఏఎంసీ పాలక వర్గం.. సోమవారం అధికారికంగా ఎమ్మెల్యే సమక్షంలో బాధ్యతలు స్వీకరించింది. వైస్ఛైర్మన్ నర్సింహ, ఛైర్మన్ సీహెచ్ రాజు, ఇతర సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

ప్రజా దర్బారుతో సమస్యలకు పరిష్కారం

రెడ్డిగూడెం: ప్రజాదర్బారు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం చూపుతున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. రెడ్డిగూడెం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, సమస్యలు పరిష్కరిస్తారన్నారు. జనసేన మండల అధ్యక్షుడు ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ), ఎంపీడీ రమణి, డీడీపీ బ్రహ్మం, తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఎంపీడీవో టి.కె.వి.రమణ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి తెదేపా కృషి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల అభ్యున్నతికి పాటుపడిన పార్టీ తెదేపా అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి కొత్తరెడ్డిగూడెంలో తెదేపా మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేలా కృషిచేయాలన్నారు. అనంతరం తెదేపా మండల అధ్యక్షుడిగా నియమితులైన జె.వేణుగోపాలరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించారు. సమావేశంలో మైలవరం ఏఎంసీ ఉపాధ్యక్షుడు చేబ్రోలు రాజు, నాయకులు కె.విజయబాబు, కోటగిరి శ్రీనివాసరావు, ఆర్.వెంకటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, సీహెచ్ చందా తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు

మైలవరం: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు డిగ్రీ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఇళ్లా రవి తెలిపారు. బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ (లాజిస్టిక్స్), బీఎస్సీలో బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, డాటా సైన్స్, ఏఐలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గంపలగూడెం, పెనుగొలను గ్రంథాలయాల్లో సోమవారం గ్రంథాలయాల ప్రాధాన్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెనుగొలనులో కవుల చిత్రపటాలను ప్రదర్శించి, వారు దేశానికి చేసిన సేవలను వివరించారు. గ్రంథాలయ నిర్వాహకులు వి.జ్యోతిర్మయి, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జి.కొండూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి విజయకృష్ణ తెలిపారు. తొలుత కవి సమ్మేళనం నిర్వహించారు.

కొండపల్లి: కొండపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.



గంపలగూడెం: వ్యాస రచన పోటీలో పాల్గొన్న చిన్నారులు



పెనుగొలనులో కవుల చిత్రాలతో ప్రదర్శన




జి.కొండూరులో..

మధిర కాలువకు 294 క్యూసెక్కుల సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు సోమవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం వద్ద 22వ కి.మీ నియంత్రిక నుంచి 294 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 294 క్యూసెక్కులు చేరగా.. దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 40, పెదకొమర 20, మధిర 25, నిదానపురం 30 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు ఏఈ వెల్లడించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలక ఎన్టీటీపీఎస్ ఎ.కాలనీ సాయిబాబా మందిరం, పారిశ్రామివాడ గణనాథుడి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, నాయకులు అక్కల రామ్మోహనరావు, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాయినాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, పురపాలక ఛైర్మన్ చిట్టిబాబు తదితరులు

కనులపండువగా దీపోత్సవాలు

తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని శివాలయాల్లో మహిళలు దీపోత్సవాలు నిర్వహించారు. అర్చకులు శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేయగా భక్తులు దర్శించుకున్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక భ్రమరాంబిక సమేత మల్లేశ్వరస్వామి ఆలయం(శివాలయం), వెల్వడం, పుల్లూరు, చంద్రగూడెం, అనంతవరం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలగించారు. మైలవరంలో నందీశ్వర అభిషేకం నిర్వహించారు.



మైలవరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కొత్తపల్లిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



గంపలగూడెం శివాలయంలో క్షీరాభిషేకం

జి.కొండూరులో అన్నదానం

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, తిరుపతిరావు దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచి మండల అరుణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో బోధనా సామర్థ్యాల మెరుగు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అప్పారావు

మైలవరం, న్యూస్‌టుడే: శిక్షణ ద్వారా అధ్యాపకుల బోధనా సామర్థ్యాలు మరింత మెరుగవుతాయని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. కళాశాలలో ఈఈఈ అధ్యాపకులకు 'ఏఐ, ఐవోటీ-ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో అనువర్తనలు' అనే అంశంపై అయిదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా అంశాల ప్రాధాన్యాన్ని ఎన్ఐటీ ఏపీ అధ్యాపకుడు ఎ.శ్రీకాంత్ వివరించారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, విభాగాధిపతి నాగేశ్వరరావు, కోఆర్డినేటర్లు గిరిధర్, పంగిడయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనంలో నాణ్యత లేకుంటే కఠిన చర్యలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండే పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తే వారంతా ఉత్సాహంగా ఉండి చదువుల్లో రాణిస్తారని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. అలా కాకుండా వారి నోర్లు కొట్టి సంపాదించాలనుకోవడం మంచిది కాదని హితవు పలికారు. సోమవారం తిరువూరు బాలికోన్నత పాఠశాల, బీసీ బాలుర వసతి గృహం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. హైస్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదని విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. వారంలో ఏజెన్సీని మార్చి, మెరుగైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ బాలుర వసతి గృహం దస్త్రాలను పరిశీలించి, మెనూ ప్రకారం ఆహారం ఇవ్వడం లేదని గుర్తించారు. వార్డెన్ మోజెస్‌ను వివరణ కోరారు. ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్‌లో విషయం తెలిపి, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని సూచించారు. అనంతరం విజయప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితులు గతం కంటే మెరుగయ్యాయని చెప్పారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు అందించే భోజనం నాణ్యంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. జి.కొండూరు మండలం వెలగలేరు ఉన్నత పాఠశాల, కుంటముక్కల గురుకులంను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెలగలేరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. అనంతరం కుంటముక్కల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులను భోజన నాణ్యతపై ప్రశ్నించగా చికెన్ ఉడకడం లేదని, సాంబారు, మజ్జిగలో నీళ్లు ఎక్కువ కలుపుతున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఎ.పాపారావు, డీఈవో సుబ్బారావు, పౌర సరఫరాల జిల్లా మేనేజరు టి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వెలగలేరు ఉన్నత పాఠశాలలో భోజన నాణ్యత పరిశీలిస్తున్న విజయ ప్రతాప్‌రెడ్డి

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం



రిషితకు నగదు అందజేస్తున్న సుబ్బారావు తదితరులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన పేద విద్యార్థినికి విజయవాడ క్లబ్ సభ్యులు బాసటగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి.. విజయవాడ గ్రామీణ మండలం గొల్లపూడికి చెందిన కొడవల్లి రిషితకు విశాఖపట్నం ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఆమె తల్లి సునీత అంగన్‌వాడీలో ఆయాగా పనిచేస్తున్నారు. తండ్రి రమేష్ ఏడేళ్ల కిందట చనిపోయారు. ఈ నేపథ్యంలో రిషిత కుటుంబానికి కళాశాల రుసుం రూ.2.07 లక్షలు చెల్లించడం భారంగా మారింది. ఈ విషయమై గొల్లపూడి మాజీ సర్పంచి బొమ్మసాని సుబ్బారావును సంప్రదించగా.. ఆయన విజయవాడ క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి మొదటి దఫా చెల్లించాల్సిన రుసుం రూ.లక్ష అందించగా.. సోమవారం ఆ మొత్తాన్ని గొల్లపూడి పంచాయతీ కార్యాలయంలో బొమ్మసాని సుబ్బారావు, తెదేపా నాయకులు రిషితకు అందజేశారు.

కబడ్డీ క్రీడాకారులకు..

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైన మండలంలోని చిలుకూరివారిగూడెం జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు సగ్గురి సాక్షిథాంసన్, చల్లా స్వాతిలకు.. దాసుళ్లపాలేనికి చెందిన అప్పిడి రామిరెడ్డి రూ.2500ల చొప్పున సోమవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు అన్నే కుసుకుమారి, ఎస్ఎంసీ ఛైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయం, లాజిస్టిక్స్ రంగాల్లో డ్రోన్లది కీలకపాత్ర



ధ్రువపత్రాలతో విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: సాంకేతిక రంగాల్లో నైపుణ్యాల పెంపునకు శిక్షణలు దోహదపడతాయని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ కళాశాల నిర్మాణ దాత హనిమిరెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో పీఎం ఉషా పథకం కింద ఐక్వాక్ ఆధ్వర్యంలో, ఏరిస్ ఆగ్రోస్ సంస్థ సహకారంతో నిర్వహించిన శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది విద్యార్థులకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఇళ్లా రవి మాట్లాడుతూ వ్యవసాయం, పర్యావరణం, లాజిస్టిక్స్ రంగాల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ రంగారావు, ఐఐసీ ఇన్‌ఛార్జి ఉమాలక్ష్మీ, ఐక్వాక్ కోఆర్డినేటర్ బి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి అధ్యాపకుల బ్యాడ్మింటన్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో భాగంగా స్థానిక పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ (పీబీఎస్) ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 29, 30 తేదీల్లో 50వ ఏపీ కాలేజ్ టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వ విద్యాలయాలకు అనుబంధంగా ఉన్న కళాశాలల్లో పని చేస్తున్న బోధనా సిబ్బంది పాల్గొనాలని సూచించారు. ఆసక్తి గల అధ్యాపకులు 20లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ 99896 16969 నంబరులో సంప్రదించాలని కోరారు.

జాతీయ రహదారిపై తప్పిన ప్రమాదం

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్-65పై గొల్లపూడి సూరాయిపాలెం వద్ద సోమవారం రాత్రి పెద్ద ప్రమాదం తప్పింది. భవానీపురం ఐరన్ యార్డు నుంచి ఇనుప పైపులను వ్యాన్‌లో గుంటుపల్లి వైపు తరలిస్తుండగా.. సూరాయిపాలెం వద్దకు రాగానే పైపులకు కట్టిన తాడు తెగిపోవడంతో జాతీయ రహదారిపై పడిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు, స్థానికులు, కార్మికులు వాటిని పక్కకు తొలగించారు. పైపులు పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

21 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం మార్కెట్ యార్డులో శుక్రవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి బి.రాజాబాబు తెలిపారు. రైతులు ముందుగా సీఎం యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుని గోనె సంచుల్లో లేదా లూజుగా మాత్రమే పత్తి తీసుకురావాలని సూచించారు. స్లాట్ బుకింగ్ రైతులు తమ చరవాణిలో చేసుకోవచ్చన్నారు. రైతు సేవా కేంద్రాలు, మార్కెట్ కమిటీ కార్యాలయంలో కూడా నమోదు చేస్తారని చెప్పారు.

పారదర్శక సేవలందించండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ప్రజలకు పారదర్శక సేవలందించాలని విస్సన్నపేట తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి సూచించారు. పుట్రేల సచివాలయాన్ని, కొండపర్వలోని శ్రీవీరాంజనేయ ఫిల్లింగ్ స్టేషన్‌ని రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుట్రేల సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను గురించి ఆరా తీశారు. దస్త్రాలను పరిశీలించారు. పెట్రోల్ బంక్‌లో ఆయిల్ నిల్వలు, కొలతలు, నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులపై ఆక్రమణలు.. ట్రాఫిక్ సమస్యలు!

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలో రోడ్లపై ఆక్రమణలు పెరిగిపోతున్నా. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధాన రహదారిలో బోసుబొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ఇరువైపులా కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డుపైనే శాశ్వత షెడ్లు, దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారులు వారి వాహనాలను రహదారులపై నిలుపుతున్నారు. ఈ కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు, ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లి రావడానికి ఎక్కువ సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పురపాలక అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలు తొలగించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కారు ఢీకొని రైల్వే విశ్రాంత ఉద్యోగి దుర్మరణం

చిట్టినగర్, న్యూస్‌టుడే: కారు ఢీకొని రైల్వే విశ్రాంత ఉద్యోగి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన పోలుదాసు బాలయ్య(76). రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌లో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. సోమవారం పని మీద ద్విచక్ర వాహనంపై కొత్తూరు తాడేపల్లి గ్రామం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కొత్తూరు చెరువు సమీపంలోని మర్రిచెట్టు ప్రాంతం వద్ద ఎదురుగా మైలవరం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు బాలయ్య వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు హరినాగప్రసాద్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



జంటగా.. ప్రేమ పంటగా

కంద దుంప హృదయాకారంలో ఆకట్టుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం పంద్యాలచెరువు గ్రామానికి చెందిన రైతు గణేశుల రెడ్డినాయుడు కంద సాగు చేస్తున్నారు. ఆయన తోటలో రెండు దుంపలు కలిసి హృదయాకారంలో ఏర్పడ్డాయి. సుమారు రెండు కిలోల బరువున్న దీన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.
– న్యూస్‌టుడే, కోనసీమ



రెండో ప్రాకారంతో ఆలయ నమూనా

రాజధానిలోని శ్రీవారి ఆలయానికి రెండో ప్రాకారం

27న సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతం వెంకటపాలెం సమీపంలో తితిదే నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి మహర్దశ రానుంది. ఆలయానికి రెండో ప్రాకారం నిర్మించాలని తితిదే నిర్ణయించింది. ఈ నెల 27న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపన చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 10.55 నుంచి 11.30 గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తిరుమల మాదిరిగా ఇక్కడ కూడా రెండో ప్రాకారం రూపుదిద్దుకోనుంది. పడమర, ఉత్తరం, దక్షిణం దిక్కుల్లో 5 అంతస్తులతో గాలి గోపురాలు.. తూర్పు వైపున 7 అంతస్తులతో మహా రాజగోపురం నిర్మించనున్నారు. అంతర్భాగంలో మహా రాజగోపురానికి అభిముఖంగా ఆంజనేయ స్వామి ఆలయం, ఉత్సవ మండపం, కోనేరు మొదలైనవి రానున్నాయి.

నంద్యాల అధికారికి జాతీయ అవార్డు



అనురాధ

ఈనాడు, కర్నూలు: నంద్యాల జిల్లా గోస్పాడు మండలం చింతకుంట గ్రామీణ పశువైద్య కేంద్రంలో పనిచేస్తున్న జూనియర్ వెటర్నరీ అధికారి అనురాధను జాతీయ స్థాయిలో అత్యున్నత పురస్కారమైన 'జాతీయ గోపాలరత్న అవార్డు' వరించింది. ఉత్తమ కృత్రిమ గర్భధారణ నిపుణుల విభాగంలో ఆమె జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. దేశంలో అన్ని కేటగిరీలకు కలిపి మొత్తం 2,081 మంది ఆయా అవార్డులకు పోటీపడ్డారు. మూడు కేటగిరీల్లో కలిపి కేవలం తొమ్మిది పురస్కారాలు ఉండగా వాటిలో ఒకటి అనురాధను వరించడం విశేషం.

తయారీరంగం బలోపేతానికి ఏపీ ప్రభుత్వం కృషి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి జీతన్‌రామ్ మాంఝికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, దిల్లీ: తయారీరంగంతో ముడిపడిన అనుబంధ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ ప్రారంభమైన 22వ సీఐఐ గ్లోబల్ ఎంఎస్ఎంఈ బిజినెస్ సమిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు సేవల రంగంలో బలంగా ఉన్న భారతదేశం ఇకపై తయారీ రంగంలోనూ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఎస్ఎంఈల్లో చిన్నస్థాయి పరిశ్రమలు మధ్యస్థాయికి, మధ్యస్థాయిలో ఉన్న సంస్థలు పెద్దగా ఎదగడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. భారతీయ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌లో ఆమోదం పొందడానికి అవసరమైన ప్రామాణీకరణ, ధ్రువీకరణపై దృష్టి సారించాలన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నుంచి భారతీయ ఎంఎస్ఎంఈలు గరిష్ఠ ప్రయోజనం పొందేలా మార్గనిర్దేశం చేయాలని సీఐఐని కోరారు.



చియా గింజల్లో ఏమేం ఉంటాయంటే..

రెండు టేబుల్ స్పూన్ల (28 గ్రా.) చియా గింజలు తీసుకొంటే..
- రోజుకు మన శరీరానికి కావల్సిన 35 శాతం ఫైబర్,
- 23 శాతం మెగ్నీషియం
- 26 శాతం ఫాస్పరస్
- 12 శాతం జింక్
- 9 శాతం ప్రొటీన్లు లభిస్తాయి.

అందుకే రోజూ వాటిని తినడం అలవాటు చేసుకోండి.
– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

రూ.4 కోట్లు ఎలా జమయ్యాయి?

- మీ జీతం లక్షల్లోనే కదా..?
- కల్తీ నెయ్యి సరఫరాలో వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఏమిటి?
- చిన్న అప్పన్నపై సిట్ ప్రశ్నల వర్షం
- నాలుగు గంటల పాటు సాగిన విచారణ



చిన్న అప్పన్నను సిట్ కార్యాలయానికి తీసుకెళ్తున్న పోలీసులు

తిరుపతి, ఈనాడు; తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 'దిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక లైజన్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన ఐదేళ్లలో జీతం, ఇతర భత్యాలు కలుపుకొంటే రూ.65 లక్షలకు మించదు.. అలాంటప్పుడు మీ బ్యాంకు ఖాతాల్లో రూ.4.69 కోట్లు ఎలా జమయ్యాయి. ఆదాయం రూ.లక్షల్లో ఉంటే మీ బ్యాంకు ఖాతాల్లోకి రూ.కోట్లు ఎలా వచ్చాయి?' అంటూ తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను సిట్ అధికారులు ప్రశ్నించారు. వీటిపై ఆయన ఎలాంటి సమాధానమూ ఇవ్వకుండా మౌనం వహించినట్లు తెలిసింది. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న చిన్న అప్పన్నను కస్టడీ నిమిత్తం సిట్ అధికారులు సోమవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, ఈసీజీ, పల్స్‌ను పరీక్షించి.. సాధారణ స్థాయిలో ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా చిన్న అప్పన్న మాస్క్ ధరించి ముఖం దాచుకునే ప్రయత్నం చేశారు. తర్వాత ఆయనను భూదేవి కాంప్లెక్స్‌లోని సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్న భోజనం తర్వాత నాలుగు గంటలపాటు విచారించారు.

సుబ్బారెడ్డితో పరిచయం ఎలా?: 'విజయనగరం జిల్లాకు చెందిన మీకు.. వైవీ సుబ్బారెడ్డితో పరిచయం ఎలా ఏర్పడింది. 2014-19 వరకు వైవీకి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేయగా తర్వాత ఏపీ భవన్‌లో ప్రత్యేక లైజన్ అధికారిగా నియమితులు కావడానికి ఎవరు సహకరించారు? దిల్లీలో ఎలాంటి బాధ్యతలు నిర్వర్తించారు?' అని అధికారులు ప్రశ్నించారు. ఓ అధికారి ద్వారా వైవీ సుబ్బారెడ్డి పరిచయం అయ్యారని, నిబద్ధతతో పనిచేయడంతో ఆ స్థాయికి ఎదిగానని, ఏపీ భవన్‌కు వచ్చే ముఖ్యుల పర్యటనలను సమన్వయం చేసుకొనే బాధ్యతలు అక్కడ నిర్వర్తించానని చిన్న అప్పన్న చెప్పినట్లు తెలిసింది. 'తిరుమల వ్యవహారాలతో మీకేం పని? నెయ్యి సరఫరాదారులు, డెయిరీల ప్రతినిధుల వివరాలను 2022లో ప్రొక్యూర్‌మెంట్ జీఎం నుంచి ఎందుకు సేకరించారు? తర్వాత నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్‌కు ఎందుకు పంపాల్సి వచ్చింది? ఇందులో అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రమేయం ఉందా?' అంటూ సిట్ అధికారులు ప్రశ్నించగా... సుబ్బారెడ్డితో ఉన్న అనుబంధంతోనే తిరుమలకు వచ్చి వెళ్లేవాడినని మాత్రమే చిన్న అప్పన్న చెప్పినట్లు సమాచారం. మిగిలిన ప్రశ్నలకు మౌనం వహించారని, పదేపదే అడిగినా స్పందించలేదని తెలిసింది. నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్స్ కలిసి ఉన్నాయని 2022 ఆగస్టులో నివేదిక వచ్చాక కూడా భోలేబాబా, శ్రీవైష్ణవి డెయిరీ, ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల నుంచి సరఫరా కొనసాగించడంలో మీ ప్రమేయం ఏమాత్రమని ప్రశ్నించగా తనకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఒక్క సరఫరాదారుడిపైనా వైవీ సుబ్బారెడ్డి ఎందుకు చర్యలు తీసుకోలేదని అడగ్గా.. తనకు తెలియదని పేర్కొన్నట్లు సమాచారం.

అంతకుముందూ లంచాలు తీసుకున్నారా?

'భోలేబాబా డెయిరీ ఏజెంట్ పీపీ శ్రీనివాస్‌ను కిలోకు రూ.25 చొప్పున కమీషన్ ఎందుకు అడిగారు? అప్పటికే ఆ సంస్థ కల్తీ నెయ్యి సరఫరా చేస్తోందని మీకేమైనా తెలుసా? కమీషన్ ఇవ్వకపోవడంతోనే ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌ను తెరపైకి తీసుకొచ్చి.. కాంట్రాక్టు దక్కేలా చేశారా? ప్రీమియర్ అగ్రిఫుడ్స్ నుంచి హవాలా ఏజెంట్ ద్వారా రెండు దఫాలుగా రూ.50 లక్షలు తీసుకున్నది వాస్తవమేనా? లంచాలు తీసుకోవడం ఇదే మొదటిసారా? లేక అంతకుముందూ తీసుకున్నారా?' అంటూ సిట్ అధికారులు ప్రశ్నించగా చిన్న అప్పన్న స్పందించలేదని తెలిసింది. అయినవారికి నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కేలా 2020లో టెండరు నిబంధనలు మార్చడంలో మీ ప్రమేయం నిజమేనా? ఆ సమయంలో సహకరించిన తితిదే అధికారులు ఎవరు? అని అడగ్గా తాను ఎవరితోనూ మాట్లాడలేదని చెప్పినట్లు సమాచారం.

తిరుపతి తూర్పు పీఎస్‌కు తరలింపు

విచారణ అనంతరం చిన్న అప్పన్నను తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి స్టేషన్‌లో ఉంచి మంగళవారం ఉదయం 10 గంటలకు విచారణ నిమిత్తం సిట్ కార్యాలయానికి తీసుకెళ్లనున్నారు. ఈ నెల 21 వరకు విచారణ కొనసాగనుంది.

స్పీకర్ వైఖరి కోర్టు ధిక్కారమే..

- కొత్త సంవత్సరం ఎక్కడ జరుపుకోవాలి అనుకుంటున్నారో నిర్ణయించుకొనే స్వేచ్ఛను ఆయనకే వదిలేస్తున్నాం
- తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణలో సీజేఐ వ్యాఖ్యలు

ఈనాడు, దిల్లీ: పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు నిర్ణయం వెలువరించాలని సుప్రీంకోర్టు చెప్పినా దానిపై ఇంతవరకు తెలంగాణ స్పీకర్ నిర్ణయం వెలువరించకపోవడం పూర్తిగా కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వచ్చే విచారణ తేదీలోపు ఆ పిటిషన్లపై చర్యలు తీసుకుంటే సరే.. లేదంటే కోర్టు ధిక్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇందులో స్పీకర్ రాజ్యాంగ రక్షణను అనుభవించలేరని తాము ఇదివరకే చెప్పామని, అందువల్ల కొత్త సంవత్సరం ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకొనే స్వేచ్ఛను ఆయనకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని, అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోనందున నేరుగా సుప్రీంకోర్టే దానిపై విచారణ చేపట్టాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలుచేసిన రెండు వేర్వేరు పిటిషన్లు.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం వెలువరించడానికి స్పీకర్‌కు మరో 8 వారాల గడువు ఇవ్వాలని అసెంబ్లీ కార్యదర్శి దాఖలుచేసిన పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ మూడు పిటిషన్లలో ప్రతివాదులకు నోటీసులు జారీచేసి, 4 వారాల్లో సమాధానం చెప్పాలని నిర్దేశిస్తూ విచారణ వాయిదా వేసింది. 'స్పీకర్ వైఖరి కోర్టు ధిక్కరణలా కనిపిస్తోంది. 10 పిటిషన్లలో ఇప్పటికే నాలుగింటిపై విచారణ పూర్తిచేసి ఉంటే నిర్ణయం వెలువరించి ఉండాల్సింది. ఈ పిటిషన్లపై రోజువారీగా విచారణ జరపాలని మేం ఇదివరకే ఆదేశించాం' అని సీజేఐ పేర్కొన్నారు. అందుకు అసెంబ్లీ కార్యదర్శి తరఫు న్యాయవాదులు బదులిస్తూ ఇప్పటివరకు చోటుచేసుకున్న పరిణామాలకు సంబంధించిన ఛార్ట్‌ను చూపడానికి ప్రయత్నించగా సీజేఐ 'సారీ' అంటూ వాటిని పరిశీలించడానికి నిరాకరించారు.

సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్య క్రమంపై కసరత్తు

- 21న ముఖ్యమంత్రి వద్ద సమీక్ష

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో బడ్జెట్ ఆధారితంగా తదుపరి ప్రాధాన్య ప్రాజెక్టులపై జలవనరులశాఖ కసరత్తు చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఐదు ప్రాధాన్య ప్రాజెక్టులను ఎంపిక చేసుకుని వాటికి నిధుల లోటు లేకుండా పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటికే హంద్రీ-నీవా పూర్తయింది. కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్లడంతో పాటు మధ్యలో వందల చెరువులు నింపి సీమ జిల్లాల్లో ఆయకట్టుకు అందిస్తోంది. మరోవైపు పోలవరం ఎడమ కాలువ పనులు జనవరి నాటికి పూర్తి అయ్యేలా లక్ష్యం విధించింది. చింతలపూడి ఎత్తిపోతల.. హరిత ట్రైబ్యునల్ సమస్యల వల్ల ఆగింది. వెలిగొండ, వంశధార రెండో దశ రెండో భాగం పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు మరికొన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యంగా ఎంచుకుని ప్రత్యేకంగా నిధులు ఇచ్చి పూర్తి చేయాలని కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై సెప్టెంబరు నెలలో ముఖ్యమంత్రి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ నెల 21న సీఎం చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష చేయనున్నారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

మిగులు విద్యుత్తు నిల్వలో పీఎస్పీలది కీలకపాత్ర

- పొరుగు దేశాలకూ ఎగుమతి చేసే సామర్థ్యం
- కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్



గ్రీన్‌కో పునరుత్పాదక విద్యుత్తు పరిశ్రమ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, పక్కన సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి తదితరులు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మిగులు విద్యుత్తును నిల్వ చేయడంలో పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు (పీఎస్పీలు) కీలకపాత్ర పోషిస్తాయని కేంద్ర విద్యుత్తుశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా పిన్నాపురంలో గ్రీన్‌కో సంస్థ నిర్మించిన పునరుత్పాదక విద్యుత్తు పరిశ్రమను సోమవారం ఆయన సందర్శించారు. హెలికాప్టర్ ద్వారా ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం పీఎస్పీల అభివృద్ధి ప్రధానాంశంగా పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి అధ్యక్షోపన్యాసం చేశారు. 'మిగులు గ్రీన్‌పవర్‌ను నిల్వ చేయడం ద్వారా సౌర విద్యుత్తు ఉత్పత్తి లేని సమయాల్లో డిమాండ్‌ను తీర్చడంలో పీఎస్పీలు కీలకపాత్ర పోషించగలవు. జలాశయాల్లో నీటి బాష్పీభవన నష్టాలను అధిగమించేందుకు తేలియాడే సౌర విద్యుత్తు ఫలకాలను ఏర్పాటు చేయాలి. సకాలంలో స్థలం, నీటి కేటాయింపులు, వేగవంతమైన అనుమతుల ద్వారా పీఎస్పీల అభివృద్ధిని సులభతరం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కీలకం. దీన్ని మరింత వేగవంతం చేయడానికి గ్రీన్ ఎనర్జీ సెస్, నీటి పన్నులు, రిజర్వాయర్ లీజు ఛార్జీలను ఉపసంహరించుకునేలా ఈ కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలి. దేశవ్యాప్తంగా దాదాపు 224 గిగావాట్ల సామర్థ్యం కలిగిన పీఎస్పీలను గుర్తించాం. వీటిలో దాదాపు 7 గిగావాట్ల సామర్థ్యమున్న 10 ప్లాంట్లు ప్రారంభమయ్యాయి. 12 గిగావాట్ల సామర్థ్యం కలిగిన మరో పది నిర్మాణంలో ఉన్నాయి. 78 గిగావాట్ల సామర్థ్యం కలిగిన 56 పీఎస్పీలు ప్రణాళిక, అభివృద్ధి దశల్లో ఉన్నాయి' అని చెప్పారు. విద్యుత్తు శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ మాట్లాడుతూ.. 2025-26లో పిన్నాపురం పీఎస్పీలో 1680 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఎనిమిది యూనిట్లను, 500 మెగావాట్ల సామర్థ్యమున్న టెహ్రీ పీఎస్పీతో పాటు విజయవంతంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఇది కేంద్ర, రాష్ట్రాల సీపీఎస్‌యూలు, ప్రైవేటు రంగం మధ్య సమన్వయాన్ని ప్రతిబింబించే విజయమని పేర్కొన్నారు. సమావేశంలో గ్రీన్‌కో సంస్థ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు భారీగా ప్రోత్సాహకాలు

అనంతరం కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ విలేకర్లతో మాట్లాడారు. మన దేశ అవసరాలకు సరిపోగా మిగులు విద్యుత్తును నేపాల్, భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలకు అందించగల సామర్థ్యాన్ని భారత్ సాధించిందని చెప్పారు. సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తి వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో నిల్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం జాతీయ ప్రాధాన్యంగా మారిందన్నారు. ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. 200 మెగావాట్ల వరకు సామర్థ్యమున్న ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున, ఆ పైబడిన వాటికి ప్రతి మెగావాట్‌కు రూ.75 లక్షల చొప్పున రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు.

నా నువ్వు లేని జీవితం... నాకొద్దు

- భార్య గర్భంలోని కవలలు మృతి
- ఆ నొప్పి తాళలేక బాధితురాలి కన్నుమూత
- తీవ్ర మనస్తాపంతో భర్త బలవన్మరణం



విజయ్, శ్రావ్య దంపతులు

శంషాబాద్, న్యూస్‌టుడే: వారిది అరమరికలు లేని దాంపత్యం. సంతానం కోసం ఎన్నో ఆసుపత్రులు తిరిగారు. చివరికి కృత్రిమ గర్భధారణతో కల నెరవేరబోతోందని ఉప్పొంగారు. పైగా కవలలు రాబోతున్నారని తెలుసుకుని... సంతోషం రెట్టింపైంది. భావి జీవితంపై ఎన్నో కలలుగన్నారు. తామొకటి తలిస్తే... అన్నట్లుగా జీవితాంతం తోడు నీడగా ఉంటుందనుకున్న భార్య ప్రసవ వేదనతో తుది శ్వాస విడిచింది. నువ్వులేని నా జీవితం శూన్యమంటూ అతనూ ఆమెను అనుసరించారు. ఈ హృదయ విదారక సంఘటన సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో చోటుచేసుకుంది. ఆర్జీఐఏ ఇన్‌స్పెక్టర్ కె.బాల్‌రాజ్ తెలిపిన కథనం ప్రకారం... కర్ణాటక రాజధాని బెంగళూరుకు చెందిన ముత్యాల విజయ్(40) ఏడాదిన్నర క్రితం తన భార్య శ్రావ్య(35)ను తీసుకొని శంషాబాద్‌కు వచ్చారు. అతను స్థానిక ఎయిర్‌పోర్టులో ప్రైవేటు ఉద్యోగి. ఈ దంపతులకు సంతానం లేదు. ఐవీఎఫ్ ద్వారా శ్రావ్య గర్భం దాల్చారు. ఆమె గర్భంలో కవలలు పెరుగుతున్నట్లు తెలుసుకుని వారు ఎనలేని ఆనందాన్ని పొందారు. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భిణి. ఈ నెల 16న రాత్రి ఏడు గంటలకు కడుపులో నొప్పి రావడంతో అత్తాపూర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనూహ్యంగా శ్రావ్య కడుపులోని కవలలు మృతి చెందడంతో ఆమె స్పృహ కోల్పోయారు. మెరుగైన వైద్యం కోసం శ్రావ్యను గుడిమల్కాపూర్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ ఆమె కూడా ప్రాణాలు విడిచారు. భార్యతోపాటు కవలలూ తనను విడిచి కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన విజయ్... నేనూ నీ వెంటనే వస్తానంటూ శంషాబాద్‌లోని ఇంట్లో ఉరేసుకున్నారు. రెండు గంటల వ్యవధిలోనూ ఒక నిండు కుటుంబం కుప్పకూలిన ఘటనతో స్థానికంగా విషాదం అలముకుంది. దంపతులు, వారి కవలల మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

కాసుల కక్కుర్తితో.. కన్నకూతురి తాకట్టు

- 15 ఏళ్ల కుమార్తెకు 43 ఏళ్ల వ్యక్తితో పెళ్లి
- మద్యం అలవాటు చేసి, అతనితో గడపాలని పంపిన తండ్రి

మైలవరం, న్యూస్‌టుడే: కాసుల కక్కుర్తితో ఓ తండ్రి 15 ఏళ్ల వయసున్న కుమార్తెను.. మద్యానికి బానిసై భార్య నుంచి విడిపోయిన 43 ఏళ్ల వ్యక్తితో దొంగ పెళ్లి చేసి, అతడి నుంచి లక్షలు తీసుకున్నాడు. కాపురానికి వెళ్లేందుకు నిరాకరించిన కుమార్తెను మద్యానికి సైతం అలవాటు చేశాడు. ఆమె ఆ మత్తులో ఉన్నప్పుడు పెళ్లి చేసిన వ్యక్తి ఇంటికి పంపాడు. బాధితురాలు చుట్టుపక్కల వారి సాయంతో బయటపడి, పోలీసులను ఆశ్రయించింది. ఈ దారుణానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాలివీ. మైలవరం మండలంలోని ఓ గ్రామంలో 15 ఏళ్ల బాలిక చదువు మానేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఏరువ జమలారెడ్డి మూడేళ్ల కిందట భార్యతో విడాకులు తీసుకుని, తాగుతూ ఒంటరిగా ఉంటున్నాడు. బాలిక తండ్రితో ఉన్న స్నేహం కారణంగా బావ అని పిలుస్తూ అతడితో కలిసి తిరిగేవాడు. ఈ నేపథ్యంలో బాలికపై అతడి కన్నుపడింది. జమలారెడ్డి పొలం అమ్మగా వచ్చిన రూ.లక్షల సొమ్ముకు బాలిక తండ్రి ఆశపడ్డాడు. తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తానంటూ అతని దగ్గర నుంచి పలు దఫాలుగా రూ.20 లక్షల వరకు తీసుకున్నాడు. ఇటీవల గుబ్బల మంగమ్మ గుడి వద్దకు తీసుకెళ్లి ఒకసారి, వేరే ప్రాంతంలో మరోసారి జమలారెడ్డితో రహస్యంగా పెళ్లి చేశాడు. ఇందుకు ఇష్టపడని బాలిక పుట్టింట్లోనే ఉంటుంది. అయితే తండ్రి ఆమెకు మద్యం అలవాటు చేశాడు. ఈ నెల 12న బాలిక తండ్రి జమలారెడ్డిని డబ్బులు అడిగాడు. నీ కుమార్తెను నాతో కాపురానికి పంపితే ఇస్తానని అతను చెప్పడంతో కుమార్తెకు మద్యం తాగించి ఆ మత్తులోనే అతడి ఇంటి వద్ద దింపి, రూ.10 వేలు తెచ్చుకున్నాడు. అసభ్యంగా ప్రవర్తిస్తున్న జమలారెడ్డి బారి నుంచి బయటపడిన బాలిక.. ఐసీడీఎస్ సిబ్బంది సాయంతో తమకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తండ్రి, జమలారెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, సోమవారం అరెస్టు చేశామని వెల్లడించారు. బాలికను విజయవాడలోని జువెనైల్ హోంకు తరలించామన్నారు.

'ఈనాడు' అందించిన నిఘంటువులు..

తెలుగుజాతికి మహత్తర కానుకలు

- భాషా పరిరక్షణకు రామోజీరావు జీవితాంతం కృషిచేశారు
- మండలి బుద్ధప్రసాద్



న్యూస్‌టుడే, అవనిగడ్డ: రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు దివంగత రామోజీరావు స్ఫూర్తితో తెలుగు భాషను కాపాడతానని సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని, ఇది తెలుగు వారందరినీ ఆనందపరిచిందని మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఓ సందర్భంలో నేను రామోజీరావును కలిశాను. తాను బతికి ఉండగానే తెలుగు మటుమాయమవుతుందేమోనని ఆయన నావద్ద ఆవేదన వ్యక్తంచేశారు. తెలుగు పరిరక్షణకు రామోజీరావు జీవితమంతా కృషిచేశారు. భాషోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. అందుకోసం తెలుగు వెలుగు మాసపత్రికను నడిపారు. తెలుగులో మహా నిఘంటువు నిర్మాణాన్ని మహాయజ్ఞంగా చేపట్టారు. ఇందులో 1.33 లక్షల తెలుగు పదాలకు తెలుగు అర్థాలున్నాయి. దీంతోపాటు 86 వేల ఆంగ్ల పదాలకు తెలుగు అర్థాలను తెలిపే మరో నిఘంటువూ రూపుదిద్దుకుంది. రామోజీరావు జయంతి రోజున ఆ నిఘంటువులను ఆవిష్కరించడం తెలుగు జాతికి ఈనాడు అందించిన మహత్తర కానుక. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ పేర్కొన్నట్లుగా.. తెలుగును పరిరక్షించడమే రామోజీరావుకు మనం అర్పించే నిజమైన నివాళి' అని బుద్ధప్రసాద్ అన్నారు. బడిలో, ఏలుబడిలో తెలుగుకు ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

స్వచ్ఛమైన మనసుకు, సంస్కృతికి గిరిజనులు వారసులు: మంత్రి సత్యకుమార్

ఎస్టీ కమిషన్ ఛైర్మన్, సభ్యుల బాధ్యతల స్వీకరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్. చిత్రంలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి, సభ్యులు, కె.ఎస్.జవహర్, సోము వీర్రాజు తదితరులు

ఈనాడు, అమరావతి-విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: గిరిజనులు స్వచ్ఛమైన మనసుకు, సంస్కృతికి వారసులని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన.. రాష్ట్ర ఎస్టీ కమిషన్ నూతన ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, కమిషన్ సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఛైర్మన్‌కు, సభ్యులు జి.సునీత, కె.లక్ష్మి, కె.సాయిరాం, కె.మల్లేశ్వరరావు, వెంకటప్పలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... షెడ్యూల్డు కులాలు, తెగలను, వెనుకబడిన తరగతుల వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లపై ఉందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ షెడ్యూల్డు కులాల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్లు సమన్వయంతో పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ పథకాలను చేరుస్తాం: అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఎస్టీ కుటుంబానికీ చేరుస్తామని బొజ్జిరెడ్డి చెప్పారు. విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. 'ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు' అని అన్నారు.

ఓఎల్ఎక్స్‌లో తహసీల్దారు కార్యాలయం!

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా గిద్దలూరు మండల తహసీల్దారు కార్యాలయాన్ని రూ.20 వేలకు విక్రయిస్తానంటూ ఓఎల్ఎక్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి ఓ ఫొటో పెట్టి పోస్టు చేశారు. ఇది వైరల్ కావడంతో అక్కడి తహసీల్దారు ఎం.ఆంజనేయరెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ స్పందిస్తూ.. ఫిర్యాదు మాట వాస్తవమేనని, విచారించి కేసు నమోదు చేస్తామని తెలియజేశారు.

డ్రోన్ సిటీలో భూములు కేటాయించేందుకు నిబంధనల ఖరారు

ఈనాడు, అమరావతి: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో అక్కడ యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు భూములు కేటాయించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఏపీఐఐసీ నిబంధనల మేరకు సంస్థలకు భూములు కేటాయించనుంది. ప్రాథమికంగా లీజు విధానంలో వీటిని ఇవ్వనుంది.

కేటాయింపులు ఇలా..

- ఒక్కో యూనిట్‌కు రాయితీ ధరపై 5 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం కేటాయిస్తుంది.
- యూనిట్ ఉత్పత్తిలోకి వచ్చిన 5-10 ఏళ్ల తర్వాత నిర్దేశిత మొత్తాన్ని చెల్లించి ఏపీఐఐసీ నుంచి భూములను కొనుగోలు చేసే అవకాశం కల్పించింది. అప్పటి వరకు లీజు విధానంలో భూములు కేటాయిస్తుంది.
- 33, 66, 99 ఏళ్ల వ్యవధికి లీజు విధానంలో భూములు పొందే అవకాశం ఉంది.
- ఎకరాలోపు భూములు తీసుకున్న సంస్థ రెండేళ్లలో యూనిట్ ఏర్పాటు చేయాలి. అంతకుమించి భూములు తీసుకున్న సంస్థలు మూడేళ్లలో కార్యకలాపాలు ప్రారంభించాలి.
- తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు 20 ఎకరాల వరకు, కామన్ ఫెసిలిటీస్‌కు 20 ఎకరాల వరకు, ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయాల కోసం 15 ఎకరాల వరకు భూముల కేటాయింపుపై నిర్ణయాన్ని ఏపీఐఐసీ ఎండీ నేతృత్వంలోని స్టేట్ ల్యాండ్ అలాట్‌మెంట్ కమిటీ తీసుకుంటుంది. అంతకు మించిన భూ కేటాయింపు ప్రతిపాదనలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

భూముల ధరల్లో ఇచ్చే రాయితీ

విస్తీర్ణం	రాయితీ (శాతంలో)
ఎకరా లోపు	40
2 ఎకరాల్లోపు	30
4 ఎకరాల్లోపు	20
5 ఎకరాల్లోపు	10

పెళ్లికి ముందు శారీరక సంబంధం సర్వసాధారణమైపోయింది

యువకుడిపై కేసు రద్దు చేసిన మదురై ధర్మాసనం

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: వివాహానికి ముందు శారీరక సంబంధం సర్వసాధారణమైపోయిందని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం అభిప్రాయపడింది. సమాజంలో జరుగుతున్న అంశాలు కోర్టుకు తెలియకుండా లేవని వ్యాఖ్యానించింది. తొమ్మిదేళ్లు లైంగిక సంబంధంలో ఉన్నాక తనతో పెళ్లికి నిరాకరించాడంటూ ఓ యువకుడిపై యువతి చేసిన ఫిర్యాదుకు సంబంధించిన కేసులో ఈ మేరకు పేర్కొంది. తిరునెల్వేలికి చెందిన దేవా విజయ్‌పై ఓ యువతి వళ్లియూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇద్దరం కళాశాలలో ప్రేమించుకున్నామని, వివాహం చేసుకుంటానని విజయ్ తొమ్మిదేళ్లు తనతో లైంగిక సంబంధంలో ఉండి, తర్వాత పెళ్లికి నిరాకరించాడని ఫిర్యాదులో ఆరోపించింది. ఈ మేరకు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ విజయ్ మదురై ధర్మాసనంలో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన జస్టిస్ పుగళేంది సోమవారం ఉత్తర్వులిచ్చారు. 'పిటిషనర్‌తో సుదీర్ఘ కాలం లైంగిక సంబంధం కొనసాగినప్పటికీ.. ఫిర్యాదుదారు వ్యతిరేకత తెలపకపోవడం వారిద్దరి సమ్మతితోనే అది జరిగిందని సూచిస్తోంది. పెళ్లి చేసుకుంటానని చెప్పి విజయ్ మోసం చేశాడనడానికి ఎలాంటి ఆధారాల్లేవు. ఇద్దరూ బంధాన్ని ఏర్పరచుకుని, సుదీర్ఘకాలం శారీరకంగా సన్నిహితంగా ఉన్న నేపథ్యంలో సమస్యలు ఏర్పడితే క్రిమినల్ చట్టాన్ని ఉపయోగించడం సరికాదు. ఇద్దరి మధ్య సంబంధం ప్రేమ ఆధారంగా ఏర్పడిందా, వివాహం కోసం ఎదురుచూశారా, కేవలం పరస్పర ఆనందమా అనేది వారికి మాత్రమే తెలుసు. ఇలాంటి విషయాల్లో కోర్టు కచ్చితమైన నిర్ణయం తీసుకోవడం అసాధ్యం' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇలా కేసు వేయడం న్యాయ ప్రక్రియ దుర్వినియోగంతో సమానమని భావిస్తూ కోర్టు ఈ కేసును రద్దు చేస్తోందంటూ ఉత్తర్వులిచ్చారు.

వసుంధర

vasundhara@eenadu.in

నాకు తెలియకుండా నగలమ్మేశాడు..!

నేనో ఐటీ ఉద్యోగినిని. నా భర్త వ్యాపారం చేస్తానంటూ నా పుట్టింటి నుంచి పెట్టుబడి తెమ్మని వేధిస్తున్నాడు. నాకు తెలియకుండా నా నగల్నీ అమ్మేశాడు. అడిగితే... కొట్టి నాలుగు రోజులు తిండిపెట్టలేదు. కట్నం కోసం మరో పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉన్నాడు. నాకు న్యాయం జరిగేదెలా? – ఓ సోదరి

ఈ రోజుల్లో ఆర్థిక విషయాలే చాలా కుటుంబాల్లో విడాకులకు కారణం అవుతున్నాయి. ముందు మీరు ఆ వివాహ బంధంలో ఉండాలనుకుంటున్నారా? లేదా అన్నది నిర్ణయించుకోండి. ఎందుకంటే, కావలసిన పరిష్కారాన్ని బట్టి... మీకు దక్కే న్యాయం ఆధారపడి ఉంటుంది. కేవలం మీ నగలు వెనక్కి రావాలి... మీ బంధం నిలబడాలి అని భావిస్తే రక్షణ కోరుతూ గృహహింస చట్టాన్ని ఆశ్రయించండి. ఒకవేళ వివాహ బంధం వద్దనుకుంటే హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13(1) ప్రకారం క్రూరత్వం కింద విడాకులు కోరుతూ కోర్టులో పిటిషన్ వేయండి. దానిలోనే మీకు రావలసిన శాశ్వత పరిహారం కింద పెళ్లప్పుడు మీరిచ్చిన కట్నకానుకలు, నగలు, అనుభవించిన శారీరక, మానసిక బాధలకు పరిహారంగా పెద్ద మొత్తంలో నగదు కోరవచ్చు. అయితే, మీరు చూపించిన సాక్ష్యాల ఆధారంగానే కోర్టు పరిష్కారం నిర్ణయిస్తుంది. అలాకాకుండా, మిమ్మల్ని పెట్టిన బాధలకు వాళ్లకి శిక్షపడాలి అనుకుంటే... వరకట్న వేధింపుల కింద పోలీసులకు ఫిర్యాదు ఇవ్వండి. కేసు క్రిమినల్ కోర్టులోనూ వేయొచ్చు. వీటికంటే ముందు మీకు రక్షణ కావాలనుకుంటే... గృహహింస చట్టం కింద ప్రొటెక్షన్ కోరుతూ ఆపై ఇంట్లో నివసించే హక్కు, నెలసరి పోషణ ఖర్చు, మీరు అనుభవించిన మానసిక, శారీరక బాధలకు పెద్ద మొత్తంగా నగదు, ఇచ్చిన కట్న కానుకలు తిరిగి కోరవచ్చు. ఆలోచించి అడుగువేయండి.

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి, న్యాయవాది

బంతిని కొడితే కిటికీ పగిలింది!

అప్పటివరకూ గల్లీలో క్రికెట్ ఆడినా... అందులో భవిష్యత్తు ఊహించుకోలేదు. కానీ, ఓ పత్రికా ప్రకటన ఆమె ప్రయాణాన్ని మలుపు తిప్పింది. లేటు వయసులో సెలెక్షన్స్‌కి వెళ్లి విశాఖ జిల్లా క్రికెట్ జట్టుకి ఎంపికయ్యారు కోసన కల్యాణి. ఇప్పుడు బీసీసీఐ నుంచి ఆంధ్ర క్రికెట్‌కు లెవెల్-I సహాయ కోచ్‌గా సేవలందిస్తున్నారు.


కల్యాణి

చిన్నప్పటి నుంచీ నాకు ఆటలంటే ఇష్టం. స్కూల్ స్థాయిలో ఎన్నో ప్రైజులూ అందుకున్నా. వీధిలో అన్నయ్య, స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడటం నాకెంతో సరదా! కానీ, అందులోనే ఎదగాలని ప్రత్యేకంగా ఎప్పుడూ అనుకోలేదు. డిగ్రీ చదివేటప్పుడు... జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో ప్రకటన వచ్చింది. అన్నయ్య దాన్ని చూపించి... రోడ్డు మీద ఆడటం కాదు... అక్కడ నిరూపించుకో అన్నాడు. అది 2006. అప్పటికి మహిళా క్రికెట్‌కు అంత ఆదరణ లేదు. అయినా హాజరయ్యా. బౌలర్ బంతి వేయగానే గట్టిగా కొట్టా.. అది చాలా దూరం వెళ్లి... కాలేజీ కిటికీని తాకింది. గ్లాసు పగిలింది. అప్పటివరకూ ఎవరూ అలా కిటికీ అద్దాల్ని పగలగొట్టలేదన్నారు. శక్తిని ఉపయోగించి కొట్టిన ఆ బంతి దెబ్బకు విశాఖ జిల్లా జట్టులో స్థానం సంపాదించగలిగా. అదీ 19 ఏళ్ల వయసులో. చాలా ఆలస్యంగా ఇందులోకి అడుగుపెట్టా. ఆ తర్వాత అనంతపురంలో జరిగిన ఇంటర్ స్టేట్ మీట్‌లో పాల్గొన్నా.

ఆ వెంటనే వివాహమైనా...

అదే సమయంలో నాకు పెళ్లయ్యింది. తర్వాతా నాకు ఆడాలనే ఇష్టం ఉన్నా... కొద్ది రోజులు క్రికెట్‌ని వదిలేయాల్సి వచ్చింది. ఆపై కొన్నాళ్లకు అండర్-19 స్టేట్ సెలెక్షన్ కోసం విశాఖ నుంచి ప్రాతినిధ్యం వహించాలని పిలుపొచ్చింది. దీంతో ప్రూవ్ చేసుకోవడానికి ఇంట్లోవాళ్లని రెండేళ్ల సమయం అడిగా. వారు ఒప్పుకోవడంతో ఆట మీద దృష్టిసారించా. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఏయూ నుంచి పాల్గొన్న మొదటి మహిళా జట్టులోనూ ఉన్నా. నాకు ఫీల్డింగ్ అంటే ఇష్టం. యువరాజ్‌సింగ్, మహమ్మద్ కైఫ్‌ల ఆటను స్ఫూర్తిగా తీసుకుని ఆడేదాన్ని. ఫీల్డింగ్, బ్యాటింగ్ బాగా చేసినా పెళ్లయ్యిందని జట్టులో ఆడే అవకాశం ఇచ్చేవారు కాదు. దాంతో చాలా రోజులు జట్టు సభ్యురాలిగానే మిగిలిపోయా. రాష్ట్రంలో బెస్ట్ ఫీల్డర్‌గా ఉండడంతో బ్యాటింగ్‌కు అవకాశం దొరికేది కాదు. ఈ వివక్ష మీద అప్పట్లో సెలక్టర్లని ప్రశ్నించా. 2009-10 సీజన్‌లో ఆంధ్ర క్రికెట్ సీనియర్ల జట్టులో చోటు దక్కించుకున్నా. టీ20లకూ ఎంపికయ్యా. మొదటిసారి గోవాలో జరిగిన మ్యాచ్‌కు హాజరయ్యా. అయితే, దురదృష్టవశాత్తు ఆ ముందురోజు గాయం కావడంతో స్టాండ్‌కే పరిమితమవ్వాల్సి వచ్చింది. తర్వాత బాబు పుట్టడం, ఆపై జరిగిన రోడ్డు ప్రమాదంతో ఆటకు దూరమవ్వాల్సి వచ్చింది.

కోచ్‌గా అవకాశం...

విమెన్ క్రికెట్ మాజీ ప్లేయర్లకు కోచ్‌గా అవకాశం ఇవ్వడంతో నేషనల్ క్రికెట్ అకాడమీ లెవెల్ -1 కోచ్‌గా 2023లో ఎంపికయ్యా. దానికంటే ముందు ఏసీఏ తరఫున వీడీసీఏలో రెండేళ్ల పాటు ఉచితంగా పిల్లలకు కోచింగ్ ఇచ్చా. ది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో క్రికెట్ కోర్సు చేశా. ఆ సర్టిఫికెట్, క్రీడానుభవం కోచ్‌గా అవకాశం తెచ్చింది. దీంతో బీసీసీఐ తరఫున ఏసీఏ విమెన్ క్రికెట్ కోచ్‌గా పనిచేసే అవకాశం లభించింది.

ప్రపంచకప్‌లో నెట్ ఇన్‌ఛార్జిగా...

- ఏపీ రంజీ విమెన్స్ సీనియర్ జట్టుకు సహాయ కోచ్‌గా రెండేళ్లు పని చేశా. అండర్-15 జట్టుకు బ్యాటింగ్ కోచ్, అండర్-19 జట్టుకు సహాయ కోచ్‌గా విధులు నిర్వర్తించా. పదేళ్లుగా జోనల్ స్థాయి, ప్రాబబుల్స్ ఎంపికలకు కోచ్‌గా సాయమందిస్తున్నా. ఏసీఏ అండర్-19 విమెన్ టీ20 ఇన్విటేషనల్ కప్‌కు 2025-26 అసిస్టెంట్ కోచ్‌గా కూడా చేశా.
- విమెన్ వరల్డ్ కప్‌లో విశాఖలో జరిగిన మ్యాచ్‌లకు ప్రాక్టీసులో నెట్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించా. ప్లేయర్లకు ప్రాక్టీసులు బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్‌లో సహకారంతో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, సౌత్‌ఆఫ్రికా జట్లకు నెట్ బౌలింగ్‌లోనూ సహకరించా.
- మొదటి విమెన్ ఏపీఎల్ జట్టుకు, ఏసీఏకు అసిస్టెంట్ కోచ్‌గా మూడేళ్లుగా కొనసాగుతున్నా.



– రావివలస సురేష్, విశాఖపట్నం

పేద మహిళ... పెద్ద మనసు!


లేతుబాయి

భూముల ధరలు ఆకాశాన్ని అంటుతోన్న రోజులివి. సెంటు భూమిని వదులుకోవడానికీ ఆలోచిస్తారు. అలాంటిది రూ.లక్షలు విలువ చేసేదాన్ని ఎవరైనా వదులుకుంటారా? కానీ ఆత్రం లేతుబాయి ఇచ్చేశారు. అలాగని తనేమీ లక్షాధికారి కాదు... చిన్న గుడిసె ఆమె నివాసం.

ఆదిమ గిరిజనులు... వీళ్లు ఎక్కువగా ఆదిలాబాద్ జిల్లాలోనే కనిపిస్తుంటారు. ఆ తెగకు చెందినవారే లేతుబాయి. ఆదిలాబాద్ జిల్లాలోని దుబ్బగూడ (ఎస్) గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన సావెజ్ ఈమె ఊరు. ఇటీవల అక్కడి 16మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. కొందరు నిర్మాణ పనులూ చేపట్టారు. కానీ వారిలో 10మందికి సొంత స్థలం లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. అప్పుడు వాళ్లంతా లేతుబాయిని స్థలం కోసం ఆశ్రయించారు. తహసీల్దార్ నుంచి విషయం తెలుసుకున్న ఆమె 'నా ఎకరం భూమి తీసుకోండి. ప్రతిఫలంగా నాకేమీ డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. స్థలాలు లేనివాళ్లందరికీ దానిలో ఇల్లు కట్టించి ఇవ్వండి' అని చెప్పారు. అలా రాయించిన అఫిడవిట్ మీద సంతకం పెట్టి, స్వయంగా తహసీల్దార్‌కే అందించారు. ఆమె చర్య ఎంతోమందిని ఆశ్చర్యానికి గురి చేసింది.

నిజానికి లేతుబాయికి పక్కా భవనం లేదు. ఆమె నివసించేదీ చిన్న పూరింట్లో. వ్యవసాయాధారిత కుటుంబం. ఈమెకు ముగ్గురు అబ్బాయిలు. ఒకరు కూలీపనులు చేస్తూ, మరొకరు తాపీ మేస్త్రీగా, ఇంకొకరు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆమె అలా భూమి ఇచ్చినా భర్తకానీ, కొడుకులు కానీ అడ్డు చెప్పలేదట. 'సొంతిల్లు చాలామంది కల. ప్రభుత్వం నుంచి ఆ అవకాశం వచ్చింది. కానీ స్థలం లేదని తోటివాళ్లు ఎక్కడ ఇల్లు కట్టుకోలేరో, తరవాత ఈ కారణంగా ఎక్కడ గొడవలు పడతారోనని భయమేసింది. మా వాళ్లంతా ఐకమత్యంగా ఉండాలనేది నా కోరిక. నేనొక్కదాన్ని కొంత భూమి వదులుకుంటే అందరం ఒకేచోట కలిసిమెలసి ఉండొచ్చు అనిపించింది. అందుకే నా పేరిట ఉన్న ఎకరం పొలం సంతోషంగా ఇచ్చేశా' అంటోన్న లేతుబాయి పెద్ద మనసుకి జోహార్ చెప్పాల్సిందే!

– నోముల రవికుమార్ రెడ్డి, సాత్నాల (జైనథ్)

టైమ్స్ స్క్వేర్ చుట్టూ... చీర కట్టి!





'చీరలోని గొప్పతనం తెలుసుకో...'అంటూ న్యూయార్క్‌లోని ఐకానిక్ టైమ్స్ స్క్వేర్ పరిసరాల్లో వందల మంది మహిళలు... చీరకట్టుతో మెరిసిపోయారు. 'శారీ గోస్ గ్లోబల్' కార్యక్రమం రెండో ఎడిషన్‌ను ఫిలాంత్రపిక్ సంస్థ ఉమా గ్లోబల్, అక్కడి భారత కాన్సులేట్ జనరల్‌తో కలిసి దీన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇండియన్-అమెరికన్ కమ్యూనిటీతో పాటు భారత్, బంగ్లాదేశ్, నేపాల్, వెస్టిండీస్, యూకే, మలేసియా, సింగపూర్, శ్రీలంక... వంటి దేశాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. టైమ్స్ స్క్వేర్ చుట్టూ సింబాలిక్ మార్చ్ చేశారు. తరాల కథలెన్నో చెబుతూ, వేల ఏళ్ల ఘనచరిత్రను గర్వంగా ప్రదర్శించారు. 'శారీ గోస్ గ్లోబల్' ఈవెంట్ సాంస్కృతిక వైవిధ్యాన్ని జరుపుకొనే వేడుక మాత్రమే కాదు. సంప్రదాయ చేతివృత్తులను కాపాడుతూ, వారికి మద్దతు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన వేదిక కూడా. ఈ కార్యక్రమం మనందరినీ ఒక్క తాటిపై నిలుపుతుంది. మరోసారి టైమ్స్ స్క్వేర్ మన సంస్కృతీ, ఆత్మవిశ్వాసంతో నిండిన వర్ణ సముద్రంలా కనిపిస్తుంటే గర్వంగా ఉంది' అంటారు ఉమా గ్లోబల్ అధ్యక్షురాలు డాక్టర్ రీటా కాకతి షా. అసోంలోని సువాల్‌కుచీలో నేసిన సంప్రదాయ పాట్‌సిల్క్ మెఖేలా సడోర్‌ని ఆమె ధరించారు. న్యూయార్క్ కేంద్రంగా ఏర్పాటైన ఉమా గ్లోబల్ సంస్థ యువత, మహిళా సాధికారత కోసం కృషిచేస్తోంది.

వయ్యారికి ఫ్యూజన్ వడ్డాణం..!









అమ్మాయిల నడుము వంపుల్లో అందంగా అమరిపోయి... ఆకట్టుకునే ఆభరణం వడ్డాణం. అందుకే, సంప్రదాయంగా కనిపించాలనుకున్నప్పుడు పట్టు చీరకట్టినా, లంగాఓణీ వేసినా... ఫైనల్ టచ్ ఇచ్చేది వడ్డాణంతోనే! వీటిల్లో అష్టలక్ష్మీ రూపాలు, ఏనుగులూ, కలువలూ చేర్చిన టెంపుల్ స్టైల్ డిజైన్‌లు, ముత్యాల గొలుసులతో చేసిన సింపుల్ రకాలు... ఇలా ఎన్నెన్నో అలరిస్తూనే ఉన్నాయి. మరి ఇప్పుడు కొత్తదనం ఏంటనేగా మీ సందేహం. సాదా వడ్డాణానికి పాశ్చాత్య శైలిని పోలి ఉండేలా బెల్ట్ మాదిరిగా కనిపించడమే వీటి ప్రత్యేకత. అందుకే, ఈ తరం... ఈ ఫ్యూజన్ స్టైల్ వడ్డాణాన్ని తెగ మెచ్చేస్తున్నారు. మీరూ వాటిని చూసేయండి.

నగా నట్రా

తగ్గితే సరిపోతుందా?

'బాక్సులో కొంచెమే అన్నం పెట్టు'... 'నేను నా ఫ్రెండ్ కంటే కేజీ ఎక్కువ బరువున్నా. ఈరోజు నుంచి నేను రాత్రి తినడం మానేస్తా'...

సన్నబడటం, బరువు తగ్గడం ఏది చేయాలన్నా అమ్మాయిలు దృష్టిపెట్టేది చాలావరకూ డైట్ మీదే! తీరా అనుకున్నది సాధించాక హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకుంటారు. ఆరోగ్యమంటే బరువు తగ్గడమేనా? అంటే కాదనే చెబుతున్నారు నిపుణులు. కేవలం సన్నగా, నిర్ణీత బరువులో ఉన్నంత మాత్రాన కలకాలం ఆరోగ్యంగా ఉంటామనీ అనుకోవద్దు అంటున్నారు. పోషకాహారం తీసుకుంటూ రోజూ వ్యాయామం చేస్తూ దృఢంగా ఉంటేనే ఆరోగ్యమంటున్నారు. ఇలా చేస్తూ ఎక్కువ బరువున్నా కూడా దీర్ఘకాలంలో ఎన్నో అనారోగ్యాల నుంచి తప్పించుకోవచ్చట. సన్నగా 50 కేజీల్లోపు ఉండీ... డైట్‌లు చేస్తూ వ్యాయామాన్ని పక్కన పెట్టి గుండెజబ్బులు సహా ఎన్నో అనారోగ్యాల బారిన పడుతున్నవారూ ఎక్కువే. పరిశోధనలు చెబుతున్న మాట ఇది. అంటే బరువు కాదు ఫిట్‌నెస్ ముఖ్యమన్న మాటేగా! కాబట్టి, అమ్మాయిలూ... క్రాష్ డైట్‌ల మీద దృష్టిపెట్టొద్దు. కనీసం అరగంట వ్యాయామానికి కేటాయిస్తూ శరీరం దృఢంగా ఉండేలా చూసుకోండి. అప్పుడే పదికాలాలపాటు ఆరోగ్యంగా ఉంటారు... సరేనా?



బంగారం - వెండి



17న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,26,530	1,14,950	1,58,335
విజయవాడ	1,23,345	1,14,550	1,59,600
ప్రొద్దుటూరు	1,24,000	1,14,080	1,59,000
రాజమహేంద్రవరం	1,25,400	1,14,950	1,73,000
విశాఖపట్నం	1,24,620	1,14,650	1,65,000
తమిళనాడు	-----	1,15,400	1,73,000



రోజువారీ జీవితంలో టెక్నాలజీ పాత్ర పెరుగుతూ వస్తోంది. అద్భుతమైన, కచ్చితమైన టెక్నాలజీ ఉత్పత్తుల్ని తీసుకురావాలంటే సమాజంలో సగభాగమైన మహిళలూ టెక్ బృందంలో భాగం కావాలి. అప్పుడే ఉత్పత్తి సమగ్రంగా ఉంటుంది. మహిళలు మంచి టెక్ నిపుణులు. ప్రతిభ విషయంలో ఎవరికీ తీసిపోరు. ఈ రంగంలో సుదీర్ఘకాలం రాణించాలంటే కొత్త విషయాలపైన ఆసక్తి పెంచుకోవాలి, నేర్చుకోవడం ఆపకూడదు.

– రుచా నానావతి, సీఐఓ, మహీంద్రా గ్రూప్

మరుపే... ఆరోగ్యం!

'ఎక్కడివక్కడ మర్చిపోతేనే మేలు' అనడం వింటుంటాం. దీన్ని పాటించడమే మరచిపోతున్నారు అమ్మాయిలూ, మహిళలూ. అనవసరమైన విషయాల్ని గుర్తుపెట్టుకుని, అవి తెచ్చే ఒత్తిడితో సతమతం అవుతున్నారు. ఎందుకంత భారాన్ని మోయడం. మరుపే ప్రతిదానికీ మందు అంటున్నారు నిపుణులు...

- ఊపిరి సలపని పనులు, బాధ్యతలు ఇవన్నీ తెచ్చే తలనొప్పి మాటల్లో చెప్పలేం. ఇంత చేస్తున్నా ఏదొక లోపంతో నిందించేవారు ఉండనే ఉంటారు. రోజూ చేసే వంటే అయినా... ఒక్కోసారి సరిగా కుదరదు. ఇక దొరికిందే అవకాశంగా తిట్లు పడుతూనే ఉంటాయి. అవన్నీ రోజంతటినీ ప్రభావితం చేస్తాయి. ఒక్కసారి ఆలోచించండి. వంట అయిపోయింది. తినే వాళ్లు తినేశారు. మాటలు అనే వాళ్లు అనేశారు. దాన్నే తలచుకుని బాధపడినంత మాత్రన జరిగిపోయిన దాన్ని మీరు మార్చగలరా? 'రేపు బాగా చేసి చూపిస్తా' అని ఆ విషయాన్ని మరచిపోతే పోలా?
- 'ఈ రోజు నీ పర్ఫార్మెన్స్ ఏమీ బాగోలేదు అమ్మాయి. నివేదికలూ అర్థం కాని విధంగానే ఉన్నాయి. ఇదే కొనసాగితే వెనకబడిపోతావ్' అంటూ కొన్ని సందర్భాల్లో యజమాని తిడుతూ ఉంటారు. అది మన మంచికే అయినా, ఆ పరిస్థితి సానుకూలంగా ఆలోచించే అవకాశం ఇవ్వదు. దాంతో ప్రతికూల ఆలోచనలు చుట్టుముడతాయి. ఆ ప్రభావం పనిమీదా పడుతుంది. ఎంతగా అంటే దాన్నే తలచుకుని మిగతా వేటిమీదా దృష్టి పెట్టలేనంతగా. అందుకే మరచిపోయి, తదుపరి పనుల మీదకు ధ్యాస మళ్లించుకుంటే ఎంత ఒత్తిడి తగ్గుతుందో ఒకసారి ఆలోచించండి.
- కార్యాలయాల్లో... రాజకీయాలు ఉంటూనే ఉంటాయి. ఒకరికొకరు నచ్చరు. అలాగని ఎవరినీ మనం మార్చలేం. తెల్లారితే మళ్లీ వాళ్ల ముఖాలు మనం, మన ముఖాలు వాళ్లూ చూడాల్సిందే. 'పోనీ మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు... నేను ఫలానా అని ప్రతి ఒక్కరికీ చెప్పగలమా' వ్యక్తిత్వాలు తెలుసుకుని, వాళ్లు ఇంతే అని సర్దుకుపోవాలి. అంతేకానీ వాళ్లు కావాలనే మనల్ని టార్గెట్ చేస్తున్నారని తెలిసినా... వాళ్లేదో అన్నారనీ, దాన్ని తిరిగి అప్పజెప్పాలనే ఆలోచనల్లో మీరుండిపోతే... నష్టం మీకే. ప్రతికూల సంఘటనల్నీ, వ్యక్తుల్నీ ఎక్కడికక్కడ వదిలేస్తేనే... మీకూ మనశ్శాంతి.

ఇవేనా... అలకలు, కోపాలు, గొడవలు... వంటివన్నీ తాత్కాలికమైనవే. సమయంతోపాటే సర్దుకుంటాయి. అలాంటి వాటికోసం ఆలోచిస్తూ... ప్రస్తుతాన్ని వృథా చేసుకుని, మానసిక సమస్యలకు తావివ్వడం సబబా. అందుకే ప్రతికూల ఘటనల్ని మరచిపోవడానికి ప్రయత్నించండి. మీకే తెలుస్తుంది ఈ పద్ధతి ఎంత ఉపశమనాన్ని ఇస్తుందో...



వృథానే ఉపాధిగా మలచుకుని..!

నిర్వహణ కరవై... నీటిలో తేలుతూ... ప్రవాహాన్ని అడ్డుకునే గుర్రపు డెక్కలు అందరికీ వ్యర్థంగానే కనిపిస్తాయి. కానీ, వాటిని ఉపయోగించే మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు పూర్ణిమా బోర్గోహైన్. ఆమెకి ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే...



'ప్రకృతి మనకు ఇచ్చిన వనరులెన్నో. వాటిని వినియోగించుకోవడం మనకు తెలియాలంతే. కాస్త సృజనాత్మకత ఉండాలే కానీ చుట్టూ ఉన్న ఏ వస్తువూ వృథా కాదు. ఆఖరికి చెరువులు, చిత్తడి నేలల్లో పనికిరాని మొక్కగా భావించే గుర్రపు డెక్క కూడా' అంటారు పూర్ణిమ. అసోంలోని శివసాగర్ జిల్లా, భోరోలువా గ్రామం ఈమెది. అక్కడ చెరువుల సంఖ్య ఎక్కువ. కానీ అవన్నీ ఎక్కడికక్కడ గుర్రపు డెక్కలతో నిండి ఉండటం గమనించారామె. 'వీటిని ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బ్యాగులూ, పర్సుల తయారీలో వాడితే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. వెంటనే సాధ్యాసాధ్యాల దిశగా దృష్టి సారించా. తెలిసిన వాళ్లని అడిగితే... ఎరువుల తయారీకి ఉపయోగిస్తారని కొందరు చెబితే, ఉపకరణాలు చేయడానికి వాడొచ్చు అన్నారు మరికొందరు. ఇలాంటి వాటికి శిక్షణ ఇచ్చే కేంద్రం అహ్మదాబాద్‌లో ఉందని తెలుసుకుని అక్కడకు వెళ్లా' అని గుర్తుచేసుకుంటారు పూర్ణిమ. అక్కడ నైపుణ్యాల్ని అందిపుచ్చుకుని... మాస్టర్ ట్రైనర్‌గా మారారీమె. తర్వాత అసోంకు వచ్చి, స్థానిక మహిళలకూ ఈ నైపుణ్యాల్ని నేర్పారు. అలా అసోంలో వందల మందికి ఈ విద్యను అందించారు. తన ఇంటి వెనక కొంత భాగాన్ని శిక్షణ కేంద్రంగా మలిచి... చెరువులూ, నదుల్లోంచి సేకరించిన గుర్రపుడెక్కని శుద్ధి చేస్తున్నారు. తర్వాత వాటితో డైనింగ్ టేబుల్ మ్యాట్‌లూ, చాపలూ, బ్యాగులూ, పర్సులూ వంటివి తయారుచేస్తున్నారు. ఓ సమూహంగా ఏర్పడి మిగతా మహిళలకూ దీన్ని నేర్పుతున్నారు. ఇలా తయారైన వాటిని హరియాణా, చండీగఢ్, దిల్లీ, ముంబయి, అమృత్‌సర్, సిమ్లాల్లో అమ్ముతున్నారు. ఓ చిన్న పరిశ్రమను ప్రారంభించి, మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించాలనేదే తన కోరిక అంటారు పూర్ణిమ.

ఈటీవీ భారత్

ఆహ్వానం వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

క్యాన్సర్‌పై పోరాడే మూలిక గుర్తింపు!



మధ్యప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో లభ్యమయ్యే పలు మూలికలపై పండిత్ ఖుశీలాల్ ఇన్‌స్టిట్యూట్ చేస్తున్న పరిశోధనల్లో ఆసక్తికర అంశాలు వెల్లడవుతున్నాయి. బాలాఘాట్, అనుప్పూర్, దిన్‌దోరి, శహడోల్‌లో స్థానిక గిరిజనులు సంప్రదాయంగా ఉపయోగించే మూలికల వివరాల నమోదు, వాటిపై అధ్యయనాన్ని ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ అంజలీ జైన్ బృందం చేపట్టింది. ఈ సందర్భంగా ప్లాంటాజినాసియా కుటుంబానికి చెందిన బొటానికల్ వ్యవహారంలో ప్లెమింగియా మేక్రోఫిల్లాగా పేర్కొనే ఓ మూడు ఆకుల మొక్క పత్రాలు, కాండం క్యాన్సర్ నిరోధక లక్షణాలు కలిగి ఉన్నాయని ఎలుకలపై చేసిన పరిశోధనలో తేలింది. "ఈ ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. దీని ప్రయోజనాలు విస్తృతంగా పొందేందుకు ఇతర ప్రాంతాల్లోనూ ఆ మూలిక సాగును చేపట్టాలి" అని అంజలీ జైన్ పేర్కొన్నారు. ఘమ్రాలో గుర్తించిన మరో మూలిక గాయాలు త్వరగా తగ్గుముఖం పట్టడంలో ఉపకరిస్తోంది. ట్రైడాక్స్ ప్రొకంబెన్స్‌గా వ్యవహరించే ఈ మొక్క జంతువుల శరీరాల్లో అత్యంత నాణ్యమైన కణజాలాన్ని కూడా ఏర్పరుస్తోంది. ప్రస్తుతం మానవుల్లో దీని పనితీరుపై అధ్యయనం కొనసాగుతోంది.

అన్నార్తుల దీనబంధు

ఆసుపత్రుల్లో పేద రోగుల బంధువులకు భోజనాలు అందిస్తున్న పార్థ



పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఆయనో సాధారణ కారు డ్రైవర్. అయినా ఆయన వితరణశీలి అసామాన్యం. పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగుల బంధువులకు ఉచితంగా భోజనాలు అందిస్తున్నారు. తొమ్మిదేళ్లుగా సేవాతత్పరతను చాటుకుంటూ 'హాస్పిటల్ మ్యాన్'గా పేరు గాంచారు. ఆయనే పార్థ కర్ చౌధరి (55). 2016లో ఓసారి అనారోగ్యంతో ఆయన ప్రభుత్వాసుపత్రిలో చేరారు. అక్కడ పేద రోగుల బంధువుల దీనస్థితి చూసి చలించిపోయారు. అప్పుడే అన్నార్తులకు, నిరుపేద రోగుల బంధుమిత్రులకు ఆహారాన్నందించాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి డ్రైవర్‌గా తన రోజువారీ విధులు పూర్తయ్యాక ఆహార వితరణశీలి పాత్రలోకి ప్రవేశిస్తారు. తొలినాళ్లలో ఆయన రోజూ 25-30 మందికి మరమరాల ప్యాకెట్లు అందించేవారు. ప్రస్తుతం రోజూ నాలుగు నుంచి అయిదు ప్రభుత్వాసుపత్రుల్లోని 150 మంది నిరుపేదలైన రోగుల బంధువులకు రెండు పూటలా ఆహారం అందిస్తున్నారు. ప్రతి ఆదివారం వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా సేవ చేస్తున్నారు. పార్థ నిస్వార్థ సేవను గుర్తించిన పలువురు.. అన్నార్తుల కోసం బియ్యం, పప్పులు, గుడ్లు, చేపలు, కొన్నిసార్లు మిఠాయిలను కూడా ఆయనకు అందిస్తున్నారు.

ఈటీవీ భారత్

దీర్ఘకాల నొప్పితో వచ్చే కుంగుబాటుతో హైబీపీ ముప్పు!

దిల్లీ: మూడు నెలల కన్నా ఎక్కువ కాలం సాగే నొప్పి వల్ల ఉత్పన్నమయ్యే కుంగుబాటు, ఇన్‌ఫ్లమేషన్‌తో అధిక రక్తపోటు (హైబీపీ) ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనం పేర్కొంది. బ్రిటన్‌లోని గ్లాస్గో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 2 లక్షల మంది డేటాను సమీక్షించారు. వీరిలో 10 శాతం మంది సరాసరిన పదమూడున్నరేళ్ల తర్వాత అధిక రక్తపోటు బారినపడినట్లు వెల్లడైంది. దీర్ఘకాల నొప్పి ఉన్నవారికి ఈ ముప్పు 75 శాతం మేర ఉన్నట్లు తేలింది. స్వల్పకాల నొప్పి ఉన్నవారికి 10 శాతం, శరీరంలో ఒక ప్రాంతంలోనే దీర్ఘకాల నొప్పి ఉండేవారికి 20 శాతం అధిక ముప్పు ఉంటుందని వెల్లడైంది. "నొప్పి ఎంత విస్తృతంగా ఉంటే.. అధిక రక్తపోటు ఉత్పన్నం కావడానికి అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది" అని పరిశోధనకు నాయకత్వం వహించిన జిల్ పెల్ తెలిపారు. దీన్నిబట్టి నొప్పి అధికంగా ఉండే వారిలో కుంగుబాటు సమస్యను సత్వరం గుర్తించి, చికిత్స చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

మీ నెట్‌వర్క్‌ను పెంచుకోవాలంటే..

మీరు మీ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలంటే, ఇతరులతో పరిచయాల కోసం వెంపర్లాడక్కర్లేదు. వారినే మీ వైపు ఆకర్షించగలగాలి. మీ ప్రస్థానం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి, మీతో సంభాషించడమే ఓ విలువైన అవకాశంగా ఇతరులు భావించినప్పుడే అది సాధ్యమవుతుంది. మీ పనిలో ఇంకెవ్వరూ మీతో పోటీపడలేనంతగా సాధికారత సంపాదించడం, ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటూ మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకుంటుంటే, వారే తమ సమూహంలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తారు.

– అవిజీత్, పర్సనల్ బ్రాండింగ్ స్ట్రాటజిస్ట్

క్యాబినెట్‌లో చోటివ్వండి

- మంత్రి పదవుల కోసం బిహార్‌లో ఎన్డీయే నేతల లాబీయింగ్
- 20న నీతీశ్ ప్రమాణం!



ప్రభుత్వాన్ని రద్దు చేయాలంటూ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు లేఖ అందజేస్తున్న నీతీశ్

పట్నా: బిహార్‌లో మంత్రి పదవుల కోసం ఎన్డీయే నేతలు లాబీయింగ్ చేసుకుంటున్నారు. కూటమిలోని పార్టీల్లో మంత్రి పదవులపై కసరత్తు ప్రారంభం కావడంతో అధిష్ఠానం మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. జేడీయూ అధినేత నీతీశ్ కుమార్.. ఈ నెల 20న పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసే అవకాశముంది. సోమవారం సమావేశమైన క్యాబినెట్.. అసెంబ్లీ రద్దు అధికారాన్ని ఆయనకు కట్టబెడుతూ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ వెంటనే గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను కలిసిన నీతీశ్.. 19వ తేదీన అసెంబ్లీని రద్దు చేసి కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం చేయాలని కోరారు. బుధవారం మరోసారి గవర్నర్‌ను కలవనున్న నీతీశ్.. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పిస్తారు. అప్పుడే ఎన్డీయే ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తారు. బుధవారమే ఆయన ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యే అవకాశముంది.

- మంత్రివర్గంలో భాజపా, జేడీయూల నుంచి ఐదారు కొత్త ముఖాలకు చోటు కల్పించే అవకాశముంది. జేడీయూ రాష్ట్రశాఖ అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుశ్వాహా క్యాబినెట్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. జేడీయూ నుంచి పాత మంత్రుల్లో ఎక్కువ మంది మళ్లీ బాధ్యతలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. కూటమిలోని ఎల్జేపీ (ఆర్‌వీ), హెచ్ఏఎం (ఎస్), ఆర్ఎల్ఎం పార్టీలకూ క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లభించనుంది.
- ఎల్జేపీ(ఆర్‌వీ)కి 3 బెర్తులు, హెచ్ఏఎం (ఎస్), ఆర్ఎల్ఎంలకు ఒక్కో బెర్తు దక్కనున్నాయి.
- భాజపాకు 16, జేడీయూకు 14 బెర్తులు దక్కనున్నాయి.

అమెరికా విద్యాసంస్థల్లో

17 శాతం తగ్గిన అంతర్జాతీయ విద్యార్థుల నమోదు

దిల్లీ: వీసా నిబంధనలు కఠినతరం చేయడం, సామాజిక మాధ్యమ ఖాతాల పరిశీలన (వెట్టింగ్) వంటి ట్రంప్ విధానాలతో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది భారీగా తగ్గింది. తాజాగా వెలువడిన 'ఓపెన్ డోర్' నివేదిక ప్రకారం.. అమెరికా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో '2025 శరదృతువు'లో కొత్త విద్యార్థుల నమోదు 17 శాతం తగ్గింది.

- 825కుపైగా ఉన్నత విద్యాసంస్థలు '2025 ఫాల్ స్నాప్‌షాట్'లో పాల్గొనగా.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యలో 1శాతం తగ్గుదల ఉన్నట్లు నివేదించాయి. గ్రాడ్యుయేట్ల నమోదు 12శాతం మేర తగ్గిందని ఆ సంస్థలు తెలిపాయి.
- కొత్త విద్యార్థుల సంఖ్య తగ్గుదల తర్వాత కూడా మిగిలిన దేశాలతో పోలిస్తే అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయులే ప్రథమ స్థానంలో ఉన్నారని.. తర్వాత స్థానాల్లో చైనా, దక్షిణ కొరియా ఉన్నాయని నివేదిక వివరించింది.
- విద్యార్థులకు జారీచేసే వలసేతర 'ఎఫ్' వీసాల్లో 2023తో పోల్చినప్పుడు 2024లో భారతీయులు తీసుకున్న వీసాల్లో 33.2శాతం తరుగుదల కనిపించింది.

రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై

500 శాతం సుంకాలు: ట్రంప్



న్యూయార్క్: రష్యాతో వ్యాపార, వాణిజ్యాలు చేస్తున్న అన్ని దేశాలపై అతి తీవ్ర ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరించారు. రష్యా నుంచి ముడి చమురును కొనే, దాన్ని మళ్లీ విక్రయించే దేశాలపై 500 శాతం దాకా సుంకాలను విధిస్తామని వెల్లడించారు. ఈ మేరకు కఠిన ప్రతిపాదనలతో కూడిన ఓ బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదముద్ర లభిస్తే తాను స్వాగతిస్తానని ట్రంప్ చెప్పారు. 500 శాతం సుంకాలను ఎదుర్కొనే దేశాల జాబితాలో ఇరాన్‌ను చేర్చాలని తాను సూచించానని, తప్పకుండా అదే జరుగుతుందని పేర్కొన్నారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు బయలుదేరే ముందు విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

'శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025'

రష్యా వాణిజ్య భాగస్వాములపై 500 శాతం సుంకాలను విధించే ప్రతిపాదనతో కూడిన బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ సెనేటర్ లిండ్సే గ్రాహం, విపక్ష డెమోక్రటిక్ పార్టీ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంథాల్ కలిసి అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పేరు 'శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025'. దాదాపు 85 మంది సెనేటర్ల కనీస మద్దతుతో ఈ బిల్లును సెనేట్‌లో చర్చకు పెట్టారు. దీనికి సెనేట్‌లోని అత్యంత కీలకమైన 'విదేశీ సంబంధాల కమిటీ' ఏకగ్రీవ మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయి. ఈ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లభిస్తే ప్రధానంగా చైనా, భారత్‌లను ట్రంప్ లక్ష్యంగా చేసుకునే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

ఎర్రకోట నిందితుడికి 10 రోజుల కస్టడీ

- రషీద్‌ను క్షుణ్నంగా విచారించనున్న ఎన్ఐఏ
- 15కు చేరిన మృతుల సంఖ్య
- శ్రీనగర్‌లో సహ కుట్రదారుడు బిలాల్‌వానీ అరెస్టు

దిల్లీ: ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు ఘటనతో ముడిపడిన నిందితుడు ఆమిర్ రషీద్ అలీని పదిరోజులపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీకి అప్పగిస్తూ దిల్లీ న్యాయస్థానం ఆదేశాలు వెలువరించింది. కారుబాంబు పేలుడుకు పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీతో చిట్టచివరిగా మాట్లాడిన వ్యక్తిగా భావిస్తున్న అతడిని అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య దిల్లీ ప్రధాన జిల్లా-సెషన్స్ న్యాయస్థానంలో సోమవారం హాజరుపరిచారు. నిందితుడిని పదిరోజుల విచారణ నిమిత్తం అప్పగించాలని ఎన్ఐఏ కోరగా న్యాయమూర్తి అంగీకరించారు. ఆత్మాహుతి బాంబర్‌గా మారిన నబీతో కలిసి అతను కుట్ర చేసినట్లు ఆరోపిస్తూ ఎన్ఐఏ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. అలీని కశ్మీర్‌కు తీసుకువెళ్లి లోతుగా ప్రశ్నిస్తామని అధికారులు తెలిపారు. పేలుడుకు కొన్నిరోజుల ముందు ఉమర్‌నబీకి సురక్షితమైన నివాసాన్ని సమకూర్చి, ఇతరత్రా ఎలాంటి సాయం కావాలన్నా అతడే అందించాడని చెప్పారు.

సాంకేతిక సాయం సహ కుట్రదారుడిది

ఉమర్‌తో కలిసి ఆత్మాహుతి దాడి కుట్రలో కీలక పాత్ర పోషించిన జసీర్ బిలాల్ వానీని ఎన్ఐఏ అధికారులు శ్రీనగర్‌లో అరెస్టు చేశారు. అనంతనాగ్ జిల్లాకు చెందిన ఈ వ్యక్తి.. ఉగ్రదాడికి కావాల్సిన సాంకేతిక సాయం అందించాడని దర్యాప్తు సంస్థ తెలిపింది. రాజనీతి శాస్త్రంలో డిగ్రీ చేసిన వానీకి ఉమర్ ఉగ్రవాద భావజాలాన్ని నూరిపోసినట్లు తెలిపింది. ★ ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్నవారిలో మరో ఇద్దరు ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 15కు పెరిగింది. పేలుడుపై కేసు నమోదుచేసిన శ్రీనగర్ పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి, కశ్మీర్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు.

రాష్ట్రపతికి చేరిన 16వ ఆర్థిక సంఘం నివేదిక

వచ్చే బడ్జెట్ సమావేశాల్లోగా పార్లమెంటు ముందుకు..



నివేదికను రాష్ట్రపతి ముర్ముకు అందజేస్తున్న అరవింద్ పనగడియా

ఈనాడు, దిల్లీ: అరవింద్ పనగడియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం 2026-31 మధ్యకాలానికి రాష్ట్రాలకు పంపిణీ చేసే ఆర్థిక వనరులకు సంబంధించిన నివేదికను సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేసింది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోగా దీనిని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. అప్పుడుగానీ రాష్ట్రాలకు ఎంత పన్నుల వాటా దక్కుతుందనే విషయం తెలియదు. జనాభా నియంత్రణను తాము బలంగా అమలు చేసినందున ఆ ప్రాతిపదికన కేటాయింపులు ఉండకూడదని దక్షిణాది రాష్ట్రాలన్నీ డిమాండు చేస్తూ వచ్చాయి. దాన్ని ఆర్థిక సంఘం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుందన్న ప్రశ్న ఉదయిస్తోంది. కొత్త సిఫార్సులు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2023 డిసెంబరు 31న 16వ ఆర్థిక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2025 అక్టోబరు 31 లోగా నివేదిక సమర్పించాలని గడువు విధించింది. తర్వాత దాన్ని నెలరోజుల పాటు పొడిగించింది.

- కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 42% వాటా పంపిణీ చేయాలని 14వ ఆర్థిక సంఘం సిఫార్సు చేయగా కేంద్ర ప్రభుత్వం దాన్ని యథాతథంగా అమలు చేసింది. 15వ ఆర్థిక సంఘమూ అదే విధానాన్ని బలపరిచింది. రాష్ట్రాలకు 41%, కొత్తగా కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడిన జమ్మూకశ్మీర్‌కు 1% కలిపి మొత్తం 42% పన్నుల వాటా పంపిణీ సిఫార్సు చేయగా ఆ నివేదికనూ కేంద్రం అమలు చేసింది. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం ఏం సిఫార్సు చేసిందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు గత ఐదేళ్లలో తెలుగు రాష్ట్రాలకు వచ్చిన పన్నుల వాటా (రూ.కోట్లలో)

సంవత్సరం	ఏపీ (4.047%)	తెలంగాణ (2.102%)
2021–22	35,385.83	18,720.54
2022–23	38,176.74	19,668.15
2023–24	45,710.74	23,742.04
2024–25	52,080.15	27,050.25
2025–26	57,566.31	29,899.77
మొత్తం	2,28,919.77	1,19,080.75

అల్‌ఫలా విశ్వవిద్యాలయ ఛైర్మన్‌కు సమన్లు

దిల్లీ: ఫరీదాబాద్ ఉగ్రకేసు దర్యాప్తులో భాగంగా దిల్లీ పోలీసులు అల్‌ఫలా విశ్వవిద్యాలయ ఛైర్మన్ జావెద్ అహ్మద్ సిద్ధీకీకి రెండు సమన్లు జారీచేశారు. ఫోర్జరీ, మోసం పేరిట యూనివర్సిటీపై రెండు కేసులు నమోదైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విశ్వవిద్యాలయ పనితీరు, సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తుల కార్యకలాపాలపై పలు అనుమానాలు నెలకొనడంతో సిద్ధీకీ వెల్లడించే విషయాలు కీలకం కానున్నట్లు అధికారులు వివరించారు.

కశ్మీరీ విద్యార్థులందరినీ అనుమానిస్తున్నారు..: ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు తర్వాత కశ్మీరీ విద్యార్థులందరినీ ఉగ్రవాదుల్లా అనుమానిస్తూ బహిష్కరణలకు గురిచేస్తున్నారని 'జమ్మూకశ్మీర్ విద్యార్థుల సంఘం' (జేకేఎస్ఏ) ఆరోపించింది. ప్రత్యేకంగా ఓ వర్గానికి చెందిన విద్యార్థులను కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరింది. చాలామంది ఇంటి యజమానులు కశ్మీరీలను ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా చెబుతున్నారని తెలిపింది.

సమస్యలు ఎర్రకోట వద్ద ప్రతిధ్వనించాయి: ముఫ్తీ

కశ్మీర్ సమస్యలు ఎర్రకోట వద్ద ప్రతిధ్వనించాయని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు. జమ్మూకశ్మీర్‌పై కేంద్ర విధానాల వైఫల్యాన్ని ఈ ఘటన ప్రతిబింబిస్తోందని చెప్పారు. శ్రీనగర్‌లో జరిగిన వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 'కశ్మీర్‌లో అన్నీ బాగున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రపంచానికి చెబుతోంది. కానీ సమస్యలు ఎర్రకోట దగ్గరే ప్రతిధ్వనించాయి. జమ్మూకశ్మీర్‌ను సురక్షితంగా ఉంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా దిల్లీకి కూడా రక్షణ కరవైంది. చదువుకున్న వైద్యుడు తన శరీరానికి ఆర్‌డీఎక్స్ కట్టుకుని ఇతరుల ప్రాణాలు తీసే స్థితికి వెళ్లాడంటే దేశంలో భద్రత లేనట్లే'నని అన్నారు.

ఉగ్ర నెట్‌వర్క్‌కు 'మేడమ్ సర్జన్'



ఇంటర్నెట్‌డెస్క్: దిల్లీలో ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటన దర్యాప్తులో మేడమ్ సర్జన్, డీ-6 వంటి పదాలు వెలుగులోకి వచ్చాయి. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధమున్న 43 ఏళ్ల 'మేడమ్ సర్జన్' షాహీన్ షాహిద్.. ఉగ్రనెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరించింది. ఏయే నగరాలను లక్ష్యంగా చేసుకోవాలి, నియామక వ్యూహాలు, డబ్బు తరలింపు, రహస్య పద్ధతిలో సమాచార మార్పిడి వంటి పన్నాగాలు బయటకు వస్తున్నాయి. డైరీలు, డిజిటల్ పత్రాలు ముఖ్యమైన ఆధారాలుగా మారాయి. ఆమె అనూహ్యంగా అదృశ్యం అయ్యేవరకు జీఎస్‌వీఎం వైద్య కళాశాలలో పనిచేసింది. ఆ సమయంలో ఆమె ప్రవర్తన ఎలా ఉండేదనే దానిపైనా ఆరా తీస్తున్నారు. షాహీన్ మృదు స్వభావి అని ఆమెతో పనిచేసినవారు చెప్పారు. ఇంటివద్ద చూసుకోవడానికి ఎవరూ లేకపోతే.. తన చిన్న బిడ్డను తీసుకొని విధులకు హాజరయ్యేదని వెల్లడించారు. క్యాంపస్ హౌస్‌లో నివసించిన ఆమెకు అందరితో మంచి సంబంధాలు ఉండేవని తెలుస్తోంది. 2013లో అనూహ్యంగా తన విధులకు తాత్కాలిక విరామం ఇచ్చిన ఆమె.. 2014లో తిరిగివస్తానని వెళ్లిపోయింది. తర్వాత మళ్లీ ఎప్పుడూ రాలేదని దర్యాప్తులో వెల్లడైంది. ఆమె ఇచ్చిన చిరునామా సరైనది కాదని 2016లో అధికారులు గుర్తించారు. 2021లో ఆమెను అధికారికంగా విధుల నుంచి తొలగించారు.

ఉగ్రవాదుల్ని..మద్దతుదారుల్ని ఒకేలా పరిగణిస్తాం

భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది



దిల్లీ: ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టంచేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ పలు చర్యలు తీసుకుంటోందని పరోక్షంగా పాకిస్థాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం ఓ ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్న ద్వివేది పలు అంశాలపై మాట్లాడారు. "పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత్ కొత్త విధానాలను అనుసరిస్తోంది. మా దేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతు కొనసాగిస్తే.. పాక్ తీవ్ర సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. దేశ ప్రజల శ్రేయస్సు, పురోగతిపై భారత్ దృష్టి పెడుతోంది. మా లక్ష్యాలకు ఆటంకాలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటుంది. బెదిరింపులకు లొంగిపోయే స్థితిలో నేడు భారత్ లేదు. శత్రువులను ఎదుర్కోవడానికి దేశ నాయకులంతా ఒకేతాటిపై నిల్చున్నారు" అని ద్వివేది నొక్కి చెప్పారు. ఉగ్రవాద మూలాలను ఎగదోయడం మానుకోకుంటే ఆ దేశ ఉనికి ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మరోవైపు.. ఇటీవల కాలంలో జరిగిన భారత్- చైనా చర్చలతో ఏడాదిగా ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగు పడుతున్నాయని ద్వివేది పేర్కొన్నారు.

ఆర్జేడీ శాసనసభాపక్ష నేతగా తేజస్వి



పట్నా: బిహార్ అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన ఆర్జేడీ ఎమ్మెల్యేలు.. తమ శాసనసభాపక్ష నేతగా తేజస్వీ యాదవ్‌ను ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న 25 మంది ఎమ్మెల్యేలు.. ఆయనను ఎన్నుకున్నట్లు ఆర్జేడీ అధికార ప్రతినిధి శక్తి సింగ్ తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్, రబ్రీదేవి, మీసా భారతి, జగదానంద్ సింగ్ హాజరయ్యారని వెల్లడించారు.

ఫలితాలపై కోర్టుకు..: బిహార్ ఎన్నికల ఫలితాలు ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించలేదని, ఈవీఎంలలో లోపాలపై కోర్టుకు వెళ్తామని ఆర్జేడీ స్పష్టం చేసింది. 'క్షేత్ర స్థాయిలోని పరిస్థితులకు ఈ తీర్పు అద్దం పట్టలేదు. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉంటే అలాంటి తీర్పు ఎలా వస్తుంది. ప్రజలు, రాజకీయ నాయకులు ఈ తీర్పును జీర్ణించుకోలేకపోతున్నారు' అని శక్తి సింగ్ పేర్కొన్నారు.

పాక్ వెళ్లేందుకు యత్నం.. యువకుడి అరెస్టు

రాజస్థాన్‌లో ఘటన

జైపుర్: రాజస్థాన్‌లోని జైసల్మేర్ సరిహద్దు వద్ద పాకిస్థాన్‌కి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న 21 ఏళ్ల యువకుడిని సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) అరెస్టు చేసింది. అతడిని ఉత్తర్‌ప్రదేశ్‌లోని షాజహాన్‌పుర్‌కు చెందిన పంకజ్ కశ్యప్‌గా గుర్తించారు. మోహంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలువ ప్రాంతం సమీపంలో అతడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా బీఎస్ఎఫ్ జవాన్లు అడ్డుకున్నారు. అతన్ని ప్రశ్నించగా.. పాకిస్థాన్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. తదుపరి చర్యల కోసం బీఎస్ఎఫ్ అతడిని పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

రష్యాలో భారత విద్యార్థి మృతి

జైపుర్: రష్యాలో గత నెల 19 నుంచి కనిపించకుండా పోయిన భారతీయ ఎంబీబీఎస్ విద్యార్థి అజీత్ చౌధరీ మృతదేహాన్ని సోమవారం అతని స్వగ్రామమైన కఫన్‌వాడకు చేర్చారు. అతని మృతదేహం ఇటీవలే ఉఫాలోని వైట్ రివర్ వద్ద లభ్యమైంది. అజీత్ చౌధరీ బష్కిర్ స్టేట్ మెడికల్ విశ్వ విద్యాలయంలో చదివేవాడు. వ్యవసాయదారుల కుటుంబానికి చెందిన అజీత్ చౌధరీ కుటుంబ వ్యవసాయ భూమిలో కొంత తెగనమ్మి ఎంబీబీఎస్ చదువుల కోసం రష్యాకు వెళ్లాడు. "మరణానికి దారితీసిన కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. దీనిపై మరింత లోతుగా విచారణ జరగాల్సి ఉంది" అని బాధితుని సమీప బంధువు భవర్ సింగ్ తెలిపారు.

ఫ్రాన్స్ నుంచి ఉక్రెయిన్‌కు 100 రఫేల్ విమానాలు!



ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

పారిస్: రష్యాతో యుద్ధంలో పైచేయి సాధించేందుకు పాశ్చాత్య దేశాల నుంచి అత్యాధునిక ఆయుధాలు కోరుతున్న ఉక్రెయిన్ తాజాగా ఫ్రాన్స్ నుంచి 100 రఫేల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయనుంది. ఈ మేరకు రఫేల్ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్‌లో ఇరుదేశాలు ఒక ఆసక్తత పత్రంపై సంతకాలు చేసినట్టు పారిస్‌లోని ఉక్రెయిన్ దౌత్య కార్యాలయం, ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం ధ్రువీకరించాయి. ఈ పత్రంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మెక్రాన్‌లు సోమవారం సంతకాలు చేశారు. ఫ్రాన్స్ నుంచి ఉక్రెయిన్ అత్యాధునిక ఆయుధ సంపత్తి సమకూర్చుకునేందుకు నిశ్చయంతో ఉందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ కార్యాలయం తెలిపింది. ఇందులో భాగంగానే రఫేల్ జెట్ విమానాలను కూడా కొనుగోలు చేయాలని భావిస్తున్నట్టు ఆ కార్యాలయం పేర్కొంది. ఈ విషయంపై మరే వివరాలూ తెలియజేయలేదు. రష్యాపై ఉక్రెయిన్‌పై దాడిని ప్రారంభించాక జెలెన్‌స్కీ ఫ్రాన్స్ సందర్శించడం ఇది తొమ్మిదోసారి.

బాల్ ఠాక్రేకు ఉద్ధవ్-రాజ్ సోదరుల నివాళులు



బాల్‌ఠాక్రే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న రాజ్‌ఠాక్రే, ఉద్ధవ్

ముంబయి: శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే వర్ధంతి సందర్భంగా మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని శివాజీ పార్క్ వద్ద ఉన్న ఆయన స్మారక చిహ్నానికి సోమవారం నివాళులు అర్పించేందుకు ఠాక్రే సోదరులు మరోసారి కలిశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా విరోధులుగా ఉన్న శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఆయన సోదరుడు మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఇటీవల ఆయా సందర్భాల్లో ఒకే వేదిక పైకి వస్తున్న విషయం తెలిసిందే. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. అయితే, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే బాల్ ఠాక్రే వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు రెండు పార్టీల అధ్యక్షులు, వారి కుటుంబ సభ్యులు, ఇరు పార్టీల కార్యకర్తలు తాజాగా ఒకే చోట చేరడం అక్కడి రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

క్వారీ కూలిన ఘటనలో.. ఆరుకు చేరిన మృతుల సంఖ్య



క్వారీ వద్ద సహాయక చర్యలు కొనసాగిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

సోన్‌భద్ర: ఉత్తర్‌ప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో క్వారీ కూలిపోయిన ఘటనలో మరో ఐదు మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరిందని సోమవారం అధికారులు తెలిపారు. మృతులను ఓబ్రాలోని పనారీకి చెందిన వారిగా గుర్తించారు. బాధిత కుటుంబికుల ఫిర్యాదు మేరకు ఈ ప్రమాదానికి కారణమైన కృష్ణ మైనింగ్ వర్క్స్ యజమానితో పాటు వ్యాపార భాగస్వాములు మధుసూదన్ సింగ్, దిలీప్ కేశరీలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ఓబ్రా ప్రాంతంలోని బిల్లీ మార్కుండి మైనింగ్ ఏరియాలో క్వారీ కూలిపోయిన విషయం తెలిసిందే. శిథిలాల కింద 12 నుంచి 15 మంది కార్మికులు చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. అయితే ఆదివారం ఒకరి మృతదేహాన్ని బయటకు తీయగా.. సోమవారం మరో అయిదు మృతదేహాలను గుర్తించారు.

చిత్రిత పత్రం సమర్పయామి!

రావి ఆకుపై మోదీ, నీతీశ్ బొమ్మలు చెక్కిన సైకతశిల్పి

ఈటీవీ భారత్: బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే సాధించిన అఖండ విజయం నేపథ్యంలో అంతర్జాతీయ సైకతశిల్పి మధురేంద్ర రావి ఆకుపై అరుదైన కళాఖండం సృష్టించారు. మన గౌరవనీయ ప్రధాని, సీఎం అంటూ మోదీ, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ సూక్ష్మచిత్రాలను దానిపై రూపొందించారు. పత్రం అడుగు భాగంలో 'ధన్యవాద్ బిహార్' అని రాశారు. బిహార్ ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబిస్తూ తీర్చిదిద్దిన ఈ రావిపత్ర చిత్రం సోషల్ మీడియాలో వైరలవుతోంది.



తాను రూపొందించిన రావిపత్ర చిత్రంతో సైకత శిల్పి మధురేంద్ర



కొండచరియలు విరిగిపడి నుజ్జునుజ్జయిన బస్సు

బస్సుపై విరిగిపడిన కొండచరియలు

వియత్నాంలో ఆరుగురి మృతి

హనోయ్: వియత్నాం ఆర్థిక రాజధాని హో చి మిన్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పర్వత మార్గంలో ప్రయాణిస్తున్న బస్సుపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు మృతి చెందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. మరో 19 మంది గాయపడ్డారు. హో చి మిన్ సిటీ నుంచి 32 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు తీరప్రాంత నగరమైన న్హా ట్రంగాకు వెళ్తుండగా ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ హైల్యాండ్స్‌లోని ఖాహ్ లె పాస్ గుండా పర్వత మార్గంలో ప్రయాణిస్తుండగా కొండచరియలు విరిగిపడి బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు.

జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను పేల్చేందుకు యత్నం

పాక్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం

కరాచీ: పాకిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును పేల్చడానికి తిరుగుబాటుదారులు మరోసారి లక్ష్యంగా చేసుకున్నారు. కానీ ఈ ప్రమాదం నుంచి రైలు త్రుటిలో తప్పించుకుందని అధికారులు తెలిపారు. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని నసీరాబాద్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్ మార్గంలో జాఫర్ ఎక్స్‌ప్రెస్ వెళ్లే రైల్వేట్రాక్‌పై తిరుగుబాటుదారులు పేలుడు పదార్థాలు అమర్చారు. ఆ ట్రాక్‌ను దాటిన కొన్ని సెకన్లకే విస్ఫోటం జరగడంతో రైలులోని కొంతభాగం దెబ్బతింది. కానీ ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం రైలు సేవలను కొన్ని గంటలపాటు నిలిపివేసి, నష్టం కల్గిన భాగాలకు మరమ్మతులు చేశారు. గతంలోనూ జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై పలుమార్లు తిరుగుబాటుదారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

పాతాళంలో దాక్కొన్నా వదలం: అమిత్ షా

దిల్లీ: ఎర్రకోట సమీపంలో పేలుడుకు కారకులు పాతాళంలో ఉన్నా.. కనిపెట్టి, అత్యంత కఠినశిక్ష పడేలా చూస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. సోమవారం ఫరీదాబాద్‌లో ఉత్తర జోనల్ మండలి 32వ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించడమే మోదీ సర్కారు ధ్యేయమని చెప్పారు.

ఛాంపియన్

భారత క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఓపెనర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న ఆటగాడు గౌతమ్ గంభీర్. 2010లో భారత్ నంబర్‌వన్ టెస్టు జట్టుగా ఎదగడంలో.. 2007 టీ20 ప్రపంచకప్‌లో, 2011 వన్డే ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా విజేతగా నిలవడంలో అతడి పాత్ర ఎంతో కీలకం. ఐపీఎల్‌లోనూ కెప్టెన్‌గా తనదైన ముద్ర వేశాడు. నిరుడు కోల్‌కతా ఛాంపియన్ కావడంలో మెంటార్‌గా అతను ముఖ్య పాత్ర పోషించాడు. అదే సమయంలో భారత జట్టు కోచ్‌గా ద్రవిడ్ పదవీ కాలం ముగియడంతో గంభీర్‌ను ఆ స్థానంలోకి తెచ్చింది బీసీసీఐ. ఏడాది తర్వాత చూస్తే టీమ్‌ఇండియా ప్రదర్శన ఏమంత గొప్పగా లేదు. అనూహ్య ఓటములు ఎదురవుతున్నాయి. జట్టులో అనేక మార్పులు జరిగిపోయాయి. తరచుగా గంభీర్ నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. కోచ్ పదవికి గంభీర్ సరైన వాడేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇదేంటి గురూ!

- కోచ్ గంభీర్‌పై తీవ్ర విమర్శలు
- టెస్టుల్లో టీమ్‌ఇండియా తిరోగమనం


గంభీర్

ఈనాడు క్రీడావిభాగం

2011 వన్డే ప్రపంచకప్ గెలిపించడంతో పాటు అన్ని ఫార్మాట్లలో టీమ్‌ఇండియాను అగ్ర జట్టుగా నిలబెట్టి భారత క్రికెట్లోనే అత్యుత్తమ కోచ్‌గా గుడ్‌బై చెప్పాడు గ్యారీ కిర్‌స్టన్. ఆ తర్వాత రవిశాస్త్రి రెండు దఫాలుగా సుదీర్ఘ కాలం భారత జట్టుకు కోచ్‌గా పని చేశాడు. మధ్యలో ఓ ఏడాది పాటు కుంబ్లే బాధ్యతలు నిర్వర్తించాడు. రవిశాస్త్రి తర్వాత ద్రవిడ్ జట్టును నడిపించాడు. కానీ వీళ్లందరి హయాంలో టీమ్‌ఇండియా మెరుగైన ప్రదర్శనే చేసింది. సచిన్ సహా దిగ్గజాల నిష్క్రమణ తర్వాత సంధి దశను అధిగమించాల్సి వచ్చినపుడు తప్పితే భారత్ పెద్దగా ఇబ్బంది పడలేదు. కోహ్లి, కుంబ్లే మధ్య విభేదాలు తలెత్తిన సమయంలోనూ జట్టు ప్రదర్శన ఏమీ దెబ్బ తిన లేదు. కానీ ఇప్పుడు గంభీర్ హయాంలో మాత్రం టీమ్‌ఇండియాకు ఊహించని పరాభవాలు ఎదురవుతున్నాయి. తన నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. కోచ్ పాత్రపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇవిగో వైఫల్యాలు

ఎంత మేటి జట్టుకైనా అప్పుడప్పుడూ ఒక ఓటమి ఎదురవడం సహజమే. గంభీర్ కోచ్ కావడానికి ముందు కూడా టీమ్‌ఇండియా ఓటములు ఎదుర్కొంది. కానీ గంభీర్ కోచ్ అయ్యాక 14 నెలల కాలంలో భారత్‌కు పెద్ద షాక్‌లే తగిలాయి. ముఖ్యంగా టెస్టుల్లో జట్టు ప్రదర్శన ఆందోళనకరంగా మారింది. ఈ 15 నెలల్లో సొంతగడ్డపై బలహీన జట్లయిన బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లపై మాత్రమే టెస్టు మ్యాచ్‌లు గెలిచింది భారత్. నిరుడు న్యూజిలాండ్ చేతిలో స్వదేశంలో 0-3తో వైట్‌వాష్‌కు గురి కావడం భారత క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద మచ్చగా మారింది. 36 ఏళ్లుగా భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలవని కివీస్.. ఏకంగా టీమ్‌ఇండియాను వైట్‌వాష్ చేయడం పెద్ద షాక్. సొంత గడ్డపై 12 ఏళ్ల తర్వాత భారత్‌కు ఎదురైన సిరీస్ ఓటమి అది. ఆ పరాభవం అనుకోకుండా జరిగిందేమో అనుకుంటే.. ఇప్పుడు దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు మ్యాచ్ ఓడడంతో టీమ్‌ఇండియా ఆట తీరుపై అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. నిరుడు న్యూజిలాండ్ సిరీస్ అనంతరం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్.. అక్కడా సిరీస్ కోల్పోయింది. వరుసగా రెండుసార్లు ఆస్ట్రేలియాలో సిరీస్‌లు సాధించిన తర్వాత ఈసారి అక్కడ ఓటమి ఎదురైంది. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో మరీ ఘోరంగా 46 పరుగులకే కుప్పకూలడం.. తాజాగా దక్షిణాఫ్రికాపై 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక 93 పరుగులకే చేతులెత్తేయడం టెస్టుల్లో భారత జట్టు పతనానికి సూచికలు. ఇంగ్లాండ్‌లో మెరుగైన ప్రదర్శన చేయడం ఒక్కటే గంభీర్ వచ్చాక టెస్టుల్లో సానుకూలాంశం. అక్కడ కూడా చివరి టెస్టులో జట్టు అసాధారణ ప్రదర్శన చేయకపోతే సిరీస్ చేజారేదే. ఇక వన్డేల విషయానికి వస్తే.. 27 ఏళ్ల తర్వాత శ్రీలంకకు సిరీస్ కోల్పోయింది గంభీర్ కోచ్ అయ్యాకే. ఇటీవలే ఆస్ట్రేలియాలోనూ భారత్ వన్డే సిరీస్ ఓడిపోయింది.

నిర్ణయాలు వివాదాస్పదం

జట్టు ప్రదర్శనను మించి.. సెలక్షన్, తుది జట్టు కూర్పు, పిచ్‌ల విషయంలో జట్టు విధానం గంభీర్ వచ్చాక తీవ్ర వివాదాస్పదం అవుతున్నాయి. జట్టులో కుర్రాళ్లకు పెద్ద పీట వేయాలన్న ఆలోచన మంచిదే అయినా.. ఈ క్రమంలో సీనియర్ల పట్ల గంభీర్ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది. టెస్టుల్లో జట్టుకు ఎన్నో ఏళ్లుగా గొప్పగా సేవలందిస్తున్న అశ్విన్, రోహిత్, కోహ్లి ఒకరి తర్వాత ఒకరు రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడానికి గంభీరే కారణమన్న ఆరోపణలున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును విజేతగా నిలిపిన రోహిత్‌ను తర్వాతి వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా తప్పించడం వివాదాస్పదమైంది. తన మాట వినే యువ కెప్టెన్ ఉండాలనే ఉద్దేశంతోనే గౌతీ ఈ నిర్ణయం తీసుకున్నాడనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు స్వదేశంలో పిచ్‌లను బౌలర్లకు అనుకూలంగా మార్చాలన్న గంభీర్ ఆలోచన కూడా బెడిసికొడుతోంది. నిరుడు న్యూజిలాండ్ చేతిలో గట్టి ఎదురు దెబ్బ తిన్నాక కూడా అతడి తీరు మారలేదు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టుకు తొలి రోజు నుంచే బంతి గిర్రున తిరిగేలా పిచ్‌ను తయారు చేయించుకున్నాడు. ఈ వికెట్‌తో ప్రత్యర్థికి ఉచ్చు బిగించబోతే భారత జట్టే ఆ ఉచ్చులో పడి ఓటమి పాలైంది. అందరూ పిచ్‌ను తప్పుబడుతుంటే.. తామే అలాంటి పిచ్‌ను అడిగామని గంభీర్ చెప్పడంతో విమర్శలన్నీ అతడి వైపు మళ్లాయి. టెస్టుల్లో కీలకమైన మూడో స్థానం విషయంలో గంభీర్ చేస్తున్న ప్రయోగాలు కూడా జట్టుకు చేటు చేస్తోంది. ఆ స్థానంలో కుదురుకుంటున్న సుదర్శన్‌ను పక్కన పెట్టి ఈడెన్ టెస్టుకు నాలుగో స్పిన్నర్‌ను ఎంచుకుంది జట్టు యాజమాన్యం. తీరా చూస్తే సుందర్‌ను స్పిన్నర్‌గా ఉపయోగించుకున్నదే లేదు. శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్, అభిమన్యు ఈశ్వరన్, దేవ్‌దత్ పడిక్కల్ లాంటి ప్రతిభావంతులకు అవకాశాలు ఇవ్వకపోవడం.. హర్షిత్ రాణా పెద్దగా రాణించకపోయినా మూడు ఫార్మాట్లలో ఆడించడం లాంటి నిర్ణయాల విషయంలోనూ గంభీర్ విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఎప్పుడూ కోపంగా కనిపించే గంభీర్ రాకతో జట్టు వాతావరణం కూడా దెబ్బ తింటోందా అనే చర్చ కూడా అభిమానుల్లో నడుస్తోంది. రవిశాస్త్రి, ద్రవిడ్ కోచ్‌లుగా ఉండగా.. డ్రెస్సింగ్ రూం ఎప్పుడూ సందడిగా కనిపించేదన్నది జట్టు వర్గాల సమాచారం. మైదానంలో ఆట ఎంత సీరియస్‌గా ఆడినా.. మిగతా సమయాల్లో ఆటగాళ్లు సరదాగా ఉండేవారు. అయితే గంభీర్ వ్యవహార శైలికి తోడు సెలక్షన్ సహా అనేక విషయాల్లో అతడి ఏకపక్ష నిర్ణయాల వల్ల జట్టు వాతావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీమ్‌ఇండియా టెస్టుల్లో ఇంకొన్ని ఓటములు ఎదుర్కొంటే మాత్రం గంభీర్‌ను బీసీసీఐ పక్కన పెట్టక తప్పదేమో!

గిల్ స్థానంలో ఎవరు?


గిల్

కోల్‌కతా: మెడ గాయంతో ఇబ్బందిపడుతోన్న టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దక్షిణాఫ్రికాతో శనివారం మొదలయ్యే రెండో టెస్టులో ఆడడం అనుమానంగా మారింది. అతడు తొలి టెస్టు సందర్భంగా రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో మూడు బంతులే ఆడి గాయంతో మైదానాన్ని వీడిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లో అసలు బ్యాటింగ్‌కే రాలేదు. గిల్ ఆస్పత్రికి కూడా వెళ్లాల్సివచ్చింది. నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు అతడికి సూచించారు. గిల్ ఒకవేళ రెండో టెస్టుకు అందుబాటులో లేకపోతే అతడి స్థానంలో ఎవరు తుది జట్టులోకి వస్తారన్నది ఆసక్తికరం. ఆ స్థానం కోసం సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్‌ల మధ్య పోటీ ఉంది. సుదర్శన్ ఇప్పటివరకు లభించిన అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోలేకపోయాడు. అతడు ఆశించినంతగా రాణించలేదు. ఇంగ్లాండ్ పర్యటనలో పరుగుల వేటలో వెనుకబడ్డ అతడు.. వెస్టిండీస్‌తో రెండో టెస్టులో వరుసగా 87, 39 పరుగులు చేశాడు. అయితే సుదర్శన్ దక్షిణాఫ్రికా-ఎ‌పై రెండు మ్యాచ్‌ల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. భారత్-ఎ తరఫున నాలుగు ఇన్నింగ్స్‌ల్లో అతడు సాధించిన అత్యధిక వ్యక్తిగత స్కోరు 32 మాత్రమే. ఇటీవల ఆస్ట్రేలియా-ఎతో అనధికార టెస్టులో పడిక్కల్ 150 పరుగులు చేశాడు. అయితే మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే మాత్రం సాయి సుదర్శన్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డాడు. "గిల్ కోలుకోకపోతే రెండో టెస్టుకు అతడి స్థానంలో సుదర్శన్‌ను తీసుకోవాలి. భారత జట్టు ఒకవేళ ఆరుగురు బౌలర్లను (నలుగురు స్పిన్నర్లు, ఇద్దరు స్పిన్నర్లు) కొనసాగిస్తే.. ఈ ఒక్క మార్పు (గిల్ స్థానంలో సుదర్శన్) తప్ప జట్టంతా అలాగే ఉండాలి" అని చెప్పాడు.

చెస్ ప్రపంచకప్

అర్జున్ గేమ్ డ్రా


అర్జున్

పంజిమ్: ఫిడే ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్‌ను భారత స్టార్ అర్జున్ ఇరిగేశి డ్రాతో మొదలుపెట్టాడు. సోమవారం వీ యీ (చైనా)తో తొలి గేమ్‌లో అర్జున్ జాగ్రత్తగా ఆడాడు. నల్ల పావులతో బరిలో దిగిన అతడు.. క్లిష్టమైన మేళవింపులకు పోకుండా ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేశాడు. ముఖ్యంగా మిడిల్ గేమ్‌లో అర్జున్ ఒక బంటును ఎర వేశాడు. కానీ వీయీ దీటుగా ప్రతిఘటించడంతో ఆట 31 ఎత్తుల్లో డ్రాగా ముగిసింది. మంగళవారం రెండో గేమ్‌లో అర్జున్ తెల్ల పావులతో ఆడనున్నాడు. ఈ గేమ్‌లో గెలిస్తే అతడు సెమీస్ చేరతాడు. డ్రా అయితే టైబ్రేక్ ఆడాల్సి ఉంటుంది. సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)-జోస్ ఎడ్వార్డ్ (మెక్సికో), సామ్ షాంక్‌లాండ్ (అమెరికా)-ఆండ్రీ ఎసిపెంకో (రష్యా) మధ్య క్వార్టర్స్ గేమ్‌లు డ్రా అయ్యాయి. మరో క్వార్టర్స్ తొలి గేమ్‌లో నాదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్).. వాన్‌చెంగ్ (చైనా)పై నెగ్గాడు.

గుర్‌ప్రీత్‌కు రజతం


గుర్‌ప్రీత్ సింగ్

కైరో: ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. సోమవారం 25 మీటర్ల ఫైర్ పిస్టల్‌లో గుర్‌ప్రీత్ సింగ్ రజతం సొంతం చేసుకున్నాడు. ఈ పోటీల్లో తొలి రోజు 288, రెండో రోజు 296 పాయింట్లు సాధించిన గుర్‌ప్రీత్.. మొత్తంగా 584 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. కొరొవ్లేవ్ (ఉక్రెయిన్) కూడా 584 పాయింట్లే గెలిచినా.. గుర్‌ప్రీత్ కంటే ఎక్కువ 10 పాయింట్లు స్కోరు చేయడంతో స్వర్ణం అతడికి దక్కింది. యాన్ లూయిస్ (ఫ్రాన్స్, 583) కాంస్యం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో పోటీపడిన భారత షూటర్ హర్‌ప్రీత్ సింగ్ (577) తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

అనుయకు స్వర్ణం


అనుయ

దిల్లీ: డెఫ్‌లింపిక్స్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో భారత షూటర్ అనుయ ప్రసాద్ స్వర్ణం గెలుచుకుంది. ఇదే విభాగంలో ప్రాంజలి రజతం సాధించింది. ఫైనల్లో అనుయ 241.1 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. ఇది డెఫ్‌లింపిక్స్ ఫైనల్ ప్రపంచ రికార్డు. ప్రాంజలి 236.8 స్కోరుతో రెండో స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో అభినవ్ దేశ్వాల్ (235.2) రజతం గెలుచుకున్నాడు.

సెమీస్‌లో ఇంకో అయిదుగురు

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్


హితేశ్


గ్రేటర్ నోయిడా: ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. మరో అయిదుగురు బాక్సర్లు సెమీస్ చేరి పతకం ఖాయం చేశారు. 70 కేజీల్లో హితేశ్ 3-2తో సెవాన్ ఒకజవా (జపాన్)కు షాకిచ్చాడు. సుమిత్ (75 కేజీ) 5-0తో హెయాన్ (కొరియా)ను ఓడించగా.. జాదుమణి సింగ్ (50 కేజీ) అంతే తేడాతో నుర్జాత్ (కజకిస్థాన్)ను చిత్తు చేశాడు. నవీన్ (90 కేజీ) 5-0తో బెక్‌జాత్ (కజకిస్థాన్)పై, పవన్ (55 కేజీ) 5-0తో నూర్ సుల్తాన్ (కజకిస్థాన్)పై గెలిచారు. మీనాక్షి (48 కేజీ), ప్రీతి (54 కేజీ), నరేందర్ (90 కేజీ), అంకుశ్ (80 కేజీ) ఇప్పటికే పతకాలు ఖరారు చేశారు.

సాత్విక్ జోడీపై ఆశలు


చిరాగ్, సాత్విక్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జోడీ బరిలో దిగనుంది. మంచి ఫామ్‌లో ఉన్న సాత్విక్-చిరాగ్ జోడీ ఈ టోర్నీలో టైటిల్ సాధిస్తుందన్న అంచనాలు, ఆశలు ఉన్నాయి. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో చాంగ్ చి- లీ వీ (చైనీస్ తైపీ) జంటతో టాప్ సీడ్ సాత్విక్- చిరాగ్ జోడీ తలపడనుంది. పురుషుల సింగిల్స్ లీ యాంగ్ (చైనీస్ తైపీ)తో లక్ష్యసేన్, యొహానెస్ మార్హెలినో (ఇండోనేసియా)తో హెచ్.ఎస్. ప్రణయ్, లీ చియా హావో (చైనీస్ తైపీ)తో కిదాంబి శ్రీకాంత్, మాగ్నస్ జొహానెసెన్ (డెన్మార్క్)తో తరుణ్ మన్నెపల్లి, సామ్ యువాన్ (కెనడా)తో ఆయుష్ శెట్టి, కెంటా నిషిమొటో (జపాన్)తో కిరణ్ జార్జ్ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో పెబ్రియానా కుసుమ- మెలీసా పుస్పితసరి జంటతో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ పోటీపడనుంది.

సినర్‌దే ఏటీపీ ఫైనల్స్ టైటిల్


సినర్

ట్యూరిన్: ఏటీపీ ఫైనల్స్ టెన్నిస్ టోర్నమెంట్లో యానిక్ సినర్ టైటిల్ నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో ఈ ఇటలీ స్టార్ 7-6 (7-4), 7-5తో టాప్‌సీడ్ అల్కరాస్ (స్పెయిన్)ను ఓడించాడు. హోరాహోరీగా సాగిన తొలి సెట్లో సినర్ 5-6తో వెనుకబడ్డాడు. ఈ స్థితిలో సెట్ పాయింట్ కాచుకుని టైబ్రేకర్‌కు నడిపించాడు. టైబ్రేకర్‌లో సర్వీసుల్లో అదరగొట్టి సెట్‌ను గెలుచుకున్నాడు. రెండో సెట్లో తొలి గేమ్‌లోనే సర్వీస్ కోల్పోయినా.. సినర్ పుంజుకున్నాడు. 3-3తో స్కోరు సమం చేశాడు. ఈ సెట్ కూడా టైబ్రేకర్‌కు మళ్లుతుందేమో అనిపించింది. పన్నెండో గేమ్‌లో అల్కరాస్ సర్వీస్ బ్రేక్ చేసిన సినర్.. సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. టైటిల్ చేజారినా.. ఈ ఏడాదిని అల్కరాస్ నంబర్‌వన్‌గా ముగించనున్నాడు.

టెస్టు క్రికెట్‌ను నాశనం చేశారు


హర్భజన్ సింగ్

దిల్లీ: భారత్‌లో టెస్టు క్రికెట్‌ను నాశనం చేశారని మాజీ ఆఫ్‌స్పిన్నర్ హర్భజన్ సింగ్ మండిపడ్డాడు. బౌలర్లకు విపరీతంగా సహకరించే ఈడెన్ గార్డెన్స్ లాంటి పిచ్‌లు క్రికెటర్ల అభివృద్ధిని అడ్డుకుంటాయని అన్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో టీమ్‌ఇండియా 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించలేక ఓటమి చవిచూసిన నేపథ్యంలో భజ్జీ ఈ వ్యాఖ్యలు చేశాడు. "వాళ్లు టెస్టు క్రికెట్‌ను సర్వనాశనం చేశారు. చాలా ఏళ్లుగా చూస్తున్నా. పేలవమైన పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి, ఎవరో వికెట్లు తీస్తున్నారు కాబట్టి, ఆ వికెట్ల ద్వారా ఎవరో గొప్ప వాళ్లవుతున్నారు కాబట్టి ఎవ్వరూ పిచ్‌ల గురించి మాట్లాడట్లేదు" అని అన్నాడు. "అంతా బాగుందని అందరూ అనుకుంటూ వచ్చారు. కానీ ఈ విధానం ఇప్పుడు మొదలైంది కాదు. చాలా ఏళ్లుగా ఇలాంటి పిచ్‌లను తయారు చేస్తున్నారు. ఇలా క్రికెట్ ఆడడం తప్పు" అని చెప్పాడు. "ఇలాంటి పిచ్‌లతో క్రికెట్లో ప్రగతి సాధించలేం. గెలుస్తున్నాం. కానీ ఎలాంటి ప్రయోజనం లేదు. క్రికెటర్లు ఎదగట్లేదు" అని హర్భజన్ అన్నాడు. హర్భజన్ టీమ్‌ఇండియా తరఫున 103 టెస్టుల్లో 417 వికెట్లు పడగొట్టాడు.

జమ్ముకశ్మీర్‌కు ఆధిక్యం

జమ్ము: జమ్ముకశ్మీర్‌తో రంజీ ట్రోఫీ ఎలైట్ (గ్రూపు-డి మ్యాచ్‌లో హైదరాబాద్ కష్టాల్లో పడింది. సునీల్ కుమార్ (5/29), ఆకిబ్ నబి (4/39) విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 121 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 88/6తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు కథ త్వరగానే ముగిసింది. 49 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జమ్ముకశ్మీర్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. సోమవారం ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 275 పరుగులు సాధించింది. కమ్రాన్ ఇక్బాల్ (50), విగ్రాంత్ శర్మ (45) రాణించారు. అబ్దుల్ సమద్ (77 బ్యాటింగ్), కన్హయ్య వధవాన్ (82 బ్యాటింగ్) అయిదో వికెట్‌కు అజేయంగా 148 పరుగులు జోడించి జట్టు భారీస్కోరుకు బాటలు వేశారు. మరో రెండ్రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో ప్రస్తుతం జమ్ముకశ్మీర్ ఖాతాలో 324 పరుగులున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో జమ్ముకశ్మీర్ 170 పరుగులు చేసింది.

అభిషేక్ సెంచరీ..

ఆంధ్ర 224/2

జంషెడ్‌పూర్: అభిషేక్‌రెడ్డి (103 బ్యాటింగ్; 156 బంతుల్లో 11×4, 1×6) అజేయ సెంచరీతో కదంతొక్కడంతో ఝార్ఖండ్‌తో రంజీ ట్రోఫీ ఎలైట్ (గ్రూపు-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 259/6తో సోమవారం ఉదయం ఆట కొనసాగించిన ఝార్ఖండ్ 328 పరుగులకు ఆలౌటైంది. బౌలర్లలో శశికాంత్ (4/67), సౌరభ్ కుమార్ (4/77) మెరిశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఆంధ్ర రెండో రోజు ఆట ముగిసే సమయానికి 60 ఓవర్లలో 2 వికెట్లకు 224 పరుగులు సాధించింది. శ్రీకర్ భరత్ (51; 67 బంతుల్లో 8×4), షేక్ రషీద్ (58; 117 బంతుల్లో 6×4) అర్ధ సెంచరీలతో రాణించారు. అభిషేక్ క్రీజులో ఉండగా.. ఝార్ఖండ్ స్కోరుకు ఆంధ్ర మరో 104 పరుగుల దూరంలో ఉంది.

పోర్చుగల్, నార్వేకు ప్రపంచకప్ బెర్తు

లిస్బన్: పోర్చుగల్, నార్వే వచ్చే ఏడాది జరిగే ఫుట్‌బాల్ ప్రపంచకప్‌నకు అర్హత సాధించాయి. గత మ్యాచ్‌లో రెడ్‌కార్డుకు గురి కావడంతో ఆర్మేనియాతో చివరి క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో ఆడకపోయినా పోర్చుగల్ సత్తా చాటింది. 9-1తో ఆర్మేనియాను చిత్తు చేసి ప్రపంచకప్ టికెట్ దక్కించుకుంది. మరో మ్యాచ్‌లో నార్వే 4-1తో ఇటలీని ఓడించింది. 48 జట్లు పోటీపడే 2026 ప్రపంచకప్‌నకు ఇప్పటికే 32 జట్లు అర్హత సాధించాయి. ఆతిథ్య హోదాలో అమెరికా, మెక్సికో, కెనడా నేరుగా బెర్తు దక్కించుకున్నాయి. ఇప్పటివరకు ఆస్ట్రేలియా, ఇరాన్, జపాన్, జోర్డాన్, ఖతార్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్థాన్ (ఆసియా), క్రొయేషియా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, నార్వే, పోర్చుగల్ (ఐరోపా), అల్జీరియా, కేప్ వెర్డే, ఈజిప్ట్, ఘనా, ఐవరీ కోస్ట్, మొరాకో, సెనెగల్, దక్షిణాఫ్రికా, ట్యునీసియా (ఆఫ్రికా), న్యూజిలాండ్ (ఓసియానియా), అర్జెంటీనా, బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్, పెరుగ్వే, ఉరుగ్వే (దక్షిణ అమెరికా) ప్రపంచకప్ టికెట్ సంపాదించాయి. మరో 13 జట్లు కాంటినెంటల్ టోర్నీల ద్వారా అర్హత సాధించబోతున్నాయి.

స్వదేశానికి అసలంక, ఫెర్నాండో

కొలంబో: పాకిస్థాన్ పర్యటిస్తోన్న శ్రీలంక జట్టులోని ఇద్దరు ఆటగాళ్లు కెప్టెన్ అసలంక, పేసర్ ఫెర్నాండో అనారోగ్యం కారణంగా స్వదేశానికి బయలుదేరనున్నారు. ముక్కోణపు టీ20 సిరీస్ కోసం శానకను శ్రీలంక కెప్టెన్‌గా నియమించినట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది. ముక్కోణపు సిరీస్‌లో శ్రీలంక, పాకిస్థాన్‌లతో పాటు జింబాబ్వే పోటీపడనుంది. ఇటీవల ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి నేపథ్యంలో శ్రీలంక ఆటగాళ్లు తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది స్వదేశానికి వెళ్లిపోవాలనుకున్నారు. కానీ భద్రతపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హామీ ఇవ్వడంతో పాటు.. స్వదేశానికి తిరిగొస్తే చర్యలు తీసుకుంటామని శ్రీలంక క్రికెట్ బోర్డు హెచ్చరించడంతో లంక ఆటగాళ్లు పాక్‌లోనే ఉండిపోయిన సంగతి తెలిసిందే. ముక్కోణపు టీ20 సిరీస్ మంగళవారం ఆరంభం కానుంది.

రాజస్థాన్ చీఫ్ కోచ్‌గా సంగక్కర


సంగక్కర

దిల్లీ: రాజస్థాన్ రాయల్స్ చీఫ్ కోచ్‌గా కుమార సంగక్కర తిరిగి నియమితుడయ్యాడు. రాహుల్ ద్రవిడ్ స్థానంలో సంగక్కర చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తాడని రాజస్థాన్ ఫ్రాంఛైజీ సోమవారం ప్రకటించింది. ఈ ఏడాది ఆగస్టులో ద్రవిడ్ ప్రధాన కోచ్ బాధ్యతల నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. గత సీజన్‌లో 14 మ్యాచ్‌లాడిన రాజస్థాన్ కేవలం 4 విజయాలతో 9వ స్థానంలో నిలిచింది. 2021లో క్రికెట్ డైరెక్టర్‌గా ఉన్న సంగక్కర 2021-2024 వరకు చీఫ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. అతడు రాజస్థాన్ క్రికెట్ డైరెక్టర్‌గానూ కొనసాగనున్నాడు.

కమిన్స్ మూడోసారి..

హైదరాబాద్: ఆస్ట్రేలియా స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ వరుసగా మూడో సీజన్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను నడిపించనున్నాడు. ఈ విషయాన్ని ఎస్‌ఆర్‌హెచ్ తన 'ఎక్స్' ఖాతాలో ధ్రువీకరించింది. 2023 వేలంలో రూ.20.50 కోట్ల భారీ మొత్తంతో సన్‌రైజర్స్‌కు సొంతమైన కమిన్స్. తర్వాతి ఏడాది దక్షిణాఫ్రికా బ్యాటర్ మార్‌క్రమ్ నుంచి జట్టు సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. కమిన్స్ కెప్టెన్సీలో 2024 సీజన్లో అద్భుత ప్రదర్శన చేసిన హైదరాబాద్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తుది పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో అంచనాలు అందుకోలేకపోయిన ఎస్‌ఆర్‌హెచ్ ఆరో స్థానంలో నిలిచింది.

సంపాదించడం రాదంటూ భార్య, అత్త అవహేళన

వారికి డబ్బుతో సమాధానం చెప్పాలనే పైరసీ బాటపట్టిన ఇమ్మడి రవి

రూ.కోట్లు తెచ్చి చూపించినా.. నీతో బతకలేనంటూ విడిపోయిన భార్య

ఈనాడు, హైదరాబాద్: దమ్ముంటే పట్టుకోండి చూద్దామంటూ పోలీసులకే సవాల్ విసిరిన నెలకే కటకటాల పాలైన ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి మానసిక స్థితిపై పోలీసులు విశ్లేషిస్తున్నారు. కొత్తగా వయసు నుంచి వివాహం వరకు చవిచూసిన అవమానాలతో డబ్బే లక్ష్యంగా ఆలోచించాడు. 2016లో ఒక యువతిని ప్రేమించి పెళ్లాడాడు. ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు.. రవి సంపాదనతో నెట్టుకురావటం సమస్యగా మారింది. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. డబ్బు సంపాదించడం నీ వల్ల కాదంటూ భార్యతోపాటు అత్త కూడా హేళన చేయటాన్ని భరించలేకపోయాడు. ఈ క్రమంలో వెబ్ డిజైనర్‌గా తనకున్న అనుభవంతో ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లను రూపొందించాడు. కొన్ని నెలలకే బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకుల నుంచి ప్రకటనల రూపంలో ఊహించనంత డబ్బు వచ్చి వాలింది. కానీ, తన సంపాదనను ఆధారంగా చూపినా తనతో కలిసి ఉండేందుకు భార్య ఇష్టపడలేదు. దీంతో 2021లో ఇద్దరూ విడిపోయారు. అనంతరం మకాం నెదర్లాండ్స్ మార్చాడు. తాను ఎక్కడున్నా అక్కడి నుంచే వెబ్‌సైట్లను నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకున్నాడు. వాటి ద్వారా సేకరించిన 50 లక్షల మంది డేటాను సైబర్ నేరస్థులు, గేమింగ్ ముఠాలకు విక్రయించి రూ.20 కోట్లు సంపాదించాడు. కూకట్‌పల్లిలోని ఫ్లాట్‌ను విక్రయించి.. వచ్చిన సొమ్ముతో విదేశాల్లో స్థిరపడాలనే ఆలోచనలో ఉండగానే పోలీసులకు చిక్కాడు.

సంజయ్ బెయిల్ పిటిషన్ మూడోసారి తిరస్కరణ

ఈనాడు, అమరావతి: సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి సంజయ్‌కు న్యాయస్థానంలో చుక్కెదురైంది. అగ్నిమాపక, సీఐడీ డీజీగా పనిచేసిన కాలంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో మూడోసారి బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. ఈ పిటిషన్‌పై గత వారం వాదనలు పూర్తయ్యాయి. ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు.. పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో సంజయ్ ఆగస్టు 26 నుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. సంజయ్ అవినీతికి పాల్పడ్డారని, కేసు దర్యాప్తులో ఉందని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది వాదించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయాధికారి.. నిందితుడు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తీర్పు వెల్లడించారు.

వార్షిక కౌలు చెల్లించేలా సీఆర్‌డీఏను ఆదేశించండి

విమానాశ్రయానికి భూములిచ్చిన రైతుల పిటిషన్

ఈనాడు, అమరావతి: గన్నవరం విమానాశ్రయం విస్తరణ నిమిత్తం భూసమీకరణ పథకం కింద కృష్ణా జిల్లా అజ్జంపూడి గ్రామంలోని తమ భూములను ఇచ్చామని, వాటికి సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వం వార్షిక కౌలు చెల్లించడం లేదని పేర్కొంటూ మన్నం కృష్ణమూర్తి, మరో ముగ్గురు దాఖలు చేసిన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. భూములు ఒకసారి స్వాధీనం చేసుకున్నాక వాటిని వినియోగించుకున్నా, లేకపోయినా కౌలు చెల్లించాల్సిందేనని విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. పూర్తి వివరాలు సమర్పించాలని సీఆర్‌డీఏను ఆదేశిస్తూ విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ.. ఇదే విషయంలో భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించాలని గతంలో హైకోర్టు ఆదేశాలు జారీచేసిందని గుర్తుచేశారు. పిటిషనర్లకు వార్షిక కౌలు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

పసుపు రెక్కల టూనా.. ధరకు ఆన!

రూ.17 వేలు పలికిన 112 కిలోల మత్స్యం



చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: సముద్రంలో వేటకు వెళ్లిన తమిళనాడులోని రామనాథపురం జిల్లా పాంబన్‌కు చెందిన మత్స్యకారుల వలకు భారీ చేప చిక్కింది. జాలర్లు మన్నార్ గల్ఫ్ వద్ద వేట సాగిస్తుండగా.. వలలో పసుపు రెక్కల సూరా చేప (టూనా) చిక్కింది. ఇది సుమారు 112 కిలోల బరువు, 3 మీటర్ల పొడవు ఉంది. మత్స్యకారులు ఆదివారం ఒడ్డుకు చేరుకోగా, చేపను నలుగురు జాలర్లు తీరానికి మోసుకొచ్చారు. దీన్ని కేరళకు చెందిన ఓ వ్యాపారి రూ.17 వేలకు కొనుగోలు చేశారు.



నడిచే కర్రపుల్ల!

హఠాత్తుగా చూస్తే ఇదో కర్రపుల్ల అనుకుంటారు.. పరిశీలిస్తే తెలుస్తుంది అదో కీటకమని. శ్రీకాకుళం జిల్లా గార మండలం శాలిహుండం వద్ద పంటపొలాల్లో ఈ చిత్రమైన కీటకం కనిపించింది. మిడత జాతికి చెందిన దీన్ని స్టిక్-బగ్, కర్ర మిడత అని పిలుస్తారు. ఎగరలేని ఈ జీవులు గోధుమ రంగులో సన్నగా 2.75 నుంచి 4 అంగుళాల పొడవు ఉంటాయి. – న్యూస్‌టుడే, గార

ఆరేళ్లలో 21 వేల సినిమాలు పైరసీ

- ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి మాస్టర్‌మైండ్
- మీడియా సమావేశంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న హైదరాబాద్ సీపీ సజ్జనార్.. చిత్రంలో సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత దార, అదనపు సీపీ శ్రీనివాసులు, దర్శకుడు రాజమౌళి, సినీనటుడు చిరంజీవి, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, సినీనటుడు నాగార్జున, నిర్మాతలు సురేశ్‌బాబు, దామోదరప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లో సర్వర్లు.. నెదర్లాండ్స్‌లో పాగా.. యూకేలో అనుచరులు.. కరేబియన్ పౌరసత్వం.. ఇదీ పైరసీ కింగ్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి(39) సామ్రాజ్యం. ఆరేళ్లుగా పలు భాషల సినిమాలను పైరసీ చేసి భారతీయ చలనచిత్ర రంగానికి రూ.వేల కోట్ల నష్టానికి కారకుడయ్యాడు. వెబ్ డిజైనర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి.. అంతర్జాతీయ స్థాయిలో నెట్‌వర్క్‌ను విస్తరింపజేసి పైరసీలో మాస్టర్‌మైండ్‌గా ఎదిగాడు. ఇన్నేళ్లూ సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులను ఏమార్చుతూ వచ్చాడు. ఎట్టకేలకు రవితోపాటు అతనికి సహకరించిన నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన వెబ్ డిజైనర్ డి.శివాజీ(27), ఆత్మకూరుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఎస్.ప్రశాంత్(27)లను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. రవి బ్యాంకు ఖాతాల్లోని రూ.3.5 కోట్ల నగదును ఫ్రీజ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సినీనటులు చిరంజీవి, నాగార్జున, నిర్మాతలు దిల్ రాజు, సురేశ్‌బాబు, దామోదరప్రసాద్, అదనపు సీపీ శ్రీనివాసులు, సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత దార, ఏసీపీలు జయపాల్‌రెడ్డి, శివమారుతి తదితరులతో కలిసి నగర సీపీ వీసీ సజ్జనార్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

2010లో సాఫ్ట్‌వేర్ కంపెనీతో ప్రారంభం

ఇమ్మడి రవి అలియాస్ ప్రహ్లాద్‌కుమార్‌ది ఏపీలోని విశాఖపట్నం. అక్కడే బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేశాడు. ఉద్యోగవేటలో ముంబయి చేరి పలు ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తూనే ఎంబీఏ పూర్తిచేశాడు. 2010లో హైదరాబాద్ చేరి ఈఆర్ ఇన్ఫోటెక్ కంపెనీ ప్రారంభించాడు. వెబ్‌సైట్ డిజైనింగ్, డొమైన్ రిజిస్ట్రేషన్, నిర్వహణపై పట్టు సాధించాడు. ఇంటర్నెట్ సౌకర్యం తేలికగా అందుబాటులోకి వస్తుండటం, ఓటీటీలకు డిమాండ్ పెరుగుతుండటాన్ని గమనించాడు. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు అందుబాటులో ఉంచితే ప్రకటనల రూపంలో బాగా సంపాదించొచ్చని ఆలోచించాడు. అప్పుడే 2019లో కరోనా లాక్‌డౌన్‌తో జనం ఇళ్లకే పరిమితమవడం, ఆ సమయంలో ఓటీటీ వేదికలకు డిమాండ్ పెరగటంతో అదే ఏడాది ఐ బొమ్మ వెబ్‌సైట్ రూపొందించాడు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రచారానికి అందులో వీలు కల్పించాడు. సినిమాలు, వెబ్‌సిరీస్‌లను ఉచితంగా వీక్షించవచ్చంటూ సామాజిక మాధ్యమాలు, టెలిగ్రామ్ గ్రూప్‌లో విస్తృత ప్రచారం చేశాడు. దీంతో నెల రోజులకే 50 లక్షల మంది యూజర్లను సంపాదించాడు.

విదేశాల నుంచి నిర్వహణ

- ✦ దాదాపు 900కు పైగా వెబ్‌సైట్లు రూపొందించి, 2022లో బప్పం వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు.
- ✦ ఆమ్‌స్టర్‌డామ్, స్విట్జర్లాండ్, అమెరికాల్లోని సర్వర్లను కొనుగోలు చేశాడు.
- ✦ పోర్క్‌బన్ కంపెనీ పేరుతో 110 డొమైన్‌లను రిజిస్ట్రేషన్ చేయించాడు. క్లౌడ్‌ఫ్లేర్ సర్వీస్‌లను ఉపయోగించుకున్నాడు. ✦ వెబ్‌సైట్లను బ్లాక్ చేసినా మరో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవాడు.
- ✦ ఆరేళ్ల వ్యవధిలో హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ తదితర సినిమాలు 21 వేల వరకు పైరసీ చేశాడు.
- ✦ తన వెబ్‌సైట్లలో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్రకటనలతో రూ.20 కోట్లు సంపాదించాడు. దేశవిదేశాలు తిరుగుతూ విలాస జీవితం ఆస్వాదిస్తున్నాడు.
- ✦ ఏపీ, మహారాష్ట్రల్లో ప్రహ్లాద్‌కుమార్ పేరుతో 2 డ్రైవింగ్ లైసెన్సులు తీసుకున్నాడు. అదే పేరుతో రూ.80 లక్షలు ఖర్చు చేసి కరేబియన్ దీవుల్లోని సెయింట్ కిట్స్ అండ్ నేవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు.
- ✦ తరచూ నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, యూఎస్‌ఏ, థాయ్‌లాండ్, ఫ్రాన్స్, దుబాయ్ తిరుగుతూ అక్కడి గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకునేవాడు.

పోలీసులకు అభినందనలు: చిరంజీవి

సినీ పరిశ్రమపై లక్షల మంది ఆధారపడి ఉన్నారు. ఇంతమంది కష్టాన్ని ఒకడు దౌర్జన్యంగా దోచుకుంటూ.. పోలీసులకే సవాల్ విసరడాన్ని తట్టుకోలేక పోయాం. గత సీపీ సీవీ ఆనంద్ చొరవతో కేసు నమోదు చేసి ముందుకు తీసుకెళ్లాం. ఆయన బదిలీ అయినా.. కొత్త సీపీ సజ్జనార్ చొరవ, అధికారుల సహకారంతో పైరసీదారుడిని పట్టుకున్నారు. సినీ పరిశ్రమ బాధను అర్థం చేసుకొని సహకరించిన పోలీసు అధికారులకు అభినందనలు.

మా కుటుంబంలోనూ డిజిటల్ అరెస్టు బాధితుడు: నాగార్జున

ఏడు నెలల క్రితం మా కుటుంబంలోని ఒకరు డిజిటల్ అరెస్టుతో రెండురోజులు నిర్బంధంలో ఉన్నారు. బలహీనతలను పట్టుకొని చాలా ఇబ్బందిపెట్టారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు నిందితులు తప్పించుకున్నారు. పైరసీ నిందితుడు రూ.20 కోట్ల కోసం ఇదంతా చేయలేదు. దీని వెనుక అంతర్జాతీయ రాకెట్ ఉంటుంది. సినిమా ఉచితమనేది ఒక ట్రాప్ మాత్రమే.

పోలీస్ యాక్షన్ సూపర్‌హిట్ సినిమా సీన్: రాజమౌళి

పట్టుకోండి చూద్దామంటూ పోలీసులకు సవాల్ విసిరిన నిందితుడిని పట్టుకోవటం సినిమాలో సూపర్‌హిట్ సీన్‌ను గుర్తుకు తెస్తోంది. విలన్ ఛాలెంజ్ చేస్తే 2నెలల తరువాత హీరో అతడిని కటకటాల వెనక వేసినట్టుంది. నిందితుడు పైరసీ సినిమాలను ఉచితంగా చూపుతూ సంఘసేవ చేయట్లేదు. దాని వెనుక దాగిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి.

పైరసీ వెబ్‌సైట్ల మూసివేత సినీ పరిశ్రమకు మేలు: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: ఐబొమ్మ, బప్పంల నిర్వాహకుడిని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు, సిటీ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్‌ను ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. ఎక్స్ వేదికగా సోమవారం ఆయన స్పందించారు. 'డబ్బు రూపంలోనే కాదు సృజనాత్మకతనూ పెట్టుబడిగా పెట్టి నిర్మించే సినిమాలను విడుదలైన రోజే ఇంటర్నెట్‌లో పోస్టు చేస్తున్న ముఠాల వల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శక, నిర్మాతలకు సాధ్యం కావడంలేదు. పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి అతనితోనే వాటిని మూసివేయించడం ఆహ్వానించదగ్గ పరిణామం' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఇది తెలుగు సినిమాకే కాదు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకూ మేలు చేస్తుందన్నారు. సజ్జనార్ కృషి ప్రశంసనీయమని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

డిజిటల్ అరెస్ట్ బెదిరింపులతో రూ.32.83 కోట్ల దోపిడీ!

- మహిళా టెకీ నుంచి కొల్లగొట్టిన మాయగాళ్లు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: 'డిజిటల్ అరెస్టు' అన్నదే లేదంటూ దేశ ప్రధాని నుంచి సాధారణ కానిస్టేబుల్ వరకు అంతా నెత్తీనోరు మొత్తుకుని చెబుతున్నా.. ఆ మోసాలకు అడ్డుకట్ట పడడం లేదు. అంతేకాదు ఉన్నత విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం వీటి బారిన పడుతున్నారు. రూ.కోట్లు పోగొట్టుకుంటున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ఓ సీనియర్ మహిళా ఐటీ ఉద్యోగిని 'డిజిటల్ అరెస్ట్'కు భయపడి ఏకంగా రూ.32 కోట్లు పోగొట్టుకున్న సంగతి ఆలస్యంగా వెలుగుచూసింది.

ఎలా చేశారంటే..

బెంగళూరులోని ఇందిరానగర్‌లో ఉండే ఉమారాణి (57) ఐటీ ఉద్యోగిని. 2024 సెప్టెంబరు 15న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి.. "నేను డీహెచ్‌ఎల్ కొరియర్ సంస్థ ప్రతినిధిని. మీ పేరుతో 3 క్రెడిట్ కార్డులు, 4 పాస్‌పోర్టులు, నిషేధిత ఎండీఎం డ్రగ్స్ ఉన్న పొట్లం ముంబయిలోని అంధేరీ కొరియర్ కేంద్రానికి వచ్చాయి' ' అని బెదిరించాడు. దీనిపై స్పందించిన ఆమె "నాకు వాటితో సంబంధం లేదు. నేనుండేది బెంగళూరులో" అని బదులిచ్చారు. అయినా ఆ వ్యక్తి మళ్లీ మాట్లాడుతూ "మీ ఫోన్ నంబరుతోనే ఈ పార్సిల్ లింక్ చేశారు. అది సైబర్ మోసం కావచ్చు. దానిపై సైబర్ క్రైమ్ సెల్‌కు ఫిర్యాదు చేయండి" అంటూ ఉచిత సలహా ఇచ్చారు. ఆ సూచనను ఆమె పట్టించుకోకుండా తనకేమీ సంబంధం లేదని మిన్నకుండిపోయారు. ఆ తర్వాత మరో వ్యక్తి ఫోన్ చేశాడు. తనను తాను సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. ' 'మీపై సీబీఐ నిఘా ఉంది. మీరు విదేశాల నుంచి ఏమేమి తెప్పించిందీ మాకు తెలుసు. మీపై కేసు దర్యాప్తులో ఉన్నందున ఈ విషయం స్థానిక పోలీసులకు, ఇతరులకు చెబితే మీ కుటుంబాన్ని మొత్తం ఇరికించి లోపలికి తోస్తాం" అని హెచ్చరించాడు. అప్పటికే కుమారుడి పెళ్లి పనుల్లో తీరికలేకుండా ఉన్న ఆమె ఒక్కసారిగా భయపడిపోయారు. ఆ పార్సిల్ ఏంటి? నాకెవరు పంపారు?' అంటూ ఆందోళనకు గురై విషయం వేరెవరికీ చెప్పకుండా కుమిలిపోయారు. మళ్లీ కొద్ది రోజులకు ఆమె ఫోన్ మోగింది. 'నేనే సీబీఐ అధికారి' అంటూ పాత వ్యక్తి గొంతు వినిపించింది. అనంతరం ఆ మోసగాడు వీడియోకాల్ చేశాడు. హంగూ ఆర్భాటాలు ప్రదర్శిస్తూ "మీరు విదేశాల నుంచి అనుమతిలేని డ్రగ్స్ తెప్పించారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తాం" అంటూ బెదిరించడంతో ఉమారాణి భయపడిపోయారు. "మా అధికారి రాహుల్ యాదవ్ మిమ్మల్ని, మీ చర్యల్ని గమనిస్తారు' ' అంటూ హెచ్చరించడంతో ఆమె స్పందించి.. "నేను వర్క్ ఫ్రంహోమ్ తరహాలో పనిచేస్తున్నా. ఇబ్బంది పెట్టకండి" అని వేడుకున్నారు. అనంతరం ఆ 'అధికారి' ఫోన్ చేసి.. "అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే మీకున్న ఆస్తులను రిజర్వు బ్యాంకుకు చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ముందు ప్రకటించాలి" అని ఆదేశించాడు. ఇదంతా నిజమేనని నమ్మిన బాధితురాలు.. ఆ మోసగాడు చెప్పినట్లే ఓ లింక్‌కు ఆస్తుల వివరాలన్నీ పంపారు. పూర్తిగా వారి వలలో చిక్కుకున్నారు. అక్కడి నుంచి నిందితులు డబ్బు గుంజడం ప్రారంభించారు. బాధితురాలు తన ఎఫ్‌డీ డబ్బులను మినహాయించి, పొదుపు ద్వారా, ఆస్తుల ద్వారా సమకూరిన ఆదాయం అంతా కలిపి రూ.32.83 కోట్లను దాదాపు 187 లావాదేవీల ద్వారా మోసగాళ్లకు బదిలీ చేశారు. ఈ డబ్బును 2025 ఫిబ్రవరి నాటికి ధ్రువీకరించి తిరిగి మీకే అప్పగిస్తామని మోసగాళ్లు ఆమెను నమ్మించారు. ఆ తర్వాత బాధితురాలికి క్లియరెన్స్ సర్టిఫికెట్ సైతం ఇచ్చారు. గడువు దాటిపోయినా తన డబ్బును తిరిగి ఇవ్వకపోవడంతో ఆమెకు అనుమానం వచ్చింది. మోసపోయినట్లు గ్రహించి.. ఈ నెల 14న బెంగళూరులోని తూర్పు డివిజన్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి వివాహం, భయం కారణాలతో ఫిర్యాదు చేయడంలో చాలా ఆలస్యమైందని వాపోయారు. బాధితురాలి నుంచి పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు సోమవారం దర్యాప్తు ప్రారంభించారు. ఏయే అంతర్జాల ఖాతాల నుంచి ఆమె సొమ్ము పోగొట్టుకున్నదీ విశ్లేషిస్తున్నారు. దుండగులు వాడిన ఫోన్ నంబర్లపై ఆరా తీస్తున్నారు.

భీమవరంలో రూ.78.60 లక్షలు..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'డిజిటల్ అరెస్టు'ను బూచిగా చూపిన కేటుగాళ్లు.. ఓ విశ్రాంత ఆచార్యుడి నుంచి సుమారు రూ.78 లక్షలు కొట్టేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన శర్మ ప్రస్తుతం బిల్డింగ్ వాల్యువర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు గత నెల 27న గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. సీబీఐ, ఐపీఎస్ ఉన్నతాధికారులమని.. మీ సిమ్‌లో తేడా ఉందని చెప్పారు. ఈ విషయం 'ఇంకెవరికీ చెప్పొద్దు.. మేం సరిచేస్తాం' అని నమ్మబలికారు. అనంతరం 'డిజిటల్ అరెస్టు' చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో భయపడిపోయిన శర్మ వారు చెప్పిన వివరాలన్నీ ఇచ్చేశారు. ఈ క్రమంలో ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించిన మోసగాళ్లు.. దాదాపు 13 రోజుల వ్యవధిలో శర్మ బ్యాంకు ఖాతాల నుంచి రూ.78.60 లక్షలు కాజేశారు. అనంతరం మోసపోయినట్లు గుర్తించిన శర్మ.. ఈ నెల 8న క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు సోమవారం భీమవరం రెండో పట్టణ పోలీసులకు చేరింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రెండో పట్టణ ఎస్సై రెహమాన్ తెలిపారు.

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ డిజిటల్ అరెస్ట్ కేసులో 8 మంది అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించిన 8 మంది నిందితులను హైదరాబాద్ నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న ఎమ్మెల్యేకు ఇటీవల మాయగాళ్లు వాట్సప్ కాల్ చేసి బెదిరించారు. మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా కేసుల్లో పెద్ద ఎత్తున నగదు ఆయన బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు గుర్తించామని భయపెట్టారు. డిజిటల్ అరెస్ట్ చేసినట్లు బెదిరించారు. బెయిల్ కోసం నగదు జమ చేయాలని, తిరిగి వాటిని బ్యాంకు ఖాతాలోకి రిఫండ్ చేస్తామంటూ రూ.1.07 కోట్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో నగర సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. డీసీపీ కవిత దార పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు బృందం దర్యాప్తు చేపట్టింది. ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల ఆధారంగా ఏపీ, హరియాణా, దిల్లీలోని ముఠాలకు సంబంధాలు ఉన్నట్టు గుర్తించారు. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హిమాన్షుసింగ్, రమేశ్‌కుమార్(వ్యాపారి), అభిషేక్ పాండే(ప్రైవేటు ఉద్యోగి), విజయవాడకు చెందిన కోట శ్రీసుదీప్, శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్లు ప్రశాంత్‌కుమార్, దీపక్, నీరజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అమరావతిపై పార్లమెంటులో చట్టం చేయాలి

- రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే పోరాటానికి కార్యాచరణ
- అమరావతి రాజధాని రైతు ఐకాస నేతల వెల్లడి



సమావేశంలో పాల్గొన్న ఐకాస నేతలు, మహిళా రైతులు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ పార్లమెంటులో తక్షణమే చట్టం చేయాలని, తదుపరి పార్లమెంటు సమావేశాల్లో రాజధాని బిల్లు ప్రవేశపెట్టేందుకు కృషి చేయాలని అమరావతి రాజధాని రైతు ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) నేతలు డిమాండ్ చేశారు. గుంటూరులో రాజధాని అమరావతి రైతు ఐకాస సమావేశం సోమవారం జరిగింది. రాజధానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలపై చర్చించారు. ఐకాస నేత జమ్ముల శ్యాంకిశోర్ మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా రైతుల సమస్యలు పరిష్కారం కాలేదు. వైకాపా విధ్వంసకర పాలనకు వ్యతిరేకంగా రైతులు పోరాడారు. ఈ ఏడాది ఆగస్టు 5న మంత్రి నారాయణను కలిసి సమస్యలు విన్నవించినా ఫలితం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని అంశాలపై సానుకూలంగా ఉన్నా కలవడానికి కుదరడం లేదు. సీఆర్‌డీఏ అధికారులు అసలు కలవడానికి, సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఇవ్వడంలేదు. సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజధాని అభివృద్ధితో పాటు రైతుల సమస్యలు పరిష్కరించడమూ అంతే ముఖ్యం. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెలాఖర్లో సమావేశమై పోరాటానికి కార్యాచరణ ఖరారు చేస్తాం" అని తెలిపారు. మహిళా రైతు వరలక్ష్మి మాట్లాడుతూ "చంద్రబాబును చూసి భూములిచ్చాం. సీఆర్‌డీఏ అధికారులు సమస్యలు చంద్రబాబుకే విన్నవించుకోవాలంటున్నారు. గ్రీవెన్స్‌లో అర్జీ ఇస్తే చెత్తబుట్టలో వేశారు. రాజధాని ఉద్యమంలో పెట్టిన కేసులు తొలగించలేదు. ల్యాండ్ పూలింగ్‌లో లేని భూముల్లో ప్లాట్లు ఇస్తే ఏం చేయాలి' అని ప్రశ్నించారు. "గత ప్రభుత్వ హయాంలో మూడు రాజధానుల కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ కేసుతో పాటు రాజధానిలో ఆర్-5 జోన్ కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. 11వ సంవత్సరం వార్షిక కౌలు మొత్తాలను వెంటనే జమ చేయాలి. రిటర్నబుల్ ప్లాట్లకు మార్కింగ్ చేసి హద్దు రాళ్లు వేయాలి" అని ఐకాస నేతలు డిమాండ్ చేశారు.

చరిత్రలో నిలిచిపోయేలా సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు

సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్



ఈనాడు, పుట్టపర్తి: సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని మీడియా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు, సేవా సంస్థలు, భక్తుల సమష్టి కృషితో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాబా శివైక్యం తర్వాత జరుగుతున్న అతిపెద్ద ఉత్సవాల్లో పాల్గొనాలని దేశ, విదేశాల నుంచి భక్తులు పుట్టపర్తికి తరలి వస్తున్నారన్నారు. రద్దీ మేరకు వసతి, భోజనం, దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆదేశాలిస్తున్నారన్నారు.

19న ప్రధాని నరేంద్రమోదీ రాక..

ఈ నెల 19న జరిగే మహిళా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారని, సత్యసాయిబాబాపై రూపొందించిన రూ.100 నాణేన్ని, తపాల బిళ్లను విడుదలచేస్తారని రత్నాకర్ తెలిపారు. 22న జరిగే కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విచ్చేస్తారని చెప్పారు. అదేరోజు సాయంత్రం జరిగే స్నాతకోత్సవానికి, 23న జరిగే జయంతి వేడుకలకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరవుతారని వివరించారు. సమావేశంలో సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే, సమన్వయకర్త కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లకు 10 మంది అధికారులు

శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 19న పుట్టపర్తి రానున్న నేపథ్యంలో ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రభుత్వం 10 మంది ఐఏఎస్, డిప్యూటీ కలెక్టర్లను నియమించింది. వీరు మంగళవారం అక్కడి అధికారులకు రిపోర్ట్ చేసి సహకరించాలని పేర్కొంటూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఇప్పటికీ నిజాలు దాచడానికి ప్రయత్నిస్తున్నారు

- పూర్తి ఓఎంఆర్ షీట్‌ను కోర్టుకు ఎందుకు సమర్పించలేదు?
- ఏపీపీఎస్సీ అధికారులపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఉద్యోగులు, అధికారులను హైకోర్టులో జరుగుతున్న అప్పీళ్ల విచారణలో జోక్యం చేసుకోకుండా దూరంగా ఉంచాలని ఏపీపీఎస్సీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఏపీపీఎస్సీ అధికారులు ఇప్పటికీ వాస్తవాలను దాచడానికి ప్రయత్నిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. గతంలో తామిచ్చిన ఆదేశాల మేరకు హైకోర్టు రిజిస్ట్రీ వద్ద సమర్పించిన జవాబుపత్రాలతో పాటు అభ్యర్థుల పేర్లు, సంతకం, ఇన్విజిలేటర్ల సంతకం తదితర వివరాలుండే ఓఎంఆర్ షీట్ పూర్తి భాగాన్ని ఎందుకు ఇవ్వలేదని తప్పు పట్టింది. తదుపరి విచారణ నాటికి వాటిని హైకోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. అభ్యర్థులు జవాబుపత్రాలకు జత చేసిన ఓఎంఆర్ షీట్‌పైనున్న బార్‌కోడ్‌లోని వివరాలు, మాన్యువల్ మూల్యాంకనం కోసం రెండోసారి ముద్రించిన బార్‌కోడ్‌లోని సమాచారం ఒకేలా ఉందా లేదా ఎలా నిర్ధారించారని ఏపీపీఎస్సీ అధికారులను ప్రశ్నించింది. దీనిపై సందేహాల నివృత్తికి నిపుణుల పేర్లను సూచించాలని ఇరువైపుల న్యాయవాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఉత్తర్వులిచ్చింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాల విషయంలో దాఖలైన అప్పీళ్లపై సోమవారం జరిగిన విచారణలో ఏపీపీఎస్సీ తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. మూల్యాంకనం కోసం సొమ్ము చెల్లించే విషయంలో జారీ చేసిన చెక్కుల జిరాక్స్ కాపీలను కోర్టు ముందు ఉంచామన్నారు. ఓఎంఆర్ షీట్ పూర్తి భాగాన్ని కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు.

22న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 22న (శనివారం) మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఏర్పడిన 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

బెంగళూరు నుంచి గుంటూరుకు మాదకద్రవ్యాలు

ఆరుగురి అరెస్టు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి గుంటూరుకు మాదకద్రవ్యాలను తీసుకొచ్చి విక్రయిస్తున్న నలుగురిని, కొనుగోలు చేస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం నిందితుల వివరాలను ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. ఆదివారం డీఎస్పీ అజీజ్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు విక్రయిస్తున్న ఆళ్ల అనిల్‌కుమార్, చింతల శ్రావణచంద్ర ప్రసాద్, షేక్ రోషన్, షేక్ నవీద్ సల్మాన్‌లతో పాటు కొనుగోలు చేయడానికి వచ్చిన డిగ్రీ విద్యార్థి గురుమహారాజు, మెడ రితీష్‌లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద 17 గ్రాముల ఎండీఎం (మెత్)ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బెంగళూరుకు చెందిన ఫరాజ్‌ఖాన్‌పై కేసు నమోదు చేశామని, అతన్ని అరెస్టు చేస్తామని తెలిపారు. చింతల శ్రావణచంద్ర ప్రసాద్, షేక్ రోషన్, షేక్ నవీద్ సల్మాన్‌లపై ఇప్పటికే కేసులు ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్ తిరస్కరించిన ఏసీబీ కోర్టు

ఈనాడు, తిరుపతి: తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితుడైన తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్‌ను నెల్లూరులోని ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి సరస్వతి సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 12న జరిగిన వాదనల సందర్భంగా ఏపీపీ జయశేఖర్ వాదిస్తూ.. "ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ నుంచి రూ.50 లక్షల లంచం తీసుకుని సరఫరా టెండరు దక్కేలా చిన్న అప్పన్న ప్రభావితం చేశారు. 2022 ఆగస్టులో నెయ్యి కల్తీ జరిగిందని మైసూరులోని ల్యాబ్ నివేదిక ఇచ్చినా.. అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అనంతరం ప్రీమియర్ అగ్రి ఫుడ్స్‌కు సరఫరా బాధ్యతలు కట్టబెట్టడంలో చిన్న అప్పన్న కీలకపాత్ర పోషించారు. సుబ్బారెడ్డిని ప్రభావితం చేసి టెండరును వారికి దక్కేలా చేశారు. కాంట్రాక్టు దక్కిన తర్వాత ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ నుంచి తిరుమలకు కల్తీ నెయ్యి ట్యాంకర్లలో వచ్చినా చిన్న అప్పన్న ఒత్తిడితో తితిదే అధికారులు అనుమతిచ్చారు. రెండు సార్లు విచారణకు పిలిచినా ఆయన సహకరించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయనకు బెయిల్ ఇస్తే కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తారు" అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ తరఫు న్యాయవాది యుగంధర్‌రెడ్డి వాదిస్తూ.. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో నిందితుడికి ఏమాత్రం సంబంధం లేదని, కేవలం వైవీ సుబ్బారెడ్డి పీఏగానే వ్యవహరించారని తెలిపారు. వీటన్నింటినీ పరిశీలించిన న్యాయమూర్తి తాజాగా చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్‌ను కొట్టేశారు.

వైజాగ్ 'స్టీల్'కు ధోకా లేదు: ఎమ్మెల్యే గంటా




విశాఖపట్నం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 'విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో వైకాపా రాజకీయం చేస్తోంది. భాగస్వామ్య సదస్సు విజయం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌కు ధోకా లేదు. దాని పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్లు ఇచ్చింది. కష్టకాలంలో కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు అందరూ సహకరించాలి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వైకాపా నాయకులకు రాళ్లు వేయడం అలవాటుగా మారింది' అని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. విశాఖపట్నంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు చరిత్ర సృష్టించిందని, గూగుల్ రాకతో రాష్ట్ర ముఖచిత్రం మారబోతోందన్నారు. జగన్ పాలనలో మంచి పరిశ్రమ ఒక్కటైనా కార్యకలాపాలను ప్రారంభించిందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని గంటా సవాలు విసిరారు. జగన్‌కు పారిశ్రామికవేత్తలంటే ఎలర్జీ అని విమర్శించారు.

EENADU Vol: 52, Issue: 98 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఆయాసమా? సీవోపీడీ కావొచ్చు!

తరచూ ఆయాసం వస్తోందా? ముఖ్యంగా శ్రమతో కూడిన పనులు చేసేటప్పుడు శ్వాస తీసుకోవటానికి ఇబ్బంది పడుతున్నారా? అయితే క్రానిక్ పల్మనరీ అబ్‌స్ట్రక్టివ్ డిజీజ్ (సీవోపీడీ) కావొచ్చు. దీన్ని ఆదిలోనే గుర్తిస్తే వెంటనే చికిత్స ఆరంభించొచ్చు. మందులతో నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే దీని లక్షణాలు ఆలస్యంగా మొదలవటం, వీటిని గుర్తించేసరికే ఊపిరితిత్తులు బాగా దెబ్బతిని ఉండటం దురదృష్టకరం. అందుకే సమస్యను తొలిదశలోనే గుర్తించటం ముఖ్యమని ప్రపంచ సీవోపీడీ దినం నొక్కిచెబుతోంది. 'ఆయాసమా? అయితే సీవోపీడీ కావొచ్చు' అని నినదిస్తోంది.



శరీరానికి అవసరమైన ఆక్సిజన్ శ్వాసతోనే లభిస్తుంది. మనం పీల్చుకున్న గాలి ముందు శ్వాసనాళం, గాలిగొట్టాల్లోకి.. అక్కడి నుంచి సూక్ష్మమైన గాలిగదుల్లోకి వెళ్తుంది. అప్పుడు గాలిలోని ఆక్సిజన్ రక్తంలోకి చేరుతుంది. అదే సమయంలో గాలిగదులు రక్తంలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, మనం విడిచిపెట్టే గాలి ద్వారా బయటకు పంపుతాయి. ఇంతటి కీలకమైన పనిని నిర్వహించే ఊపిరితిత్తులు దెబ్బతింటే ఇంకేమైనా ఉందా? ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ మార్పిడి ప్రక్రియే అస్తవ్యస్తమవుతుంది. సీవోపీడీలో జరిగేది ఇదే. దీనికి మూలం గాలిగొట్టాలు, గాలిగదులు దెబ్బతినటమే. మన ఊపిరితిత్తుల్లో కోట్లాది గాలిగదులుంటాయి. నిజానికి మనకు వీటిలో మూడో వంతే సరిపోతాయి. ఇది ఒకరకంగా వరం. మరోరకంగా శాపం. ఊపిరితిత్తులు బాగా దెబ్బతినేంతవరకూ ఇబ్బందులేమీ ఉండవు మరి. అప్పటివరకూ సీవోపీడీ నిశ్శబ్దంగా లోలోపల దాడి చేస్తూనే వస్తుంది. మనం గుర్తించేసరికే గాలిగదులు, గాలిగొట్టాలు కోలుకోలేనంతగా చెడిపోతాయి. సీవోపీడీ జబ్బు బాగా ముదిరేవరకూ మనం తెలుసుకోలేక పోవటానికి కారణమిదే. పరిస్థితి విషమిస్తే మరణించే ప్రమాదమూ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అతి ఎక్కువ మరణాలకు దారితీస్తున్న జబ్బుల్లో సీవోపీడీ నాలుగో స్థానంలో ఉండటమే దీనికి నిదర్శనం. నివారించుకునే అవకాశమున్నా, అదుపులో ఉంచే మందులున్నా దీని బలవనమేదీ నిజంగా విచారకరం. మనదేశంలో ప్రతి 10 మందిలో ఒకరు దీని బారినపడుతుండటం ఆందోళనకరం. మరో ముఖ్యమైన సంగతేంటంటే- దాదాపు సగం మందిలో జబ్బు గుర్తించకుండానే ఉంటోంది. వయసుతో పాటు దగ్గు మామూలేనని అనుకోవటం, దీర్ఘకాలం పొగతాగటం, ఇతర జబ్బులుగా పొరపడటం వంటివన్నీ దీనికి దారితీస్తున్నాయి. కాబట్టి దీనిపై అంతా అవగాహన కలిగుండటం తప్పనిసరి.



డా. ఎ.విజయ్‌కుమార్
పల్మనాలజిస్ట్
హైదరాబాద్ చెస్ట్ సెంటర్
ఇందిరాపార్క్ రోడ్
హైదరాబాద్

కారణాలేంటి?

పొగ తాగటం: అతిపెద్ద కారణం ఇదే. సీవోపీడీ బాధితుల్లో 95% మంది పొగతాగే వారే. ఒకప్పుడీ సమస్య 55-60 ఏళ్ల వారిలో కనిపిస్తుండేది. ఇప్పుడు 35-40 ఏళ్ల వారిలోనూ కనిపిస్తోంది. దీనికి కారణం చిన్నతనంలోనే పొగతాగటానికి అలవాటు పడటం. ఎంత ఎక్కువకాలంగా పొగ తాగితే అంత ఎక్కువ ముప్పు పొంచి ఉంటుంది. పొగాకులోని రసాయనాలు గాలిగొట్టాల్లో, గాలిగదుల్లో వాపుప్రక్రియను ప్రేరేపించి, అవి దెబ్బతినేలా చేస్తాయి. సిగరెట్లు, చుట్టలు, బీడీలు కాల్చేవారికే కాదు.. వారి పక్కన ఉండి ఆ పొగలను పీల్చినవారికీ ముప్పే. వెలుగుతున్న సిగరెట్ నుంచి వెలువడే పొగ మరింత ప్రమాదకరం. బీడీల్లో నాసిరకం పొగాకు వాడటం వల్ల హాని కారకాలు ఎక్కువగా ఉంటాయి. బీడీ ఆకు నుంచి వెలువడే పొగ కూడా ప్రమాదమే.

ఇంటి కాలుష్యం: కట్టెలు, బొగ్గులు, పిడకల పొయ్యిల నుంచి వెలువడే పొగ కూడా హానికరమే. ముఖ్యంగా ఇరుకిరుకు గదుల్లో ఇలాంటి పొయ్యిల మీద దీర్ఘకాలం వంట చేసే మహిళలకు ముప్పు ఎక్కువ.

బయటి కాలుష్యం: వాయు కాలుష్యం, రసాయన పొగలు, దుమ్ము, పంట వ్యర్థాలను కాల్చటం కూడా సీవోపీడీకి దారితీస్తున్నాయి.

జబ్బులు: ఆస్థమా, చిన్నప్పుడు తరచూ శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల బారినపడ్డవారికి, ఊపిరితిత్తులు సరిగా అభివృద్ధి చెందనివారికిది రావొచ్చు. ఇన్‌ఫెక్షన్లు, పెద్ద వయసు కూడా కారణం కావొచ్చు.

రెండు రకాలు

సీవోపీడీలో క్రానిక్ బ్రాంకైటిస్, ఎంఫెసీమా అని రెండు రకాలున్నాయి. చాలామందిలో రెండూ ఉంటాయి. కొందరికి మాత్రం ఏదో ఒకటే ఉండొచ్చు.

క్రానిక్ బ్రాంకైటిస్: ఇది గాలిగొట్టాల్లో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)తో తలెత్తుతుంది. పెద్దఎత్తున లోపలికి చొచ్చుకొచ్చే సిగరెట్టు పొగ వంటి వాటిని గాలిగొట్టాలు అంతగా ఎదుర్కోలేవు. దీంతో సున్నితమైన లోపలి పొర దెబ్బతింటుంది. మరోవైపు రోగనిరోధక వ్యవస్థ పొగను శత్రువుగా భావించి ఎదురుదాడి చేస్తుంది. దీంతో వాపు ప్రక్రియ తలెత్తి.. గాలిగొట్టాలు ఉబ్బి, లోపలి మార్గం సన్నబడుతుంది. కళ్లె ఉత్పత్తీ పెరుగుతుంది. దీంతో శ్వాస తీసుకోవటం కష్టమవుతుంది.

ఎంఫెసీమా: ఇందులో గాలిగొట్టాలతో పాటు గాలిగదులూ దెబ్బతింటాయి. కొన్ని గదులు చిట్లిపోవచ్చు. కొందరికి రెండు మూడు గదులు కలిసిపోవచ్చు. దీంతో లోపలికి వెళ్లిన గాలి బయటకు రాలేక చిక్కుకుపోతుంది. అప్పుడు ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ మార్పిడి ప్రక్రియ అస్తవ్యస్తమవుతుంది.

జాగ్రత్తలు తప్పనిసరి

● వ్యాయామం ఆపొద్దు. ఆయాసం వస్తుందని ఎప్పుడూ కూర్చోవటం తగదు. రోజుకు కనీసం 40 నిమిషాల సేపు నడవాలి. ఆయాసం వచ్చినప్పుడు కాసేపు కూర్చొని, తిరిగి నడవాలి. ● దగ్గు, ఆయాసం మూలంగా సరిగా తినకపోవటం వల్ల పోషణ లోపం తలెత్తొచ్చు. కాబట్టి ఆహారంలో తగినన్ని పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా ప్రొటీన్ ఎక్కువ తీసుకోవాలి. సాధారణంగా 60 కిలోల బరువున్నవారికి 60 గ్రాముల ప్రొటీన్ అవసరం. సీవోపీడీ గలవారికైతే 90-120 గ్రాములు కావాలి. శాకాహారులు సోయా, వేరుశనగ, బాదం, పప్పులు, పాలు తీసుకోవచ్చు. మాంసాహారులైతే గుడ్లు తినొచ్చు. ● న్యుమోనియా, ఫ్లూ టీకాలు విధిగా తీసుకోవాలి.

ఇలా నిర్ధారణ

సీవోపీడీని కచ్చితంగా నిర్ధారించటం చాలా ముఖ్యం. అప్పుడే సరైన చికిత్స సాధ్యమవుతుంది. సమస్యను గుర్తించకుండా దగ్గు, ఆయాసం తగ్గటానికి ఏవేవో మందులు తీసుకుంటుంటే సీవోపీడీ లోలోపలే ముదురుతూ వస్తుందని గుర్తించాలి. లక్షణాలు, తీరుతెన్నులను బట్టి దీన్ని అనుమానిస్తారు. కొన్ని ప్రశ్నల సాయంతో (మాడిఫైడ్ ఎంఎంసీ స్కోరింగ్ పద్ధతి) తీవ్రతను అంచనా వేస్తారు. స్పైరోమెట్రీ ద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ఇందులో శ్వాసను గట్టిగా తీసుకొని ఒక గొట్టంలాంటి పరికరంలోకి గాలిని బలంగా ఊదిస్తారు. సాధారణంగా గాలిని ఊదినప్పుడు మొదటి క్షణంలోనే 80-90% బయటకు వస్తుంది. అదే సీవోపీడీలో 70% కన్నా తక్కువగా బయటకు వస్తుంది. సీవోపీడీనా? ఆస్థమానా? అన్నది తెలుసుకోవటానికీ స్పైరోమెట్రీ ఉపయోగపడుతుంది. ఆస్థమాలో తొలి క్షణంలో గాలి బయటకు బాగా వస్తుంది గానీ సీవోపీడీలో అంతగా రాదు.

● క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్లలోనూ దగ్గు, కళ్లె పడటం వంటివి ఉంటాయి. అందువల్ల ఇలాంటి సమస్యలేవైనా ఉన్నాయేమో తెలుసుకోవటానికి ఎక్స్‌రే, రక్త, కళ్లె పరీక్షలూ చేయాల్సి ఉంటుంది.

దగ్గే ప్రధాన లక్షణం

సీవోపీడీ లక్షణాలు చాలావరకూ ఆలస్యంగా బయటపడుతుంటాయి. వీటిల్లో ప్రధానమైంది ఎడతెరపి లేని దగ్గు. ఇది ముఖ్యంగా ఉదయం పూట ఎక్కువగా ఉంటుంది. దగ్గుతో పాటు కళ్లె కూడా పడుతుంది. మూడు నెలలు దాటినా దగ్గు తగ్గకపోతే సీవోపీడీని అనుమానించాలి.
● రానురానూ ఆయాసం మొదలవుతుంది. మొదట్లో వేగంగా నడవటం వంటి కాస్త కష్టమైన పనులు చేసినప్పుడు ఆయాసం కలుగుతుంది. ఆ తర్వాత మెట్లు ఎక్కటం వంటి అలవాటులేని పనులు చేసినప్పుడు శ్వాస కష్టంగా అనిపిస్తుంది. అనంతరం చిన్న చిన్న పనులు, రోజువారీ పనులు (స్నానం, తల దువ్వుకోవటం వంటివి) చేస్తున్నా ఆయాసం వేధిస్తుంది. చివరికి కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడూ ఆయాసం రావొచ్చు.

చికిత్స- కౌన్సెలింగ్, మందులు

ఇప్పుడు సీవోపీడీకి మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటి కన్నా ముందు కౌన్సెలింగ్ చాలా అవసరం. పొగ అలవాటు పూర్తిగా మానెయ్యటం అన్నింటికన్నా ముఖ్యం. ఇందుకు కౌన్సెలింగ్ ఉపయోగపడుతుంది. రోజుకు ఎన్ని సిగరెట్లు తాగుతున్నారు? ఆర్థిక స్థితులేంటి? అనే దాన్ని బట్టి కౌన్సెలింగ్ ఇస్తారు.

● సీవోపీడీలో ఒకసారి గాలిగొట్టాలు, గాలిగదులు దెబ్బతింటే తిరిగి మామూలు స్థితికి రావు. అయినా కూడా మందులతో లక్షణాల నుంచి మంచి ఉపశమనం లభిస్తుంది. గాలిగొట్టాలు విప్పారేలా చేసే బ్రాంకోడైలేటర్లు, కళ్లె ఉత్పత్తిని తగ్గించే మస్కరినిక్ యాంటగోనిస్ట్స్, వాపును తగ్గించే మందులు మేలు చేస్తాయి. వీటిని ఇన్‌హేలర్ల రూపంలో రోజుకు ఒకసారి తీసుకుంటే చాలు. 24 గంటలూ పనిచేస్తాయి.

● రక్తంలో ఆక్సిజన్ తగ్గితే ముక్కు ద్వారా ఆక్సిజన్ పీల్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇంట్లో వాడుకోవటానికి, తేలికగా వెంట తీసుకెళ్లగలిగే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ● సీవోపీడీ గలవారికి కుంగుబాటు, ఆందోళన వంటి మానసిక సమస్యల ముప్పూ ఎక్కువే. ఇలాంటివి గలవారు తగు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

ఆ తాపత్రయంతోనే కోనార్ ఎంఎఫ్!

అనుభవ పాఠం

అది 2011. సుమారు ఐదు కిలోల బరువున్న ఆరు నెలల పసికందును ఆసుపత్రికి తీసుకొచ్చారు. తీవ్ర గుండె వైఫల్యం, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ ఉన్నాయి. పరీక్షల అనంతరం గుండె గోడలో పలుచోట్ల రంధ్రాలున్నట్టు తేలింది. మంచి చికిత్స చేసినా ఇన్‌ఫెక్షన్, ఆయాసంతో పరిస్థితి విషమించింది. కృత్రిమ శ్వాస అవసరమైంది. శస్త్రచికిత్స చేయలేని పరిస్థితి. మామూలుగానైతే ట్రాన్స్‌కాథెటర్ పద్ధతితో ఆర్టీరియోవీనస్ లూప్ ఏర్పాటు చేసి గుండె రంధ్రాలు మూసేయాల్సి ఉంటుంది. అయితే ఇది సంక్లిష్టమైన ప్రక్రియ. సమయమూ ఎక్కువ పడుతుంది. ముఖ్యంగా శిశువులకిది ముప్పు కలిగించొచ్చు. బిడ్డ పరిస్థితి నాజూకుగా ఉండటం వల్ల తేలికైన, సురక్షితమైన విధానంతో రంధ్రం మూసేస్తే బాగుంటుంది కదా అన్న ఆలోచన మెదిలింది. ఇదే మొత్తం చికిత్స గతిని మార్చేసింది.

ఆ శిశువుకు రెట్రోగ్రేడ్, వైర్-ఓన్లీ విధానంతో గుండె రంధ్రాలను మూసేయాలని నిర్ణయించాం. ముందుగా ఐదు చిన్న ఫ్రెంచ్ ఆర్టీరియల్ షీత్స్, హైడ్రోఫోలిక్ గైడ్ తీగ సాయంతో గుండె రంధ్రాల ఆవలికి చేరుకున్నాం. అనంతరం ఆంప్లాట్జర్ డక్ట్ ఆక్లూడర్ II పరికరంతో గుండె కుడి ధమని ద్వారా పెద్ద రంధ్రాలను మూసేశాం. సాధారణంగా ఈ పరికరంతో రెండు రక్తనాళాలు కలిసిన భాగాన్ని (పీడీఏ) మూసివేస్తుంటారు. కానీ దీన్ని మేం గుండె గదుల మధ్య రంధ్రాన్ని పూడ్చటానికి ఉపయోగించుకున్నాం. అదృష్టం కొద్దీ అది ఫలించింది. శిశువు క్రమంగా కోలుకుంది. కొద్దిరోజుల్లోనే ఆరోగ్యం పుంజుకుంది. మిగిలిన చిన్న రంధ్రాలన్నీ వాటంతటవే పూడుకున్నాయి. బిడ్డ ఎదుగుదల సక్రమంగా సాగింది.



ఈ అనుభవమే కొత్త పరికరం ఆవిష్కరణకు దారితీసింది. అదే కోనార్ ఎంఎఫ్ (కోనార్ ఎంఎఫ్ అక్లూడర్). ఓ చిన్నారి అవసరం, బిడ్డను కాపాడాలనే తాపత్రయమే దీనికి మూలం. చిట్టి గుండెల చికిత్సలో ఇది విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన మా తొలి అనుభవాలు అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి. సంప్రదాయ పద్ధతులకు ప్రత్యామ్నాయంగా ఇప్పుడు దీన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. గుండె రంధ్రాలను పూడ్చటానికి రూపొందించిన ఈ రెట్రోగ్రేడ్ విధానానికి అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ 2012లో ఉత్తమ ఆవిష్కరణ పురస్కారాన్ని ప్రదానం చేసింది. దీనికి భారత్, అమెరికా, దక్షిణ కొరియా, వియత్నాం, ఫిలిప్పీన్స్, యూరేషియన్ ప్రాంతాలతో పాటు ఎన్నో అంతర్జాతీయ పేటెంట్లు లభించాయి. గుండె రంధ్రాలను పూడ్చటానికి ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఎంతోమంది దీన్ని అనుసరిస్తున్నారు. దీనికి అనుగుణంగానే పరికరాన్ని రూపొందిస్తూ, మెరుగుపరుస్తూ వచ్చాం. ఇప్పుడు ఐదో తరం పరికరం అందుబాటులో ఉంది. నిజానికి దీన్ని మొదట్లో మల్టీ ఫంక్షనల్ అక్లూడర్ అనే పిలిచేవాళ్లం. యూరోపియన్ కన్ఫామిటీ (సీఈ) ప్రామాణిక చిహ్నాన్ని కేటాయించేటప్పుడు నా పేరు స్ఫురించేలా కోనార్ ఎంఎఫ్ అని నామకరణం చేసింది. దీంతో యూరప్ మొత్తం ఈ పరికరాన్ని వాడుకోవటానికి అనుమతి లభించినట్టయ్యింది. ఇప్పుడు ఆసియా, యూరప్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు దీన్ని వాడుతున్నారు.

ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే- దీనంతటికీ మూలం ఒక శిశువు విషమ పరిస్థితే అని నాకు తోస్తోంది. బిడ్డను బతికించాలని పడ్డ తాపత్రయమే ప్రపంచస్థాయి ఆవిష్కరణకు దారితీసింది.



లక్షలాది పిల్లల ప్రాణాలను రక్షించటానికిది తోడ్పడుతోంది. డాక్టర్ ఆలోచనే కాదు, వైద్య విజ్ఞానరంగం తీరునూ ఒకే ఒక్క రోగి మార్చగలడని ఈ అనుభవం నాకు తరచూ గుర్తుచేస్తుంటుంది.

- డా॥ కోనేటి నాగేశ్వరరావు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్

వృద్ధాప్యానికి ఔషధ కళ్లెం!

వృద్ధాప్య ఛాయలు త్వరగా ముంచుకురాకుండా చూడటానికి వ్యాయామం ఎంతగానో తోడ్పడుతుంది. మరి వ్యాయామం చేయలేనివారి పరిస్థితేంటి? ఓ మామూలు ఔషధ మూలకంతో వ్యాయామ ఫలితాలను పొందగలిగితే? చైనా పరిశోధకులు అలాంటి ఘనతే సాధించారు. శరీరమంతటా వృద్ధాప్యాన్ని అడ్డుకునే ప్రభావాలను వ్యాయామం ఎలా పుట్టిస్తుందో గుర్తించటమే కాదు, వాటిని అనుకరించగల మూలకాన్నీ కనుగొన్నారు. ఈ అధ్యయనంలో భాగంగా- విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, తీవ్ర వ్యాయామం చేస్తున్నప్పుడు ఒంట్లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా విశ్లేషించారు. ఇందులో కిడ్నీలు అదృశ్య కేంద్రంగా పనిచేస్తూ బిటేన్ అనే జీవక్రియ ద్రవ్యాన్ని శరీమంతటికీ సరఫరా చేస్తున్నట్టు తేలింది. ఒంట్లో సమతుల్యతను పునరుద్ధరించటానికి, రోగనిరోధక కణాలను ఉత్తేజితం చేయటానికి, వాపు ప్రక్రియను అదుపు చేయటానికి బీటేన్ తోడ్పడుతుండటం గమనార్హం. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే- దీర్ఘకాల వ్యాయామ ప్రయోజనాల్లో చాలావాటిని బీటేన్ ఒక్కటే సాధిస్తుండటం.



బీట్‌రూట్, పాలకూర వంటి వాటిల్లో బీటేన్ ఉంటుంది. శరీరమూ దీన్ని సొంతంగా తయారుచేసుకుంటుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నప్పుడు కిడ్నీలు దీన్ని పెద్దమొత్తంలో విడుదల చేసి, శరీరమంతటికీ వృద్ధాప్యాన్ని అడ్డుకునే సూచనలను పంపిస్తుండటం గమనార్హం. అందుకే దీన్ని ఎలుకలకు మందు రూపంలో ఇచ్చి పరిశీలించగా.. వ్యాయామంతో సమానమైన ఫలితాలు కనిపించటం విశేషం. వాపుప్రక్రియ తగ్గింది. జీవక్రియ, విషయగ్రహణ సామర్థ్యం ఇనుమడించాయి. బీటేన్ సురక్షితమైంది, సమర్థవంతమైంది కావటం వల్ల వ్యాయామం చేయలేనివారికిది ఉపయోగపడగలదని పరిశోధకులు చెబుతున్నారు.

కాఫీతో సాఫీగా



ఉదయం లేస్తూనే కాఫీ నోట్లో పడితే గానీ చాలామందికి రోజు గడవదు. కొందరు మల విసర్జన కోసమూ దీన్ని ఆశ్రయిస్తుంటారు. కాఫీ అలవాటు గల ప్రతి ముగ్గురిలో ఒకరు వేడి వేడి కాఫీ తాగిన తర్వాత మల విసర్జన అవుతుందని చెబుతుంటారు కూడా. దీనికి కాఫీలోని ఆమ్లాలే కారణమని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ ఆమ్లాలు హార్మోన్ల ఉత్పత్తిని.. ముఖ్యంగా గ్యాస్ట్రిన్, కోలెసిస్టొకినిన్ అనే హార్మోన్ల విడుదలను ప్రేరేపిస్తాయి. ఇవి జీర్ణకోశంలోని అసంకల్పిత కండరాలు సంకోచించేలా చేయటం ద్వారా పేగులు కదిలేలా చేస్తాయి. దీంతో మల విసర్జన ప్రక్రియ పుంజుకుంటుంది. అయితే పరగడుపున కాఫీ తాగితే పేగులు వేగంగా కదులుతాయా? లేదా? అన్నది మాత్రం కచ్చితంగా తెలియదు. కానీ కెఫీన్‌తో కూడిన కాఫీ సైతం ఆహారం మాదిరిగానే పేగులు కదలటానికి తోడ్పడుతున్నట్టు, నీరు కన్నా 60% బలంగా ప్రభావం చూపుతున్నట్టు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

గొంతుకు తేనె హాయి

గొంతు నొప్పి, గరగరతో బాధపడుతున్నారా? అయితే తేనె తాగి చూడండి. గొంతు సమస్యల కోసం ప్రాచీనకాలం నుంచీ చిట్కా వైద్యంగా దీన్ని వాడుతూ వస్తున్నారు. ఇదెలా పనిచేస్తుందో శాస్త్రీయంగానూ రుజువైంది కూడా.

తేనెలో సహజ చక్కెర ఉంటుంది. ఇది నోటిని తీపి చేయటమే కాకుండా గొంతునొప్పి, జలుబు, ఫ్లూ లక్షణాలు తగ్గటానికి తోడ్పడుతుండటం ఆశ్చర్యకరం. దీనికి కారణం తేనెటీగలు పువ్వుల నుంచి సేకరించిన మకరందమే. ఇందులో చక్కెర మాత్రమే కాదు.. తక్కువ మోతాదులో ఎంజైమ్‌లు, విటమిన్లు, ఖనిజ లవణాల వంటివీ ఉంటాయి. తేనెను తీసుకున్నప్పుడు ఇవీ ఒంట్లోకి చేరతాయి. ఇదెలా పనిచేస్తుందంటే..

● **వాపు తగ్గుముఖం:** తేనెలో రుచికారకాలు (ఫ్లేవనాయిడ్లు) ఉంటాయి. ఇవి ఒకరకం వృక్ష రసాయనాలు. వీటిల్లో వాపును తగ్గించే గుణాలుంటాయి. అందువల్ల గొంతునొప్పి ఉన్నప్పుడు కొద్దిగా తేనె తీసుకుంటే వాపు తగ్గి, కాస్త ఉపశమనం కలుగుతుంది.

● **సూక్ష్మక్రిములతో పోరాటం:** తేనెలోని ఫ్లేవనాయిడ్లకు బ్యాక్టీరియా, వైరస్ భరతం పట్టే గుణమూ ఉంది. ఇవి రోగనిరోధకశక్తికి దన్నుగా నిలిచి హానికారకాలతో పోరాడటానికి తోడ్పడతాయి. అలాగని ఇది మందులకు ప్రత్యామ్నాయం కాదు. గొంతునొప్పి మరీ ఎక్కువగా వేధిస్తుంటే తగు చికిత్స తీసుకోవాల్సిందే.



● **గొంతు సాఫీగా:** తేనె చిక్కగా, జిగురుగా ఉంటుంది. ఇది గొంతు లోపలి పొర మీద పూతలా పరచుకొని రక్షణగా నిలుస్తుంది. ఫలితంగా చిరాకు, గరగర తగ్గుతాయి. తేలికగా మింగటానికి తోడ్పడుతుంది.

● **దగ్గు నుంచి ఉపశమనం:** గొంతుకు హాయినిచ్చే గుణాలు దగ్గు తగ్గటానికీ సాయం చేస్తాయి. దుకాణాల్లో అమ్మే దగ్గు మందుల కన్నా తేనె మరింత ఎక్కువ సమర్థంగా పనిచేస్తున్నట్టు.. ముఖ్యంగా రాత్రిపూట వేధించే దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి.

ఎలా తీసుకోవాలి?

● ఒకట్రెండు చెంచాల తేనె నేరుగా తీసుకోవచ్చు.
● గోరువెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి అయినా తీసుకోవచ్చు.
● గ్రీన్ టీ, పుదీనా టీ వంటి వాటిల్లోనైనా కలిపి తాగొచ్చు.

మనోవైకల్య జన్యువు!

మనోవైకల్యం (స్కిజోఫ్రినియా), ఆందోళన (యాంగ్జయిటీ), కుంగుబాటు (డిప్రెషన్) వంటి మానసిక సమస్యలకు రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయని భావిస్తుంటారు. కొందరికి జన్యుపరంగానూ రావొచ్చు. దీని విషయంలో జర్మనీ పరిశోధకులు ముందడుగు వేశారు. జీఆర్ఐఎన్2ఏ అనే జన్యువులో తలెత్తే మార్పులు మనోవైకల్యానికి కారణమవుతున్నట్టు గుర్తించారు. ఈ జన్యువు లోపం గల 121 మందిని విశ్లేషించి తాజా విషయాన్ని కనుగొన్నారు. జన్యు మార్పుల తీరును బట్టి ఇది ఒక్క మనోవైకల్యానికే కాదు, ఇతరత్రా మానసిక సమస్యలకూ కారణమవుతోందని పరిశోధకులు చెబుతున్నారు. జీఆర్ఐఎన్2ఏ మార్పులు గలవారిలో చిన్నప్పుడే ఇలాంటి మానసిక సమస్యలు తలెత్తుతున్నాయనీ వివరిస్తున్నారు. నాడీ కణాల విద్యుత్ ప్రచోదనాల విషయంలో ఈ జన్యువు కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో మార్పులు తలెత్తితే మెదడు సంకేతాల్లో పాలు పంచుకునే ఎన్ఎండీఏ అనే గ్రాహకం పనితీరు మందగిస్తున్నట్టు తేలింది. మరి ఈ గ్రాహకాన్ని ప్రేరేపిస్తే ఫలితముంటుందా? పరిశోధకులు అదీ పరిశీలించారు. ఎల్-సెరైన్ మందుతో ఎన్ఎండీఏను ప్రేరేపించగా మానసిక లక్షణాలు తగ్గుముఖం పడుతుండటం విశేషం. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం- ప్రతి ఏడుగురిలో దాదాపు ఒకరు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటిల్లో ఆందోళన సమస్యలు, కుంగుబాటు ముందు వరుసలో ఉంటున్నాయి. వీటికి రకరకాల అంశాలు దోహదం చేసే అవకాశమున్నా జన్యువుల పాత్రే ఎక్కువ. అందువల్ల మానసిక సమస్యలను త్వరగా నిర్ధారించి, చికిత్స చేయటానికి తాజా అధ్యయన ఫలితాలు తోడ్పడగలవని ఆశిస్తున్నారు.



డిస్కు ఎందుకు జారుతుంది?

వెన్నెముక డిస్కు జారిందని, నడుం నొప్పితో బాధపడుతున్నామని చాలామంది చెబుతుంటారు. ఇంతకీ డిస్కు అంటే ఏంటి? ఇదెందుకు జారుతుంది?

మన వెన్నెముకలో పూసల మధ్య మందంగా, దృఢంగా రబ్బరులాంటి భాగాలుంటాయి. వీటినే డిస్కులు అంటారు. వంగటం, పక్కలకు తిరగటం వంటివి చేసినప్పుడు వెన్నుపూసలు మృదువుగా కదలటానికి తోడ్పడేవి ఇవే. వీటి మధ్యభాగంలో చిక్కటి ద్రవం, చుట్టూ గట్టి పీచులాంటి పదార్థం ఉంటాయి. ఇవి క్షీణించినా, దెబ్బతిన్నా వెలుపలి భాగం బలహీనమై చిట్లిపోవచ్చు. లోపలున్న పదార్థాలు తోసుకురావొచ్చు, లీక్ కావొచ్చు. దీన్నే డిస్కు జారటం, ఉబ్బటం, చిట్లటం, ముందుకు పొడుచుకురావటం అంటుంటారు. ఇది వెన్ను మధ్యలో ఉండే నాడులను నొక్కటం వల్ల నడుం నొప్పి తలెత్తుతుంది. కాళ్లలోకి నొప్పి పాకుతున్నట్టుగానూ (సయాటికా) అనిపించొచ్చు. ఏ నాడి ప్రభావితమైందనే దాన్ని బట్టి మొద్దుబారటం, పొడుస్తున్నట్టు అనిపించటం, కండరం బలహీనం కావటం వంటివీ ఉంటాయి. కొందరికి నొప్పి స్వల్పంగానే ఉంటే, మరికొందరికి చాలా తీవ్రంగా వేధించొచ్చు.



రెండూ కలిసి

డిస్కు జారటానికి కారణమేంటి? ఇది కేవలం వయసుతో వచ్చే మార్పేనా? శరీర భంగిమ అస్తవ్యస్తం కావటం దోహదం చేస్తుందా? చాలావరకూ రెండూ కారణమవుతుంటాయి. వయసు మీద పడుతున్నకొద్దీ వెన్నెముక మృదువుగా కదిలే గుణం తగ్గుతూ వస్తుంది. పొడిబారుతూ వస్తుంది. దీంతో చిన్నపాటి పనులకే గాయాలు కావొచ్చు. తరచూ బరువులెత్తటం, నడుం పక్కలకు తిప్పటం, ఎక్కువసేపు కూర్చోవటం వల్ల డిస్కు దెబ్బతినే ముప్పు పెరుగుతుంది. బరువైన మూటలు ఎత్తటం, అదేపనిగా డ్రైవింగ్ చేయటం వంటి పనులూ ఎక్కువ భారం పడేలా చేస్తాయి. జన్యువులు, ఆయా వ్యక్తుల శరీర తత్వమూ కారణం కావొచ్చు. మొత్తమ్మీద వయసుతో క్షీణించటం, భంగిమ దెబ్బతినటం రెండూ కలిసి డిస్కు జారిపోయేలా చేస్తుంటాయి.

నివారించుకోవటమెలా?

క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, బరువులు సక్రమంగా ఎత్తటం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లతో డిస్కు జారిపోకుండా చూసుకోవచ్చు.

● నడక, ఈత, పరుగు వంటి వ్యాయామాలు వెన్నెముక మృదువుగా కదలటానికి, బలంగా ఉండటానికి తోడ్పడతాయి. ● అడ్డదిడ్డంగా బరువులు ఎత్తొద్దు. అదిరినట్టుగా పక్కలకు తిరగొద్దు. ఎలాపడితే అలా జారగిల్లొద్దు. ఏ పనిచేస్తున్నా శరీర భంగిమ సరిగా ఉంచుకోవటానికి ప్రయత్నించాలి. ● ఎక్కువసేపు కూర్చొని పనులు చేసేవారు మధ్యమధ్యలో కుర్చీలోంచి లేచి, కాసేపు అటూఇటూ నడవాలి. ● బరువు అదుపులో ఉంచుకుంటే డిస్కుల మీద భారం పడకుండా చూసుకోవచ్చు. ● సిగరెట్లు కాల్చొద్దు. అలవాటుంటే మానెయ్యాలి. ఎందుకంటే పొగలోని నికొటిన్ డిస్కు కణజాలాన్ని బలహీనం చేస్తుంది.

జీవనశైలి, చిట్కాలతో ఉపశమనం

డిస్కు జారిందనగానే సర్జరీ తప్పదని చాలామంది భావిస్తుంటారు. ఇది నిజం కాదు. నూటికి 90 మందికి తగినంత విశ్రాంతి, మందులు, ఫిజియోథెరపీ వ్యాయామాలతోనే మంచి ఫలితం కనిపిస్తుంది.

● నొప్పి ఉన్నప్పుడు కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవటం మంచిది. వేడి కాపు, ఐస్ అద్దటం.. నెమ్మదిగా సాగదీయటం ఉపయోగపడతాయి.
● పూర్తిగా మంచానికే అతుక్కుపోవాల్సిన పనిలేదు. నడుం మీద ఎక్కువ భారం పడకుండా తేలికపాటి వ్యాయామాలు.. నడక, ఈత వంటివి చేయాలి. ● డాక్టర్ల సలహా మేరకు నొప్పిని తగ్గించే మందులు వేసుకోవచ్చు. ● నొప్పి కాస్త తగ్గిన తర్వాత ఫిజియోథెరపిస్టును సంప్రదించి ప్రత్యేక వ్యాయామాలు చేయాలి. ● శరీర భంగిమ సరిగా ఉండేలా చూసుకోవటం, వెన్నుకు దన్నుగా ఉండే కుర్చీలు వాడుకోవటం వంటివి నొప్పి నుంచి త్వరగా కోలుకోవటానికి తోడ్పడతాయి.

డాక్టర్ వద్దకు ఎప్పుడు?

రెండు, మూడు వారాలు దాటినా నొప్పి తగ్గకపోతే.. నొప్పి మాత్రలతో ఉపశమనం కలగకపోతే.. రోజువారీ పనులు చేసుకోలేనంతగా నొప్పి వేధిస్తుంటే తాత్సారం చేయరాదు. డాక్టర్‌ను సంప్రదించి, చికిత్స తీసుకోవాలి. జననాంగాల వద్ద మొద్దుబారటం, మల, మూత్ర విసర్జన మీద పట్టుకోల్పోవటం, క్రమంగా బలహీనత ఎక్కువ కావటం, సరిగా నడవలేకపోవటం వంటి తీవ్ర లక్షణాలు కనిపిస్తే అసలే నిర్లక్ష్యం చేయొద్దు. త్వరగా చికిత్స తీసుకుంటే దీర్ఘకాల దుష్ప్రభావాలను తప్పించుకోవచ్చు.

రైతు బిడ్డ.. బిలియనీర్ అయ్యాడు



లలిత్ కేశ్రే

- గ్రో షేర్ల ర్యాలీ నేపథ్యం
- రూ.లక్ష కోట్లు మించిన సంస్థ మార్కెట్ విలువ

ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ కంపెనీ గ్రో మాతృసంస్థ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ షేర్లు భారీ స్థాయిలో దూసుకెళ్తూ, ఐపీఓలో వీటిని పొందిన మదుపర్లలో ఆనందాన్ని నింపుతున్నాయి. అంతే కాదు.. స్టాక్ మార్కెట్లో మరో బిలియనీర్ ఆవిష్కరణకూ ఇవి కారణమయ్యాయి. గ్రో మార్కెట్ విలువ కూడా రూ.లక్ష కోట్లను అధిగమించింది.

సోమవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లో గ్రో షేరు 20% అప్పర్ సర్క్యూట్‌తో రూ.178.23 వద్ద ముగిసింది. ఈ ప్రకారం సంస్థ మార్కెట్ విలువ రూ.1.10 లక్షల కోట్లకు పెరిగింది. ఈ కంపెనీలో 55.91 కోట్ల షేర్లు కలిగిన, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కేశ్రే సంపద విలువ రూ.9,960 కోట్లకు చేరింది. డాలర్లలో చెప్పాలంటే 1.12 బిలియన్ డాలర్లు (ఒక్కో డాలరు రూ.88.61)గా ఉంది. ఫలితంగా సరికొత్త బిలియనీర్‌గా లలిత్ మారారు.

4 రోజుల్లో 78% లాభం: ఈనెల 4 నుంచి 7 వరకు జరిగిన ఐపీఓలో రూ.100 ధర చొప్పున షేర్లను, గ్రో కంపెనీ మదుపర్లకు కేటాయించింది. ఈ షేర్లు 12న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ అవ్వగా, 17వ తేదీ కల్లా రూ.178.23కు చేరాయి. 4 ట్రేడింగ్ రోజుల్లోనే ఈ షేర్లు పొందిన వారికి 78% ప్రతిఫలం లభించింది. సంస్థ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లను అధిగమించింది. స్టాక్‌మార్కెట్లో నమోదైన 5,000కు పైగా కంపెనీల్లో, 100కు పైగా కంపెనీలు మాత్రమే ఈ స్థాయిలో మార్కెట్ విలువను కలిగి ఉన్నాయి. ఏంజెల్ వన్, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్, 5పైసా, సువామా, జేఎమ్ ఫైనాన్షియల్ వంటి పోటీ బ్రోకింగ్ కంపెనీల మార్కెట్ విలువ మొత్తం కలిపినా రూ.70,000 కోట్ల దరిదాపుల్లోనే ఉండటం గమనార్హం.

మారుమూల గ్రామంలో జన్మించి..

మధ్యప్రదేశ్‌లోని మారుమూల గ్రామం అయిన లెపాలో రైతు ఇంట పుట్టిన లలిత్, చదువు కోసం తాతయ్య ఉండే ఖర్గోన్‌కు వెళ్లారు. అక్కడా ఇంగ్లిషు మీడియం స్కూళ్లు లేవు. స్థానిక భాషలోనే చదువుకున్నా, జేఈఈలో మంచి ర్యాంకు సాధించి, ఐఐటీ బాంబేలో చేరారు. బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీలు రెండూ అక్కడే పూర్తి చేశారు. ఫ్లిప్‌కార్ట్ మాజీ ఉద్యోగులైన హర్ష్ జైన్, ఇషాన్ బన్సల్, నీరజ్ సింగ్‌లతో కలిసి 2016లో ఆన్‌లైన్ స్టాక్‌బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్ గ్రోను ఏర్పాటు చేయడమే లలిత్ జీవితంలో కీలక మలుపు అయ్యింది. పీక్ ఎక్స్‌వీ, వై కాంబినేటర్, రిబిట్ క్యాపిటల్, టైగర్ గ్లోబల్, కాఫ్‌మాన్ ఫెలోస్ ఫండ్ వంటి ఇన్వెస్టర్లు దన్నుగా నిలిచిన ఈ కంపెనీ.. 2025 మార్చి 31 నాటికి రూ.4,056 కోట్ల ఆదాయంపై రూ.1824 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46% భారత్ నుంచే



కేంద్రమంత్రి పెమ్మసాని

ఈనాడు, దిల్లీ: ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46% భారత్ నుంచే జరుగుతున్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ వేదికపై జరిగిన వరల్డ్ టెలికమ్యూనికేషన్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 'ప్రపంచంలోనే అతి తక్కువ ధరకు డేటా అందిస్తోంది. దేశంలో ప్రస్తుతం నెలకు సగటున 28 జీబీ డేటా వినియోగం జరుగుతోంది. దీనివల్లే ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46% భారత్ నుంచే జరుగుతున్నాయి. ఆర్థిక సమ్మిళితత్వాన్ని ఇది మరింత బలోపేతం చేస్తోంది. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ ప్రాజెక్టును అమలుచేస్తోంది. గిగాబిట్ ఫైబర్‌తో ఇప్పటికే 2.18 లక్షల గ్రామాలను అనుసంధానం చేశాం. 2030 నాటికి కనీసం 30% మొబైల్ టవర్లు పునరుత్పాదక ఇంధనంతో నడిచేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు 3 కోట్ల మోసపూరిత టెలికాం కనెక్షన్లు నిలిపేశాం. 66 లక్షల మేర ఆర్థిక మోసాలను నివారించాం' అని పెమ్మసాని పేర్కొన్నారు.

మురుగప్ప గ్రూపు మాజీ ఛైర్మన్ అరుణాచలం వెల్లాయన్ కన్నుమూత



ఈనాడు, హైదరాబాద్: మురుగప్ప గ్రూపు మాజీ ఛైర్మన్, కోరమండల్ ఇంటర్నేషనల్ గౌరవ ఛైర్మన్ అరుణాచలం వెల్లాయన్ (72) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం కన్నుమూశారు. దాదాపు 125 ఏళ్ల చరిత్ర కలిగిన, రూ.90,000 కోట్ల వ్యాపార సామ్రాజ్యమైన మురుగప్ప గ్రూపులో ఆయన నాలుగో తరం వ్యాపారవేత్త. దివాన్ బహదూర్ మురుగప్ప చెట్టియార్ మునిమనవడైన వెల్లాయన్‌కు భార్య లలిత, కుమారులు అరుణ్, నారాయణ్ ఉన్నారు. మురుగప్ప గ్రూపు వ్యాపారాల విస్తరణలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. మురుగప్ప గ్రూపు సంస్థలతో పాటు కనోరియా కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్, ఎగ్జిమ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు బోర్డుల్లో ఆయన డైరెక్టర్‌గా ఉన్నారు. సదరన్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్, ఏఐఎంఏ, ఆల్ ఇండియా షుగర్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్లలో సేవలు అందించారు. డూన్ స్కూల్లో చదువుకున్న ఆయన, శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ తర్వాత యూకేలోని ఆస్టన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ బిజినెస్ స్కూల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ అభ్యసించారు. ఆయన అనుభవాలు, నాయకత్వ పటిమ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని మురుగప్ప గ్రూపు పేర్కొంది.

రైల్వేస్టేషన్లలో మెక్‌డొనాల్డ్స్, కేఎఫ్‌సీ స్టాళ్లు

రైల్వేస్టేషన్లలో మెక్‌డొనాల్డ్స్, కేఎఫ్‌సీ, పిజ్జాహట్, బాస్కిన్ రాబిన్స్, హల్దీరామ్స్, బికనీర్‌వాలా వంటి ప్రీమియం సింగిల్ బ్రాండ్ ఆహార విక్రయశాలలను అనుమతించాలని భారతీయ రైల్వేలు నిర్ణయించాయి. ఈ స్టాళ్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని నిర్ణీత కాలానికి లీజుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించనున్నారు. దేశీయంగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరించి, మెరుగైన సదుపాయాలతో విమానాశ్రయాల తరహాలో తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో భాగంగానే.. విభిన్న తరహా ఆహారశాలలకూ అనుమతులు ఇస్తున్నారు. ఇందువల్ల టికెట్ల ఆదాయంతో పాటు ఇతర ఆదాయం కూడా రైల్వేలకు గణనీయంగా పెరుగుతుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం రైల్వేలకు వస్తున్న ఆదాయంలో 'టికెటేతర ఆదాయం' వాటా చాలా తక్కువగా ఉంటోంది. నూతన స్టాళ్ల ఏర్పాటైతే, ప్రీమియం ఆహారాన్ని కోరుకునే రైల్వే ప్రయాణికులకు, ముఖ్యంగా యువతకు మరింత సౌకర్యంగా ఉంటుంది.

తొలిసారిగా అమెరికాకు విమాన ఇంధనం



- షెవ్రాన్ ప్లాంట్‌లో అంతరాయం వల్లే
- రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి 60,000 టన్నుల ఎగుమతి

అమెరికాకు మనదేశం తొలిసారిగా విమాన ఇంధనాన్ని (ఏటీఎఫ్) ఎగుమతి చేసింది. అమెరికా (దక్షిణ కాలిఫోర్నియా)లోని అగ్రగామి సంస్థ షెవ్రాన్ రిఫైనరీలో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడటమే ఇందుకు కారణమని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఆ రిఫైనరీలో రోజుకు 2,85,000 బ్యారెళ్ల ఏటీఎఫ్ ఉత్పత్తి జరుగుతుంది. అక్కడ అంతరాయం వల్ల, మన దేశ అగ్రగామి సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ రిఫైనరీ నుంచి 60,000 మెట్రిక్ టన్నుల (4,72,800 బ్యారెళ్లు) ఏటీఎఫ్‌ను ప్రత్యేక ఓడ ద్వారా, అక్టోబరు 28-29 తేదీల్లో జామ్‌నగర్ ఓడరేవు నుంచి పంపినట్లు కెప్లర్, ఎల్ఎస్ఈజీ డేటా, పరిశ్రమ వర్గాలను ఉటంకిస్తూ ఆ కథనం వెల్లడించింది. డిసెంబరు ప్రారంభంలో ఈ ఓడ లాస్ ఏంజెలెస్‌ను చేరే అవకాశం ఉంది. షెవ్రాన్ ప్లాంటులో మరమ్మతులు పూర్తయ్యే వరకు, విమాన ఇంధన లభ్యత పరంగా సమస్యలు కొనసాగొచ్చని యూఎస్ వెస్ట్ కోస్ట్ భావిస్తోంది.

2026లో అమెరికా నుంచి 2.2 మి.టన్నుల వంటగ్యాస్ దిగుమతి

వచ్చే ఏడాదిలో (2026) అమెరికా నుంచి 2.2 మిలియన్ టన్నుల వంట గ్యాస్ దిగుమతి కోసం భారత ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశీయ వార్షిక ఎల్‌పీజీ దిగుమతుల పరిమాణంలో ఇది 10 శాతానికి సమానం. పరిమాణం, కాలపరిమితి, ధరలపై అంగీకార షరతులతో భారత్- అమెరికా మధ్య కుదిరిన మొదటి అధికారిక, వాణిజ్య ఒప్పందం ఇదే. వచ్చే ఏడాది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) 48 అతిపెద్ద గ్యాస్ రవాణా ఓడల ద్వారా 2.2 మిలియన్ టన్నుల వంట గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటాయి. షెవ్రాన్, ఫిలిప్స్, టోటల్ ఎనర్జీస్ ట్రేడింగ్ ఎస్ఏ లాంటి దిగ్గజ సంస్థలు ఈ గ్యాస్‌ను సరఫరా చేస్తాయి. మనదేశ ఎల్‌పీజీ అవసరాల్లో 65 శాతాన్ని దిగుమతులే తీరుస్తున్నాయి. భారత్‌కు 31 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ అవసరం ఉండగా.. 2024లో 20.4 మిలియన్ టన్నులను యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా నుంచి దిగుమతి చేసుకుంది.

వాణిజ్య ఒప్పందం తొలి భాగం పూర్తి కావొస్తోంది

భారత్- అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో తొలి భాగం దాదాపు పూర్తి కావొస్తోందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. మన వస్తువులపై అమెరికా ప్రభుత్వం విధించిన 50% సుంకం సమస్యకు, ఈ ఒప్పందంలో పరిష్కారం లభించే అవకాశం ఉందని అన్నారు.

సైయెంట్ సెమీకండక్టర్స్, అజిముత్ ఏఐ నుంచి సిలికాన్ చిప్

ఈనాడు, హైదరాబాద్: సైయెంట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ సైయెంట్ సెమీకండక్టర్స్, అజిముత్ ఏఐ కలిసి 'అర్కా- జీకేటీ-1' అనే సిలికాన్ చిప్‌ను ఆవిష్కరించాయి. ఇది మనదేశంలో అభివృద్ధి చేసిన మొదటి తరం 'ప్లాట్‌ఫామ్- ఆన్- ఏ- చిప్' కావడం ప్రత్యేకత. అత్యధిక సామర్థ్యం గల ఎడ్జ్ ఏఐ, స్మార్ట్ ఎనర్జీ మీటర్లలో దీన్ని వినియోగిస్తారు. సెమీకండక్టర్ల విభాగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేయడానికి ఈ చిప్ వీలు కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. దీన్ని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆవిష్కరించారు. ఈ చిప్‌నకు మల్టీ-కోర్ కస్టమ్ కంప్యూటింగ్, అడ్వాన్స్‌డ్ అనలాగ్ సెన్సింగ్, మెమొరీ, ఇంటెలిజెంట్ పవర్ మేనేజ్‌మెంట్ వంటి ప్రత్యేకతలున్నాయి. అడ్వాన్స్‌డ్ మీటరింగ్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, స్మార్ట్ సిటీస్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అవసరాలకు దీన్ని వినియోగిస్తారు.

రికార్డు గరిష్ఠానికి వాణిజ్య లోటు

దిల్లీ: మన ఉత్పత్తులపై అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల కారణంగా, దేశీయ ఎగుమతులు అక్టోబరులో 11.8% క్షీణించి 34.38 బిలియన్ డాలర్ల (సుమారు రూ.3.02 లక్షల కోట్ల)కు పరిమితమయ్యాయి. దేశ దిగుమతులు 16.63% పెరిగి 76.06 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.69 లక్షల కోట్ల)కు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 41.68 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 3.67 లక్షల కోట్ల) వద్ద రికార్డు గరిష్ఠానికి చేరింది. అక్టోబరులో బంగారం దిగుమతులు 200% వరకు పెరిగి 14.72 బి. డాలర్ల (సుమారు రూ.1.30 లక్షల కోట్ల)కు చేరాయి. వెండి దిగుమతులైతే 528.71% పెరిగి 2.71 బి. డాలర్ల (సుమారు రూ.24,000 కోట్ల)కు చేరాయి.

కోడి గుడ్లు

18న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	620
వరంగల్	622
విజయవాడ	640
తూ/ప గోదావరి	625
విశాఖపట్నం	610
చిత్తూరు	663

అపోలో మైక్రోసిస్టమ్స్ చేతికి ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్

100% వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తి

ఈనాడు, హైదరాబాద్: రక్షణ రంగానికి అవసరమైన పేలుడు పదార్థాలు, ఇతర ఉత్పత్తులు, సేవలు అందించే సంస్థ ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్‌ను, అపోలో మైక్రోసిస్టమ్స్ కొనుగోలు చేసింది. తన సబ్సిడరీ కంపెనీ అపోలో డిఫెన్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా, ఆ సంస్థలో 100% వాటా సొంతం చేసుకున్నట్లు అపోలో మైక్రోసిస్టమ్స్ వెల్లడించింది. ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్‌కు హోల్డింగ్ కంపెనీగా ఉన్న జీఓసీఎల్ కార్పొరేషన్ నుంచి వాటా కొనుగోలు చేసినందున.. ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ తమ స్టెప్-డౌన్ సబ్సిడరీ కంపెనీగా మారినట్లు అపోలో మైక్రోసిస్టమ్స్ పేర్కొంది. వేగంగా విస్తరిస్తున్న రక్షణ ఉత్పత్తుల విభాగంలో క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం, ఈ స్వాధీనత వల్ల తమకు లభిస్తుందని అపోలో మైక్రోసిస్టమ్స్ ఎండీ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్‌కు రూర్కెలా, మరికొన్ని ప్రదేశాల్లో యూనిట్లు ఉన్నాయి. గనుల తవ్వకం సంస్థలకు ఎన్నో ఏళ్లగా ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ సేవలు అందిస్తోంది.

మరోసారి ఈడీ విచారణకు అనిల్ అంబానీ డుమ్మా



దిల్లీ: విదేశీ మారకపు ద్రవ్య నియంత్రణ చట్ట ఉల్లంఘనకు (ఫెమా) సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరయ్యేందుకు రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ నిరాకరించారు. ఈ నెల 14న విచారణకు హాజరు కావాలని తొలుత ఈడీ కోరగా, ఆయన రాలేదు. 'దృశ్యమాధ్యమ పద్ధతిలో (వర్చువల్) హాజరు' అయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు అనిల్ అంబానీ పేర్కొన్నారు. అనిల్ అభ్యర్థనను తిరస్కరించిన ఈడీ, సోమవారం (17న) హాజరు కావాల్సిందిగా సమన్లు జారీ చేసింది. ఈసారీ ఆయన డుమ్మాకొట్టారు. ఈడీ మూడోసారి సమన్లు జారీ చేస్తుందా, మరేదైనా చర్యకు దిగుతుందా అనే అంశంపై స్పష్టత రాలేదు. ఈడీ సూచించిన ఏ సమయంలోనైనా వర్చువల్‌గా హాజరయ్యేందుకు, వాంగ్మూలాన్ని ఇచ్చేందుకు అనిల్ సిద్ధంగా ఉన్నారని ఆయన అధికార ప్రతినిధి వెల్లడించారు. జయపుర్- రీంగస్ రహదారి ప్రాజెక్టుకు సంబంధించి ఈ దర్యాప్తు జరుగుతోంది.

ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంలో విచారణ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్), ఇతర గ్రూప్ కంపెనీలు, ప్రమోటర్ అనిల్ అంబానీకి సంబంధించిన భారీ బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసులో కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తును కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించడానికి సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనాన్ని, వెంటనే ఈ దావా విచారించాల్సిందిగా న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు.

3-5 ఏళ్లలో ఈక్విటీ మదుపర్ల సంఖ్య రెట్టింపు!



సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే

వచ్చే 3-5 ఏళ్లలో ఈక్విటీ మార్కెట్ మదుపర్ల సంఖ్యను రెట్టింపు చేయడమే లక్ష్యమని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు. ఇటీవల సెబీ ఒక సర్వే చేపట్టగా, ప్రతి అయిదుగురిలో ఒకరు పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపించారని తేలిందన్నారు. ఏదో ఒక మార్గంలో షేర్లు కొనుగోలు చేయాలని అధికులు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. 2020 తరవాతే స్టాక్‌మార్కెట్ మదుపర్ల సంఖ్య శరవేగంగా పెరిగిందని గుర్తు చేశారు. అక్టోబరు నాటికి మన దేశంలో 12.2 కోట్ల మంది స్టాక్‌మార్కెట్ మదుపర్లు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇంకో 10 కోట్ల మంది మదుపర్లను పెంచుకుంటే, చాలా దేశాల జనాభా కంటే, ఎక్కువగా మన దేశంలో మదుపర్లు ఉంటారని పాండే వివరించారు.

యునికామర్స్‌తో రేమండ్ భాగస్వామ్యం


ఇ-కామర్స్ ఎనేబుల్‌మెంట్ ప్లాట్‌ఫాం అయిన యునికామర్స్‌తో రేమండ్ లైఫ్‌స్టైల్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. తన డిజిటల్ రిటెయిల్ కార్యకలాపాలను ఏకీకృతం చేయడంతో పాటు, వాటి నిర్వహణను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ భాగస్వామ్యం కింద యునికామర్స్‌కు చెందిన యునివేర్ ప్లాట్‌ఫాంను రేమండ్ అందిపుచ్చుకుంటుంది.

బొండాడకు రూ.465 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: సౌర విద్యుత్, టెలికాం మౌలిక వసతుల సంస్థ బొండాడ ఇంజినీరింగ్‌కు రూ.465 కోట్ల విలువైన పనులు లభించాయి. మహారాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ మహాజెన్‌కో నుంచి 100 మెగావాట్ సౌర విద్యుత్ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. భూమి ఎంపిక, కొనుగోలు, డిజైనింగ్, ఇంజినీరింగ్, నిర్మాణం తదితర అన్ని పనులనూ నిర్వహిస్తామని సంస్థ సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు అన్నారు.

జనవరిలో కొత్త ఐటీఆర్ ఫారాలు

సీబీడీటీ వెల్లడి



దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలికేలా, దాదాపు 6 దశాబ్దాల 'పాత ఆదాయపు పన్ను చట్టం-1961' స్థానంలో 'కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025'ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 2026 ఏప్రిల్ 1 నుంచి ఇది అందుబాటులోకి రానుంది. దీని అమలుకు ముందే, ఈ కొత్త చట్టం కింద ఉన్న నిబంధనలతో ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) ఫారాలను వచ్చే జనవరి కల్లా నోటిఫై చేయనున్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్ రవి అగర్వాల్ తెలిపారు. పన్ను చెల్లింపు ప్రక్రియను సరళీకృతం చేయడంతో పాటు, వ్యాపార వర్గాలకు సంబంధించిన నిబంధనలను సరళతరం చేయాలన్నదే కొత్త పన్ను చట్టం లక్ష్యమని వివరించారు. కొత్త నిబంధనల రూపకల్పన ప్రక్రియ వేగంగా జరుగుతోందని, పన్ను చెల్లింపుదారులు తమ అంతర్గత వ్యవస్థలు, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్లలో కొత్త చట్టానికి అనుగుణంగా మార్పులు చేసుకునేందుకు వీలుగా తగినంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే.. జనవరి నాటికి కొత్త ఐటీఆర్ పత్రాలు అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు 12న పార్లమెంటు 'కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025'ను ఆమోదించింది. ఆదాయపు పన్ను చట్టం కొత్త పన్ను రేట్లను నిర్ణయించదు. పన్ను చట్టాన్ని అర్థం చేసుకోవడంలో ఉన్న సంక్లిష్టతను తొలగించడం, నిబంధనలను సులభతరం చేయడం, పాత భాషను ఆధునికీకరించడం లాంటివి మాత్రమే చేస్తుంది.

- పాత చట్టంలో 819 సెక్షన్లు ఉండగా, కొత్త చట్టంలో 536 ఉన్నాయి. అధ్యాయాలు 47 నుంచి 23కు తగ్గాయి. పదాల సంఖ్య 5.12 లక్షల నుంచి 2.6 లక్షలకు పరిమితమయ్యాయి. సులభంగా అర్థం చేసుకునేందుకు 39 పట్టికలు, 40 సూత్రాలను కొత్త చట్టంలో చేర్చారు. దీనివల్ల పన్ను చట్టంపై మరింత స్పష్టత వస్తుందని సీబీడీటీ వెల్లడించింది.

రిఫండు క్లెయిమ్‌లను విశ్లేషిస్తున్నాం: ఆదాయపు పన్ను రిఫండులు కొంతమందికి జాప్యం అవ్వడానికి కారణాలను వివరిస్తూ.. కొన్ని రిఫండు క్లెయిమ్‌ల్లో 'తప్పుడు మినహాయింపులు లేదా అధిక మొత్తాల్లో క్లెయిం చేసినట్లు' గుర్తించామని రవి అగర్వాల్ తెలిపారు. వీటిపై పూర్తిస్థాయి విశ్లేషణ జరుగుతోందని వివరించారు. సరైన క్లెయింలను ఈ నెలాఖరు లేదా డిసెంబరులోగా పరిష్కరిస్తామని తెలిపారు. తక్కువ మొత్తం రిఫండులను ఇప్పటికే దాదాపుగా పూర్తి చేసినట్లు తెలిపారు. 'కొంతమంది పన్ను చెల్లింపుదారులు తప్పు, అసంపూర్తిగా రిటర్నులు దాఖలు చేసినట్లు గమనించాం. రిటర్నులను సరిచేసి, ఫైల్ చేయాలని వారికి సూచించినట్లు' వివరించారు. ఏప్రిల్ 1 నుంచి నవంబరు 10 వరకు ఆదాయపు పన్ను రిఫండ్‌లు గత ఏడాదితో పోలిస్తే సుమారు 18% తక్కువగా, రూ.2.42 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. రిఫండు కోసం క్లెయిం చేసుకుంటున్న వారు తగ్గడం, పన్ను శ్లాబుల్లో సవరణ ఇందుకు కారణమని అగర్వాల్ వివరించారు.

రూ.25.20 లక్షల కోట్ల పన్ను లక్ష్యం చేరతాం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఆదాయపు పన్ను వసూళ్ల లక్ష్యం రూ.25.20 లక్షల కోట్లను చేరుకుంటామని సీబీడీటీ ఛైర్మన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రత్యక్ష పన్నుల వసూళ్లు, గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 6.99% పెరిగాయని, పన్ను చెల్లింపుదారుల స్పందనా బాగుందని వివరించారు.

స్వయంచాలిత వాహనాల కోసం సమగ్ర నియంత్రణ విధానం

నిపుణుల సూచనలు

దిల్లీ: దేశంలో ఎంతో క్లిష్టమైన రహదారులున్న నేపథ్యంలో, స్వయంచాలిత వాహనాల (అటానమస్ వెహికిల్స్) ప్రయోగాత్మక దశ నుంచి వినియోగ దశకు చేరుకునేందుకు సమగ్ర నియంత్రణ వ్యవస్థను ప్రభుత్వం సిద్ధం చేయాలని నిపుణులు సూచించారు. ప్రామాణిక నిర్వహణ విధానాలూ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ రోడ్ ఫెడరేషన్ (ఐఆర్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్ ప్రొఫెసర్ పి.రాజలక్ష్మి మాట్లాడుతూ.. స్వయంచాలిత సాంకేతికతలో భద్రత కీలకమన్నారు. మన దేశ రహదారులకు తగిన విధంగా ఈ సాంకేతికతను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. 2030 నాటికి అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (అడాస్), క్రూజ్ కంట్రోల్ వంటివి అన్ని వాహనాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. 2040 నాటికి కొన్ని నగరాల్లో నియంత్రిత మార్గాల్లో అటానమస్ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు వివరించారు. భారత్ 2047 నాటికి స్వయంచాలిత వాహనాల రంగంలో నాయకత్వ స్థానంలో ఉండాలని అనుకుంటోంది. దీనికోసం భద్రతా ప్రమాణాలు, మార్కెట్ అభివృద్ధి, సాంకేతికత అనుకూలత వంటివి సమన్వయం కావాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వీటికి సంబంధించి ప్రత్యేక చట్టం లేదని పేర్కొన్నారు. భద్రత, బాధ్యత, గోప్యత, నైతికత వంటి అంశాలపై సమగ్ర చట్టపరమైన విధానాలు అవసరమని విశ్లేషించారు.

ఫిబ్రవరి నుంచి దిల్లీ-షాంఘై సర్వీసులు: ఎయిరిండియా

దిల్లీ: వచ్చే ఫిబ్రవరి 1 నుంచి దిల్లీ - షాంఘై మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఆరేళ్ల తరవాత సంస్థ తన సర్వీసులను పునరుద్ధరిస్తోంది. ఇందుకోసం వినియోగించే బోయింగ్ 787-8 విమానాల్లో 18 బిజినెస్ క్లాస్ సీట్లతో పాటు, 238 ఎకానమీ క్లాస్ సీట్లు ఉంటాయి. వారంలో నాలుగు సార్లు ఈ సర్వీస్ ఉంటుంది. ముంబయి నుంచి కూడా షాంఘైకు నేరుగా సర్వీసు ప్రారంభించడానికి చూస్తున్నట్లు వివరించింది.

మళ్లీ 26000 పైకి నిఫ్టీ



సెన్సెక్స్ ▲ 388	నిఫ్టీ ▲ 103
84951	26013

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.442 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1466 కోట్లు

దేశీయ సూచీల లాభాల పరుగు వరుసగా ఆరో రోజూ కొనసాగింది. భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆశలు, బిహార్‌లో భాజపా విజయం, బలమైన కార్పొరేట్ ఫలితాలు సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. దీంతో నిఫ్టీ మళ్లీ 26,000 పాయింట్ల ఎగువకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 7 పైసలు పెరిగి 88.59 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.70% నష్టంతో 63.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

- బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.3.20 లక్షల కోట్లు పెరిగి రూ.477.14 లక్షల కోట్లు (5.38 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
- సెన్సెక్స్ ఉదయం 137 పాయింట్ల (క్రితం ముగింపు 84,562.78) లాభంతో 84,700.50 వద్ద ప్రారంభమైంది. మదుపర్ల కొనుగోళ్లతో రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 84,988.09 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 388.17 పాయింట్ల లాభంతో 84,950.95 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ 103.40 పాయింట్లు పెరిగి 26,013.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,906.35- 26,024.20 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 20 లాభపడ్డాయి. ఎటర్నల్ 1.94%, కోటక్ బ్యాంక్ 1.30%, మారుతీ 1.28%, టైటన్ 1.17%, ఎం అండ్ ఎం 1.11%, టెక్ మహీంద్రా 1.06% రాణించాయి. టీఎంపీవీ 4.83%, అల్ట్రాటెక్ 0.70%, ఏషియన్ పెయింట్స్ 0.67%, టాటా స్టీల్ 0.63% నష్టపోయాయి.
- ఎన్‌హెచ్ఏఐ నుంచి రూ.9,270 కోట్ల కాంట్రాక్టు దక్కించుకోవడంతో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ షేరు 3.78% లాభపడి రూ.44.53 వద్ద ముగిసింది.
- షేరు మార్పిడి లావాదేవీలో కుమ్‌కుమ్ వెల్‌నెస్‌లో 36% వాటా కొనుగోలు చేసేందుకు సెల్‌విన్ ట్రేడర్స్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.
- పుజియామా పవర్ సిస్టమ్స్ ఐపీఓ ముగిసేసరికి 2.14 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 2,63,47,221 షేర్లను ఆఫర్ చేయగా, 5,63,26,400 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 5.15 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 88 శాతం, రిటెయిల్ విభాగంలో పూర్తి స్పందన లభించింది.
- 2025-26 చివరికల్లా లిథియమ్- అయాన్ సెల్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎక్సైడ్ ఇండస్ట్రీస్ తెలిపింది. ఈ బ్యాటరీల కోసం ద్విచక్ర వాహన తయారీ సంస్థలతో చర్చలు జరుపుతున్నామని, వీటిలో రెండు సంస్థలు తమకు ప్రారంభ వినియోగదార్లు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది.
- ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం కింద మొత్తం రూ.7,172 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనతో వచ్చిన 17 ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటిల్లో 11,800 మందికి ఉద్యోగాలు రానున్నాయి.
- యాదగిరిగుట్టలో 110 ఎకరాల్లో టౌన్‌షిప్ అభివృద్ధికి రూ.300 కోట్ల పెట్టుబడి పెడతామని స్థిరాస్తి సంస్థ స్టోన్‌క్రాఫ్ట్ వెల్లడించింది.

దేశీయ విపణిలోకి జర్మనీ కాస్మొటిక్ బ్రాండ్ ఎసెన్స్: జర్మనీ కాస్మొటిక్ బ్రాండ్ 'ఎసెన్స్'ను భారత విపణికి తీసుకురానున్నట్లు రిలయన్స్ రిటెయిల్ సోమవారం ప్రకటించింది. ఇందుకోసం జర్మనీకి చెందిన అంతర్జాతీయ కాస్మొటిక్స్ కంపెనీ కాస్నోవా బ్యూటీతో ఎక్స్‌క్లూజివ్ డిస్ట్రిబ్యూషన్ భాగస్వామ్యాన్ని కంపెనీ కుదుర్చుకుంది.

క్షీణించిన జపాన్ వృద్ధి: ఈ ఏడాది జులై- సెప్టెంబరులో జపాన్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు, ఏడాది క్రితంతో పోలిస్తే 1.8% క్షీణించింది. జపాన్ ఎగుమతులపై అమెరికా టారిఫ్‌లు విధించడమే ఇందుకు ప్రధాన కారణం. జూన్ త్రైమాసికంతో పోలిస్తే 0.4% దిగజారింది. గత త్రైమాసికం కంటే వృద్ధి రేటు 0.6% తగ్గొచ్చని మార్కెట్ వర్గాలు భావించగా, అంతకన్నా కాస్త మెరుగ్గానే పరిస్థితి ఉంది.

ఈనాడు సినిమా




రజనీకాంత్ - బాలకృష్ణలకు అరుదైన గౌరవం

అగ్ర కథానాయకులు రజనీకాంత్, నందమూరి బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి-2025) వేడుకల్లో వీరిద్దర్నీ ప్రత్యేకంగా సన్మానించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్వయంగా ప్రకటించారు. "చిత్ర పరిశ్రమలో 50ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా రజనీకాంత్, బాలకృష్ణలను సత్కరించనున్నాం. భారతీయ చలన చిత్ర సంస్కృతిపై వారి శాశ్వత ప్రభావాన్ని వేడుకలా చేసుకునే మైలురాయి ఇది. వారిద్దరూ దశాబ్దాలుగా అద్భుతమైన నటనతో ఎన్నో మంచి కథల్ని ప్రేక్షకులకు అందించి గొప్ప ప్రజాదరణతో ముందుకు సాగుతున్నారు. అందుకే వాళ్ల కృషికి గుర్తింపుగా ఇఫి ముగింపు వేడుకల్లో వారిని సన్మానించనున్నాం" అని ఎల్.మురుగన్ తెలిపారు. సినీ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఇఫి-2025 వేడుక ఈనెల 20 నుంచి 28వరకు గోవా వేదికగా జరగనుంది.

'ఫౌజీ'కి ప్రీక్వెల్


ప్రభాస్

ప్రస్తుతం కథానాయకుడు ప్రభాస్ చిత్రమంటే రెండు భాగాలన్నది పరిపాటిగా మారిపోయింది. ఇప్పటికే ఆయన 'సలార్ 2', 'కల్కి 2' చిత్రాలు చేయాల్సి ఉంది. 'ది రాజాసాబ్'కి కూడా రెండో భాగం అవకాశముందని ఆ చిత్ర నిర్మాత ఇప్పటికే ప్రకటించారు. ఇప్పుడీ జాబితాలో 'ఫౌజీ' కూడా చేరనుంది. హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ప్రీక్వెల్ ఉంటుందని దర్శకుడు హను ఓ ప్రకటనలో తెలిపారు. "ఈ చిత్ర తొలి భాగంలో ప్రభాస్ పాత్రకు సంబంధించి ఒక ప్రపంచాన్ని చూపిస్తున్నాం. రెండో భాగం తనలోని మరో కోణాన్ని అన్వేషిస్తుంది. మన గత వలస పాలన ప్రధానంగా ఈ ప్రీక్వెల్ ఉండనుందని.. వ్యక్తిగతంగా నాకు స్ఫూర్తినిచ్చిన కొన్ని నిజ జీవిత అనుభవాల్ని దానికి జోడించనున్నామ"ని చెప్పారు. దేశభక్తి అంశాలతో ముడిపడి ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో అలరించనున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది. ఇందులో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా.. జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఓటీటీలో ఈ వారం

కొత్త కంటెంట్ కోసం మీరు సిద్ధమా..? అయితే ఓటీటీలు కూడా వాటికి సంబంధించిన కబుర్లతో రెడీగా ఉన్నాయి. ప్రతివారం అదిరిపోయే కథలతో వినోదాలు పంచుతున్నాయి ఓటీటీలు. ఎప్పటిలాగే ఈ వారాంతం కూడా భిన్నమైన సిరీస్‌లు, సినిమాల్ని అందించబోతున్నాయి.

షాంపైన్ ప్రాబ్లమ్స్(సినిమా)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
ఏ మ్యాన్ ఆన్ ది ఇన్‌సైడ్ 2(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
ది ఫ్యామిలీ మ్యాన్ 3(సిరీస్)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్
జిద్దీ ఇష్క్(సిరీస్)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
ఉసిరు(సినిమా)	శుక్రవారం	సన్‌నెక్ట్స్
ట్రైన్ డ్రీమ్స్(సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ది డెత్ ఆఫ్ బన్నీ మున్రో(సిరీస్)	శుక్రవారం	జియోహాట్‌స్టార్

ప్రతి గెలుపునకూ ఓ కథ



'ఫీనిక్స్' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు విజయ్ సేతుపతి కుమారుడు, యువ కథానాయకుడు సూర్య సేతుపతి. ఇప్పుడాయన 'నాడు సెంటర్' అనే సిరీస్‌తో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన, రెజీనా కసాండ్రా, శశికుమార్, కలైయరసన్ ప్రధాన పాత్రల్లో నటించారు. నారు నారాయణన్ దర్శకత్వం వహించారు. "ప్రతి ఆటకూ ఓ పోరాటం ఉంటుంది. ప్రతి గెలుపుకూ ఒక కథ ఉంటుంది" అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంది. టీనేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ గురువారం జియోహాట్‌స్టార్ వేదికగా రాబోతుంది.

కబడ్డీనే 'బైసన్' జీవితం



"కబడ్డీ మీకు ఒక ఆటే కావచ్చు.. కానీ కిట్టన్‌కి కబడ్డీ అంటే అతని జీవితం" అంటూ ఇటీవలే థియేటర్లలో సందడి చేసింది 'బైసన్' చిత్రం. విక్రమ్ కుమారుడు ధ్రువ్ హీరోగా నటించిన ఈ సినిమాని మారి సెల్వరాజ్ తెరకెక్కించారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. కబడ్డీ నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులో కిట్టన్ అనే యువకుడిగా తన నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు ధ్రువ్. ఇప్పుడీ చిత్రం మీ ఇళ్లలో సందడి చేయబోతుంది. శుక్రవారం నుంచి ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో అలరించడానికి రెడీగా ఉంది.

ప్రశాంత్ నీల్ సమర్పణలో హారర్ చిత్రం


సూర్య, ప్రీతి, హను రెడ్డి

ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఓ హారర్ చిత్రానికి శ్రీకారం చుట్టింది. సూర్యరాజ్ వీరబత్తిని, హను రెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాని కీర్తన్ నాదగౌడ తెరకెక్కిస్తున్నారు. శ్రీవైష్ణవ, శశాంక్ పాటిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైనట్లు సోమవారం ప్రకటించారు. "ఓ గ్రామంలోని వైద్య కళాశాల నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. సైన్స్‌కి.. మూఢనమ్మకానికి అర్థం కాని ఒక రహస్యంతో.. ఇప్పటి వరకు చూడని సరికొత్త కథతో ఈ సినిమా ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచుతుంది. త్వరలో చిత్రీకరణ ప్రారంభిస్తాం" అని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకి సంగీతం: వెంకీ జి.జి.

జంటగా మరోసారి?


సాయి పల్లవి

ధనుష్

సాయిపల్లవి - ధనుష్‌లది వెండితెరపై విజయవంతమైన జోడి. వీళ్లిద్దరి నుంచి వచ్చిన 'మారి 2' సినిమా.. అందులోని 'రౌడీ బేబీ" పాట ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. వీళ్లిద్దరూ ఇప్పుడు మరోసారి జంటగా మురిపించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ధనుష్ ప్రస్తుతం తన 55వ చిత్రం కోసం 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామితో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం కథానాయికగా సాయిపల్లవిని రంగంలోకి దించేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు జరిగినట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. సాయిపల్లవి ప్రస్తుతం హిందీలో 'రామాయణ' చిత్రంలో నటిస్తోంది. అలాగే 'మేరే రహో' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

సారం లేని సంసారం వద్దు.. విడాకులే ముద్దు!


ఆనంది, ప్రియదర్శి

ప్రియదర్శి - ఆనంది జంటగా నవనీత్ రావ్ తెరకెక్కించిన చిత్రం 'ప్రేమంటే'. రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. సుమ కనకాల కీలక పాత్రధారి. ఈ సినిమా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇది కొత్తగా పెళ్లైన ఓ జంట కథ. వాళ్ల జీవితాల్లోని గిల్లికజ్జాలు.. దీన్ని సాకుగా చూపి వాళ్లను విడగొట్టాలని ప్రయత్నించే ఓ లేడీ కానిస్టేబుల్.. ఇలా మూడు పాత్రల నేపథ్యంలో ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. 'సారం లేని సంసారం వద్దు.. విడాకులే ముద్దు" అంటూ ఆఖర్లో సుమ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌కు ఆకర్షణగా నిలిచింది.

కోకో.. కికీల అపురూప బంధం


'కికీ అండ్ కోకో'

"చిన్నారుల వినోదం, విద్యకు కొత్త నిర్వచనం చూపే వినూత్న చిత్రం 'కికీ అండ్ కోకో'. ఇది పిల్లలకే కాదు.. పెద్దల్లోనూ చిన్నప్పటి మధురానుభూతుల్ని మరోసారి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు పి.నారాయణన్. ఆయన తెరకెక్కించిన ఈ యానిమేషన్ చిత్రాన్ని ఇనికా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో పలు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు పి.నారాయణన్ మాట్లాడుతూ.. "కోకో అనే చిన్నారికి.. కికీ అనే తన పెంపుడు కుక్కకు మధ్య ఉన్న అపురూపమైన బంధాన్ని చూపించే చిత్రమిది. నేటి బాలలకు వాళ్లని ప్రభావితం చేసే ఇలాంటి కథలు చాలా అవసరం. అందరి హృదయాల్ని హత్తుకునే ఈ కథను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం" అన్నారు. "ఇది థియేటర్లలోనే చూసి ఆనందించాల్సిన సినిమా. స్నేహం, ప్రేమ లాంటి అంశాలతో పిల్లలు నేర్చుకునే విలువైన పాఠాలకు వేదికగా నిలుస్తుంది" అన్నారు ఇనికా ప్రొడక్షన్స్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ జి.యం.కార్తికేయన్.

ఇలా ఏ ప్రేమకథలోనూ జరగలేదేమో!


రాహుల్, వేణు


"'బేబీ', '7/జీ బృందావన్ కాలనీ', 'ప్రేమిస్తే', 'సైరత్'లా 'రాజు వెడ్స్ రాంబాయి" సినిమా కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది" అన్నారు దర్శకుడు వేణు ఊడుగుల. ఇప్పుడాయన మరో నిర్మాత రాహుల్ మోపిదేవితో కలిసి స్వయంగా నిర్మించిన ఈ చిత్రాన్ని సాయిలు కంపాటి తెరకెక్కించారు. అఖిల్, తేజస్వీని రావ్ జంటగా నటించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ నుంచి వస్తున్న ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ.. "ఖమ్మం - వరంగల్ జిల్లాల మధ్య జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా దర్శకుడు సాయిలు ఈ కథని సిద్ధం చేసుకున్నాడు. ఈ స్క్రిప్ట్ నన్ను చాలా కలచివేసింది. మనం రకరకాల పరువు హత్యల గురించి విన్నాం. కానీ, ఈ కథ విన్నాక ఇలాంటి దుర్మార్గం ఏ ప్రేమకథలోనూ జరగలేదనిపించింది. ఇందులో బలమైన డ్రామా ఉంది. అందరూ అనుకున్నట్లు దీంట్లో విషాదకరమైన ముగింపు ఉండదు. ప్రేక్షకులు ఒక మంచి అనుభూతితోనే థియేటర్ల నుంచి బయటకొస్తారు. ఈ సినిమా చూసి కొందరు తల్లిదండ్రులైనా తమ పిల్లల ప్రేమ విషయంలో పాజిటివ్‌గా ఆలోచిస్తారని నమ్ముతున్నాం. ఈ చిత్రంలో ఎక్కడా ఈ ఘటన జరిగిన ఊరు పేరును.. బాధితులైన వ్యక్తుల పేర్లను చెప్పడం లేదు. ఈ సినిమాలో అఖిల్, తేజస్వీని తమ పాత్రల్లో ఎంతో సహజంగా నటించారు. కథానాయిక తండ్రి పాత్రలో చైతన్య జొన్నలగడ్డ నటన కట్టిపడేస్తుంది. ఈ సినిమా తప్పకుండా ప్రతి ఒక్కర్నీ ఆలోచింపజేస్తుంది" అన్నారు. ఆయన దర్శకుడిగా త్వరలో యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేయనున్నట్లు తెలిపారు. నిర్మాత రాహుల్ మోపిదేవి మాట్లాడుతూ.. "15ఏళ్లుగా సమాధి చేయబడిన ఓ వాస్తవ ఘటనతో ఈ సినిమా రూపొందించాం. ఈ ప్రేమకథకు మంచి డ్రామా జోడించి.. అందరూ థియేట్రికల్‌గా చూసేలా సాయిలు ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. దీన్ని ఆ ఘటన జరిగిన ప్రాంతంలోనే చిత్రీకరించాం. కొన్ని చిన్న పాత్రల కోసం అక్కడి గ్రామంలోని వాళ్లనే తీసుకుని.. నటనలో శిక్షణ ఇచ్చి వాడుకున్నాం" అన్నారు.

ఘట్టమనేని హీరోతో.. రవీనా టాండన్ తనయ

ఘట్టమనేని కుటుంబం నుంచి వస్తున్న మరో కొత్త హీరో ఘట్టమనేని జయకృష్ణ. కృష్ణ మనవడు, రమేశ్ బాబు కుమారుడైన ఈ యువతరంగంతో దర్శకుడు అజయ్ భూపతి ఓ సినిమా రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. వైజయంతీ మూవీస్ సమర్పణలో పి.కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతోనే నటి రవీనా టాండన్ - ఏఏ ఫిల్మ్స్ ఇండియా అధినేత అనిల్ థడానీల కుమార్తె రషా థడానీని తెలుగు తెరకు పరిచయం చేయనున్నారు. ఆమె ఇందులో జయకృష్ణకు జోడీగా కనిపించనున్నట్లు తెలియజేస్తూ సోమవారం ఓ పోస్టర్ విడుదల చేశారు. రషా ఇప్పటికే 'అజాద్' సినిమాతో బాలీవుడ్‌లో తొలి అడుగు వేసింది. ఇప్పుడీ కొత్త చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనుంది. ఇందులో ఆమె చాలా బలమైన.. నటనా ప్రాధాన్యమున్న పాత్రలో కనిపించనుంది. వాస్తవికతకు పెద్దపీట వేస్తూ భావోద్వేగాలతో మనసుల్ని హత్తుకునే ప్రేమకథలా దీన్ని రూపొందించనున్నారు. త్వరలోనే టైటిల్‌తో పాటు మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.


రషా థడానీ

కులం జీవితాలతో ఆడే ఆటలో...


శివాజీ, నవదీప్, బిందు మాధవి

"ప్రపంచంలో అన్నిటి కంటే తక్కువ ఖర్చులో దొరికేది సినిమానే" అన్నారు నటుడు శివాజీ. అలాంటి సినిమా కోసం చాలా మంది కష్టపడి పని చేస్తున్నారని.. అందుకే దయ చేసి అందరూ సినిమాల్ని థియేటర్లోనే చూడాలని, పైరసీని ప్రోత్సహించొద్దని కోరారు. ఇప్పుడు శివాజీ, నవదీప్, రవికృష్ణ ప్రధాన పాత్రధారులుగా మురళీకాంత్ తెరకెక్కించిన చిత్రం 'దండోరా'. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరు 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హీరో అడివి శేష్ ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శివాజీ మాట్లాడుతూ.. 'ఐబొమ్మ పైరసీ సైట్ వల్ల తాను చాలా మందికి ఉపయోగపడుతున్నానని ఆ నిర్వాహకుడు అనుకున్నాడు. కానీ, ఎంతోమందిని ఇబ్బంది పెట్టాడు. మనకంటూ కొన్ని పద్ధతులున్నాయి. రాజ్యాంగం ప్రకారం బతకాలి. ఇప్పటికైనా అతనిలో మార్పు రావాలి. సినిమాని థియేటర్‌లో చూసిన అనుభూతి మరెక్కడా దొరకదు. మా 'దండోరా' మంచి కాన్సెప్ట్‌తో రూపొందింది. థియేటర్లలో చూసి ఆదరించండి" అన్నారు. "నేటికీ కులం అనేది ఎంతో మంది జీవితాలతో ఎలా ఆడుకుంటోందనేది ఈ చిత్రంతో చూపించనున్నాం. దీన్ని ఓ చావుతో ముడి పెట్టి ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఎలా చూపించామన్నది ఆసక్తికరం" అన్నారు నటుడు నవదీప్. దర్శకుడు మురళీకాంత్ మాట్లాడుతూ.. "మా టీజర్ నచ్చి.. అల్లు అర్జున్ ఫోన్ చేసి మెచ్చుకున్నారు. చాలా ఆనందంగా ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో బిందు మాధవి, రవికృష్ణ, నందు, మౌనిక రెడ్డి, రవీంద్ర బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

విభిన్నమైన కథతో టార్టాయిస్

రాజ్‌తరుణ్, అమృత చౌదరి జంటగా రిత్విక్ కుమార్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టార్టాయిస్'. శశిధర్ నల్ల, విజయ్ కుమార్, ఇమ్మడి సంతోష్, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ, రావి కాలే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ.. "ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఇదొక విభిన్నమైన కథతో రూపొందుతోంది. నా కెరీర్‌కు మంచి కిక్ ఇస్తుంది" అన్నారు. "విభిన్నమైన కథ.. సరికొత్త స్క్రీన్‌ప్లేతో మంచి థ్రిల్లర్ సినిమాగా ఉంటుంది. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం" అన్నారు దర్శకుడు రిత్విక్ కుమార్. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సాహిత్యం: చంద్రబోస్, ఛాయాగ్రహణం: శబరి.

ఇవే మీ కెరీర్‌ను నిర్ణయిస్తాయి

గతేడాది 'క్రూ', 'సింగమ్ అగైన్' చిత్రాలతో తెరపై సందడి చేసింది బాలీవుడ్ కథానాయిక కరీనా కపూర్. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే ఈమె.. బంధుప్రీతి (నెపోటిజం) మీకు అవకాశాల్ని ఇస్తుంది కానీ విజయాన్ని కాదని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కరీనా నెపోటిజం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. 'నేను సినీ కుటుంబంలో జన్మించినందుకు నాకు ఎన్నో గొప్ప అవకాశాలు లభించాయి. కానీ పరిశ్రమలో మనుగడ సాగించడానికి కొన్ని విషయాలు అవసరం. నెపోటిజం మీకు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడానికి సహాయం చేస్తుంది. కానీ అది సుదీర్ఘ కెరీర్‌కు హామీ ఇవ్వదు. ప్రతిభ, స్థిరత్వం, ప్రేక్షకుల ఆదరణనే మీ కెరీర్‌ను నిర్ణయిస్తుంది.. నిలబెట్టగలుగుతుంది. మీ ఇంటి పేరు కాదు" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం పృథ్వీరాజ్ సుకుమారన్‌తో కలిసి 'దైరా' అనే చిత్రంతో బిజీగా ఉంది కరీనా.


కరీనా కపూర్


ఈనాడు ప్రతిభ
మంగళవారం, నవంబరు 18, 2025
16 https://pratibha.eenadu.net https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

తెలియని పరిమాణాలు.. తెలిసిన ప్రమాణాల్లో!

జనరల్ స్టడీస్ — భౌతికశాస్త్రం

అర కిలోమీటర్ దూరానికి అరగంటలో వెళ్లి అరకిలో కూరగాయలు తెచ్చాడు అరవింద్. ఇక్కడ అర కిలోమీటర్ దూరమనే పొడవుకు, అరగంట అనే కాలానికి, అరకిలో అనే ద్రవ్యరాశికి కచ్చితమైన కొలమానాన్ని వ్యక్తం చేశారు. ఈ విధంగా భౌతిక రాశుల మాపనానికి ఉపయోగించే మౌలిక రాశులనే కొలతలు అంటారు. సమీకరణాలను రూపొందించుకోవడానికి, సరిచూసుకోవడానికి అవి అవసరం. ఒక యూనిట్‌ను మరో యూనిట్‌లోకి మార్చడానికి, వివిధ భౌతిక రాశుల మధ్య సంబంధాలను గుర్తించడానికి కొలతలు కీలకం. భౌతిక శాస్త్రాన్ని అధ్యయనం చేయడంలో అత్యంత ముఖ్యమైన ఈ కొలతలపై పోటీ పరీక్షార్థులు తగిన అవగాహన పెంపొందించుకోవాలి. తద్వారా రాశుల మధ్య సంబంధాలను తార్కికంగా అర్థం చేసుకోగలుగుతారు.

కొలతలు


లార్డ్ కెల్విన్

భౌతిక రాశుల పరిమాణాన్ని నిర్ణయించేది కొలత అని లార్డ్ కెల్విన్ పేర్కొన్నారు. మరో రకంగా చెప్పాలంటే భౌతిక రాశి పరిమాణాన్ని తెలిసిన ప్రమాణంతో పోల్చి చెప్పడాన్ని 'కొలత' అంటారు. కొలవదగిన రాశులే భౌతిక రాశులు

★ భౌతిక రాశి పరిమాణం

= సంఖ్యాత్మక విలువ × ప్రమాణం

ఉదా: 100 కిలోగ్రాములు (కి.గ్రా.) 900 లీటర్లు (లీ.), 10 సెకను(సె.)., 500 గ్రాములు (గ్రా.), 250 మిల్లీ లీటర్లు (ఎం.ఎల్.) 5 అడుగులు

భౌతిక రాశులు: రెండు రకాలు 1) ప్రాథమిక రాశులు లేదా మూలరాశులు (Fundamental quantities), 2) ఉత్పన్న రాశులు (Derived quantities).

ప్రాథమిక రాశులు: ఇవి ఇతర రాశి/రాశులపై ఆధారపడనివి. వీటిని 'స్వతంత్ర రాశులు' అని కూడా పిలుస్తారు.
★ వీటి ప్రమాణాలను 'ప్రాథమిక ప్రమాణాలు'/'మూల ప్రమాణాలు' అంటారు. **ఉదా:** పొడవు, దవ్యరాశి, కాలం,

★ తర్వాత కాలంలో మరో ఆరు రాశులను ఈ జాబితాలో చేర్చారు. కొలత పద్ధతులకు మూలాధారం ప్రాథమిక రాశులు.


కొలత పద్ధతులు – ప్రాథమిక ప్రమాణాలు

ప్రాథమిక రాశులు	FPS	CGS	MKS	SI
1) పొడవు	Foot అడుగు	సెం.మీ.	మీటరు	మీటర్(m)
2) ద్రవ్యరాశి	Pound అడుగు	గ్రాము	కిలోగ్రాము	కిలోగ్రాము(Kg)
3) కాలం	Second సెకను	సెకను	సెకను	సెకను(s)
4) ఉష్ణోగ్రత	-	-	-	క్వెలిన్(K)
5) విద్యుత్తు ప్రవాహం	-	-	-	ఆంపియర్(A)
6) కాంతి తీవ్రత	-	-	-	కాండిలా(cd)
7) పదార్థ పరిమాణం	-	-	-	మోల్(mol)
8) సమతల కోణం	-	-	-	రేడియన్(rad)
9) ఘనకోణం	-	-	-	స్టెరేడియన్(sr)

★ FPS పద్ధతిని బ్రిటిష్ పద్ధతి అంటారు. ★ CGS, MKS పద్ధతులను మెట్రిక్ పద్ధతులు/దశాంశ పద్ధతులు అంటారు. ★ SI పద్ధతి అంటే అంతర్జాతీయ ప్రమాణాల పద్ధతి (ఇంటర్నేషనల్ సిస్టమ్ యూనిట్). ★ SI పద్ధతి 1961 నుంచి ప్రపంచవ్యాప్తంగా అమలులోకి వచ్చింది.

ప్రమాణాలు పెంచే/తగ్గించేందుకు వాడే ఘాతాలు

డెకా	- 10^{1}	డెసి	- 10^{-1}
హెక్టా	- 10^{2}	సెంటీ	- 10^{-2}
కిలో	- 10^{3}	మిల్లీ	- 10^{-3}
మెగా	- 10^{6}	మైక్రో	- 10^{-6}
గిగా	- 10^{9}	నానో	- 10^{-9}
టెరా	- 10^{12}	పీకో	- 10^{-12}
పెటా	- 10^{15}	ఫెమిటో	- 10^{-15}



ఒక వస్తువును ఎన్ని సార్లు కొలిచినా, ఎవరు కొలిచినా ఒకే పరికరంతో కొలిస్తే, ఒకే విలువ వస్తే దానిని 'ప్రామాణిక కొలత' లేదా 'యూనిట్ మెజర్' అంటారు.



పొడవు: అతి తక్కువ దూరాలను 'పొడవుగా' పిలుస్తారు. దీనిని కొలవడానికి స్కేలు, టేపు, సర్వేగొలుసు మొదలైన వాటిని వాడతారు. ★ పొలాలు, మైదానాల పొడవును కొలవడానికి సర్వే గొలుసు లాంటి పరికరాలను ఉపయోగిస్తారు. ★ స్క్రూగేజ్, వెర్నియర్ కాలీపర్స్ లాంటి పరికరాలు కూడా అతి చిన్న పొడవులను కొలవడానికి వాడతారు.
మిల్లీ మీటరు కంటే తక్కువ పొడవులు కొలవడానికి అవి సాయపడతాయి. వీటిని 'సున్నితపు పరికరాలు' అంటారు.


సర్వేగొలుసు

వివిధ పొడవులు, ప్రమాణాలు: ★ పరమాణు కేంద్రక వ్యాసార్ధాన్ని ఫెర్మిలో తెలియజేస్తారు. 1 fermi = 10^{-15} మీటరు.

★ పరమాణు పరిమాణాన్ని ఆంగ్‌స్ట్రామ్‌లో చెబుతారు. 1 ఆంగ్‌స్ట్రామ్ (A°) = 10^{-8} సెం.మీ. = 10^{-10} మీటరు ★ పాలీథీన్ కవర్ల మందాన్ని, బ్యాక్టీరియా/వైరస్ పొడవులను మైక్రోమీటరు/మైక్రాన్లలో చెబుతారు. 1 మైక్రాన్ = 10^{-6} మీటర్లు. ★ ఒక అంగుళం = 2.54 సెం.మీ. ★ 12 అంగుళాలు = 1 అడుగు = 30.480 సెం.మీ. ★ సముద్రాల లోతును ఫాథమ్‌లో కొలుస్తారు. ఒక ఫాథమ్ = 6 అడుగులు = 1.828 మీటర్లు. ★ ఒక కిలోమీటరు = 0.625 మైళ్లు = 1000 మీటర్లు. ఒక మైలు = 1.604 కి.మీ. = 1760 గజాలు (యార్డులు).
★ పడవలు, ఓడలు ప్రయాణించే దూరాలను నాటికల్ మైల్స్‌లో కొలుస్తారు. ఒక నాటికల్ మైలు = 1.852 కి.మీ. = 1852 మీ. ★ పెద్ద దూరాలను (నక్షత్రాల మధ్య దూరం) కాంతి సంవత్సరాల్లో కొలుస్తారు. ఒక కాంతి సంవత్సరం = 9.46×10^{15} మీ. లేదా
= 6.33×10^{4} Au. ★ నౌకల వేగాలను నాట్స్‌ల్లో కొలుస్తారు. ఒక నాట్ = 1.15 మైళ్లు/గంట = 1.85 కి.మీ./గం.

ఖగోళ ప్రమాణం: భూమికి, సూర్యుడికి మధ్య ఉన్న సగటు దూరాన్ని ఆస్ట్రనామికల్ యూనిట్ అంటారు. 1 Au = 1.496×10^{11} మీ.

పార్‌సెక్: ఖగోళ దూరాలను కొలిచే అతి పెద్ద ప్రమాణం. దీనినే 'పార్‌లాస్టిక్ సెకండ్' అంటారు. ఒక పార్‌సెక్ = 3.26 కాంతి సంవత్సరాలు
= 3.08×10^{16} మీటర్లు

మాక్ సంఖ్య: క్షిపణులు, సోనిక్, సూపర్ సోనిక్ విమానాల వేగాలను దీనిలో తెలియజేస్తారు. ఒక మాక్ సంఖ్య = 331 మీ./సె. = గాలిలో ధ్వని వేగం

కనీసపు కొలత (Least Count): ★ ఒక పరికరంతో కొలవదగిన అతి తక్కువ కొలతను కనీసపు కొలత (LC) అంటారు. ★ స్కేలులో కనీసపు కొలత = 1 మి.మీ.= 0.1 సెం.మీ.★ వెర్నియర్ కాలీపర్స్ కనీసపు కొలత = 0.1 మి.మీ. = 0.01సెం.మీ. ★ స్క్రూగేజ్ కనీసపు కొలత = 0.01 మి.మీ. = 0.001 సెం.మీ.

ద్రవ్యరాశి (Mass): వస్తువులో ఉన్న పదార్థ పరిమాణాన్ని 'ద్రవ్యరాశి' అంటారు. దీనిని సాధారణ త్రాసు/సున్నితపు త్రాసుతో కొలుస్తారు. 'ఇది విశ్వంలో స్థిరం మారదు.' అని చెప్పింది - గెలీలియో



ద్రవ్యరాశి $m = \frac{f \text{ బలం}}{a \text{ త్వరణం}}$

★ 1 కి.గ్రా. = 1000 గ్రా.
★ 1 కి.గ్రా. = 2.2 పౌండ్
★ 1 క్వింటా = 100 కి.గ్రా.
★ 1 పౌండ్ = 453 గ్రా.
★ 1 మెట్రిక్ టన్ను = 1000 కి.గ్రా.
★ 1 స్లగ్ = 14.59 కి.గ్రా.

ద్రవ్యరాశికి అతిచిన్న ప్రమాణం = atomic mass unit (amu)

1 = 1.67×10^{-27} కి.గ్రా. లేదా
931.5 Mev మిలియన్ ఎలక్ట్రాన్ ఓల్ట్

చంద్రశేఖర్ లిమిట్: ద్రవ్యరాశికి అతి పెద్ద ప్రమాణం = CSL (చంద్రశేఖర్ లిమిట్) ★ ఇది సూర్యుడి ద్రవ్యరాశికి 1.4 రెట్లు అధికం ★ 1 CSL = $1.4 \times (2 \times 10^{30})$ కి.గ్రా. = 2.8×10^{30} కి.గ్రా.


సన్ డయల్

కాలం: ★ ఏవైనా రెండు సంఘటనల మధ్య వ్యవధిని 'కాలం' అంటారు. కాలానికి అన్ని పద్ధతుల్లో ప్రమాణం సెకను. సెకను అంటే 1 (ఒక) రోజులో 86,400వ వంతు ★ సెకను అంటే సీసియం - 133 పరమాణువు చేసే కంపనాలు. 919,31,770 కంపనాలు చేయడానికి పట్టేకాలం.

కాలానికి అతిచిన్న ప్రమాణం - షేక్.
1 షేక్ = 10^{-8} సెకన్లు.

★ కాలానికి అతి పెద్ద ప్రమాణం - కాస్మిక్ సంవత్సరం
1 కాస్మిక్ సంవత్సరం = 225 మిలియన్ ఏళ్లు.

కాలాన్ని కొలిచే పరికరాలు: గడియారాలు.
గడియారం పనిచేసే సూత్రం: ఆవర్తన సూత్రం

★ పూర్వం వాడిన గడియారాలు = నీటి గడియారం, లోలక గడియారం, సన్‌డయల్. ★ పూర్వం వాడిన మొదటి గడియారం - సన్‌డయల్ (సౌర గడియారం) ★ లోలక గడియారం తయారుచేసింది - గెలీలియో (1640) ★ ఆటల సమయాలను తెలిపే గడియారం - స్టాప్‌వాచ్ ★ ప్రస్తుత గడియారాలు - స్ఫటిక గడియారం, పరమాణు గడియారం, ఎలక్ట్రానిక్ గడియారం. ★ కాలాన్ని కచ్చితంగా కొలిచే గడియారం - పరమాణు గడియారం (atomic clock). దీనిలో వాడే పదార్థం - సీసియం.

ఉత్పన్న రాశులు: ★ ఇవి ప్రాథమిక రాశులపై ఆధారపడతాయి. ★ వీటిని పరతంత్ర రాశులుగా పిలుస్తారు.★ వీటి ప్రమాణాలను ఉత్పన్న ప్రమాణాలు అంటారు.

ఉదా: వైశాల్యం, ఘనపరిమాణం, వేగం, త్వరణం సాంద్రత, బలం, పని, పీడనం.

వైశాల్యం: ఒక వస్తువు యొక్క ఉపరితలం కొలతను వైశాల్యం అంటారు.

★ వైశాల్యం = పొడవు × వెడల్పు $A = l \times b$

ప్రమాణాలు: CGS = సెంటీమీటర్^{2} (చదరపు సెంటీ మీటరు), ★ SI పద్ధతిలో = మీటరు^{2} (చదరపు మీటరు). ★ 1 మీ.^{2} = 1 మీ. × 1 మీ. = 100 సెం.మీ. × 100 సెం.మీ.

★ 1 మీ.^{2} = 10,000 సెం.మీ.^{2}


రచయిత: ఎస్.వై.నాయుడు

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



■ ప్రతిష్ఠాత్మక 69వ బాలన్ డిఓర్ పురస్కారాల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎవరు పురస్కారం గెలుపొందారు?
జ: ఫ్రాన్స్ క్రీడాకారుడు ఉస్మాన్ డెంబెలే (ఫుట్‌బాల్ క్రీడకు సంబంధించి ప్రపంచంలోనే అత్యుత్తమ గుర్తింపు పొందిన ఈ పురస్కారాన్ని మహిళల విభాగంలో స్పెయిన్ క్రీడాకారిణి ఐతానా బొన్మాటీ వరుసగా మూడో సారి గెలుచుకుని చరిత్ర సృష్టించింది).

■ ఏ రాష్ట్రంలో నీటి సరఫరా, వరద నియంత్రణ, పట్టణ పాలనను మెరుగుపరచడానికి భారత్, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) 125 మిలియన్ డాలర్ల రుణ ఒప్పందంపై సంతకాలు చేశాయి? **జ:** అస్సాం

■ ప్రసాద్ (పీఆర్ఏఎస్ఏడీ – పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) పథకం కింద ఏ రాష్ట్రంలో పునరుద్ధరించిన 524 ఏళ్ల నాటి పురాతన త్రిపుర సుందరి ఆలయాన్ని ప్రధాని మోదీ ఇటీవల ప్రారంభించారు?
జ: త్రిపుర (దేశంలోని 51 శక్తిపీఠాల్లో ఇది ఒకటిగా ఉంది.)

■ అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2025లో ఈ దినోత్సవాన్ని 'సైన్ లాంగ్వేజ్ యునైట్స్ అజ్' అనే థీమ్‌తో నిర్వహించారు.)
జ: సెప్టెంబరు 23

మరింత సమాచారం

పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవాలంటే..!

స్టడీ స్కిల్స్



ఏడాదంతా బాగా చదివినప్పటికీ పరీక్షల ముందు ఎంతో కొంత ఒత్తిడి ఏర్పడటం సహజం. నేర్చుకున్న అంశాలు పరీక్షల్లో వస్తాయా, రావా? అనే సందేహాలు తలెత్తుతుంటాయి. అప్పుడు పునశ్చరణ (రివిజన్) చేయడం మంచిది. సబ్జెక్టుల వారీగా ఒక పునశ్చరణ టైమ్ టేబుల్‌ను వీలైనంత ముందే సిద్ధం చేసుకోవాలి. సులభం అనిపించే సబ్జెక్టులకు తక్కువగా, కఠినంగా ఉండే వాటికి ఎక్కువగా సమయాన్ని కేటాయించాలి. పునశ్చరణకు ఎంచుకునే ప్రదేశం ప్రశాంతంగా ఉండాలి. ఇలా పరీక్షల ఒత్తిడిని దూరం చేసే పునశ్చరణ ప్రణాళిక ఏవిధంగా ఉండాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



దరఖాస్తు చేశారా?



☛ ఎంఈసీఓఎన్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు
చివరి తేదీ: 2025, నవంబరు 18

☛ ఎన్‌ఐటీసీలో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు
చివరి తేదీ: 2025, నవంబరు 18

అవసరమైనప్పుడు తాత్కాలిక దేశాధిపతి!

ఇండియన్ పాలిటీ


భారతదేశంలో రాష్ట్రపతి తర్వాత రెండో అత్యున్నత పదవి ఉపరాష్ట్రపతి. రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ పార్లమెంటు సంప్రదాయాలు, రాజ్యాంగ విలువలను పరిరక్షించే విశిష్ట స్థానం. రాష్ట్రపతి పదవికి ఖాళీ ఏర్పడితే ఆ బాధ్యతలను ఉపరాష్ట్రపతి నిర్వర్తిస్తారు. ఆ పదవికి ఉన్న రాజ్యాంగ పరమైన విధులు, ప్రాధాన్యాలు, ఇప్పటి వరకు పని చేసిన వ్యక్తుల ప్రత్యేకతలను పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. ఉపరాష్ట్రపతిగా పోటీ చేయడానికి ఉండాల్సిన అర్హతలు, ఎన్నిక విధానం, పదవీకాలం, అధికారికంగా అందే ప్రయోజనాలు, నిర్వర్తించే బాధ్యతలు, తొలగింపు విధానం, వీటన్నింటినీ పేర్కొంటున్న రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌నూ గుర్తుంచుకోవాలి.


ఉపరాష్ట్రపతి భవన్

ఉపరాష్ట్రపతి

1. ఉపరాష్ట్రపతి పదవి గురించి రాజ్యాంగంలో ఎక్కడ వివరించారు?
   1) 5వ భాగం, ఆర్టికల్స్ 63 నుంచి 68
   2) 5వ భాగం, ఆర్టికల్స్ 63 నుంచి 69
   3) 5వ భాగం, ఆర్టికల్స్ 64 నుంచి 71
   4) 5వ భాగం, ఆర్టికల్స్ 65 నుంచి 70

2. భారతదేశానికి ఉపరాష్ట్రపతి పదవి ఉండాలని రాజ్యాంగ సభలో బలంగా వాదన వినిపించింది ఎవరు?
   1) డా.బాబూ రాజేంద్ర ప్రసాద్
   2) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
   3) హెచ్.వి.కామత్
   4) గోపాలస్వామి అయ్యంగార్


హెచ్.వి. కామత్

3. ఉపరాష్ట్రపతి పదవికి సంబంధించిన రాజ్యాంగ అధికరణలకు చెందిన సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఆర్టికల్ 63 - భారతదేశానికి ఉపరాష్ట్రపతి ఉంటారు.
   బి) ఆర్టికల్ 64 - ఉపరాష్ట్రపతి పదవిరీత్యా రాజ్యసభకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.
   సి) ఆర్టికల్ 65 - ఏదైనా కారణంతో రాష్ట్రపతి పదవికి ఖాళీ ఏర్పడితే ఉపరాష్ట్రపతి తాత్కాలిక రాష్ట్రపతిగా వ్యవహరించవచ్చు.
   1) ఎ, బి సి 2) ఎ, బి 3) ఎ, సి 4) బి, సి


4. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) రాష్ట్రపతి అనారోగ్యానికి గురైన సందర్భంలో ఆయన/ఆమె కోలుకునే వరకు ఉపరాష్ట్రపతి తాత్కాలిక రాష్ట్రపతిగా వ్యవహరించవచ్చు.
   బి) ఉపరాష్ట్రపతి తాత్కాలిక రాష్ట్రపతిగా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో రాష్ట్రపతికి ఉన్న అన్ని అధికారాలను పొందుతారు, రాష్ట్రపతి పొందే జీతభత్యాలు అందుకుంటారు.
   సి) ఉపరాష్ట్రపతి తాత్కాలిక రాష్ట్రపతిగా వ్యవహరిస్తున్న సమయంలో రాజ్యసభ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.
   1) ఎ, సి 2) ఎ, బి
   3) బి, సి 4) ఎ, బి, సి

5. ఉపరాష్ట్రపతి తాత్కాలిక రాష్ట్రపతిగా ఎవరి సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
   1) రాష్ట్రపతి
   2) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
   3) అటార్నీ జనరల్
   4) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

6. ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి రాజ్యాంగంలో ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?
   1) ఆర్టికల్ 66 2) ఆర్టికల్ 68
   3) ఆర్టికల్ 69 4) ఆర్టికల్ 67

7. ఆర్టికల్ 66(3) ప్రకారం ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేయాలంటే ఉండాల్సిన అర్హతలను గుర్తించండి.
   ఎ) భారతీయ పౌరుడై ఉండాలి. దివాళా తీసి ఉండరాదు.
   బి) 35 సంవత్సరాల వయసు నిండి ఉండాలి.
   సి) రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికవడానికి కావాల్సిన అర్హతలు ఉండాలి.
   డి) కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల్లో ఉద్యోగియై ఉండరాదు.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

8. ఉపరాష్ట్రపతి పదవి ఎన్నికకు సంబంధించి కింది వాటిలో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల చట్టం, 1952ను అనుసరించి ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది.
   బి) కేంద్ర ఎన్నికల సంఘం ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక నిర్వహిస్తుంది.
   సి) 1961 వరకు పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేవారు.
   డి) ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక విషయంలో రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి



9. ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే విధానాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్ణయించారు?
   1) 11వ రాజ్యాంగ సవరణ చట్టం, 1961
   2) 12వ రాజ్యాంగ సవరణ చట్టం, 1961
   3) 10వ రాజ్యాంగ సవరణ చట్టం, 1961
   4) 9వ రాజ్యాంగ సవరణ చట్టం, 1960

10. కింది వాటిలో ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేసే అభ్యర్థి పూర్తి చేయాల్సిన షరతులను గుర్తించండి.
   ఎ) రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల సవరణ చట్టం 1977 ప్రకారం షరతులను నిర్దేశించారు.
   బి) ధరావత్తు (డిపాజిట్)గా రూ.15,000 చెల్లించాలి.
   సి) ఎలక్టోరల్ కాలేజీలోని 20 మంది సభ్యులు ప్రతిపాదించాలి. మరో 20 మంది సభ్యులు బలపరచాలి.
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, సి 4) ఎ, బి, సి

11. ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే ఎలక్టోరల్ కాలేజీలో ఓటర్లుగా ఎవరుంటారు?
   1) పార్లమెంటు ఉభయసభలకు ఎన్నికైన మొత్తం సభ్యులు.
   2) పార్లమెంటు ఉభయసభల మొత్తం సభ్యులు.
   3) పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికైన మొత్తం సభ్యులు.
   4) పార్లమెంటు, రాష్ట్రాల విధాన సభ, శాసన మండలికి ఎన్నికైన మొత్తం సభ్యులు.



12. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఉపరాష్ట్రపతి పదవికి ఒక వ్యక్తి రెండుసార్లు మాత్రమే పోటీ చేయవచ్చు.
   బి) ఉపరాష్ట్రపతి పదవీకాలం ఐదేళ్లు.
   సి) ఉపరాష్ట్రపతిని 'మహాభియోగ తీర్మానం' ద్వారా పార్లమెంటు తొలగిస్తుంది.
   డి) ఉపరాష్ట్రపతి తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించాలి.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) బి, డి 4) ఎ, బి, సి, డి

13. ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తొలగించే ప్రక్రియ గురించి రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?
   1) ఆర్టికల్ 66(B) 2) ఆర్టికల్ 67(B)
   3) ఆర్టికల్ 68(B) 4) ఆర్టికల్ 69(B)

14. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఉపరాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని పార్లమెంటు ఉభయసభల్లో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.
   బి) ఉపరాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని రాజ్యసభలో ముందుగా ప్రవేశపెట్టాలి.
   సి) ఉపరాష్ట్రపతిని తొలగించే తీర్మాన నోటీసును 14 రోజుల ముందుగా అతడికి ఇవ్వాలి.
   డి) ఉపరాష్ట్రపతిని పార్లమెంటు సాధారణ మెజార్టీతో తొలగించగలదు.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి

15. రాజ్యాంగంలోని ఆర్టికల్ 71 (1) ప్రకారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవుల ఎన్నికల వివాదాలను ఎవరు పరిష్కరిస్తారు?
   1) పార్లమెంటు
   2) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
   3) ఎలక్టోరల్ కాలేజీ
   4) సుప్రీంకోర్టు



సుప్రీంకోర్టు

16. ఉపరాష్ట్రపతి జీతభత్యాల గురించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) రాజ్యసభ ఛైర్మన్ హోదాలో జీతభత్యాలు పొందుతారు.
   బి) వీరి జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.
   సి) భారత సంఘటిత నిధి నుంచి జీతభత్యాలు పొందుతారు.
   డి) వీరి జీతభత్యాలు ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తాయి.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

17. ప్రస్తుతం ఉపరాష్ట్రపతి.. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో నెలకు ఎంత వేతనం పొందుతున్నారు?
   1) రూ.3 లక్షలు 2) రూ.4 లక్షలు
   3) రూ.5 లక్షలు 4) రూ.2.5 లక్షలు

18. భారత ఉపరాష్ట్రపతి పదవిని వేల్స్ యువరాజుతో పోల్చవచ్చని ఎవరు పేర్కొన్నారు?
   1) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్
   2) నార్మన్ డి.పామర్
   3) డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 4) కె.టి.షా


19. రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ అనారోగ్యంగా ఉన్నప్పుడు 25 రోజుల పాటు తాత్కాలిక రాష్ట్రపతిగా వ్యవహరించిన ఉపరాష్ట్రపతి ఎవరు?
   1) మహమ్మద్ హిదయతుల్లా
   2) శంకర్ దయాళ్ శర్మ
   3) బి.డి. జెట్టి
   4) జి.ఎస్. పాఠక్


మహమ్మద్ హిదయతుల్లా


20. మన దేశంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా ఎవరు వ్యవహరిస్తారు?
   1) రాష్ట్రపతి
   2) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
   3) ఉపరాష్ట్రపతి
   4) కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి

21. పార్లమెంటు సంస్థలతో రాజ్యసభ జరిపే అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలు ఎవరి పేరు మీదుగా జరుగుతాయి?
   1) సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్
   2) స్పీకర్
   3) ఉపరాష్ట్రపతి
   4) రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్

22. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వ్యవహరించారు.
   బి) డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ 1952 - 57 మధ్య ఏకగ్రీవంగా ఎన్నికై తొలి ఉపరాష్ట్రపతిగా వ్యవహరించారు.
   సి) డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ 1957-62 మధ్య ఏకగ్రీవంగా మరోసారి ఎన్నికై ఉపరాష్ట్రపతిగా వ్యవహరించారు.
   డి) డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ రెండుసార్లు ఉపరాష్ట్రపతి పదవి నిర్వహించారు.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

23. పదవిలో ఉండగా మరణించిన ఏకైక ఉపరాష్ట్రపతి ఎవరు?
   1) జాకీర్ హుస్సేన్
   2) కృష్ణకాంత్
   3) ఆర్.వెంకట్రామన్
   4) బి.డి.జెట్టి


కృష్ణకాంత్

24. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి తదుపరి ఉపరాష్ట్రపతి పదవికి ఏకగ్రీవంగా ఎవరు ఎన్నికయ్యారు?
   1) జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా
   2) జస్టిస్ మార్కండేయ ఖట్జూ
   3) జస్టిస్ రంగనాథన్
   4) జస్టిస్ మదన్ మోహన్ పూంఛీ

25. స్వాతంత్ర్యానంతరం జన్మించి ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టిన తొలి వ్యక్తి ఎవరు?
   1) కె.ఆర్.నారాయణన్
   2) కృష్ణకాంత్
   3) ఎం.వెంకయ్య నాయుడు
   4) గోపాల స్వరూప్ పాఠక్



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-2, 2-3, 3-1, 4-2, 5-4, 6-1, 7-4, 8-4, 9-1, 10-4, 11-2, 12-3, 13-2, 14-3, 15-4, 16-2, 17-2, 18-3, 19-1, 20-3, 21-3, 22-4, 23-2, 24-1, 25-3.

సరళ హరాత్మక చలనం

ఆవర్తన చలనాన్ని పునరావృతం చేయడానికి పట్టే కనిష్ఠ సమయాన్ని ఆవర్తన కాలం అంటారు. ఒక నిర్దిష్ట కాలవ్యవధిలో పునరావృతమయ్యే చలనాన్ని ఆవర్తన చలనం అంటారు. రెండు బిందువుల మధ్య ఒకే మార్గంలో ఒక వస్తువు ముందుకీ, వెనక్కీ కదులుతూ చేసే ఆవర్తన చలనాన్ని డోలన చలనం అంటారు. ఒక వస్తువు స్థానభ్రంశానికి అనులోమానుపాతంలో ఉండి, సమతాస్థితి స్థానం వైపు పనిచేసే పునరుద్ధరణ బలం వల్ల కలిగే ఆవర్తన చలనాన్ని సరళ హరాత్మక చలనం అంటారు.



సాగని తీగకు వేలాడే ద్రవ్యరాశి
లఘులోలక వ్యవస్థ

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

స్ప్రింగ్ - ద్రవ్యరాశి వ్యవస్థ


బలస్థిరాంకం k ఉన్న తేలికైన స్ప్రింగ్ సహాయంతో m ద్రవ్యరాశి కలిగిన ఒక దిమ్మెను వేలాడదీస్తే దాన్ని స్ప్రింగ్-ద్రవ్యరాశి వ్యవస్థ అంటారు. దిమ్మెను కొద్దిగా కిందికి లాగి వదిలితే విరామ స్థానానికి అటుఇటుగా నిలువు తలంలో డోలనాలు చేస్తుంది.

✦ ఇలాంటి వస్తువులకు డోలనావర్తన కాలం తెలుసుకోవడానికి

సూత్రం: $T = 2\pi\sqrt{\frac{m}{k}}$

✦ ఈ రకమైన స్ప్రింగ్-ద్రవ్యరాశి వ్యవస్థ డోలనావర్తన కాలం, పౌనఃపున్యం గురుత్వ త్వరణం g విలువపై ఆధారపడదు.

శ్రేణిలో కలిపిన స్ప్రింగులు:



అతి తక్కువ ద్రవ్యరాశి కలిగిన రెండు స్ప్రింగులను పటంలో చూపిన విధంగా శ్రేణిలో కలిపితే వాటి బల స్థిరాంకాలు వరుసగా k_1, k_2 అవుతాయి అనుకుందాం. అప్పుడు ఆ ఫలిత బల స్థిరాంకం $k = \frac{k_1 k_2}{k_1 + k_2}$


ఈ శ్రేణి వ్యవస్థ ఆవర్తన కాలం

$$T = 2\pi\sqrt{\frac{m(k_1 + k_2)}{k_1 k_2}}$$

పై రెండు స్ప్రింగులకు విడివిడిగా T_1, T_2 లు ఆవర్తన కాలాలు అయితే శ్రేణిలో కలిపిన స్ప్రింగులకు ఫలిత ఆవర్తన కాలం

$$T = \sqrt{T_1^2 + T_2^2}$$

సమాంతరంగా కలిపిన స్ప్రింగులు:




k_1, k_2 బల స్థిరాంకాలుగా ఉన్న రెండు స్ప్రింగులకు m ద్రవ్యరాశి గల ఒక రాయిని వేలాడదీశారు అనుకుందాం. అప్పుడు ఫలిత బల స్థిరాంకం $k = k_1 + k_2$

ఆవర్తన కాలం $T = 2\pi\sqrt{\frac{m}{(k_1 + k_2)}}$

☛ రెండు స్ప్రింగులకు విడివిడిగా ఆవర్తన కాలాలు వరుసగా T_1, T_2 అయితే, సమాంతరంగా కలిపినప్పుడు ఫలిత ఆవర్తన కాలం

$$T = \frac{T_1 T_2}{\sqrt{T_1^2 + T_2^2}}$$

అనువర్తనాలు



i) ఒక స్ప్రింగ్ ద్రవ్యరాశి వ్యవస్థలో స్ప్రింగ్ బల స్థిరాంకం k అనుకుందాం. ద్రవ్యరాశి m కలిగిన దిమ్మె పొడవు l, వెడల్పు b, ఎత్తు h అనుకుందాం. ఈ దిమ్మెను d సాంద్రత ఉన్న ఒక ద్రవంలో పటంలో చూపిన విధంగా ముంచాలి. దిమ్మె భారం w ను సమం చేసేందుకు ప్లవన బలం, పునరుద్ధరణ బలాలు పనిచేస్తాయి.


◆ దిమ్మెను కొద్దిగా కిందకు లాగి వదిలితే సరళ హరాత్మక చలనంలోకి వస్తుంది.

ఈ వ్యవస్థ ఆవర్తన కాలం

$$T = 2\pi\sqrt{\frac{m}{(k + lbdg)}}$$

పౌనఃపున్యం $n = \frac{1}{2\pi}\sqrt{\frac{(k + lbdg)}{m}}$


ii) U ఆకారంలోని ఒక గొట్టంలో σ సాంద్రత ఉన్న ఒక ద్రవాన్ని తీసుకుని, ఒక్కొక్క శాఖలో h ఎత్తు వరకు ద్రవం ఉంచారనుకుందాం. మొత్తం ద్రవం పొడవు $l = 2h$



◆ కొద్దిగా గాలిని ఊది ద్రవాన్ని కిందకు నెడితే రెండు వైపులా ద్రవం స.హ.చ చేస్తుంది. ఈ సందర్భంలో ఆవర్తన కాలం

$$T = 2\pi\sqrt{\left(\frac{h}{g}\right)}$$

లఘులోలకం



నిలువు తలంలో తేలికైన, సాగని ఒక తీగకు ఒక ద్రవ్యరాశిని వేలాడదీసినట్లయితే ఆ వ్యవస్థను లఘులోలకం అంటారు. లేదా పురిలేని, తేలికైన దారానికి చివరన ఒక బిందు రూపంలో ఉన్న ద్రవ్యరాశిని కట్టి, రెండో చివరన స్థిరబిందువుకు వేలాడదీస్తే దాన్ని లఘులోలకం అంటారు. దీన్ని కొద్దిపాటి కోణంతో కదిలిస్తే సరళ హరాత్మక చలనం చేస్తుంది.

❖ ఏ బిందువు నుంచి లోలకం వేలాడుతుందో ఆ బిందువును వేలాడే బిందువు అంటారు.

❖ లోలకం గురుత్వ కేంద్రాన్ని డోలన కేంద్రం అంటారు.

❖ వేలాడే బిందువుకు డోలన కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని లోలకం పొడవు అంటారు.

❖ భారం (mg) తిర్యక్ అంశమైన mgsinθ కావాల్సిన పునరుద్ధరణ బలాన్ని కలిగిస్తుంది.

❖ లఘులోలకం ఆవర్తన కాలం $T = 2\pi\sqrt{\frac{l}{g}}$

❖ లఘులోలకం ఆవర్తన కాలం (T) అనేది లోలకం ద్రవ్యరాశి, ఆకారం, పరిమాణంపై ఆధారపడదు.

❖ T విలువ లోలకం పొడవు వర్గమూలానికి అనులోమానుపాతంలో, గురుత్వ త్వరణం వర్గమూలానికి విలోమానుపాతంలో ఉంటుంది.

❖ ప్రదేశం మారినా లఘులోలక ఆవర్తన కాలం T మారకూడదంటే l విలువ మార్చుకోవాలి.

కోణీయ సరళ హరాత్మక చలనం

ఒక అక్షాన్ని ఆధారం చేసుకొని తిరిగేందుకు వీలుగా ఉండే ఒక వస్తువును తీసుకుని, దాన్ని కొద్ది కోణంతో తిప్పితే ఏర్పడే జడత్వ భ్రామకం I అనుకున్నట్లయితే ఆ వస్తువులో ఏర్పడే త్వరణం $a = -\omega^2 x$

సెకన్ల లోలకం

ఒక లఘులోలకం ఆవర్తన కాలం 2 సెకన్లు అయితే దాన్ని సెకన్ల లోలకం అంటారు. లేదా ఒక డోలనానికి 2 సెకన్లు పట్టే లోలకాన్ని సెకన్ల లోలకం అని పిలుస్తారు.

▼ T = 2 సెకన్లు కాబట్టి $l = \frac{g}{\pi^2}$

▼ దీన్నిబట్టి సెకన్ల లోలకం పొడవు ప్రదేశాన్ని (g) బట్టి మార్చుకోవాల్సి ఉంటుంది.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day 834

Candid

Telugu meaning: నిజాయతీగా, సూటిగా


English meaning: The word candid (క్యాండిడ్) is an adjective that describes someone who is open, honest, and sincere in expression.

Synonyms: Frank, Honest; *Antonyms:* Secretive, Dishonest

Usage: **1.** Her candid response during the interview impressed everyone on the panel.

2. He gave a candid account of his struggles before achieving success.

Current Affairs



Indian all-rounder Ravindra Jadeja became the second Indian and overall fourth cricketer in the world to score 4000 runs and take at least 300 wickets in Test cricket. He achieved this milestone during the second day of the first Test against South Africa in Kolkata on 15 November 2025.

✦ In 88 tests, Jadeja has scored 4,001 runs at an average of 38.84, with six centuries and 27 fifties, and a best score of 175*.

A new generation of man-portable autonomous underwater vehicles (MP-AUVs) was successfully developed by the Defence Research and Development Organisation (DRDO). The system comprises multiple autonomous underwater vehicles (AUVs) equipped with side scan sonar and underwater cameras as primary payloads for real-time detection of mine-like objects.



The Indian Air Force (IAF) participated in the 8th edition of the bilateral air exercise 'Garuda 25' with the French Air and Space Force (FASF) at Mont-de-Marsan, France, on 16 November 2025. The exercise will continue until 24 November. Garuda 25 provides an opportunity for professional interaction, exchange of operational knowledge, and sharing of best practices between the two Air Forces.



Minister of State for Power Shripad Y. Naik inaugurated the Ministry of Power Pavilion at the 44th India International Trade Fair (IITF) on 14 November 2025 at Bharat Mandapam in New Delhi.

✦ The pavilion aims to provide visitors with a comprehensive look at India's evolving energy landscape and the role of power sector PSUs in advancing clean energy and infrastructure development.

For more Current Affairs: Scan QR code

స్టడీ జోన్

జాతీయ జంతువు - పులి

ప్రపంచంలో పులుల జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. అడవుల నాశనం, వేట, అక్రమ రవాణా కారణంగా పురాతన కాలంతో పోలిస్తే ప్రస్తుతం పులుల సంఖ్య బాగా క్షీణించింది. దీన్ని అధిగమించి.. పులుల సంతతిని పెంచి, వాటిని రక్షించే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే 1972, నవంబరు 18న పులి (పాంథేరా టైగ్రస్)ని మన దేశ జాతీయ జంతువుగా ప్రకటించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల నేపథ్యంలో పులులకు సంబంధించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

జాతీయ జంతువుగా

1972 వరకు భారతదేశ జాతీయ జంతువుగా సింహం ఉండేది. అధికంగా వేటాడటం వల్ల ఆ సమయంలో దేశంలో పులుల సంఖ్య గణనీయంగా క్షీణించింది. ఎంతలా అంటే.. దేశంలో 1900 నాటికి 40,000 ఉన్న పులుల సంఖ్య 1972కి 1800కు తగ్గింది. వీటిని సంరక్షించేందుకు నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం 1972, నవంబరు 18న పులిని జాతీయ జంతువుగా ప్రకటించింది.

✦ పులులను వేట నుంచి రక్షించి, వాటి సంతతిని పెంచడానికి ప్రభుత్వం 1973, ఏప్రిల్ 1న 'ప్రాజెక్ట్ టైగర్'ను చేపట్టింది.



ప్రాజెక్ట్ టైగర్ – పులుల సంరక్షణ

ప్రాజెక్ట్ టైగర్‌లో భాగంగా కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ దేశ భూభాగాన్ని 7 ప్రాంతాలుగా విభజించి పులుల సంరక్షణను నిర్వహిస్తోంది. వీటినే ప్రాంతీయ పరిరక్షణ యూనిట్లు అంటారు. అవి:

1. శివాలిక్ - తెరాయ్ సంరక్షణ కేంద్రం
2. ఈశాన్య సంరక్షణ కేంద్రం
3. సుందర్‌బన్స్ సంరక్షణ కేంద్రం
4. పశ్చిమ కనుమల సంరక్షణ కేంద్రం
5. తూర్పు కనుమల సంరక్షణ కేంద్రం
6. మధ్య భారత్ సంరక్షణ కేంద్రం
7. సరిస్కా సంరక్షణ కేంద్రం

◆ ప్రపంచవ్యాప్తంగా టైగర్ రేంజ్ దేశాలు - భారత్, బంగ్లాదేశ్, భూటాన్, కంబోడియా, చైనా, ఇండోనేసియా, లావోస్, మలేసియా, మయన్మార్, నేపాల్, రష్యా, థాయ్‌లాండ్, వియత్నాం.

దేశంలోని టైగర్ రిజర్వ్‌ల గురించి ముఖ్యాంశాలు, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

దివ్యాంగులు

సమాజం ఆమోదించిన ప్రవర్తనా రీతులను కాకుండా ఆలోచన, ప్రత్యక్ష, సంజ్ఞానాత్మక ఉద్వేగపరమైన అసమతుల లక్షణాలుంటే ఆ స్థితిని మానసిక అనారోగ్యం అంటారు. దివ్యాంగులు సాధారణ వ్యక్తుల్లా సమాజంలో ఉన్న అవకాశాలు, వనరులను వినియోగించుకోలేరు. వివక్షకు, సామాజిక వెలికి గురవుతున్నారు.



నిర్వచనాలు, ప్రాథమిక భావనలు

☛ వికలాంగులు అనడానికి బదులు ప్రత్యేక సామర్థ్యం కలిగినవారు లేదా దివ్యాంగులు అని పిలుస్తున్నారు.

☛ దివ్యాంగుల సంక్షేమం అనేది కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తుంది. ఒక వ్యక్తి సాధారణ స్థితిలో చాటుకునే సామర్థ్యాన్ని చూపెట్టలేకపోవడాన్ని వికలాంగత్వం లేదా అశక్తత అని కూడా అంటారు. ఒకటి కంటే ఎక్కువ వైకల్యాలు ఉంటే బహుళ వైకల్యం అంటారు.

ఉదా: మాట్లాడలేకపోవడం, వినలేకపోవడం

అశక్తతల రూపాలు, మాట్లాడటం, భాషాపరమైన సమస్యలు, పఠన వైకల్యం, రాతపరమైన సమస్యలు, జన్యుపరమైన కారణాల వల్ల వచ్చే ముఖ్యమైన అశక్తతలు, భారతదేశంలో వికలాంగుల కోసం పనిచేస్తున్న సంస్థలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

Raja Raman Centre for Advanced Technology (RRCAT), Madhya Pradesh, is inviting applications for the recruitment of Trade Apprentice posts. The total no. of posts is 150. Eligible candidates can apply online before 26 November 2025.

Research Intern Posts

CSIR-Central Food Technological Research Institute (CFTRI), Mysore invites applications for the internship posts on a temporary basis. The total no. of posts is 10. The last date for online applications is 28 November 2025.

Scientist Jobs

Rubber Board Kerala (RB) is inviting applications for the posts of Scientist-A, B, C on direct recruitment basis. The total no. of posts is 50. The application fee is Rs. 500. Eligible candidates can apply online before 1 December 2025.

Did You Apply..?

Today (November 18) is the last date for the following Jobs/ Admissions

☛ Project Staff posts in NITC.
Eligibility: Diploma, Degree, B.Sc., PG.

☛ 39 Assistant Executive Jobs in MECON Limited.
Eligibility: Degree, B.Tech, BE, LLB, Diploma, MBA, PGDM.

☛ Ph.D Program in NIRDPR, Hyderabad.
Eligibility: PG M.Phil.

For more information and other notifications - scan QR code

Bank Exams
Quantitative Aptitude

Cylinder - Cone

1. A solid metallic cylinder of base radius 4 cm and height 7 cm is melted to form cones, each of height $1\frac{1}{2}$ cm and base radius $\frac{1}{2}$ cm. The number of cones is:
A) 968 B) 869 C) 986
D) 896 E) 715

2. The material of a solid cone is converted into the shape of a solid cylinder of equal radius. If the height is of the cylinder is $7\frac{1}{7}$ cm. What is height of the cone?
A) $21\frac{5}{7}$ cm B) $21\frac{3}{7}$ cm
C) $21\frac{6}{7}$ cm D) $21\frac{1}{7}$ cm
E) None of the above

3. The radii of the base of a cylinder and a cone are in the ratio $\sqrt{5} : \sqrt{3}$ and their heights are in the ratio 3 : 5. Their volumes are in the ratio of:
A) 3 : 1 B) 3 : 2 C) 1 : 3
D) 5 : 3 E) 5 : 7

4. A solid consists of a circular cylinder with exact fitting right circular cone placed on the top. The height of the cone is x cm. If total volume of the solid is $3\frac{1}{2}$ times the volume of the cone. Then the height of the circular cylinder is:
A) $\frac{4}{5}$ x cm B) $\frac{7}{6}$ x cm
C) $\frac{5}{6}$ x cm D) $\frac{7}{2}$ x cm
E) $\frac{9}{2}$ x cm

5. A right circular cone and a right circular cylinder have equal base and equal height. If the radius of the base and the height are in the ratio 8 : 15, then the ratio of the total surface area of the cylinder to that of the cone is:
A) 45 : 23 B) 46 : 25 C) 24 : 43
D) 25 : 46 E) None of the above

6. A right circular cylindrical vessel is full of liquid. How many right circular cones having the same radius and height as those of the right circular cylinder will be needed to store that water?
A) 4 B) 2 C) 1 D) 3 E) 7

7. A tent is in form of a right circular cylinder surmounted by a cone. The diameter of the cylinder is 32 m. The height of the cylindrical portion is 15 m while the vertex of the cone is 27 m above the ground. The area of the canvas required for the tent is:
A) 800π sq.m B) 864π sq.m
C) 900π sq.m D) 850π sq.m
E) None of the above

8. A conical cavity is drilled in a circular cylinder of height 24 cm and 14 cm base diameter. The height and the base diameter of the cone are same as those of the cylinder. Determine the total surface area of the remaining solid.
A) 650π sqcm B) 506π sqcm
C) 560π sqcm D) 568π sqcm
E) 555π sqcm

9. A tank internally measuring 160 cm × 130 cm × 100 cm has 13,71,250 cu.cm water in it. Porous bricks are placed in the water until the tank is full up to its brim. Each brick absorbs one tenth of its volume of water. How many bricks of 18 cm × 7 cm × 5 cm. Can be put in the tank with out spilling over the water?
A) 1250 B) 1200 C) 1350
D) 1300 E) 1150

10. A pipe needs to be installed so that water flowing through it at a speed of 9 m per minute can completely fill a tank of 480 cu.m capacity in 12 minutes. Determine the required inner radius of the pile? (Approx)
A) 1.15 m B) 1.11 m C) 1.2 m
D) 1.19 m E) 1.14 m

11. A cylinder with base radius of 10 cm and height of 3 cm is melted to form a cone of height 9 cm. The radius of the cone will be:
A) 13 cm B) 10 cm C) 9 cm
D) 7 cm E) 8 cm

12. A cylindrical container is completely filled with ice cream. The cylinder has a diameter of 16 cm and a height of 10 cm. The ice cream is shared equally among 40 children, each receiving equal ice cream cone that consists of a cone with a hemi spherical top. If the height of the cone is twice the diameter of its base. Find the diameter of each ice cream cone.
A) 5 cm B) 6 cm
C) 4 cm D) 8 cm
E) 10 cm

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

సాఫ్ట్‌వేర్ నుంచి.. సివిల్స్ వైపు?



సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఒత్తిడి ఎక్కువగా ఉంది. యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం కావాలనుంది. కానీ అక్కడి పోటీని తలుచుకుంటే భయమేస్తోంది. ఐటీలో కొనసాగాలో.. యూపీఎస్సీకి సన్నద్ధం కావాలో అర్థంకావడం లేదు.

\- అభిలాష్

■ మీరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారని చెప్పారు కానీ, ఎప్పటి నుంచి ఐటీలో ఉన్నారు? డిగ్రీలో ఏ సబ్జెక్టులు చదివారు? మీ వయసు ఎంత? ఈ వివరాలూ చెప్పాల్సింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఒత్తిడి ఎక్కువగా ఉంది కాబట్టి, యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవ్వాలనుకోవడం అర్థరహితం. యూపీఎస్సీ సన్నద్ధత తపస్సు లాంటిది. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో వందల ఉద్యోగాలకు లక్షల మంది పోటీ పడుతున్నారు. చాలామంది మూడు నాలుగేళ్ల నుంచీ, నిరంతరాయంగా సన్నద్ధం అవుతున్నారు. మీకు నిజంగా సివిల్ సర్వీసెస్ మీద అంతులేని ఇష్టం, కనీసం మూడేళ్లు నిర్విఘ్నంగా చదవగలను అన్న నమ్మకం ఉంటేనే, యూపీఎస్సీ గురించి ఆలోచించండి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఒత్తిడి విషయానికి వస్తే.. పాఠశాల ఉపాధ్యాయుల



నుంచి యూనివర్సిటీ ఆచార్యుల వరకూ, గుమాస్తా నుంచి సీనియర్ ఐఏఎస్ వరకూ.. అందరికీ పని ఒత్తిడి ఉంటుంది. మీరు వంద మంది ఉద్యోగులతో మాట్లాడితే, కనీసం తొంభై శాతం మంది ఒత్తిడి తట్టుకోలేక పోతున్నాం అనే చెబుతారు. కాబట్టి, ఒత్తిడి పనిలో ఉండదు, దాన్ని చూసే దృష్టిపై ఆధారపడి ఉంటుంది. చేసే పనిపై ఇష్టం పెంచుకుని, ఆ పనిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తే, ఒత్తిడి తగ్గుతుంది. ఉద్యోగంలో ఒత్తిడి అధిక పని వల్ల వస్తోందా? సహోద్యోగుల కారణంగా వస్తోందా? కస్టమర్ల ద్వారా వస్తోందా? ఉద్యోగ అభద్రత వల్ల వస్తోందా? పనికి తగ్గ వేతనం లేకపోవడం వల్ల వస్తోందా? ఇలా అనేక విషయాలను విశ్లేషించి, సమస్యకు మూల కారణం కనుక్కొని పరిష్కారం కోసం ప్రయత్నించండి. ఒకవేళ, మీకు నిజంగానే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌పై చాలా ఇష్టం ఉంటే, ఆ దిశలో ప్రయత్నాలూ చేయండి. మీరు ఏ రంగంలో రాణించాలన్నా, ముందు మీలోని భయాన్ని జయించండి. ఆ తర్వాత విజయం తప్పకుండా వరిస్తుంది.

–ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

మోషన్ గ్రాఫిక్స్

సంస్థ: నాక్టిల్యూసెంట్ టెక్నాలజీస్ ఎల్ఎల్‌పీ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/l6NfZ

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: స్కోప్ ఫర్ ఛేంజ్
నైపుణ్యాలు: కంటెంట్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్‌ఇన్, పింటరెస్ట్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ స్టైపెండ్: రూ.1,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/ZBmQ3

ఫిజిక్స్-పెన్‌ట్యాబ్ ఎక్స్‌పర్ట్

సంస్థ: పోల్‌స్టార్ ఎడ్యుకేషన్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ రాయడం, హిందీ మాట్లాడటం, ఫిజిక్స్
స్టైపెండ్: రూ.12,000-16,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/dX4ME

వాలంటీర్

సంస్థ: యోలిడే ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్, మార్కెట్ రిసెర్చ్ స్టైపెండ్: రూ.1,300-2,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/fB4do

ప్రాడక్ట్-లెడ్ మీడియా

సంస్థ: రిక్రూట్ సీఆర్ఎం
నైపుణ్యాలు: మార్కెట్ రిసెర్చ్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.7,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/RMy46

ఆన్‌లైన్ మార్కెటింగ్

సంస్థ: రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నైపుణ్యాలు: ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.1,200-3,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://tinyurl.com/ymmjpc3b

ట్రాన్‌స్క్రిప్షన్ - మరాఠీ

సంస్థ: పోల్‌స్టార్ ఎడ్యుకేషన్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మరాఠీ రాయడం, టైపింగ్ స్టైపెండ్: రూ.12,000-16,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/LhBkM

ఔట్‌రీచ్

సంస్థ: గిగ్‌ఫ్లో నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, సేల్స్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.1,000-5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/22CcY

వర్డ్‌ప్రెస్ డెవలప్‌మెంట్

సంస్థ: గెమా ఎడ్యుకేషన్ టెక్నాలజీ ప్రై.లి. నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పీహెచ్‌పీ, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వర్డ్‌ప్రెస్
స్టైపెండ్: రూ.1,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/yaqaM

సాఫ్ట్ స్కిల్స్

ఉద్యోగ వేటలో.. తార్కిక బాట!



కార్పొరేట్ కొలువులు పొందడానికి పుస్తక పరిజ్ఞానం ఒక్కటే సరిపోదు. అంతకు మించిన సమర్థతను సంస్థలు ఆశిస్తున్నాయి. సమస్యలకు పరిష్కారాన్ని చూపగలిగే సామర్థ్యం ఉన్నవారికి పట్టం కడుతున్నాయి. కొత్త ఆలోచనలతో, ముందు చూపుతో వ్యవహరించే వారికే మద్దతిస్తున్నాయి. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా కొనసాగుతోన్న ప్రస్తుత తరుణంలో ఏ ఒక్క నైపుణ్యమో సరిపోవడం లేదు. ఉద్యోగం రావాలన్నా, ఉన్నత స్థాయిని అందుకోవాలన్నా ఎన్నో మెలకువలు పెంపొందించుకోవాలి. అలాంటి వాటిలో ముఖ్యమైంది.. క్రిటికల్ థింకింగ్.

ఒకసారి కంపెనీ సీఈఓ సంస్థలోని ముఖ్యమైన ఉద్యోగులను సమావేశపరిచి.. మార్కెట్‌లో ప్రవేశపెట్టబోయే 'ప్రొడక్ట్' గురించి వివరించారు. అది సంస్థ దశను మార్చబోతోందనీ.. ఆ మాట కొస్తే ఇండస్ట్రీనే మలుపు తిప్పబోతోందనీ చెప్పడంతో అందరూ చప్పట్లు కొట్టారు. ఆ ప్రొడక్ట్ గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న సుధీర్ సీఈఓ అనుమతి తీసుకుని.. సదరు ఉత్పత్తిలోని లోపాలను వివిధ కోణాల్లో విశ్లేషించాడు. ప్రొడక్ట్‌ను మార్కెట్‌లోకి వదలగానే హిట్ అయినా.. దాని సౌలభ్యం రీత్యా పోటీదారులు కూడా ఇదే ఉత్పత్తిని తీసుకు రాగల అవకాశాలను విడమర్చి చెప్పాడు. అందువల్ల తమ కంపెనీ ఉత్పత్తికి దీర్ఘకాలం డిమాండ్ ఉండదని అంచనా వేశాడు. సుధీర్ విశ్లేషణాత్మక ఆలోచనను, ముందు చూపును సీఈఓ అభినందించి, ఆ ఆవిష్కరణను ఆరు నెలలపాటు వాయిదా వేశారు. లోపాలనూ సవరించడంతో కంపెనీ లాభాల బాట పట్టింది.

ఇక్కడ సుధీర్ ప్రదర్శించిన నైపుణ్యాన్నే 'క్రిటికల్ థింకింగ్' అంటారు. అంటే ఒక సమాచారాన్ని లేదా విషయాన్ని విమర్శనాత్మకంగా, తార్కికంగా విశ్లేషించి.. అన్ని కోణాల్లో మదింపుచేసి తుది నిర్ణయం తీసుకోవడం. ఈ సామర్థ్యమే ఫ్రెషర్స్‌కు కూడా కోట్ల రూపాయల వేతన ప్యాకేజీలనూ అందిస్తుంది.

ఎంపికలో ఏం చూస్తున్నాయంటే..

ప్రస్తుతం టెక్నికల్ స్కిల్స్ కంటే.. తార్కిక సామర్థ్యాన్ని ఎక్కువగా పరీక్షిస్తున్నట్లు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) పేర్కొంది. దీని ఫ్యూచర్ స్కిల్స్ నివేదిక ప్రకారం.. మన దేశంలో 60 శాతం కంటే ఎక్కువ సంస్థలు కొత్తగా నియమించే ఉద్యోగుల్లో తార్కిక సామర్థ్యాన్ని మొదటి ప్రాధాన్యంగా గుర్తించాయి. కొన్ని సంస్థలు ఉద్యోగార్థులకు దీని ఆధారిత ప్రశ్నలు ఇచ్చి.. వాటికి సమర్థమైన సమాధానాలు చెప్పినవారికి అధిక వార్షిక వేతనం అందిస్తున్నట్లు పేర్కొన్నాయి.

ఎలా పరీక్షిస్తాయి?

ఈ మధ్య ఉద్యోగార్థులకు కేస్ స్టడీ ఇంటర్వ్యూలు నిర్వహించి.. క్రిటికల్ థింకింగ్‌ను పరీక్షిస్తున్నారు. అభ్యర్థిని సాధారణంగా అడిగే ప్రశ్నలు కాకుండా.. 'మా కస్టమర్ రిటెన్షన్ రేటు (క్లయింట్లను కంపెనీ నిలబెట్టుకునే శాతం) 20 శాతం తగ్గింది. మీరేం చేస్తారు?' లాంటి ప్రశ్నలు అడుగుతున్నారు. ఇందులో అభ్యర్థి సమాధానం కాకుండా.. వారి ఆలోచనా విధానాన్ని గమనిస్తారు. అంటే.. వారు డేటా అడుగుతారా? సమస్య మూలాన్ని గుర్తిస్తారా? బహుళ పరిష్కారాలు సూచించగలుగుతారా? అని పరీక్షిస్తున్నారు.

✦ కంపెనీలు పని వాతావరణంలో నిజమైన సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని కూడా పరీక్షిస్తున్నాయి. అంటే అభ్యర్థిని ఒక గ్రూప్‌లో ఉంచి.. ఏదైనా ఒక ఫేక్ క్లయింట్ కంప్లైంట్‌ను ఇస్తారు. అప్పుడు ఆ అభ్యర్థి ఆ ఫిర్యాదును పరిష్కరించే క్రమంలో ఆ టీమ్‌ను ఎలా లీడ్ చేస్తారు? ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు? లాంటివి గమనిస్తారు. దీని ద్వారా కమ్యూనికేషన్‌తోపాటు క్రిటికల్ థింకింగ్‌ను పరిశీలిస్తున్నారు.

✦ మరికొన్ని సంస్థలు గేమింగ్ అసైన్‌మెంట్లు ఇస్తున్నాయి. అంటే పజిల్స్, లాజికల్ గేమ్స్ ద్వారా సమస్య పరిష్కార వేగాన్ని, ఆ క్రమంలో ఎదురవుతోన్న ఒడుదొడుకులు, ప్రతిస్పందనలను అంచనా వేస్తున్నారు.

మెరుగైన ఆలోచనలకు...

లాజిక్ ముఖ్యం: ఒక విషయం మీ దృష్టికి వచ్చినప్పుడు దాన్ని అన్ని కోణాల్లోనూ విశ్లేషించాలి. మీ ముందుకు ఏ ఉద్దేశంతో తీసుకొచ్చారో అంచనా వేయగలగాలి. సంస్థ కోసం ప్రతి దాన్నీ తర్కంతో ప్రశ్నించగలగాలి. సమస్యకు కారణాలు, రుజువులు, పరిష్కార మార్గాల గురించి అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే కొత్త విషయాలను తెలుసుకోగలుగుతారు.

భావోద్వేగాలకు అతీతంగా: ప్రతి వ్యక్తికీ సొంత అభిప్రాయాలుంటాయి. చిన్నతనం నుంచీ మన మైండ్ ఒక మోటివ్‌కి సెట్ అయి ఉంటుంది. కానీ తార్కికంగా ఆలోచించేవారు భావోద్వేగాలకు లొంగకూడదు. వాస్తవాలు, ఆధారాల మీద మాత్రమే దృష్టి పెట్టాలి. తీసుకునే నిర్ణయాల్లో ఎక్కడా ఎలాంటి పక్షపాతం, వివక్ష ఉండకూడదు.

వాస్తవికత ప్రతిబింబించాలి: మీ ఆలోచనలు, నమ్మకాలకు మధ్య ఉన్న తేడాను గుర్తించగలగాలి. వాదన - ప్రతి వాదనలకు తగినంత విలువనివ్వాలి. వివిధ అంశాలు, రకరకాల ఆలోచనలకు మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. మీ లాజిక్‌లో ఏమైనా లోపాలుంటే వాటిని గుర్తించగలగాలి. సమస్యల పరిష్కారంలో ఒక క్రమపద్ధతిని అనుసరించాలి.

ఇవి పాటిస్తే మేలు..

విద్యార్థులు క్రిటికల్ థింకింగ్‌ను పెంచుకునేందుకు నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ నివేదికలో పొందుపరిచిన కొన్ని సూచనలు

✦ ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్‌పై దృష్టి పెట్టాలి.

✦ విమర్శనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలి. ఎందుకు? ఎలా? అని ప్రశ్నించేందుకు ఎప్పుడూ వెనకాడకూడదు.

✦ ఇంటర్న్‌షిప్‌ల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి. క్షేత్రస్థాయి వాస్తవ (రియల్ వరల్డ్) సమస్యలు, కార్యాలయ సంస్కృతి విధానం (వర్క్ ప్లేస్ డైనమిక్స్) గురించి తెలుసుకోవాలి.



గంపా నాగేశ్వర్‌రావు
సైకాలజిస్ట్,
ఇంపాక్ట్ వ్యవస్థాపకులు

జాతీయ సంస్థల్లో.. డిజైన్ కోర్సులు

ఎంతో ఆకర్షణీయంగా, వైవిధ్యంగా, చూపు పక్కకి తిప్పనీయకుండా రూపొంది ఎన్నో వస్తువులు, ఉపకరణాలు, వెబ్‌సైట్లు.. మంత్రముగ్ధులను చేస్తుంటాయి. వీటి తళుకుల వెనుక ఉన్నది.. డిజైనర్ల సృజనే. డిజైనింగ్ రంగానికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(నిడ్)లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. ఈ సంస్థల్లో బ్యాచిలర్, మాస్టర్ కోర్సులు అందిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో వీటిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పరీక్షతో సీట్లు కేటాయిస్తారు. ఈ సంస్థల్లో కోర్సులు పూర్తిచేసుకున్నవారు మేటి అవకాశాలతోపాటు, ఆకర్షణీయ వేతనాలూ అందుకోగలరు.

ఊహలకు.. ఆకర్షణీయ, అర్థవంతమైన రూపమివ్వగలిగే నైపుణ్యం ఉన్నవారు డిజైన్ కోర్సుల బాట పట్టవచ్చు. వీరికోసం జాతీయ ప్రాధాన్య సంస్థగా.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, అహ్మదాబాద్ ఏర్పాటైంది. దీనికి ఆంధ్రప్రదేశ్ (విజయవాడ), హరియాణా, మధ్యప్రదేశ్, అసోంల్లో శాఖలూ ఉన్నాయి. వీటిలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సులు అందిస్తున్నారు.



బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడిజ్)

ఈ కోర్సుల వ్యవధి నాలుగేళ్లు. నిడ్, అహ్మదాబాద్ క్యాంపస్‌లో.. కమ్యూనికేషన్ డిజైన్‌లో.. ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, ఎగ్జిబిషన్ డిజైన్, యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్ కోర్సులు అందిస్తున్నారు. ఇండస్ట్రియల్ డిజైన్‌లో.. సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్ కోర్సులున్నాయి. అలాగే టెక్స్‌టైల్ డిజైన్ కోర్సు ఇక్కడ ఉంది.

● ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపసుల్లో.. ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, టెక్స్‌టైల్ అండ్ అపారెల్ డిజైన్ కోర్సులు ఉన్నాయి.

మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎండిజ్)

కోర్సుల వ్యవధి రెండున్నరేళ్లు. వీటిని అహ్మదాబాద్, బెంగళూరు, గాంధీనగర్ క్యాంపసుల్లో అందిస్తున్నారు. యూజీలో ఉన్న కోర్సులన్నీ పీజీలో ఉన్నాయి. అదనంగా.. రిటైల్ ఎక్స్‌పీరియన్స్ డిజైన్, డిజిటల్ గేమ్ డిజైన్, ఇన్ఫర్మేషన్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, లైఫ్‌స్టైల్ డిజైన్, యాక్సెసరీస్ డిజైన్, న్యూ మీడియా డిజైన్, ఫొటోగ్రఫీ డిజైన్, స్ట్రాటజిక్ డిజైన్ మేనేజ్‌మెంట్, టాయ్ అండ్ గేమ్ డిజైన్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఆటోమొబైల్ డిజైన్, యూనివర్సల్ డిజైన్ కోర్సులు ఉన్నాయి.

పరీక్ష ఇలా..

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్టులో ప్రిలిమ్స్, మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్ పేపర్ వంద మార్కులకు నిర్వహిస్తారు. వ్యవధి 3 గంటలు. పేపర్‌పై పెన్సిల్/పెన్నుతో సమాధానాలు రాయాలి. ప్రశ్నపత్రం ఆంగ్లంలో ఉంటుంది. ప్రిలిమ్స్‌లో ప్రతిభావంతులకు మెయిన్స్ నిర్వహిస్తారు. తుది నియామకాలు ప్రిలిమ్స్, మెయిన్స్‌లో సాధించిన మార్కుల మెరిట్‌తో ఉంటాయి. మాదిరి ప్రశ్నపత్రాలు నిడ్ వెబ్‌సైట్‌లో ఉంచారు. పరీక్షపై అవగాహనకు ఇవి ఉపయోగపడతాయి. పరీక్ష వ్యవధి, ఇతర వివరాలు అడ్మిట్ కార్డు ద్వారా తెలుపుతారు.

అవకాశాలు

జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నందువల్ల ఈ సంస్థల్లో ప్రాంగణ నియామకాలు జరుగుతున్నాయి. బీ డిజైన్‌తోనూ మేటి అవకాశాలు పొందవచ్చు. వర్ల్‌పూల్, విప్రో, టైటాన్, ఫిలిప్స్, టాటా, గోద్రెజ్, జేపీ మోర్గాన్, ఎల్‌జీ, మారుతీ సుజుకీ, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, రంగోలీ, రెడ్‌బస్, తనిష్క్, వెల్‌స్పన్, జొమాటో.. ఇలా పలు సంస్థలు ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. పీజీ విద్యార్హతతో మరింత ఆకర్షణీయ వేతనాలు, అత్యున్నత హోదాలు పొందవచ్చు.

ముఖ్యాంశాలు

అర్హత: బ్యాచిలర్ కోర్సులకు ఇంటర్ అన్ని గ్రూపుల విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం కోర్సులు చదువుతున్న వారూ అర్హులే. వయసు 20 ఏళ్లలోపు ఉండాలి. జులై 1, 2005 తర్వాత జన్మించాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు మూడేళ్లు దివ్యాంగులకు ఐదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది. మాస్టర్ ఆఫ్ డిజైన్‌కు.. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల బీడిజైన్ లేదా అనుబంధ కోర్సులు చదివినవారు అర్హులు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: డిసెంబరు 1 వరకు స్వీకరిస్తారు.

దరఖాస్తు ఫీజు: దివ్యాంగులు, థర్డ్ జండర్లకు రూ.500, ఎస్సీ, ఎస్టీలకు రూ.1500, మహిళలకు రూ.2000, మిగిలిన అందరికీ రూ.3000.

ప్రిలిమినరీ పరీక్ష తేదీ: డిసెంబరు 21

వెబ్‌సైట్: https://admissions.nid.edu/NIDA2026/Default.aspx

రైల్వేలో అప్రెంటిస్..

సౌత్ ఈస్టర్న్ రైల్వే, కోల్‌కతా... యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

● యాక్ట్ అప్రెంటిస్: 1,785 ఖాళీలు

అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉండాలి.

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్, ఎంఎంటీఎం, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, లైన్‌మ్యాన్, తదితరాలు.

వయసు: 01.01.2026 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌తో.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు తేదీ: 17-12-2025.

వెబ్‌సైట్: https://www.rrcser.co.in/notice.html

డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్లు

కేబినెట్ సెక్రటేరియట్, న్యూదిల్లీ.. గ్రూప్-బీ (నాన్ గెజిటెడ్) డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్(టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్(టెక్నికల్)- 250 పోస్టులు

సబ్జెక్టుల వారీగా ఖాళీలు: ● కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: 124 ● డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: 10 ● ఎలక్ట్రానిక్స్/ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్: 95 ● సివిల్ ఇంజినీరింగ్: 02 ● మెకానికల్ ఇంజినీరింగ్: 02 ● ఫిజిక్స్: 06 ● కెమిస్ట్రీ: 04 ● మ్యాథమెటిక్స్: 02 ● స్టాటిస్టిక్స్: 02 ● జియాలజీ: 03

అర్హత: ఇంజినీరింగ్/టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా సంబంధిత విభాగాల్లో పీజీ. గేట్-2023/2024/2025 స్కోరు ఉండాలి.

వేతనం: నెలకు సుమారు రూ.99,000. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: గేట్ స్కోరు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలనతో. **గమనిక:** పూర్తి నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది. వివరాలు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

వెబ్‌సైట్: https://cabsec.gov.in/index.php

టీచింగ్ పోస్టులు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్, ఆల్వార్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాలో 252 టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● ప్రొఫెసర్ - 26
● అసోసియేట్ ప్రొఫెసర్ - 38
● అసిస్టెంట్ ప్రొఫెసర్ - 54
● సీనియర్ రెసిడెంట్ - 107
● జీడీఎంఓ - 25
● స్పెషలిస్ట్ ఇన్ హాస్పిటల్ అడ్మిన్ (సీనియర్ కన్సల్టెంట్) - 01 ● స్పెషలిస్ట్ ఇన్ హాస్పిటల్ అడ్మిన్ (జూనియర్ కన్సల్టెంట్) - 01

విభాగాలు: అనస్థీషియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, డెర్మటాలజీ, మెడిసిన్, ఆర్థోపెడిక్స్ పీడియాట్రిక్స్, రేడియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, రేడియోథెరపీ, అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ ఆంకాలజీ.. మొదలైనవి.

అర్హత: సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ/ ఎండీ/ ఎంఎస్/ డీఎం/ ఎంసీహెచ్.

గరిష్ఠ వయసు: ఇంటర్వ్యూ తేదీ నాటికి 45 ఏళ్ల నుంచి 69 ఏళ్ల మధ్య ఉండాలి.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,39,086. అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,55,093. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,34,047. స్పెషలిస్ట్ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్)కు రూ.78,800. సీనియర్ రెసిడెంట్‌కు రూ.67,000- రూ.1,34,047.

దరఖాస్తు ఫీజు: జనరల్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు ఫీజు లేదు. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.

ఇంటర్వ్యూ తేదీలు: నవంబరు 24, 25.


వేదిక: ఈఎస్ఐసీ ఎంసీహెచ్ దేసులా, ఎంఐఏ, ఆల్వార్, రాజస్థాన్ 301030.

వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

సెంట్రల్ హోమియోపతి కౌన్సిల్‌లో..

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ హోమియోపతి (సీసీఆర్‌హెచ్).. 90 గ్రూప్ ఏ, బీ, సీ పోస్టులను ప్రకటించింది. సీబీటీ, స్కిల్ టెస్టుతో నియామకాలుంటాయి. ఎంపికైతే ఆకర్షణీయ వేతనం అందుకోవచ్చు.

గ్రూప్-ఏలో రిసెర్చ్ ఆఫీసర్ పోస్టులు 14, గ్రూప్-బీలో జూనియర్ లైబ్రేరియన్-1, అసిస్టెంట్ రిసెర్చ్ ఆఫీసర్ (ఫార్మకాగ్నసీ)-1, స్టాఫ్‌నర్సు-9, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్(ఎంఎల్‌టీ)-28 ఉన్నాయి. గ్రూప్-సీలో ఫార్మసిస్ట్-3, ఎక్స్‌రే టెక్నీషియన్-1, లోయర్ డివిజన్ క్లర్క్-27, డ్రైవర్-2, జూనియర్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్-1, జూనియర్ స్టెనోగ్రాఫర్-3 ఉన్నాయి.



ఎంపిక: గ్రూప్-బీ, సీ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), స్కిల్ టెస్ట్‌లతో ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం 100 మార్కులకు హిందీ, ఇంగ్లిషుల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు.

స్టాఫ్‌నర్స్: సీబీటీలో.. సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 70, జనరల్ అవేర్‌నెస్, ఆప్టిట్యూడ్, రీజనింగ్‌ల నుంచి 20 ప్రశ్నలు, ఐటీ, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరీక్షించే 10 ప్రశ్నలు ఇస్తారు.

ఎంఎల్‌టీ: విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి 70 ప్రశ్నలు, రిసెర్చ్ ఆప్టిట్యూడ్, మెడికల్ ఎథిక్స్, క్వాలిటీ కంట్రోల్, ల్యాబ్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ల నుంచి 20 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు.

లోయర్ డివిజన్ క్లర్క్: స్కిల్ టెస్ట్ ఉంటుంది. కంప్యూటర్‌పై టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

సబ్జెక్టు సంబంధిత అంశాలకే ఎక్కువ మార్కులు కేటాయించారు. కాబట్టి ముఖ్యాంశాలను అధ్యయనం చేసి.. పునశ్చరణ చేసుకోవాలి. కొన్ని పోస్టులకు స్కిల్ టెస్టులో భాగంగా టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. తప్పులు లేకుండా వేగంగా టైప్ చేయడాన్ని సాధన చేయడం వల్ల అనుకూల ఫలితాలు పొందవచ్చు.

ముఖ్య వివరాలు..

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టులకు కావాల్సిన విద్యార్హతలు

స్టాఫ్ నర్సు: బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేయాలి.

మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్: మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్ డిగ్రీ, రెండేళ్ల అనుభవం ఉండాలి.

లోయర్ డివిజన్ క్లర్క్: ఇంటర్మీడియట్, ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు/ హిందీలో 30 పదాలు టైప్ కంప్యూటర్‌పై టైప్ చేయగలగాలి.

వయసు: స్టాఫ్‌నర్స్‌కు 30 ఏళ్లు, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్‌కు 35 సంవత్సరాలు, లోయర్ డివిజన్ క్లర్క్‌కు 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీ - ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్టీ/ ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ పోస్టులకు రూ.1000. గ్రూప్-బీ, సీ పోస్టులకు రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు ఫీజు లేదు.

వేతన శ్రేణి: అసిస్టెంట్ రిసెర్చ్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులకు నెలకు రూ.44,900 - 1,42,900. మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్‌కు రూ.35,400- 1,12,400. లోయర్ డివిజన్ క్లర్క్‌కు రూ.25,500 - 81,100. మూలవేతనానికి అదనంగా హెచ్‌ఆర్‌ఏ, డీఏ, ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయి.

పరీక్ష కేంద్రాలు: దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, గువాహటి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 26.11.2025

వెబ్‌సైట్: http://www.ccrhonline.in/

హసీనా అప్పగింతకు భారత్ విముఖం!

– దిల్లీ నుంచి నిరేంద్ర దేవ్

మానవాళిపై హింసకు పాల్పడ్డారన్న కారణంగా మరణ శిక్షను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాల్సిందిగా బంగ్లాదేశ్ ప్రభుత్వం చేసిన అభ్యర్థనను భారత్ దాదాపు తిరస్కరించినట్లే! ఏళ్లుగా బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తున్న భారత్‌కు ఈ నిర్ణయం ఒకరకంగా కత్తిమీద సామే.. 1996లో హసీనా పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ భారత బంగ్లాదేశ్ మధ్య సత్సంబంధాలు నెలకొన్నాయి. మన్మోహన్ సింగ్, నరేంద్ర మోదీల పాలనా కాలంలో బంగ్లాదేశ్‌తో భారత సంబంధాలు సుదృఢమయ్యాయి. ఇరుదేశాల మధ్య బైడేల అప్పగింత ఒప్పందం అమలులో ఉంది. హసీనాపై వచ్చిన అభియోగాలు రాజకీయంగా చేసినవే తప్ప వాటిలో వాస్తవం లేదని భావిస్తున్న భారత్.. బంగ్లాదేశ్ అభ్యర్థనను తిరస్కరించవచ్చని విశ్లేషకుల వాదన. హసీనాను తిప్పి పంపరాదని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు భారత్‌లో 100 శాతం మద్దతు లభించే అవకాశం ఉంది.

'బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా వెలువరించిన తీర్పును భారత్ గమనంలోకి తీసుకుంది. భారత్‌కు అత్యంత సమీపంలో ఉన్న పొరుగు దేశం బంగ్లాదేశ్. ఆ దేశంలో శాంతిభద్రతలు, ప్రజాస్వామ్యం, సుస్థిరత పరిరక్షణపట్ల భారత్ కట్టుబడివున్నది. అందుకోసం సంబంధితులందరితో నిరంతరం నిర్మాణాత్మక సంబంధాలను కొనసాగిస్తాం' అని విదేశాంగశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

బంగ్లాదేశ్ వ్యవస్థాపక నాయకుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె అయిన షేక్ హసీనా 2024 ఆగస్టు 5న పదవి నుంచి వైదొలగిన నాటి నుంచీ భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

ఒత్తిడికి అవకాశం

షేక్ హసీనాను తమకు అప్పగించాల్సిందిగా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం.. భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఆమె దేశం విడిచి పారిపోయిన నిందితురాలని, అందుకే ఆమెకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ ట్రైబ్యునల్ మరణ దండన విధించిందని పేర్కొంటూ ఆమెను తమకు అప్పగించాలని ఆ దేశ విదేశాంగశాఖ ఇప్పటికే భారత ప్రభుత్వాన్ని కోరింది. 'భారత్ మమ్మల్ని ఒక మంచి పొరుగు దేశంగా అభివర్ణిస్తుంటుంది. బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు కోరుకునే దేశంగా హసీనాను అప్పగించడం భారత్ ముందున్న సర్వోన్నత విధి' అని బంగ్లాదేశ్ జమాత్ కార్యదర్శి జనరల్ మియా గులామ్ పోర్వార్ వ్యాఖ్యానించారు. 'హసీనాపై జరిగిన విచారణను ప్రశ్నించేందుకు అవకాశమే లేదని మేం నమ్ముతున్నాం. విచారణ పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా అంతర్జాతీయ ప్రమాణాలకు లోబడి జరిగింది' అని ఆయన పేర్కొన్నారు. 'దేశం విడిచి పారిపోయి మరణశిక్ష ఎదుర్కొంటున్న ఒక వ్యక్తికి ఆశ్రయం కల్పించినవారు ఆమె చేసిన ఘోర నేరాలను సమర్థించినట్లే. ఆమెను వెంటనే



ఢాకాలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న హసీనా వ్యతిరేకులు

బంగ్లాదేశ్‌కు అప్పగించాలనేదే మా డిమాండ్' అని స్పష్టం చేశారు.

వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. గత సంవత్సరం ఆగస్టులో తిరుగుబాటు జరిగినప్పటి నుంచి భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాల్లో పలిమితులు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించాలని అప్పటి నుంచీ కోరుతూనే ఉంది. అయితే బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దమనకాండను నియంత్రించడంలో ఆపద్ధర్మ ప్రభుత్వం విఫలమైందని భారత ప్రభుత్వం ఆరోపిస్తూ ఉంది.

రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకుంటున్న బంగ్లా

గత సంవత్సరం ఆగస్టులో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యూనస్ నేతృత్వంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం రక్షణ వ్యవస్థను సుదృఢం చేస్తూ అనేక తక్షణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే బంగ్లాదేశ్ వైమానిక స్థావరాలను చైనా సాయంతో పునరుద్ధరిస్తోంది. 2025 మార్చి-ఏప్రిల్‌లో భారత, బంగ్లాదేశ్ సరిహద్దులోని రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి లాల్‌మోనిర్హాట్ విమాన స్థావర పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. పాకిస్థాన్‌తో సంబంధాల మెరుగుపరుచుకుంటోంది. పాకిస్థాన్‌కు చెందిన లెఫ్టినెంట్ జనరల్ తబస్సుమ్ హబీబ్ వంటి సైన్యాధికారులు బంగ్లాదేశ్ సైనికాధికారులతో ఏదేని కాలంగా సంప్రదింపులు జరుపుతున్నారు. బంగ్లాదేశ్ సైన్యానికి మరింత మెరుగైన శిక్షణ అందించడంపై ఈ చర్చల జరిగాయి. బంగ్లాదేశ్ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా.. పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ ప్రతినిధులతో సహా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్‌ను, త్రివిధ దళాల అధిపతులను కలిసి రక్షణ సహకారం, గూఢచర్య సమాచార పంపకంపై సంప్రదింపులు జరిపారు.

మరణ శిక్ష పడిన దేశాధినేతలు

భారత దేశం స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో మునిగి తేలుతున్న 1975 ఆగస్టు 15న తెల్లవారుజామున.. అప్పుడే కొత్తగా ఏర్పడిన బంగ్లాదేశ్‌లో పెను సంక్షోభం తలెత్తింది. బంగ్లాదేశ్ జాతిపిత, అప్పటి దేశాధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్, ఆయన కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారు. ఆనాటి సామూహిక హత్యాకాండలో ఆయన కుమార్తె షేక్ హసీనా బతికి బయటపడ్డారు. దాదాపు 50ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేసిన ఆమెకు తాజాగా బంగ్లాదేశ్ ప్రభుత్వం మరణదండన విధించింది. ఈ నేపథ్యంలో మరణశిక్షను ఎదుర్కొన్న కొందరు ప్రపంచదేశాధినేతల వివరాలివీ..

జుల్ఫికర్ అలీ భుట్టో



పాకిస్థాన్ రాజకీయాల్లో ఇప్పటికీ చక్రం తిప్పుతున్న పార్టీ పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ). ఆ పార్టీని స్థాపించిన మాజీ దేశాధ్యక్షుడు, మాజీ ప్రధాన మంత్రి అయిన జుల్ఫికర్ అలీ భుట్టోను 1979 ఏప్రిల్ 4న ఉరి తీశారు. అప్పటికి ఆయన వయసు 51. పీపీపీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అహ్మద్ రెజా కసూరీ హత్యకు ఆయనే ఆదేశించారన్న అభియోగంపై కోర్టు భుట్టోకు మరణశిక్ష విధించింది. రావల్పిండి జిల్లా జైలులో ఉదయం 2 గంటలకు ఆయనను ఉరి తీశారు.

అద్నాన్ మెండెరెస్



తుర్కియేలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అద్నాన్ మెండెరెస్ ప్రభుత్వాన్ని అప్పటి సైన్యం లోని ఉన్నతాధికార వర్గం కూల్చేసింది. తుర్కియేను దశాబ్దాలపాటు రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ అనే రాజకీయ పక్షం అతి క్రూరంగా పరిపాలించింది. అనేక దశాబ్దాల అనంతరం అద్నాన్ మెండెరెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైంది. మర్మరా సముద్రంలోని ఒక దీవిలో ఆయనపై విచారణ జరిపిన ఒక కోర్టు ఆయనతోపాటు మరో ముగ్గురికి మరణ శిక్ష విధించింది. ఆ తర్వాత దానిని అమలు చేశారు.

చున్ డూ హ్వాన్ (దక్షిణ కొరియా)



1979లో జరిగిన సైనిక తిరుగుబాటులో చున్ డూ హ్వాన్ ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఆయన ఏడాది తర్వాత జరిగిన ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో ముగ్గురు న్యాయమూర్తులతో కూడుకున్న ఒక న్యాయస్థానం ఆయనకు మరణ శిక్ష విధించింది. అయితే సుప్రీంకోర్టు ఈ శిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది.

సద్దాం హుసేన్



భారత దేశానికి అనుకూలుడిగా పేరున్న ఇరాక్ నియంత సద్దాం హుసేన్‌ను 2006 డిసెంబరు 30 ఉరితీశారు. 1982లో తనపై జరిగిన హత్యా యత్నానికి సంబంధించి 148 మంది షియా ముస్లింల మరణానికి సద్దాం కారకుడని ఆయనపై అభియోగం. ఆయనకు విధించిన మరణ దండనను ఉత్తర బాగ్దాద్‌లోని కడీమియా జిల్లా సైనిక నిఘా విభాగం ప్రధాన కార్యాలయంలో అమలు పరిచారు.

పర్వేజ్ ముషారఫ్



పాకిస్థాన్ మాజీ నియంత పర్వేజ్ ముషారఫ్‌కు దేశద్రోహ నేరంపై మరణశిక్ష విధించారు. ముగ్గురు న్యాయమూర్తులతో కూడుకున్న ప్రత్యేక కోర్టు ఎమర్జెన్సీ విధించడం ద్వారా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనకు ఈ శిక్ష విధించింది. 2020 జనవరిలో ఆయనకు విధించిన మరణ శిక్షను కోర్టు రద్దు చేసింది.

- నేషనల్ డెస్క్

అభివృద్ధికి కట్టుబడితే ఎన్నికల్లో గెలుపు

- బిహార్ ఎన్నికలే తార్కాణం: మోదీ



దిల్లీ: తమ ఆకాంక్షల్ని నెరవేర్చే పార్టీలకే ప్రజలు పట్టం కడతారని, బిహార్ ఫలితాలే అన్ని రాష్ట్రాలకూ ఆ మేరకు విస్పష్ట సందేశం పంపించాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు చాలా ఎక్కువగా ఉంటాయని చెప్పారు. లెఫ్ట్, రైట్, సెంటర్.. ఏ పార్టీలకైనా భవితవ్యమంతా వాటి అభివృద్ధి విధానాలే నిర్ణయిస్తాయని చెప్పారు. సోమవారం ఆయన దిల్లీలో 'రామ్‌నాథ్ గోయెంకా ఆరో స్మారకోపన్యాసం' చేశారు. 'కేంద్ర ప్రభుత్వమైనా, ప్రాంతీయ పార్టీల నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలైనా.. ప్రధానంగా వాటి దృష్టి అంతా అభివృద్ధిపైనే కేంద్రీకృతం కావాలి. మంచి ఉద్దేశాలున్నవారిని, అభివృద్ధి ప్రాధమ్యాలున్నవారిని ప్రజలు విశ్వసిస్తారు. బిహార్ మరోసారి దానిని రుజువు చేసింది. పెట్టుబడుల్ని ఆకర్షించడంలో, అభివృద్ధికి చేయూత ఇవ్వడంలో రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. సరళతర వ్యాపార నిర్వహణను మెరుగుపరిచేందుకు పోటీ నిర్వహించడం ఈ దిశగా గొప్ప అడుగు అవుతుంది. అభివృద్ధికి, 24×7 ప్రాతిపదికన సంక్షేమానికి కట్టుబడి ఉండటం వల్ల ఎన్నికల్లో భాజపా నెగ్గుతూ వస్తోంది' అని చెప్పారు.

ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌ల ఛార్జీలపై స్పందించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

దిల్లీ: ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌లో ప్రయాణ ఛార్జీలను, అనుబంధ రుసుములను ఇష్టారాజ్యంగా పెంచేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, సంబంధిత సంస్థలు స్పందించాలని సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాల తరవాత చేపడతామని తెలిపింది. మహా కుంభమేళా సమయంలో, పహల్గాం ఉగ్రదాడి జరిగిన తరవాత ప్రైవేటు విమానయాన సంస్థలు అడ్డగోలుగా ఛార్జీలు పెంచేశాయని పిటిషన్‌దారు ఎస్.లక్ష్మీనారాయణన్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ప్రైవేటు విమానయాన సంస్థలు ఛార్జీలను ఇష్టమొచ్చినట్లు పెంచకుండా నిరోధించే నిబంధన ఏదీ లేదని తెలిపారు. ఇకపై ఇలాంటిది జరగకుండా నిబంధనల చట్రాన్ని విధించాలని కోరారు.

డోభాల్‌తో పుతిన్ సలహాదారు చర్చలు

దిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సలహాదారుడు నికోలయ్ పట్రుషేవ్ సోమవారం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ద్వైపాక్షిక సంబంధాలతో ముడిపడిన అన్ని అంశాలను చర్చించారు. వచ్చే నెలలో పుతిన్ చేపట్టబోయే భారత పర్యటనపై వారు ప్రధానంగా ముచ్చటించుకున్నట్లు తెలుస్తోంది. జాతీయ సముద్ర భద్రతా విభాగం సమన్వయకర్త వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్‌గుప్తాను కూడా నికోలయ్ కలిశారు. పుతిన్ పర్యటనకు సన్నాహకంగా విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ ప్రస్తుతం మాస్కోలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో చర్చలు జరుపుతారు. భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు పుతిన్ భారత్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. రెండు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక, వ్యూహాత్మక మైత్రిని మరింత విస్తరించడంపై ఇద్దరు నేతలు దృష్టి పెడతారు.

పాన్‌కార్డుల కేసులో ఆజంఖాన్‌కు ఏడేళ్ల జైలు

రాంపుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపుర్ జైలు నుంచి విడుదలై రెండు నెలలు కూడా గడవకముందే సమాజ్‌వాదీ పార్టీ నేత మహమ్మద్ ఆజంఖాన్ సోమవారం మళ్లీ జైలుకు వెళ్లారు. 2019లో రెండు వేర్వేరు పుట్టిన తేదీలతో రెండు పాన్ కార్డులను మోసపూరితంగా సంపాదించిన నేరానికి ఆజంఖాన్‌తో పాటు ఆయన కుమారుడు అబ్దుల్లాకూ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు తలా ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. సీతాపుర్ జైలులో 23 నెలలు ఉన్న ఆజంఖాన్ సెప్టెంబరు 23న విడుదలయ్యారు.

అస్సాంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ

దిల్లీ: అస్సాంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. రాష్ట్రంలో తుది ఓటరు జాబితా 2026, ఫిబ్రవరి 10న ప్రచురించాలని నిర్ణయించింది. జాబితా సవరణలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఓటరు నమోదు పత్రాలను అందించడానికి బదులు ముందే నింపిన రిజిస్టరు సాయంతో ఓటరు జాబితాను సవరిస్తారు. "అస్సాంలో పౌరసత్వానికి సంబంధించి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో అక్కడ ఇప్పటికే పౌరసత్వ పరిశీలన జరుగుతోంది. అది చివరి దశకు చేరుకుంది కూడా. అందుకే అస్సాంలో ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)కు బదులు ప్రత్యేక సవరణ(ఎస్ఆర్) చేపడుతున్నాం" అని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్వాగతించారు. తమ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

వీసా రహిత ఇరాన్ ప్రయాణ సదుపాయం నిలిపివేత

దిల్లీ: భారతీయులు వీసా అవసరం లేకుండా ఇరాన్‌లో ప్రయాణించే సదుపాయాన్ని నిలిపివేశారు. భారతీయుల్ని ఉద్యోగాలకు సంబంధించిన తప్పుడు హామీల ప్రాతిపదికన తమ దేశానికి తీసుకొస్తున్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర దేశాలకు తీసుకువెళ్లే ముందు తాత్కాలిక ప్రాతిపదికన ఇరాన్‌కు తరలిస్తున్నారన్న సమాచారమూ ఈ నిర్ణయానికి దోహద పడింది. సాధారణ భారతీయ పౌరులు వీసా లేకుండా ఇరాన్‌లో ప్రయాణించడంపై విధించిన నిలిపివేత ఆదేశాలు ఈనెల 22 నుంచి అమలులోకి వస్తాయి. నేరగాళ్ల ముఠాలు ఈ సదుపాయాన్ని దురుపయోగం చేయకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది.

ఆయుధ నిల్వల ఆరోపణలపై బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజ్‌భవన్ ప్రాంగణంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేశారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన ఆరోపణలను గవర్నర్ సీవీ ఆనంద బోస్ తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాజ్‌భవన్‌లో భద్రతా సిబ్బందితో గవర్నర్ తనిఖీలు చేయించారు. ''ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేశారా? అని గుర్తించేందుకు కోల్‌కతా పోలీసులు, కేంద్ర బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కూడిన బృందానికి గవర్నర్ బోస్ నేతృత్వం వహించారు'' అని ఓ అధికారి మీడియాకు తెలిపారు. ప్రస్తుతం బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కొనసాగుతోంది. ఎన్నికల ప్రక్రియ ప్రక్షాళనకు 'ఎస్ఐఆర్' ఎంతో అవసరమని శనివారం గవర్నర్ వ్యాఖ్యానించారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే గవర్నర్, రాజ్‌భవన్ లక్ష్యంగా చేసుకొని టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ ఆరోపణలు గుప్పించారు. "రాజ్‌భవన్ లోపల భాజపా నేరస్థులకు గవర్నర్ ఆశ్రయం కల్పించారు. వారికి బాంబులు, తుపాకులు సమకూర్చారు" అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో రాజ్‌భవన్ ప్రాంగణంలో తనిఖీలు చేయించాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు "సోదాల కోసం రాజ్‌భవన్ ప్రాంగణాన్ని ఖాళీ చేయించారు. వివిధ విభాగాల అధికారులు సైతం ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గవర్నర్ వెంట జర్నలిస్టులు కూడా ఉన్నారు. ఇదంతా ప్రత్యక్ష ప్రసారం చేయించారు" అని సంబంధిత అధికారి తెలిపారు.



కోల్‌కతాలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆనంద బోస్ సమక్షంలో తనిఖీలు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను బహిర్గతం చేసేందుకు మద్దతివ్వండి

- ట్రంప్ సంచలన నిర్ణయం

వాషింగ్టన్: అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు సంబంధించిన విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట మార్చారు. ఈ కేసు ఫైల్స్‌ను బహిర్గతం చేసే బిల్లుకు మద్దతు ఇవ్వాలని హౌస్ రిపబ్లికన్లను కోరారు. దీన్ని ఇంతకుముందు వ్యతిరేకించిన ఆయన.. ఇప్పుడు నిర్ణయాన్ని మార్చుకోవడం అమెరికాలో సంచలనంగా మారింది. "దాచడానికి ఏమీ లేదు" అని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రిపబ్లికన్ పార్టీ విజయాల నుంచి దృష్టి మరల్చడానికే 'రాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్'లు సృష్టించిన తప్పుడు ప్రచారం అని ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసును ఉద్దేశించి అన్నారు.

రిపబ్లికన్లలోనే భిన్నాభిప్రాయం

ఎప్‌స్టీన్ ఫైల్స్ బహిర్గతం అంశంపై రిపబ్లికన్ పార్టీలోనే తీవ్ర విభేదాలు తలెత్తాయి. ట్రంప్‌నకు గట్టి మద్దతుదారు అయిన జార్జియా ప్రతినిధి మార్జోరీ టేలర్ గ్రీన్ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడంతో ఆమెపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బిల్లు ఆమోదానికి కావాల్సినన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉండటంతోనే ఆయన ఈ విషయంలో మాట మార్చారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సొంత పార్టీలో వ్యతిరేకత వ్యక్తమైనా.. ఆయన ఇలా యూ-టర్న్ తీసుకోవడం చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. ఈ వారంలోనే చట్టసభలో ఎప్‌స్టీన్ ఫైల్స్ బహిర్గతానికి సంబంధించిన బిల్లు ఓటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది.



వృశ్చిక మాసం తొలి రోజైన సోమవారం శబరిమల అయ్యప్ప ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

శబరిమలకు పోటెత్తిన భక్తులు

శబరిమల: మండల-మకరవిలక్కు వార్షిక తీర్థయాత్ర ప్రారంభం సందర్భంగా కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో తొలిరోజే భక్తుల రద్దీ భారీగా పెరిగింది. సోమవారం తెల్లవారుజామున నుంచే భక్తుల తాకిడి పెరిగినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డ్(టీడీబీ) అధికారులు తెలిపారు. రద్దీని నియంత్రించేందుకు రోజుకు 90 వేల మందినే దర్శనానికి అనుమతిస్తున్నామని పేర్కొన్నారు. వర్చువల్ క్యూ విధానం ద్వారా 70వేల మంది, స్పాట్ బుకింగ్ ద్వారా మరో 20వేల దర్శనాలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

పులుల సంరక్షణ కేంద్రాల చుట్టూ రక్షిత పర్యావరణ జోన్‌లు

- ఏడాదిలోగా ప్రకటించాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: పెద్ద పులుల సంరక్షణ కేంద్రాల చుట్టూ రక్షిత పర్యావరణ జోన్(ఈఎస్‌జడ్)లను ఏడాదిలోగా ప్రకటించాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఆ తరహా వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల బఫర్ జోన్‌ల చుట్టూ కిలోమీటరు పరిధిలో గనుల తవ్వకం కార్యకలాపాలపై నిషేధం విధించింది. జిమ్ కార్బెట్ పులుల సంరక్షణ కేంద్రంలో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, అనుమతిలేని నిర్మాణాలను కూల్చివేయాలని, అక్రమంగా చెట్ల నరికివేత, అక్రమ నిర్మాణాల కారణంగా జరిగిన విధ్వంసాన్ని పరిష్కరించాలని ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పులుల నివాస ప్రాంతానికి కిలో మీటరు పరిధిలో మైనింగ్ కార్యకలాపాల్ని పూర్తిగా నిషేధిస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. ఈ అంశంపై 80 పేజీల తీర్పు వెలువరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ అందులో 28 పేజీలను పులుల సంరక్షణ కేంద్రాల్లో జరిగిన పర్యావరణ విధ్వంసానికి కేటాయించారు. జిమ్ కార్బెట్ టైగర్ రిజర్వు ప్రాంతంలో పర్యావరణ ఉల్లంఘనలను పరిశీలించి జరిగిన నష్టాన్ని మదింపు చేసి పునరుద్ధరణ చర్యలను సిఫార్సు చేసేందుకు 2024 మార్చిలో సుప్రీం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సులకు న్యాయస్థానం ఆమోదం తెలిపింది. నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు కార్బెట్ టైగర్ రిజర్వును పునరుద్ధరించేందుకు రెండు నెలల్లో ఒక ప్రణాళికను సమర్పించాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

సీబీఐకి సుప్రీం అక్షింతలు

దిల్లీ: హిమాచల్ ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు చెందిన అధికారి విమల్ నేగి హత్యకు సంబంధించి సీబీఐ విచారణ తీరును సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా తప్పుపట్టింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న కొందరు అధికారుల్ని పూర్తిగా బోగస్ అధికారులని కోర్టు పేర్కొంది. ఈ కేసులో దేశ్ రాజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన ముందస్తు బెయిలు దరఖాస్తుపై విచారణ జరిపిన జస్టిస్ ఎహసానుల్లా అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర ఈ వ్యాఖ్యలు చేశారు. హత్యకు సంబంధించి సరైన సాక్ష్యాధారాలు సేకరించడంలో సీబీఐ వైఫల్యాన్ని ధర్మాసనం ఎండగట్టింది. "సీబీఐలో ఎలాంటి అధికారులు పనిచేస్తున్నారో చూడండి. పూర్తిగా బోగస్ అధికారులు. వీళ్లు ఉద్యోగంలో కొనసాగడానికి అనర్హులు. మీరు సమర్పించిన ఈ పత్రం ఎందుకూ పనికిరాదు. ఇందులో అన్నీ ఊహాగానాలే. ఇదిగో సాక్ష్యం ఇక్కడుందని ఎక్కడా రాయనే లేదు" అని ధర్మాసనం పేర్కొంది.

నైజీరియాలో 25 మంది బాలికల అపహరణ

అబూజా: వాయువ్య నైజీరియాలో సాయుధ దుండగులు మరోసారి రెచ్చిపోయారు. 25 మంది పాఠశాల బాలికల్ని వారి డార్మిటరీ నుంచి అపహరించుకుపోయారు. సోమవారం తెల్లవారు జామున ఈ సంఘటన జరిగింది. దురాగతాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఒక పాఠశాల ఉద్యోగిని హతమార్చారు. మరో ఉద్యోగి ఈ దాడిలో గాయపడ్డాడు. ఈ అపహరణకు ఏ ఒక్క సంస్థా ఇప్పటివరకూ బాధ్యత వహించలేదు. ఈ సంఘటన తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో మాగాలోని ఒక బోర్డింగ్ స్కూలులో జరిగిందని పోలీసులు తెలిపారు. దుండగులు అత్యాధునిక ఆయుధాలు కలిగివున్నారని, పాఠశాల భద్రతా సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి బాలికల్ని తీసుకుపోయారని వివరించారు. పాఠశాల విద్యార్థినుల్ని అపహరించుకు పోవడం నైజీరియాలో తరచూ సంభవిస్తూ ఉంటుంది. 2014లో బోకో హరం అనే మిలిటెంట్ సంస్థ చిబాక్ అనే ప్రదేశం నుంచి 276 మంది పాఠశాల విద్యార్థినుల్ని అపహరించుకుపోవడం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ఇప్పటి వరకూ 1500 మంది విద్యార్థినులు సాయుధ మూకల చేతిలో అపహరణకు గురయ్యారు.

'డిజిటల్ అరెస్టు' నిందితులను విడుదల చేయొద్దు

- మహిళా న్యాయవాదిని మోసగించిన కేసులో న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు ప్రత్యేక ఆదేశం
- త్వరలో దేశవ్యాప్త మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడి



దిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం అసాధారణ నిర్ణయం తీసుకుంది. డిజిటల్ అరెస్టు కేసులో నిందితులను విడుదల చేయరాదని కోర్టులను ఆదేశించింది. అసాధారణ వైపరీత్యానికి ప్రత్యేకమైన చికిత్స అవసరమని పేర్కొంది. 'డిజిటల్ అరెస్టు' సమస్య నివారణకు కఠిన చర్యలు తప్పనిసరి అని అభిప్రాయపడింది. సైబర్‌నేరగాళ్లకు ముకుతాడు బిగించేలా త్వరలో దేశవ్యాప్త మార్గదర్శకాలు జారీ చేస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం వెల్లడించింది. డిజిటల్ అరెస్టు పేరుతో సుప్రీంకోర్టు మహిళా న్యాయవాది (72) నుంచి రూ.3.29 కోట్లను దోచుకున్న నిందితుడు విజయ్ ఖన్నా, సహ నిందితుడి విడుదలకు ఏ కోర్టూ ఉత్తర్వులివ్వరాదని ఆదేశించింది. ఉపశమనం కోసం నిందితులిద్దరూ సుప్రీంకోర్టు వద్దకు రావాలని తెలిపింది. అసాధారణ సమస్యపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దేశమంతటికీ సరైన సందేశాన్ని పంపించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. దర్యాప్తు సంస్థలు, కోర్టులు, ప్రభుత్వ విభాగాల అధికారులమని చెబుతూ వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరించి, భయపెట్టి, స్వీయనిర్బంధానికి గురిచేసి భారీ మొత్తంలో డబ్బు గుంజుతున్న మోసాలపై సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. 'వ్యక్తుల స్వేచ్ఛకు మేం వ్యతిరేకం కాదు. అయితే, ఇది అసాధారణమైన కేసు. దీనిపట్ల కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. తదుపరి విచారణ వరకు వేచి చూడండి' అని విచారణ సమయంలో జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత పరిష్కారం చూడాలి

- దిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: ప్రతి ఏడాది శీతాకాలం ప్రారంభానికి ముందు నుంచే దేశ రాజధాని దిల్లీలో మొదలయ్యే తీవ్ర కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఆలోచించాలని, ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతో దానిని అధిగమించలేమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పాత వాహనాలు, డీజిల్ జనరేటర్లు, నిర్మాణ కార్యకలాపాల వంటి వాటిపై నిషేధం విధించాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) పేరుతో ప్రతి ఏడాది వీటిని అమలు చేస్తున్నా వాయు సూచీల నాణ్యత మెరుగుపడకపోవటాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం సోమవారం విచారణ సమయంలో ప్రస్తావించింది. పర్యావరణం, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని తెలిపింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ ఆదేశాలను పంజాబ్, హరియాణా ప్రభుత్వాలు గట్టిగా అమలుచేయాలని సూచించింది. కాలుష్య సమస్య శాశ్వత నివారణకు సమగ్ర ప్రణాళికతో ఈ నెల 19న జరిగే విచారణకు హాజరుకావాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిని ఆదేశించింది.

ఆర్మీ క్వార్టర్లలోని మసీదుకు సాధారణ పౌరులను అనుమతించాలన్న పిటిషన్ కొట్టివేత

దిల్లీ: చెన్నైలోని మిలిటరీ క్వార్టర్లలో ఉన్న మసీదులో ప్రార్థనలకు సాధారణ పౌరులను కూడా అనుమతించాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. అలా అనుమతిస్తే భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం పేర్కొంది.

టెట్రాప్యాక్‌లో మద్యం అమ్మకాలు ఆశ్చర్యం కల్గిస్తున్నాయి..

- సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: టెట్రా ప్యాక్‌లో మద్యం అమ్మకాన్ని అనుమతించొచ్చా అన్న అంశంపై సుప్రీంకోర్టు సోమవారం దృష్టి సారించింది. "ఏమిటిది? జ్యూస్ ప్యాకెట్టా? టెట్రా ప్యాక్‌లలో మద్యం అనుమతించవచ్చా?" అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. "ఒరిజినల్ చాయిస్" విస్కీ బ్రాండును ఉత్పత్తి చేసే జాన్ డిస్టిలరీస్, "ఆఫీసర్స్ చాయిస్" విస్కీ ఉత్పత్తి చేసే అలీడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ప్రసిద్ధ మద్యం సంస్థల మధ్య తలెత్తిన ట్రేడ్ మార్కు వివాదంపై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. మద్యాన్ని ఈ విధంగా ప్యాకింగ్ చేయడం ప్రమాదకరం, మోసపూరితం అని కోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వం ఇలాంటి ప్యాకెట్లలో మద్యం అమ్మకాలను అనుమతించడం తమకు ఆశ్చర్యం కలిగిస్తోందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇదో తీవ్ర విషయమని ధర్మాసనం పేర్కొంది. ఈ రెండు సంస్థల వివాదాన్ని స్నేహ పూర్వకంగా పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావును మధ్యవర్తిగా నియమించింది. ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీ రెండు సంస్థలు ఉత్పత్తి చేసిన విస్కీ టెట్రాప్యాక్‌లను కోర్టు ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా "ఏమిటిదీ, జ్యూస్ ప్యాకెట్టా?" అని కోర్టు ప్రశ్నించింది. "టెట్రాప్యాక్‌లో మద్యాన్ని తొలిసారి చూస్తున్నాను. ఇది చాలా ప్రమాదకరమని మేం భావిస్తున్నాం. వీటిని విద్యార్థులు తమ బ్యాగుల్లో కళాశాలలు, పాఠశాలలకు తీసుకెళ్లే ప్రమాదం ఉంది. తల్లిదండ్రుల్ని పిల్లలు అవలీలగా మోసగించొచ్చు" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.



24న ఐఎన్ఎస్ మహే ప్రారంభం

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: భారత నౌకాదళానికి చెందిన తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో (ఏఎస్‌డబ్ల్యూఎస్) వాటర్ క్రాఫ్ట్ ఐఎన్ఎస్ మహేను 24న ప్రారంభించనున్నట్లు సోమవారం నేవీ వర్గాలు వెల్లడించాయి. కొచ్చిన్ షిప్‌యార్డులో నిర్మించిన ఈ నౌకలో 80 శాతం స్వదేశీ సాంకేతికతను వినియోగించారు. నౌక వెస్టర్న్ సీబోర్డు ఆధీనంలో కార్యకలాపాలు కొనసాగించనుంది. ముంబయిలో నౌకను జాతికి అంకితం చేసి నేవీ సర్వీసులోకి తీసుకొనున్నామని నేవీ వర్గాలు తెలిపాయి.

విద్యార్థులకు ఉచిత ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచిత ఎన్ఎంఎంఎస్ నమూనా ప్రవేశ పరీక్షను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట సుబ్బారావు, నరేష్‌మార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 20లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు 95027 66455, 99484 37301 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

29 నుంచి ఉపాధ్యాయులకు క్రీడలు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులకు ఈ నెల 29 నుంచి క్రీడా పోటీలు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు ఉంటాయి. మండల స్థాయిలో 29, 30 తేదీల్లో, డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14, జిల్లా స్థాయిలో డిసెంబరు 20, 21, 22, రాష్ట్ర స్థాయిలో జనవరి 2, 3, 4 తేదీల్లో పోటీలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో 679 మండల, 74 డివిజనల్, 26 జిల్లా కేంద్రాల్లో ఈ పోటీలు ఉంటాయి. ప్రతి మండలానికి రూ.5వేలు, డివిజన్, జిల్లాకు రూ.20వేల చొప్పున పాఠశాల విద్యాశాఖ నిధులు విడుదల చేసింది.

వీఎల్‌జీకి కర్నూలు విమానాశ్రయ నిర్వహణ బాధ్యతలు

ఈనాడు, అమరావతి: కర్నూలు విమానాశ్రయ నిర్వహణ బాధ్యతలను వీఎల్‌జీ సెనిబిలీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు అప్పగించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సంస్థకు ఏడాదికి రూ.3.49 కోట్లు చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎల్‌ఏపీ జారీ చేయాలని ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థను ప్రభుత్వం ఆదేశించింది.

రాజధాని పనుల్లో చిన్నగుత్తేదార్లకు అవకాశం కల్పించాలి

మంత్రి నారాయణకు సబ్కా లేఖ

ఈనాడు, అమరావతి: సీఆర్‌డీఏ పరిధిలో చేపడుతున్న పనుల్లో చిన్న, మధ్య తరహా గుత్తేదార్లకు కూడా అవకాశం కల్పించాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) కోరింది. ఈ మేరకు పురపాలక శాఖ మంత్రి నారాయణకు లేఖ రాసినట్లు సబ్కా రాష్ట్ర కోఆర్డినేటర్ కె.శివకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్ద ప్యాకేజీలుగా కాకుండా.. రూ.50 కోట్లలోపు, రూ.5-10 కోట్లకు వేర్వేరుగా టెండర్లు పిలిస్తే.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సబ్కాలోని గుత్తేదారులకు పనులు దక్కుతాయని, దీనివల్ల స్థానికులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఇకపై పిలవబోయే టెండర్లలో దీనిని పరిగణనలోకి తీసుకోవాలని, జాయింట్ వెంచర్లకు టెండర్లు వేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

రాజయ్యపేట సందర్శన 21 నుంచి 29కి వాయిదా

ఈనాడు, అమరావతి: బల్క్ డ్రగ్ పార్క్ సమస్యతో పాటు మత్స్యకారుల ఇబ్బందులను పరిశీలించేందుకు జాతీయ మత్స్యకార సంఘం జాతీయ కమిటీ సభ్యులు ఈ నెల 29న నక్కపల్లి మండలంలోని రాజయ్యపేటను సందర్శించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 రోజునే సందర్శన ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతినిధులు రావడం, అనుమతుల ప్రక్రియ పూర్తి చేయడం కోసం 29కి వాయిదా వేసినట్లు వెల్లడించారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పుట్టా గురు వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారుగా జి.కల్యాణ్‌ను నియమించినట్లు ప్రకటించారు.

తిరుమలేశ్వరరావుకు నివాళులర్పించిన తెదేపా నేతలు

ఈనాడు, అమరావతి: ఏపీ నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమలేశ్వరరావు మృతిపై తెదేపా నేతలు సంతాపం తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి: ఎస్పీడీ

ఈనాడు, అమరావతి: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ఉపాధి కోసం వలస వెళ్లే పిల్లలను సీజనల్ వసతి గృహాల్లో చేర్చాలని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతూ 'బడి వయసు పిల్లలు కూలీ, యాచక వృత్తుల్లో కనిపించకూడదు. ఏ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది వలస వెళ్తున్నారో గుర్తించి ఆ ప్రాంతాలలో పాఠశాలల నుంచి వలస వచ్చిన వారికి వారి మాతృభాషలోనే బోధించాలి' అని సూచించారు.

రాజధాని వరద ముంపు నివారణకు

రెండో పంపింగ్ స్టేషన్‌కు టెండర్లు

- రూ.595 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 8,400 క్యూసెక్కుల సామర్థ్యం

ఈనాడు, అమరావతి: రాజధాని వరద నివారణ ప్రణాళికలో భాగంగా రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సోమవారం టెండర్ ప్రకటన విడుదల చేసింది. మొత్తం రూ.595 కోట్ల వ్యయంతో (పన్నులతో కలిపి) 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో ఈ పంపింగ్ స్టేషన్‌ను నిర్మిస్తారు. ఉండవల్లి వద్ద 2014-19 మధ్య నిర్మించిన మొదటి పంపింగ్ స్టేషన్‌కు పక్కనే దీన్ని నిర్మిస్తారు. పంపింగ్ స్టేషన్‌ను గుత్తేదారు సంస్థే 15 ఏళ్ల పాటు నిర్వహించేలా టెండర్ నిబంధన రూపొందించారు. ఇప్పుడు కట్టబోయే పంపింగ్ స్టేషన్‌లో ఒక్కొక్కటి 6 వేల హార్స్‌పవర్ సామర్థ్యం గల 13 మోటార్లు ఉంటాయి.

కొండవీటివాగు వరద నీటిని ఎత్తిపోసేందుకు

కొండవీటివాగు రాజధాని అమరావతి మీదుగా వెళ్లి ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. అమరావతికి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో పాటు, పాలవాగు వంటి ఇతర చిన్న వాగులు, వంకలు కూడా కొండవీటి వాగులో కలుస్తాయి. కృష్ణా నదికి వరద లేనప్పుడు.. కొండవీటి వాగులో ఎంత ప్రవాహం వచ్చినా నదిలోకి వెళ్లిపోతుంది. కానీ కృష్ణానదికి వరద వచ్చినప్పుడే.. కొండవీటి వాగు కూడా ఉద్ధృతంగా ప్రవహిస్తే ఆ నీరు కృష్ణా నదిలో కలవకుండా వెనక్కి తన్నుతుంది. అలాంటి పరిస్థితి తలెత్తినప్పుడు రాజధాని ప్రాంతం ముంపునకు గురికాకుండా ఉండేందుకు వరద నివారణ ప్రణాళికను సీఆర్‌డీఏ తయారు చేసింది. కొండవీటి వాగుకు తీవ్రస్థాయిలో వరద పోటెత్తితే గరిష్ఠంగా 23 వేల క్యూసెక్కుల జలాలు వస్తాయని అంచనా. వాటిని కృష్ణా నదిలోకి ఎత్తిపోసేందుకు మూడు పంపింగ్ స్టేషన్లు అవసరమని ప్లాన్ చేశారు. ఈ మేరకు మొదటిది ఉండవల్లి వద్ద 5,000 క్యూసెక్కుల సామర్థ్యంలో 2019కి ముందే నిర్మించారు. ఇప్పుడు 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. మూడో పంపింగ్ స్టేషన్‌ను వైకుంఠపురం వద్ద 8,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యంతో నిర్మిస్తారు.

కొండవీటివాగు, గుంటూరు ఛానల్‌పై రెండు వరుసల బ్రిడ్జి

ప్రకాశం బ్యారేజీ సమీపంలో కొండవీటివాగు, గుంటూరు ఛానల్‌పై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జికి సమాంతరంగా.. రెండు వరుసల బ్రిడ్జి, షిప్‌లాక్ నిర్మాణానికి రూ.55.85 కోట్ల అంచనా వ్యయంతో ఏడీసీ టెండర్లు పిలిచింది. కృష్ణా కరకట్ట రహదారి మీదకు వెళ్లే మార్గంలో...కొండవీటివాగుకు సంబంధించిన లాకులు, దానిపై సన్నటి బ్రిడ్జి ఉన్నాయి. కృష్ణా కరకట్ట మీదుగా రాజధానిలోకి రాకపోకలు ప్రస్తుతం ఈ బ్రిడ్జి మీదుగానే సాగుతున్నాయి. కరకట్ట రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలన్నది ప్రతిపాదన. దానికి తగ్గట్టుగా నాలుగు వరుసల బ్రిడ్జిలు కూడా అవసరం. ఇందులో భాగంగా తొలుత రెండు వరుసల బ్రిడ్జి నిర్మిస్తారు. అది అందుబాటులోకి వచ్చాక.. .. ప్రస్తుతం ఉన్న సన్నటి బ్రిడ్జిని తొలగించి... అక్కడ రెండు వరుసలతో బ్రిడ్జి నిర్మిస్తారు. రాజధానిలో అభివృద్ధి చేస్తున్న కాలువల్లో జల విహారానికి కూడా సీఆర్‌డీఏ ఏర్పాట్లు చేస్తోంది. రాజధానిలోని కాలువల్లోంచి బోట్లు కృష్ణా నదిలోకి వెళ్లేందుకు వీలుగా... ఇప్పుడు నిర్మించనున్న బ్రిడ్జికి షిప్‌లాక్ ఏర్పాటు చేయనున్నారు.

మూల కణాల దాతల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన 'ఆప్తా'

ఈనాడు, అమరావతి: రక్త క్యాన్సర్లతో బాధపడేవారి ప్రాణాలు కాపాడే లక్ష్యంతో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ఆధ్వర్యంలో మూల కణాల (స్టెమ్ సెల్) దాతల నమోదు కార్యక్రమం ప్రారంభించామని ఆప్తా అధ్యక్షుడు మధువల్లి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అట్లాంటాలో గాయని సునీత చేతుల మీదుగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఆప్తా సంయుక్త కోశాధికారి వెంకట శివ గోక్యాడ, సంయుక్త కార్యదర్శి ప్రియాంక గడ్డం, ధీరజ్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారని తెలిపారు. ప్రపంచ స్టెమ్ సెల్ రిజిస్ట్రీ డీకేఎంఎస్ భాగస్వామ్యంతో రిజిస్ట్రేషన్ డ్రైవ్ ప్రారంభించామన్నారు. దక్షిణాసియా మూలాలున్న దాతల సంఖ్య పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



అట్లాంటాలో గాయని సునీతను సత్కరిస్తున్న ఆప్తా సభ్యులు


స్టెమ్ సెల్ డోనర్ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఆప్తా ప్రతినిధులు

సవేంద్రరెడ్డి కేసులో సీబీఐ విచారణపై స్టే పొడిగింపు

ఈనాడు, దిల్లీ: వైకాపా వాలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కుంచాల సౌందరరెడ్డి (సవేంద్రరెడ్డి) అరెస్టుకు దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపి తమకు ప్రాథమిక నివేదిక ఇవ్వాలంటూ ఏపీ హైకోర్టు జారీచేసిన ఆదేశాలపై అక్టోబర్ 7న విధించిన స్టేను సుప్రీంకోర్టు పొడిగించింది. హైకోర్టు ఉత్తర్వులను సవాలుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై సోమవారం విచారించిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ వీఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చింది. ఇందులో ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ ఈ కేసులో సీబీఐ దర్యాప్తుపై స్టే విధిస్తూ జారీచేసిన ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు పేర్కొంది.

ఈ-స్టాంప్ అక్రమాలపై విచారణ జరిపించండి

హైకోర్టులో పిల్ దాఖలు

ఈనాడు, అమరావతి: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐతో నిష్పాక్షిక దర్యాప్తు జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అనంతపురం వైకాపా మాజీ ఎంపీ తలారి రంగయ్య హైకోర్టులో పిల్ వేశారు. బోయ యర్రప్ప, ఆయన భార్య భార్గవి కళ్యాణదుర్గంలో ఈ-సేవ కేంద్రాన్ని నిర్వహించారన్నారు. తక్కువ విలువ కలిగిన ఈ-స్టాంపులను అక్కడ కొని, వాటిని ఎక్కువ విలువ కలిగిన స్టాంపులుగా మార్చి ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు నిర్వహించిందని ఆరోపించారు. కళ్యాణదుర్గం తెదేపా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నియంత్రణలో ఉన్న బెంగళూరులోని ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లోన్ దస్త్రాలు, ఆర్థిక లావాదేవీలపై లోతైన విచారణ జరిపించాలని కోరారు.

జీతం ఇవ్వడం లేదని ప్రాణమే తీసింది!

- ఓ భార్య ఘాతుకం

మల్లాపూర్, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లిలో మండపల్లి భూమేశ్ (34) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సంపాదించిన డబ్బులను కుటుంబ అవసరాలకు ఇవ్వడం లేదనే కోపంతో కట్టుకున్న భార్యే భర్తను కడతేర్చినట్టు పోలీసులు తెలిపారు. సీఐ అనిల్‌కుమార్, ఎస్సై రాజు కథనం ప్రకారం.. జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామానికి చెందిన భూమేశ్‌కు కొత్తదాంరాజుపల్లికి చెందిన విజయతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులు కొద్ది సంవత్సరాలు మెట్‌పల్లి అర్బన్ కాలనీలో నివాసం ఉన్నారు. వారి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో ఇటీవల విజయ.. తన తల్లి


భూమేశ్

లక్ష్మి వద్దకు వచ్చి ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కొత్తదాంరాజుపల్లిలో అత్తగారింటికి వచ్చిన భూమేశ్‌కు భార్య విజయ, అత్తలతో జీతం డబ్బుల విషయమై గొడవ జరిగింది. సోమవారం ఉదయం రైస్ మిల్లు సమీపంలోని ఓ సంఘం భవనంలో భూమేశ్ చనిపోయి ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు సమాచారం అందించడంతో మల్లాపూర్ ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. ఆదివారం రాత్రి భూమేశ్ నిద్రిస్తున్న సమయంలో మెడకు చున్నీతో ఉరి వేసి హతమార్చినట్టు గుర్తించారు.

సచివాలయాలకు పర్యవేక్షకులొస్తున్నారు!

- 660 మంది డిప్యూటీ ఎంపీడీవోలకు త్వరలో బాధ్యతలు
- మున్సిపల్, జిల్లా స్థాయిలోనూ అధికారుల నియామకం

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాలకు మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో పర్యవేక్షకులొస్తున్నారు. తొలి దశలో మండల స్థాయిలో పర్యవేక్షక అధికారుల నియామకాన్ని త్వరలో చేపట్టనున్నారు. రెండో దశలో మున్సిపల్, జిల్లా స్థాయిలో అధికారులను కేటాయిస్తారు. ఈ నెలాఖరులోగా మొత్తం నియామక ప్రక్రియ పూర్తి చేయాలని సచివాలయాలశాఖ యోచిస్తోంది.

● సచివాలయాలపై మండల స్థాయి పర్యవేక్షణాధికారులుగా రాష్ట్ర వ్యాప్తంగా 660 మంది డిప్యూటీ మండల పరిషత్ అధికారులను నియమించనున్నారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, జడ్పీ, మండల కార్యాలయాల్లో పరిపాలన అధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎంపీడీవోలుగా ఇటీవల పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. వీరందరి సేవలను డిప్యుటేషన్‌పై సచివాలయాలశాఖ వినియోగించుకోనుంది. పదోన్నతి పొందిన వారి జాబితా కొద్ది రోజుల క్రితం సచివాలయాలశాఖకు చేరింది.

● వార్డు సచివాలయాలపై పర్యవేక్షణ అధికారులుగా మున్సిపల్ అధికారులను డిప్యుటేషన్‌పై తీసుకుంటారు. సచివాలయాలశాఖ అధికారులు పురపాలకశాఖతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 పర్యవేక్షణాధికారుల నియామకం కోసం ఉప, అదనపు కమిషనర్లను డిప్యుటేషన్‌పై పంపాలని కోరారు. ఇందుకు సంబంధించి పురపాలకశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. వారం, పది రోజుల్లో వీరి జాబితా సచివాలయాలశాఖకు పంపే అవకాశం ఉంది.

● జిల్లా స్థాయి సచివాలయ పర్యవేక్షణాధికారులుగా జిల్లా పరిషత్ సీఈవో, డిప్యూటీ సీఈవో, జాయింట్ డైరెక్టర్ క్యాడర్ అధికారులను నియమించనున్నారు. ఇందులో 70% పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, మరో 30% పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల అధికారులను డిప్యుటేషన్‌పై సచివాలయాల శాఖ తీసుకుంటుంది. నెలాఖరులోగా వీరి నియామక ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

3 క్యాటగిరీలుగా సచివాలయాలు

● కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సచివాలయాలను ఏ, బీ, సీ క్యాటగిరీలుగా విభజించింది. ఎ క్యాటగిరీలో ఆరుగురు, బీ-లో 7, సి-లో 8 మంది ఉద్యోగులు ఉంటారు. వీరికి జనరల్, స్పెషల్ పర్పస్ ఫంక్షనరీలుగా బాధ్యతలు అప్పగించింది. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో వీటిపై పర్యవేక్షణ కోసం మూడు దశల్లో అధికారులను నియమిస్తోంది.

దేశ పురోభివృద్ధిలో గ్రంథాలయాలది కీలకపాత్ర

- అంతర్జాతీయ సదస్సులో వక్తలు
- లంకా సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

తిరుపతి (ఎస్వీయు), న్యూస్‌టుడే: గ్రంథాలయాలను విజ్ఞాన భాండాగారాలుగా తీర్చిదిద్దిన దేశాల్లో అక్కడి ఆర్థికవ్యవస్థ, యువత, విద్యార్థులు పురోభివృద్ధి బాటలో పయనిస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. కాలానుగుణంగా గ్రంథాలయాలను తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో 'లైబ్రరీ 2047- డెమోక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. దాదాపు ఎనిమిది దేశాల నుంచి 500 మంది లైబ్రరీ సైన్స్ ప్రొఫెసర్లు, గ్రంథ పాలకులు హాజరయ్యారు. వర్సిటీ వీసీ ఆచార్య నరసింగరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లోని విజ్ఞానాన్ని బాహ్య ప్రపంచానికి వ్యాపింపజేయాలని అభిప్రాయపడ్డారు. అనంతరం ఎస్వీయూ, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం గ్రంథకర్త లంకా సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తితిదే ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణశర్మ మాట్లాడుతూ లంక సూర్యనారాయణ చిన్నతనం నుంచే లక్షల మందికి గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పంచారని, అనేక పుస్తకాలు ఉచితంగా అందజేసి దేశంలోనే ఆదర్శ వ్యక్తిగా నిలిచారని కొనియాడారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి సురేంద్ర నాయుడు, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


లంకా సూర్యనారాయణను జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించి, జ్ఞాపికను బహూకరిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు, విభీషణశర్మ తదితరులు


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పారావు, విజయభాస్కరరావు, డా.కొలిత బండార వీజేశేఖర, దేవకి మదల్లి, ఉమా కంజిలాల్, భూపతినాయుడు తదితరులు

విశాఖ ఉక్కుపై ప్రధానితో ప్రకటన చేయించాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఉండదని ప్రధాని మోదీ చేత ప్రకటన చేయించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయించాలని సోమవారం కోరారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగ సంస్థనా? మోదీ బినామీ కంపెనీయా? అని ప్రశ్నించారు. 30 వేల మంది కార్మికులుంటే 18 వేలకు కుదించారని, ఉక్కు ఉత్పత్తికి కావాల్సిన ముడిసరకును తగ్గించారని, ఐదు రోజులకు సరిపడానే అందుబాటులో ఉంచుతున్నారని, ఇదంతా స్టీల్ ప్లాంట్‌ను అమ్మేసే కుట్రలో భాగమని విమర్శించారు.



వీటికి టాలెంట్‌తో పని లేదు..

- ఇతరుల పట్ల దయతో ఉండటం.
- నిజాయతీతో జీవించడం.
- మనస్ఫూర్తిగా నవ్వడం.
- స్నేహితులతో గడపడం.
- ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం.
- చక్కగా నిద్రపోవడం. ✦ ఆటలాడటం.

ఈ పనులు చేయడానికి ఎలాంటి ప్రతిభా అవసరం లేదు. ఎవ్వరైనా చేయగలరు. కానీ చాలా మంది చేయలేకపోతున్నారు. చేసినవారికి ఆరోగ్యం, ఆనందం, సంతృప్తి గ్యారంటీ.

– బ్రాడ్ స్టుల్‌బర్గ్, రచయిత


సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినంగా ఉంటాం

- పనిచేస్తే ప్రోత్సహిస్తాం
- వైద్యారోగ్యశాఖ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరిక

ఈనాడు, అమరావతి: బోధన ఆసుపత్రులతోపాటు జిల్లా, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలాగైతే రోగులకు మెరుగైన వైద్య సేవలు ఎలా అందుతాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. వైద్యుల హాజరు, రోజువారీ చేసే ఓపీ పరీక్షల వివరాలతో నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. బాగా పనిచేస్తే ప్రోత్సహిస్తామని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయంలో సోమవారం ప్రభుత్వ వైద్యశాలలు, వైద్యుల పనితీరుపై మంత్రి సమీక్షించారు. ముఖ ఆధారిత హాజరులో కొందరు తప్పుడు పద్ధతులు అనుసరించి విధులకు గైర్హాజరు అవుతున్నారని, సంజాయిషీ నోటీసులు ఇస్తున్నా మార్పు కనిపించడంలేదని అసహనం వ్యక్తంచేశారు. బోధనాసుపత్రుల్లో పని చేసే అడ్మినిస్ట్రేటర్ల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. బోధన ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఇతర కీలక హోదాల్లో ఉన్నవారి జాబ్‌చార్ట్, పనితీరూ పరిశీలించాలని ఆదేశించారు. బాధ్యతతో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బందిని నెలవారీ గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఆయుష్మాన్ భారత్ ఐడీల ద్వారా రోగులకు చికిత్స జరిగేలా చూడాలని, క్యాన్సర్ చికిత్స వివరాలు నోటిఫైబుల్ రిజిస్ట్రీ ద్వారా ఆయా యాజమాన్యాలు వెల్లడించాలని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెట్టుబడులు రావడాన్ని ఓర్వలేకపోతున్న వైకాపా

శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి భారీ మొత్తంలో పెట్టుబడులు రావడాన్ని వైకాపా ఓర్వలేకపోతుందని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని, సుమారు 16 లక్షల ఉద్యోగాలు రానున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. "వైకాపా హయాంలో రాష్ట్రంలోని ఎన్నో పరిశ్రమల్ని మాజీ సీఎం జగన్ వెళ్లగొట్టారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు. కక్ష సాధింపుతో రాష్ట్ర భవిష్యత్తును దెబ్బకొట్టారు. అప్పుడు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయిన వారు సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ల కృషితో ఇప్పుడు తిరిగి వస్తున్నారు" అని అనురాధ పేర్కొన్నారు.

అమరావతిలో బీసీ భవనాలకు భూములు కేటాయించాలి

సీఎంకు రామచంద్రయాదవ్ లేఖ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో జనాభా ప్రాతిపదికన బీసీలకు భూములు కేటాయించాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. ఆ భూముల్లో ప్రభుత్వమే అన్ని బీసీ వర్గాలకూ సామాజిక భవనాలు, శిక్షణ, సాంస్కృతిక కేంద్రాలను నిర్మించి ఇవ్వాలని కోరారు. బీసీల్లో అత్యధిక, అధిక, మధ్యస్థ-స్వల్ప జనాభా ఉన్న సామాజికవర్గాలకు వరుసగా 20, 15, 10 ఎకరాల చొప్పున కేటాయించాలని కోరుతూ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. 'అమరావతి నిర్మాణం పేరిట ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలు సామాజిక న్యాయాన్ని విస్మరించేలా ఉన్నాయి. అమరావతిలో బీసీల వాటా ఎంత? వారి ఆత్మగౌరవానికి మీరిచ్చే విలువెంత? బీసీలంటే ఓటు బ్యాంకు కాదు, ఈ రాష్ట్రానికి పునాదిరాళ్లని ప్రభుత్వం గుర్తించాలి' అని పేర్కొన్నారు.

వైకాపా మైనార్టీ నేత భూ కబ్జా

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం తనకు మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని వైకాపా నేత, ఆ పార్టీ అనంతపురం నగర మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఆక్రమించాడని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని నగరానికి చెందిన జి.లక్ష్మీ వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. పలు సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మంత్రి కొలుసు పార్థసారథి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

● కుమార్తెకు ఇష్టపూర్వకంగా రాసిచ్చిన స్థలాన్ని తన కుమారుడు ఆక్రమించాడని తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం గాజులపల్లికి చెందిన వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు చేశారు.

● తన స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన పద్మజ కోరారు.

జైలులో వసతులు కల్పించాలని చెవిరెడ్డి పిటిషన్

ఈనాడు, అమరావతి: రోజూ ఇంటి నుంచి భోజనం, కుటుంబ సభ్యులు, న్యాయవాదులతో మాట్లాడేందుకు ప్రతి వారం మూడు చొప్పున ములాఖత్‌లు, రాసుకునేందుకు బల్ల, డీటీహెచ్ కనెక్షన్‌తో టీవీ తదితర సదుపాయాలు కల్పించాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం విజయవాడలోని ఏసీబీ కోర్టులో వేసిన పిటిషన్‌పై వాదనల నిమిత్తం న్యాయాధికారి మంగళవారానికి వాయిదా వేశారు.

ఈ వైరస్‌లు అత్యంత ప్రమాదకరం

- ఐసీఎంఆర్ వెల్లడి
- తగిన వైద్య పరిష్కారాల కోసం కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: మనదేశంలో క్లిష్టమైన అంటువ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్న వైరస్‌లను భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) గుర్తించింది. ఇటువంటి వైరస్‌ల జాబితాను ఐసీఎంఆర్‌లోని కమ్యూనికల్ డిసీజెస్ విభాగం తయారు చేసింది. దీనివల్ల అంటువ్యాధుల వ్యాప్తిపై నిఘా పెంపొందించేందుకు, తగిన దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు వీలవుతుందని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్యులు, శాస్త్రవేత్తలు, అంటు వ్యాధుల నిపుణులను సంప్రదించి ఈ జాబితాకు తుదిరూపం ఇచ్చారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్న తీరుతెన్నులు, రోగ నిర్ధారణ/ చికిత్స విధానాలను సైతం పరిశీలించారు. తీవ్రమైన అంటువ్యాధులకు కారణమవుతున్న వైరస్‌లను గుర్తించటమే కాకుండా, దీనిపై వైద్యులు, లేబొరేటరీ నిపుణులు, అంటు వ్యాధుల నిపుణులు, ప్రభుత్వంలోని విధాన నిర్ణేతలకు తగిన అవగాహన పెంపొందాలనే ఉద్దేశంతో ఈ కసరత్తు చేపట్టారు. తగిన వైద్య పరిష్కారాలను కనుగొనడానికి ఈ ప్రక్రియ దోహదపడుతుందని భావిస్తున్నారు.

ప్రమాదకర వైరస్‌ల జాబితా

✦ డెంగీ వైరస్ ✦ సాల్మొనెల్లా పారటైఫి ఏ, బి ✦ ఓరియెంటియా సత్సుగముషి ✦ ఇన్‌ఫ్లుయంజా వైరస్ ఏ, బి ✦ చికున్‌గున్యా వైరస్ ✦ చాందీపురా వైరస్ ✦ జికా వైరస్ ✦ క్యాసనూర్ ఫారెస్ట్ డిసీజ్ వైరస్ ✦ ఎంటెరో వైరసెస్ ✦ హ్యూమన్ హెర్పిస్ వైరసెస్ ✦ హంటా వైరస్ ✦ ఎబోలా వైరస్ ✦ మార్‌బర్గ్ వైరస్ ✦ ఎల్లో ఫీవర్ వైరస్ ✦ లాంగ్యా హెనిపావైరస్ ✦ రిఫ్ట్ వ్యాలీ ఫీవర్

రెండు వారాల యాత్ర.. ఉమ్రా

- బక్రీద్ నెల మినహా.. ఎప్పుడైనా వెళ్లే అవకాశం
- పరిమితులు లేకపోవడంతో తెలంగాణ నుంచి పెద్దఎత్తున యాత్రికులు
- యాత్రా ప్యాకేజీలు నిర్వహిస్తున్న వందల సంస్థలు



ప్రత్యేక దుస్తుల్లో విమానాశ్రయంలో ఉమ్రా యాత్రికులు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్రకు వెళ్లాలని, రెండు వారాల ఉమ్రా యాత్రకు వెళ్లి మక్కా, మదీనాలను సందర్శించాలని ప్రణాళికలు వేసుకుంటారు. ఉమ్రా యాత్ర హజ్ యాత్రకు భిన్నం. బక్రీద్ నెల మినహా మిగిలిన పదకొండు నెలల్లో ఎప్పుడైనా వెళ్లేందుకు అవకాశముంది. ఉమ్రా యాత్రకు వెళ్లాలంటే రెండు వారాలు అక్కడ ఉండాలి. ఓ వారం మక్కాలో, మరో వారం మదీనాలో బస చేయాలి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోని ముస్లిం మైనార్టీలు అక్కడికి వెళ్లేందుకు హైదరాబాద్‌లోని ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీలను సంప్రదిస్తారు. ఒక్కో వ్యక్తికి రూ.80 వేల నుంచి రూ.95 వేల వరకు తీసుకుని ట్రావెల్ ఏజెన్సీల నిర్వాహకులు హైదరాబాద్ నుంచి పంపుతున్నారు. మక్కా, మదీనా ప్రాంతాల్లో వసతి, భోజనం ఏజెన్సీలే చూసుకుంటాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి జెడ్డాకు విమానం, అక్కడి నుంచి మక్కాకు రోడ్డు ప్రయాణం, మక్కాలో ఏడు రోజుల పాటు సందర్శన, అనంతరం మదీనాలో ఏడు రోజులుండి తిరిగి జెడ్డాకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానం ద్వారా హైదరాబాద్‌కు వస్తారు.

✦ ఉమ్రా అంటే ప్రత్యేక పవిత్ర ప్రార్థన. వేర్వేరు ప్రాంతాల నుంచి ఉమ్రా యాత్రకు వెళ్లిన యాత్రికులు మక్కాలోని 'హౌస్ ఆఫ్ గాడ్' (మహ్మద్ ప్రవక్త నివసించిన ఇల్లు)లో ప్రత్యేక పవిత్ర ప్రార్థన చేస్తారు. రోజంతా అక్కడే ఉండి ఐదు సార్లు నమాజ్ ఆచరిస్తారు. కొందరు రాత్రివేళలో అక్కడే బసచేస్తారు. మరికొందరు సమీపంలోని ఇళ్లలో ఉంటారు. మిగిలిన ఆరు రోజుల్లో మహ్మద్ ప్రవక్త ప్రార్థనలు నిర్వహించిన పర్వతాలను సందర్శిస్తారు. మక్కాలో మ్యూజియాన్ని దర్శించి మదీనాకు ప్రయాణమవుతారు. అక్కడ మహ్మద్ ప్రవక్త ఖబరస్థానను దర్శించుకుంటారు. 14 వేల ఏళ్ల క్రితం నిర్మించిన మసీదును సందర్శించి పరిసర ప్రాంతాల్లోని పవిత్ర స్థలాల్లో సామూహిక, వ్యక్తిగత ప్రార్థనలు నిర్వహిస్తారు.

ప్రత్యేక వస్త్రం.. ఎహ్రామ్

ఉమ్రా యాత్రకు వెళ్లేవారు ప్రత్యేక వస్త్రం ధరించాలి. సాధారణ దుస్తుల్లో ఉమ్రాకు వెళ్లేందుకు వీల్లేదు. పురుషులు, మహిళలు తెల్ల పంచె, ఉత్తరీయం ధరించాలి. పొక్కా ఉండకూడదు. చిన్నారులు, మహిళలు తెలుపు దుస్తులు, ఉత్తరీయంలాంటి స్కార్ఫ్ ధరించాలి. ఈ ప్రత్యేక వస్త్రాన్ని 'ఎహ్రామ్' అంటారు. దీని అర్థం పరిశుద్ధమైనదని. ఇంటి నుంచి బయల్దేరేటప్పుడు కానీ, విమానాశ్రయంలో కానీ, జెడ్డా విమానాశ్రయంలో కానీ ప్రత్యేక వస్త్రాన్ని ధరిస్తారు. ఎహ్రామ్‌ను ధరించి మక్కాకు చేరుకోవాలి.

✦ హజ్, ఉమ్రా యాత్రలకు మన దేశం నుంచి ఏటా భారీ సంఖ్యలో వెళ్తున్నారు. హజ్‌కు సంబంధించిన ప్రత్యేక కోటాను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రాల వారీగా నిర్ణయిస్తుంది. రాష్ట్రంలో ఏటా 9 వేలకు పైగా భక్తులు హజ్ యాత్రకు వెళ్తున్నారు. ఉమ్రా యాత్రకు ఎలాంటి కోటా లేదు.. దీంతో హైదరాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు వందల ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ప్యాకేజీలు నిర్వహిస్తున్నాయి. ఆ యాత్రకు వెళ్తున్న వారి వివరాలు ట్రావెల్ సంస్థల వద్ద మినహా ఇతర చోట్ల ఉండవు. పూర్తిగా యాత్రికులు, ఏజెన్సీ అనుబంధంతో ఈ యాత్ర కొనసాగుతోంది.

మృత్యుంజయుడు షోయబ్!



ఈనాడు, హైదరాబాద్: ఉదయమంతా ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అలసిపోయారు. బస్సు ఎక్కగానే నిద్రలోకి జారుకున్నారు. ఒక వ్యక్తి మాత్రం నిద్రపోలేదు. డ్రైవర్ వెనకాలే కూర్చున్నాడు. సౌదీ అరేబియాలో ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమై బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఆసిఫ్‌నగర్‌లోని జిర్రా ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ షోయబ్ బస్సు డ్రైవరు వెనుక కూర్చున్నాడు. వీరి బస్సు ముందు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. వెంటనే మంటలు చెలరేగాయి. అప్పటికే మెలకువగా ఉన్న షోయబ్ వెంటనే పక్కనే ఉన్న అత్యవసర ద్వారం నుంచి బయటపడ్డాడని కుటుంబసభ్యులు తెలిపారు.

ఉమ్రా యాత్రలో ప్రమాదం బాధాకరం: మంత్రి ఫరూక్

ఈనాడు, అమరావతి: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన యాత్రికులు మరణించడం అత్యంత బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

సౌదీలో ప్రమాదం విషాదకరం: శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా

సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మక్కా మదీనా యాత్రకు హైదరాబాద్ నుంచి వెళ్లిన పలువురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ మయాన జకియా ఖానం విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సౌదీలో రోడ్డు ప్రమాదంపై మాధవ్ దిగ్భ్రాంతి

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ప్రమాదం విషాదకరం: జగన్

సౌదీ అరేబియాలో జరిగిన విషాదకర ప్రమాదం పట్ల మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

✻ సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన యాత్రికులు మృతి చెందడం పట్ల సీపీఎం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మరణించిన వారికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది.

మద్యం మత్తులో డ్రైవింగ్‌కు ఏటా 50 మంది పైనే బలి

- సగటున ఏడాదిలో 110కి పైగా ప్రమాదాలు
- కర్నూలు ఘటనైనా మేల్కొలుపు కావాలి
- డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు విస్తృతం చేయాలి

ఈనాడు, అమరావతి: కర్నూలు శివారులో ఇటీవల జరిగిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు దహనం దుర్ఘటనలో.. ఒక్క బైకర్ మద్యం మత్తు అతడితో పాటు మరో 19 మంది ప్రాణాలను బలిగొంది. ఇలా మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారి ఫలితంగా రాష్ట్రంలో ఏటా సగటున 110కి పైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిల్లో సగటున 50 మంది మరణిస్తున్నారు. మరో 100 మందికి పైగా తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమవుతున్నారు. వాస్తవంగా ఈ సంఖ్య ఇంతకు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. చాలా సందర్భాల్లో చోదకుడు మద్యం తాగి వాహనం నడపడమే ప్రమాదానికి కారణమైందన్న అంశాన్ని పోలీసు రికార్డుల్లోకి ఎక్కించట్లేదు. కర్నూలు తరహా పెద్ద దుర్ఘటనలు జరిగినప్పుడు తప్ప, చిన్నచిన్న ప్రమాదాలను పట్టించుకోవట్లేదు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోకపోతే కర్నూలు తరహా ప్రమాదాలు పునరావృతమయ్యే ముప్పు ఉంది. పోలీసు, రవాణా శాఖలు ఆ దిశగా ఉమ్మడి కార్యాచరణ చేపట్టాల్సిన అవసరముంది.



మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రాష్ట్రంలో ఐదేళ్లలో జరిగిన ప్రమాదాలు, మరణాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	130	70	157
2022	109	31	118
2021	121	50	64
2020	77	56	75
2019	127	43	144
మొత్తం	564	250	558

(ఆధారం: కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాలు)

మెదడు మొద్దుబారి.. జీవితాలు రోడ్డున పడి..

◆ మనిషి రక్తంలో ఆల్కహాల్ 30ఎంజీ/100 ఎంఎల్‌కు మించితే శరీరం, మెదడు పూర్తిగా అదుపు తప్పుతాయి. సాధారణ డ్రైవర్‌తో పోల్చితే మద్యం తాగిన చోదకుడి వల్ల ప్రమాద ఆస్కారం 40 రెట్లు ఎక్కువ.

◆ మద్యం తాగిన వారిలో వాహనం నడిపే నైపుణ్యం క్షీణిస్తుంది. దూకుడు, దుందుడుకుతనం పెరిగి ప్రమాదాలకు దారితీస్తుంది. సాధారణంగా వాహనాన్ని నిదానంగా నడిపే వ్యక్తి సైతం మద్యం మత్తు తలకెక్కగానే దూకుడుగా వ్యవహరిస్తాడు.

◆ అప్రమత్తత తగ్గిపోతుంది. తక్షణం నిర్ణయం తీసుకునే శక్తి మందగించి, హఠాత్పరిణామానికి తగ్గట్టుగా ప్రతిస్పందించలేరు. చేతుల్లో పట్టు తగ్గుతుంది. హ్యాండిల్, స్టీరింగ్‌పై అదుపు ఉండదు.

◆ ముప్పును ముందుగా పసిగట్టలేరు. వాహనాన్ని మలుపు తిప్పలేరు. ఎవరైనా అడ్డొచ్చినా ఆపలేరు. తరచూ లైన్లు మారుతారు.

◆ పరిసరాలపై పట్టు కోల్పోతారు. స్వీయనియంత్రణ ఉండదు. ముందు, వెనక వచ్చే వాహనాల రాకపోకల్ని గమనించలేరు. ఎదురుగా ఏమున్నాయో గుర్తించలేరు. కంటిచూపు మందగిస్తుంది.

మొక్కుబడిగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

రాష్ట్రంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు మొక్కుబడిగానే సాగుతున్నాయి. తనిఖీలు నగరాలు, జిల్లా కేంద్రాలకే పరిమితమవుతున్నాయి. అదీ వారాంతాల్లోనే! జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారులపై అప్పుడప్పుడు మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. తాగి వాహనం నడిపితే పోలీసులకు చిక్కడం తథ్యమనే భయం కల్పించలేకపోతున్నారు.

◆ పదేపదే మద్యం తాగి వాహనాలు నడిపే వారి వివరాలతో సమాచార నిక్షిప్త నిధి రాష్ట్ర, జిల్లా స్థాయిలో అందుబాటులో లేదు. ఎవరైనా పట్టుబడినప్పుడు జరిమానాలు విధించడం, తర్వాత వదిలేయడం సర్వసాధారణమైంది.

◆ డ్రంకన్ డ్రైవ్ కేసుల విచారణలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. శిక్షలు నామమాత్రంగానే పడుతున్నాయి.

◆ మోటారు వాహనాల చట్టం ప్రకారం మద్యం మత్తులో వాహనం నడుపుతూ తొలిసారి పట్టుబడితే రూ.10 వేల జరిమానా, 6 నెలల వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశముంది. రెండోసారి పట్టుబడితే రూ.15 వేల జరిమానా, రెండేళ్ల వరకూ జైలు శిక్ష లేదా రెండూ విధించవచ్చు. మూణ్నెల్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయాలి. అయితే ఇవేవీ పూర్తిస్థాయిలో అమలు కావట్లేదు.

సీజేఐపై దాడి.. 30కోట్ల దళితుల మీద జరిగిన దాడే!

దిల్లీ ధర్నాలో మందకృష్ణ మాదిగ



దిల్లీ జంతర్‌మంతర్‌లో జరిగిన ధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మందకృష్ణ మాదిగ

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దేశంలోని 30 కోట్ల మంది దళితులపై జరిగిన దాడిగానే పరిగణిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సీజేఐపై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇక్కడి జంతర్‌మంతర్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అత్యున్నత స్థానంలో ఉన్న న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఎన్నో సంఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన వ్యవస్థలు ఇప్పుడు చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగినా ఎందుకు మౌనంగా ఉన్నాయి? అని ఆయన ప్రశ్నించారు. ఈ ధర్నా అనుమతికి సైతం పోరాడాల్సి వచ్చిందని, చివరి క్షణంలో అనుమతినిచ్చారని మంద కృష్ణ తెలిపారు.

ఐఎస్ఏ ఫలితాల్లో తెలుగు మహిళదే తొలిస్థానం



రమ్య

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్(ఐఎస్ఏ) ఎసెస్‌మెంట్ పరీక్ష ఫలితాల్లో విజయనగరానికి చెందిన చార్టెడ్ ఎకౌంటెంట్ అన్నె వెంకట రమ్య అఖిలభారత స్థాయిలో తొలి స్థానంలో నిలిచారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) దేశవ్యాప్తంగా ఈ నెల 8న ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష నిర్వహించింది. ఇందులో జాతీయ స్థాయిలో మొదటి ముగ్గురిని ఎంపిక చేస్తారు. సీఏ తర్వాత పోస్ట్ క్వాలిఫికేషన్ కోర్సుల్లో భాగంగా చార్టెడ్ ఎకౌంటెంట్లు పోటీపడతారు. వేల మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయగా.. 155 (200 మార్కులకు) మార్కులతో రమ్య మొదటి ర్యాంకు సాధించారు. ఈమె స్వగ్రామం కృష్ణా జిల్లా బిల్లనపల్లి. తల్లిదండ్రులు సాయిరాణి, నాగేశ్వరరావు. వ్యవసాయ కుటుంబం. వివాహం అనంతరం రమ్య విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రదీప్‌నగర్‌లో ఉంటున్నారు. భర్త వల్లభనేని సాయిరాంకుమార్ చౌదరి. ఇద్దరూ సీఏ వృత్తిలోనే ఉన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. 2012 నుంచి ఈమె సీఏగా కొనసాగుతున్నారు.

'బాలలపై నేరాల్లో పోక్సో, కిడ్నాప్ కేసులే అధికం'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2023లో బాలలపై జరిగిన నేరాల్లో దాదాపు 82 శాతం కేసులు పోక్సో కిడ్నాప్ కేసులే ఉన్నాయని చైల్డ్ రైట్స్ అండ్ యూ సంస్థ సౌత్ రీజియన్ రీజినల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్ ఎన్‌సీఆర్‌బీ-2023 నివేదికను విశ్లేషిస్తూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023లో బాలలపై జరిగిన నేరాల సంఖ్య తగ్గినప్పటికీ.. బాల్య వివాహాలు, అక్రమ రవాణా వంటి నేరాలు ఎక్కువయ్యాయన్నారు.

క్యాన్సర్ కేసులపై గురి

- రాష్ట్రంలో 4.18 కోట్ల మందికి స్క్రీనింగ్ లక్ష్యం
- ఎన్‌సీడీ 4.0 సర్వేతో వ్యాధి తీవ్రతపై స్పష్టతకు కసరత్తు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో క్యాన్సర్‌తో ఏటా 30 వేల మంది చనిపోతున్నారు. 75వేల కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించి సరైన వైద్యం అందించి తీవ్రతను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. బాధితులను గుర్తించడానికి గతంలో చేపట్టిన ఎన్‌సీడీ (అసాంక్రమిక వ్యాధుల) 3.0 సర్వే ఫలితాలు సంతృప్తికరంగా రాలేదు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 21 నుంచి సెప్టెంబరు 10 వరకు 18వేల మంది వైద్యులు, సహాయకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. క్యాన్సర్ బాధితులను గుర్తించడానికే ఎన్‌సీడీ 4.0 సర్వేకు శ్రీకారం చుట్టారు. 2026 ఏప్రిల్ నాటికి ఈ సర్వే పూర్తయితే వాస్తవ పరిస్థితిపై స్పష్టత రానుంది.

వెలుగులోకి అనుమానిత కేసులు

రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన 4.18 కోట్ల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సెప్టెంబరు 17న 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌సీడీ 4.0 సర్వే ప్రారంభించారు. ఈ శిబిరాల్లో 19.46 లక్షల మందిని పరీక్షిస్తే 28,458 క్యాన్సర్ అనుమానిత కేసులు వెలుగుచూశాయి. తర్వాత పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో కొన్నాళ్లు, మొంథా తుపానుతో మరికొన్నాళ్లు సర్వేకు ఆటంకం కలిగింది. పరిస్థితి కుదుటపడ్డాక రాష్ట్రంలోని 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సర్వే ప్రారంభించారు.

✦ ఎన్‌సీడీ 4.0 సర్వేలో ఇప్పటివరకు అనుమానిత నోటి క్యాన్సర్ కేసులు 31,391 గుర్తిస్తే.. గర్భాశయ ముఖద్వార కేసులు 20,298, రొమ్ము క్యాన్సర్ కేసులు 11,694 గుర్తించారు. వీరిని నిపుణుల సమక్షంలో మరోసారి పరీక్షించి 170 రొమ్ము, 125 గర్భాశయ ముఖద్వార, 137 నోటి క్యాన్సర్ అనుమానిత కేసులను ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లకు రిఫర్ చేశారు. ఆయా కేసుల్లో ఇప్పటివరకు యూనిట్లకు వెళ్లి పరీక్షించుకున్నది 32 కేసులే.

లక్ష్యాలు చేరితే ఫలితాలు

క్యాన్సర్ లక్షణాలున్నా కొందరు పరీక్షలకు వెనకాడడంతో క్షేత్రస్థాయి వాస్తవ చిత్రం వెలుగులోకి రావట్లేదు. అవగాహన కల్పిస్తే పరిస్థితిలో మార్పు రావచ్చు.

✦ ఎన్‌సీడీ 3.0 సర్వేలో క్యాన్సర్ పీడితుల స్క్రీనింగ్‌లో 225 ప్రశ్నలు అడిగేవారు. వీటికి సమాధానాలు రాబట్టడం సాధ్యం కాక ఆ సర్వేలో స్పష్టమైన ఫలితాలు రాలేదు. 4.0 సర్వేలో ప్రశ్నలను 28కి కుదించారు. క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించేందుకు సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సెర్ప్ విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లనూ భాగస్వాములను చేశారు.

✦ శాఖల మధ్య సమన్వయం, కచ్చితమైన సమాచార సేకరణ, అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ, వైద్య పరీక్షలతో బాధితులను గుర్తించి ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లలో చేర్పించడం లాంటి లక్ష్యాలను వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశించుకుంది. ఇవి సాకారమైతే లక్ష్యాలు చేరుకునే వీలుంది.

అట్లాస్‌తో పూర్తి స్పష్టత

క్యాన్సర్ కేసులను గుర్తించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలోనే ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా నియమించింది. ఈయన నేతృత్వంలో రాష్ట్రంలో క్యాన్సర్ కట్టడి చర్యలు మొదలయ్యాయి. ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలో నమోదైన క్యాన్సర్ కేసులతో పాటు.. ఇతర వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న కేసుల వివరాలను ఒకచోట క్రోడీకరించడం, ఎన్‌సీడీ 4.0 సర్వే ద్వారా గుర్తించిన కేసుల ఆధారంగా రాష్ట్రంలో వాస్తవ పరిస్థితిపై స్పష్టతకు రానున్నారు. ఈ డేటా, మ్యాపింగ్‌లతో ఏయే జిల్లాల్లో, మండలాల్లో, ప్రాంతాల్లో కేసుల తీవ్రత ఎక్కువగా ఉంది? ప్రమాద కారకాలేంటి? నివారణ చర్యలకు ప్రణాళికలు.. తదితర అంశాలతో క్యాన్సర్ అట్లాస్ రూపొందిస్తారు. ఈ సమగ్ర నివేదిక రాచపుండు కట్టడికి మార్గదర్శకమవుతుందని భావిస్తున్నారు.

'సర్' ప్రక్రియలో పాల్గొనబోం

తమిళనాడు రెవెన్యూ సంఘాల ప్రకటన

కాంచీపురం, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా కలెక్టర్లు అర్ధరాత్రి వరకు సమావేశాలు నిర్వహించి ఇబ్బందులకు గురి చేస్తున్నందున మంగళవారం నుంచి ఆ ప్రక్రియలో పాల్గొనబోమని తమిళనాడు రెవెన్యూ ఉద్యోగుల సంఘాల సమాఖ్య సోమవారం ప్రకటించింది. చెన్నైలో అత్యవసర ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి కలెక్టరేట్ల ఎదుట నిరసన చేపట్టాలని సమాఖ్య పిలుపునిచ్చింది. 'సర్'కు సంబంధించిన పనులను బహిష్కరించాలని పలు తీర్మానాలను ఆమోదించింది.

సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్య క్రమంపై కసరత్తు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో బడ్జెట్ ఆధారితంగా తదుపరి ప్రాధాన్య ప్రాజెక్టులపై జలవనరులశాఖ కసరత్తు చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఐదు ప్రాధాన్య ప్రాజెక్టులను ఎంపిక చేసుకుని వాటికి నిధుల లోటు లేకుండా పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది.

ప్రాజెక్టులు	పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు (రూ.కోట్లలో)	ఎకరానికి ఎంత వ్యయం చేయాలి (రూ.లలో)
1. వంశధార రెండో భాగం	171.91	94,000
2. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు	263.36	55,800
3. తారకరామతీర్థ సాగరం	808.36	3,26,000
4. మహేంద్రతనయ రిజర్వాయర్	506.68	2,06,000
5. హిరమండలం ఎత్తిపోతల	176.35	8,400
6. వంశధార- నాగావళి అనుసంధానం	50.23	21,300
7. మడ్డువలస రిజర్వాయర్	30.04	57,700
8 జంఝావతి	59.00	32,400
9 నాగావళి- చంపావతి అనుసంధానం	21.53	29,000

ప్రాజెక్టు పూర్తికి చేయాల్సిన వ్యయం, రాబోయే సాగు ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఎకరానికి ఇంకా ఎంత ఖర్చు చేయాలో వేసిన లెక్కలు ఇవి...

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై లెక్కలు సిద్ధం...:

ఉత్తరాంధ్రలో నిర్మాణంలో ఉన్న 9 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలంటే రూ.2,087.46 కోట్లు ఖర్చవుతుందని అధికారులు తాజాగా లెక్కలు తేల్చారు. ఈ ప్రాజెక్టుల వల్ల కొత్త ఆయకట్టు 1,24,639 ఎకరాలు, 2,48,326 ఎకరాల స్థిరీకరణ సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు. ఏ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు చేస్తే ఎంత ఆయకట్టు సాగులోకి వస్తుందో, ఎకరానికి ఎంత ఖర్చు చేయాల్సి వస్తుందో కూడా గణాంకాలు సిద్ధం చేశారు.

కడపకు గాలేరు నగరి...: మరోవైపు రాయలసీమ ప్రాజెక్టులపైనా పరిశీలన జరుగుతోంది. తాజాగా ముఖ్యమంత్రి హామీ మేరకు కడప నగరానికి గాలేరు నగరి జలాలు తీసుకెళ్లేందుకు మిగిలిన పనికి ఎంత ఖర్చవుతుందో లెక్కించారు. ప్రస్తుత గుత్తేదారును తొలగించి కొత్తగా టెండర్లు పిలిచి పనులు చేసేందుకు రూ.1,400 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

◆ హంద్రీ-నీవా జలాలు కల్యాణి డ్యాం వరకు తరలించి అక్కడి నుంచి తిరుమల అవసరాలు తీర్చాలనే ఆలోచన ఉంది. సీఎం చంద్రబాబు దీనికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ పనులూ ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి. ◆ కర్నూలులో ఎస్కేప్ ఛానల్ అభివృద్ధి చేసి సోమశిల, కండలేరు జలాశయాలకు నీళ్లు మళ్లించే పనులకు రూ.1,480 కోట్లు ఖర్చవుతుంది. ఇప్పటికే ఈ పనులు 21.5% పూర్తయ్యాయి. ఇవీ పరిశీలనలో ఉన్నాయి. ◆ 2019 ముందు తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన భైరవానితిప్ప ప్రాజెక్టు రూ.770 కోట్లతో పూర్తి చేయాల్సి ఉంది. ◆ ఎగువ పెన్నార్ ఎత్తిపోతల పనులూ పరిశీలనలో ఉన్నాయి. రూ.640 కోట్ల వరకు ఖర్చు కానుంది. ◆ వెలిగొండ ఇప్పటికే ప్రాధాన్య పనుల జాబితాలో ఉంది. పనులు జరుగుతున్నాయి. ◆ మధ్యాంధ్రలో వరికిపూడిశెల ఎత్తిపోతల పథకం చేపట్టేందుకు కసరత్తు సాగుతోంది. ఇందులో వివిధ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ప్రస్తుత ప్రణాళికల ప్రకారం రూ.643 కోట్లు ఖర్చవుతుంది. 24,500 ఎకరాలకు సాగునీరందుతుంది. రెండో ప్రతిపాదన ప్రకారం రూ.3,543 కోట్లు ఖర్చు చేస్తే 1,00,115 ఎకరాలకు నీరందేలా ప్రణాళిక సిద్ధమైంది.

మీ క్రీడా సంఘానికి గుర్తింపు ఉందా?

- లేకుంటే ప్రభుత్వ ప్రయోజనాలు పోయినట్టే
- వీటిపై క్రీడాకారులకు అవగాహన తప్పనిసరి

ఈనాడు, అమరావతి: క్రీడలే లోకంగా కొందరు నిత్యం సాధన చేస్తుంటారు. పేదరికం, కష్టనష్టాల్ని ఎదుర్కొంటూ వివిధ క్రీడా సంఘాలు లేదా అసోసియేషన్ల తరఫున జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు, ధ్రువపత్రాలు సాధిస్తుంటారు. సంబంధిత క్రీడల్లో అగ్రగామిగానూ కొనసాగుతుంటారు. ఇదంతా బాగానే ఉన్నా.. వీరు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడా సంఘానికి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) గుర్తింపు లేకపోతే మాత్రం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందే ప్రయోజనాలన్నీ కోల్పోవాల్సి వస్తుంది. గుర్తింపు లేని సంఘం తరఫున ఎవరన్నా ఆడినా ఆ విజయానికి విలువ ఉండదు. క్రీడాకోటా కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, నగదు ప్రోత్సాహకాలు ఏవీ రావు.

> విజయవాడకు చెందిన గోకుల్ యలగందుల(24) ఎనిమిదేళ్లుగా 'బాడీ బిల్డింగ్' చేస్తున్నారు. సంబంధిత అసోసియేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2023, 24 సంవత్సరాల్లో వరుసగా రెండుసార్లు 'మిస్టర్ ఆంధ్ర' టైటిల్ సాధించారు. జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో టాప్-10లో నిలిచారు. ఇటీవల క్రీడాకోటా కింద డీఎస్సీ ఉద్యోగానికి దరఖాస్తు చేశారు. అయితే గోకుల్ ప్రాతినిధ్యం వహించిన అసోసియేషన్‌కు శాప్ గుర్తింపు లేకపోవడంతో ఉద్యోగానికి అర్హత కోల్పోయాడు.
>
> గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఓ పేద విద్యార్థిని కొన్నేళ్లుగా ఓ అసోసియేషన్ తరఫున సాఫ్ట్‌బాల్ ఆడుతోంది. అక్రమాలు జరుగుతున్నాయనే కారణంతో ఆ అసోసియేషన్ గుర్తింపును శాప్ కొంతకాలం రద్దు చేసింది. ఆ కాలవ్యవధిలో జరిగిన టోర్నమెంట్‌లో బాలిక పాల్గొని ధ్రువపత్రం పొందింది. దాంతో ట్రిపుల్ఐటీ సీటు కోసం దరఖాస్తు చేసింది. కానీ, అసోసియేషన్ గుర్తింపు రద్దు చేసిన కాలంలో నిర్వహించిన టోర్నమెంట్‌ను గుర్తించమని శాప్ పేర్కొనడంతో సీటు కోల్పోయింది.

నిబంధనలు ఏం చెబుతున్నాయ్..

✦ నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోడ్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌డీసీ-2011) ప్రకారం రాష్ట్రంలోని అన్ని క్రీడా సంఘాలు శాప్ గుర్తింపు పొందాలని రాష్ట్ర ప్రభుత్వం 2018లోనే ఉత్తర్వులు జారీ చేసింది.

✦ ఏటా వీటిని రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలా సంఘాలు ఆ నిబంధనను పాటించడం లేదు. ✦ క్రీడా సంఘాలన్నీ సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం కింద రిజిస్టర్ అవుతాయి. దాంతో వీటి మీద నేరుగా చర్యలు తీసుకొనే అధికారం శాప్‌నకు ఉండదు. ✦ కేవలం సంబంధిత జాతీయ స్థాయి ఫెడరేషన్లకు లేఖలు రాయడం, గుర్తింపు పొందాల్సిందిగా కోరడం వరకే అవకాశం ఉంటుంది.

రాష్ట్రంలో ఇది పరిస్థితి..

✦ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 64 క్రీడా సంఘాలు ఉన్నాయి. ఇందులో 28 సంఘాలకు శాప్ గుర్తింపు లేదు. మరో 26 అసోసియేషన్లు ఈ ఏడాది రెన్యూవల్ చేయించుకోలేదు. దాంతో మొత్తంగా శాప్ గుర్తింపు పొంది, రెన్యూవల్ చేయించుకున్నవి 10 సంఘాలే ఉన్నాయి. ✦ వీటిపై క్రీడాకారులు, వారి తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో ఆయా సందర్భాల్లో నష్టం జరుగుతోంది. ✦ కొన్ని క్రీడా సంఘాలు విద్యార్థులకు ఈ అంశాన్ని చెప్పడం లేదు.

ఏం చేయాలి?

✦ క్రీడా సంఘానికి శాప్ గుర్తింపు ఉన్నదీ లేనిదీ తెలుసుకోవాలి. ✦ చాలా సంఘాలు గుర్తింపు పొందినా, రెన్యూవల్ చేయించుకోవట్లేదు. ✦ వివిధ అవకతవకల కారణాలతో కొన్నింటి గుర్తింపును శాప్ రద్దు చేస్తుంది. వాటి గురించీ తెలుసుకోవాలి. లేకపోతే ఆ సమయంలో ఆయా క్రీడా సంఘాలు జారీ చేసే సర్టిఫికెట్లకు విలువలేకుండా పోతుంది.

✦ క్రీడాయాప్‌లో వ్యక్తిగతంగా నమోదు కావడం, శాప్ కార్యాలయాన్ని సంప్రదించడం ద్వారా సంఘాల గుర్తింపు వివరాలు తెలుసుకోవచ్చు.

✦ ఏదైనా ఇబ్బంది ఉంటే శాప్‌నకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రయోజనాలు ఇవీ..

✦ గుర్తింపు పొందిన జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లు, పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించొచ్చు.

✦ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, క్రీడా సామగ్రి పొందొచ్చు.

✦ విజేతలకు సర్కారు నగదు ప్రోత్సాహకాలు ఇస్తుంది. ✦ క్రీడా కోటా కింద ఎంబీబీఎస్, ట్రిపుల్ఐటీ, ఇంజినీరింగ్ వంటి సీట్లు పొందొచ్చు.

✦ గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ వంటి ప్రభుత్వ ఉద్యోగాలను పోటీ పరీక్షలు లేకుండా క్రీడల్లో ప్రతిభ ఆధారంగా పొందొచ్చు.

✦ ప్రభుత్వ క్రీడా మైదానాలు, కోచ్‌లను శిక్షణ కోసం ఉపయోగించుకోవచ్చు.

డాక్టర్‌లా.. ప్రాణం పోద్దాం రండి!

విద్యార్థులు, చిన్నారులు, డీజే దగ్గర డాన్స్ చేస్తున్న యువత, వ్యాయామం చేస్తున్నవారు ఇలా ఎందరో హఠాత్తుగా గుండెపోటుతో మరణిస్తున్నారు. అప్పటి వరకు నవ్వుతూ కనిపించిన వారు క్షణాల్లో కుప్పకూలుతున్న వైనం చూస్తున్నాం. ఒకప్పుడు 50 ఏళ్ల పైబడిన వారిలో కనిపించే గుండెపోటు, ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా వస్తోంది. ఈ పరిస్థితుల్లో సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడొచ్చు. అందుకే ప్రతి వ్యక్తీ దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు వైద్యులు.



ఎందుకు అవసరం?

- వ్యక్తి ఎక్కువ ఒత్తిడికి గురైనప్పుడు రక్త ప్రసరణలో తేడా వస్తుంది. అటువంటి సందర్భాల్లో, మెదడు, ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తం ప్రసరణ నిలిచిపోయే అవకాశం ఉంది.
- సీపీఆర్ ద్వారా రక్త ప్రవాహాన్ని త్వరగా పునరుద్ధరించి బాధితుడిని కాపాడవచ్చు. గుండెపోటు వచ్చిన తర్వాత, అవయవాలన్నీ పనిచేయడం ఆగిపోవడానికి దాదాపు ఐదు నుంచి పది నిమిషాల సమయం పడుతుంది. మెదడును సజీవంగా ఉంచి ప్రాణాల్ని రక్షించేందుకు సీపీఆర్ అవకాశం ఇస్తుంది.

సీపీఆర్‌కి ముందు చేయాల్సిన పనులు...

1. సీపీఆర్ అవసరమైన వ్యక్తి స్పృహలో ఉన్నారా? లేదా అపస్మారక స్థితిలో ఉన్నారా చూడాలి.
2. వ్యక్తి స్పృహలో ఉంటే, అతన్ని ఆ స్థితిలో ఉంచడానికి మాట్లాడుతూ, ప్రతిస్పందనను పొందేందుకు ప్రశ్నలు అడుగుతూ ఉండాలి.
3. సాధ్యమైనంత త్వరగా దగ్గరలోని ఆస్పత్రికి లేదా అంబులెన్స్‌కు కాల్ చేయాలి.
4. సమీపంలో ఎవరైనా వైద్య నిపుణులు అందుబాటులో ఉంటే, వారిని సీపీఆర్ చేయాలని అడగండి.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఎలా చేయాలి?



- మీరు సీపీఆర్‌ను సరిగ్గా నిర్వహిస్తున్నారని నిర్ధారించుకోవడానికి సీఏబీ (సర్క్యులేషన్, ఎయిర్‌వే, బ్రీతింగ్)ను గమనించాలి. ఈ మార్గదర్శకాలను వ్యక్తిలో రక్త ప్రసరణను పునరుద్ధరించడానికి నిర్వహిస్తారు.
- బాధిత వ్యక్తిని సమాంతరంగా పడుకోబెట్టి, మెడ పక్కన మీరు మోకాళ్లపై నిల్చొని ఉండాలి. ఒక చేతి మడమను బాధితుడి ఛాతీ మధ్య భాగంలో, దానిపైన మరో చేతిని ఉంచాలి.
- మీ చేతులు, భుజాలు కచ్చితంగా నిటారుగా ఉన్నాయని నిర్ధారించుకోవాలి. మీ బలాన్ని ఉపయోగించి బాధితుడి ఛాతీని కనీసం రెండు అంగుళాలు లోపలకు పోయేలా గట్టిగా వత్తాలి.
- కిందికి నొక్కడం పైకి వదలడం అనేది రెండు సమానంగా చేయాలి. మధ్యలో వదిలేయకూడదు. ఇలా ఎవరైనా వైద్యుల సాయమందే వరకూ చేస్తుండాలి.
- అప్పటికీ కదలిక లేకపోతే నోటి ద్వారా గాలి ఊదడం ప్రారంభించాలి. బాధితుడి నుదిటిపై మీ అరచేతిని ఉంచి, వారి తలను సున్నితంగా వెనుకకు వంచి గడ్డాన్ని పైకి లేపాలి.
- వ్యక్తి నోరు తెరిచినప్పుడు ముక్కును మూసివేసి, మీ నోటితో గాలిని ఊదడం ప్రారంభించాలి. ఛాతీపై చాలా శ్రద్ధ వహించి, అది పెరుగుతుందో లేదో చూడాలి.
- అదే విధంగా కొంత సేపు ఇస్తూ ఉండాలి. ఛాతీ పైకి లేవకపోతే, ఇదే ప్రక్రియను తిరిగి కొనసాగించాలి.

అవగాహనకు కార్యక్రమాలు...

సమాజంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్ నేర్చుకోవడం మంచిది. దీనిపై ఎన్జీవోలు, ఆసుపత్రులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీంతోపాటు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మధుమేహం, రక్తపోటు వంటి పరీక్ష చేయించుకోవడం చాలా మంచిది. కుటుంబంలో ఎవరికైనా కొలెస్ట్రాల్ ఉన్నట్లైతే ముందుజాగ్రత్త పడాలి.

– డాక్టర్ ఎ.వి.ఆంజనేయులు, సీనియర్ కార్డియాలజిస్ట్, ఫోకస్ డయాగ్నోస్టిక్ సెంటర్, పంజాగుట్ట, హైదరాబాద్.


సున్నం వాడకుండా నిర్మాణం.. నేటికీ అపురూపం!





కాకతీయులు నిర్మించిన ఆలయాలంటే వేయిస్తంభాల గుడి, రామప్ప దేవాలయం గుర్తుకువస్తాయి. ఆ కాలంలో కట్టిన... నిర్మాణం, శిల్పకళాపరంగా అన్నింటా ప్రాముఖ్యాన్ని కలిగి ఉంది ఖమ్మం జిల్లా కూసుమంచిలోని గణపేశ్వరాలయం. ఈ ప్రాంతంలో శిల్పకళకు మహోన్నత రూపం కనిపిస్తుంది. పురాతన కట్టడాల్లో సున్నం వాడకం కనిపిస్తుంది. ఈ ఆలయ నిర్మాణంలో సున్నం వినియోగం ఎక్కడా కనిపించదు. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో తూర్పు ముఖద్వారంతో ఈ ఆలయం నిర్మితమైంది. ముఖ మండపం, గర్భాలయంలో శిల్పకళ, ముఖద్వారం వద్ద నందీశ్వరుడి విగ్రహం, పానవట్టంతో కలిపి ఆరడుగుల ఎత్తు, అంతే పొడవు, వెడల్పుతో గర్భాలయంలో శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కాకతీయ వంశంలో చివరి రాజు, క్రీ.శ.1289 నుంచి 1329 వరకు పాలించిన ప్రతాపరుద్రుడు ఈ ఆలయాన్ని నిర్మించారని ప్రతీతి. – న్యూస్‌టుడే, కూసుమంచి

ఈ చెట్టు.. జీ+2





ఆలయం కింది అంతస్తులో..



మొదటి అంతస్తులో..



రెండో అంతస్తులో..

సనత్‌నగర్ ఎస్సార్టీ కాలనీలోని సాయిరాం సేవా సమాజ్ ఆలయంలో మేడిచెట్టు ఇది. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండు అంతస్తులను దాటి టెర్రస్‌పైకి వెళ్లింది. 1960లో శివ నివాస భవనాన్ని అప్పటి యజమానులు శేషగిరిరావు, సత్యవతీదేవిలు ఈ ఆలయం కోసం విరాళంగా అందజేశారు. మొదటి, రెండో అంతస్తుల్లో సాయి, దత్తాత్రేయ ఆలయాలను అభివృద్ధి చేశారు. 1970లో కింది అంతస్తులో ఈ మేడి చెట్టును నాటారు... ఈ 55 ఏళ్లలో 55 అడుగుల ఎత్తు పెరిగింది. చెట్టు ఎదగడం కోసం ప్రతి అంతస్తులో స్లాబ్‌ రంధ్రాలు పెట్టడంతో... ఇలా ఎదుగుతూ వస్తోంది. – న్యూస్‌టుడే, సనత్‌నగర్



ఆలయం మిద్దెపై..

గోపాల్‌రత్న.. ఈ కృష్ణారెడ్డి



ఆయనది వ్యవసాయ కుటుంబం. చిన్ననాటి నుంచి పాడి పశువులంటే ప్రాణం. ఉన్నత చదువులు చదివి, ఉద్యోగంలో స్థిరపడినప్పటికీ.. 39 ఏళ్లుగా నిరాటంకంగా డెయిరీ నిర్వహిస్తున్నారు. 73 వయస్సులోనూ డెయిరీని నిత్యం సందర్శిస్తూ పశువుల బాగోగులను చూస్తుంటారు. ఆయనే కంకణాల కృష్ణారెడ్డి.. కేంద్ర ప్రభుత్వ జాతీయ గోపాల్‌రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. స్వదేశీ పశువులు, గేదెల పోషణ విభాగంలో ఉత్తమ పాడి రైతుగా ద్వితీయ బహుమతికి ఎంపిక చేసినట్లు కేంద్ర పశుసంవర్ధకశాఖ సోమవారం వెల్లడించింది. ఈనెల 26న దిల్లీలో జాతీయ పాల దినోత్సవ వేడుకల్లో కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి రాజీవ్ రంజన్ చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరిస్తారు. ఈ సందర్భంగా మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపిక రూ.3 లక్షల నగదును అందజేస్తారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఐతోలులో జన్మించిన కృష్ణారెడ్డి జియాలజీలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని జియాలజీ సర్వే ఆఫ్ ఇండియాలో సీనియర్ జియాలజిస్టుగా ఉద్యోగం పొందారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఆయన సొంతంగా డెయిరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తమ సోదరులతో కలిసి రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో అయిదెకరాల్లో దానిని ప్రారంభించారు. పాడిని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ గ్రేడ్-1 గెజిటెడ్ ఆఫీసర్‌గా ఉన్న ఆయన 2000వ సంవత్సరంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం 100 గేదెలు, 50 ఆవులతో ఈయన డెయిరీలో ప్రతీరోజు వెయ్యి లీటర్ల ఉత్పత్తి జరుగుతోంది. సేంద్రియపాలకు ఏకైక కేంద్రం కావడంతో హైదరాబాద్ చుట్టుపక్కల నుంచి వినియోగదారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. దీని ద్వారా 50 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇక్కడ పశువులకు కృత్రిమ గర్భధారణ, వైద్య సేవలను అందిస్తున్నారు. కృష్ణారెడ్డి 2008లో ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తమ పాడిరైతు పురస్కారాన్ని పొందారు. 'అవార్డు పొందడం ఆనందంగా ఉంది. యువత ఈ రంగంలోకి రావాలి. మూగజీవాలకు సేవ చేయడంతో పాటు స్వచ్ఛమైన పాలను ప్రజలకు అందించడంలో ఎంతో ఆనందం పొందుతున్నా' అని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. –ఈనాడు, హైదరాబాద్

వ్యర్థం.. అధిక దిగుబడికి పరమార్థం



పంట వ్యర్థాలు భూసారం పెరుగుదలకే వినియోగపడేలా మారుస్తూ.. ఇద్దరు అన్నదమ్ములు చేస్తున్న వ్యవసాయం ఆదర్శప్రాయంగా నిలుస్తున్న ఉదంతమిది. పంజాబ్‌లోని భారత్-పాక్ సరిహద్దు ప్రాంతం ముంబేకే గ్రామంలో నివసిస్తున్న సోదరులు బల్వీందర్ సింగ్ బాత్, టార్సేమ్ సింగ్ బాత్ ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. గత పదేళ్లుగా పంట వ్యర్థాలను తగలబెట్టకుండా.. భూమిలో కలియదున్నుతున్నట్లు బల్వీందర్ సింగ్ పేర్కొన్నారు. దీనివల్ల పంట దిగుబడి పెరుగుతుందని.. భూమికి మేలు చేసే కీటకాలు కూడా చనిపోవన్నారు. ఈ విషయమై బల్వీందర్ సింగ్ బాత్ 'ఈటీవీ భారత్'తో మాట్లాడుతూ.. గోధుమలు విత్తడానికి, పంటకోతకు తాము ప్రత్యేకంగా ట్రాక్టర్ తయారు చేసుకున్నట్లు తెలిపారు. తమకు ఉన్న 50 ఎకరాల్లో గోధుమలను నేరుగా విత్తుతామన్నారు. పంట వ్యర్థాలను దహనం చేయకుండా పర్యావరణాన్ని కాపాడుతున్నందుకు తనకు, తన సోదరుడికి పంజాబ్ ప్రభుత్వం 'విజయవంతమైన రైతులు' బిరుదు ప్రదానం చేసినట్లు తెలిపారు. పంట కోసిన తర్వాత మిగిలిన వ్యర్థాలను భూమిలో కలియదున్నే యంత్రాలను కొనుగోలు చేయడానికి రైతులకు ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వాల్సిందిగా వారు కోరారు. –ఈటీవీ భారత్

కోరిక ఉన్నంత మాత్రాన లక్ష్యం సిద్ధించదు



- చక్కటి శరీర సౌష్టవం కావాలా? బద్ధకం వదిలి క్రమశిక్షణతో వ్యాయామాలు చేయాల్సిందే.
- వ్యాపారవేత్తగా ఎదగాలా? మీ కష్టంతో స్వయంగా మీరే వ్యాపారాన్ని నిర్మించుకోవాలి.
- జీవితంలో స్వేచ్ఛ కోరుకుంటున్నారా? దాన్ని సాధించడానికి ఇప్పుడు త్యాగాలు చేయక తప్పదు.

లక్ష్యం ఏదైనా సరే, దాన్ని అందుకోవాలంటే కేవలం కోరిక ఉంటే సరిపోదు. అందుకు అవసరమైన త్యాగాలకు సిద్ధపడటంతోపాటు జీవనశైలి, అలవాట్లను మార్చుకోవాల్సిందే.

- డేవిడ్ తలేన్, కంటెంట్ డెవలపర్

కంకి.. కారుణ్యం





పూర్వం వరి పంటను కోశాక.. బాగా గింజలున్న కంకులను ఇంటి గుమ్మాల ముందు కట్టేవారు. పిచ్చుకలు, పక్షులు వాటిని ఆహారంగా తీసుకునేవి. వాటి రాకపోకలతో కిలకిలారావాలతో ఇళ్లు కళకళలాడేవి. ప్రస్తుతం పట్టణీకరణ పెరుగుతుండడంతో ఆ పద్ధతులను ఆచరించేవారు కరవవుతున్నారు. పిచ్చుకలకు ఆహారమూ కరవై వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ధాన్యం కుచ్చులు తయారు చేసి విక్రయించడాన్ని ఉపాధిగా మలిచారు నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి (డీఆర్‌డీవో) విజయలక్ష్మి. మూడేళ్ల క్రితం 50 కుచ్చులతో ప్రారంభించి, గతేడాది 400 వరకు వాటిని తయారు చేసి విక్రయించారు. ఈ ఏడాది గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో సుమారు వెయ్యికిపైగా కుచ్చుల తయారీకి నిర్ణయించారు. కొద్దిగా పచ్చగా ఉన్నప్పుడే దొడ్డురకం వరిని కోసుకొచ్చి.. ఒక్కో కర్రను తీసుకుని.. అందులో ధాన్యం కలిగిన దాని వెన్నును తీస్తారు. అలా తీసిన వెన్నును దారంకు అల్లుతారు. ఇలా కుచ్చును తీర్చిదిద్ది ఒక్కో దానిని రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. గుమ్మాలకు కట్టుకోవడంతోపాటు శుభకార్యాల్లో అలంకరణగా, బహుమతులుగా ఇచ్చేందుకు పలువురు వీటిని కొనుగోలు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్

శివ.. మంచి ఆలోచనయ్యా





ఎక్కడో ఏదో అగ్ని ప్రమాదం జరుగుతుంది. అందరూ దాని గురించి వింటారు, చదువుతారు వదిలేస్తారు. కొందరు మాత్రం అలాంటి ఘటనలతో ప్రభావితం అవుతారు. చిత్రంలో కనిపిస్తున్న శివ రెండో కోవకు చెందిన వ్యక్తి. ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్న ఆయన దానికి బయటివైపు అగ్నిమాపక యంత్రం బిగించి హైదరాబాద్ చాదర్‌ఘాట్ వద్ద కనిపించారు. సాధారణంగా ఏ ఆటోల్లోనూ ఈ సిలిండర్ కనపడదు మీరు ఎందుకు పెట్టుకున్నారన్న ప్రశ్నకు బదులిస్తూ "ఇది సీఎన్‌జీ ఆటో కొనుగోలు సమయంలోనే వస్తుంది. కానీ చాలామంది అవసరం లేదని పక్కకు పెడతారు. ఇటీవల బ్యాటరీ వాహనాలు తరచూ రహదారులపై దగ్ధమవుతున్నాయి. అలాంటి వాహనాల్లో ఇలాంటి సిలిండర్ ఉంటే మంచిది కదా. ఆపద వేళ ఎవరికైనా ఉపయోగపడుతుందని ఇలా ఆటోకు వెనక పెట్టాను" అని సమాధానం చెప్పారు. –ఈనాడు, హైదరాబాద్

పురాతన నాణేలలోనే మదుపు



రాణీ రుద్రమదేవి కాలంలో చలామణీలో ఉన్న బంగారు వరాహ నాణెం

వివిధ కాలాలకు చెందిన నాణేల సేకరణలో తన తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు వరంగల్ ఎల్లంబజారుకు చెందిన రాగి వైకుంఠాచారి. 30 ఏళ్లుగా ఆయన విలువైన నాణేలు సేకరిస్తున్నారు. శాతవాహనులు, చోళులు, మొగలులు, కాకతీయులు, ఈస్టిండియా కంపెనీ, బ్రిటిష్ పాలన కాలంలో వాడుకలో ఉన్న నాణేలు దాదాపు పదివేల వరకూ ఆయన భద్రపరిచారు. "ఒక్కో నాణేనిది ఒక్కో చరిత్ర. వాటి ఆధారంగా భావితరాలకు చరిత్రను తెలియజేసేందుకు కృషి చేస్తున్నా. నాణేల విశిష్టతను తెలియజేసేలా పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చా. నా ఆదాయంలో 20 శాతం ఇందుకే వెచ్చిస్తున్నా. ఇప్పటివరకూ సేకరించిన నాణేల విలువ రూ.25 లక్షల వరకూ ఉంటుంది" అని చెప్పారు వైకుంఠాచారి. – ఈనాడు, హనుమకొండ

కోతి బావ.. వింటున్నావా



అదేంటి ధాన్యపు రాశిపై మైక్ పెట్టారు.. వడ్లు ఆరబెట్టేందుకు ఏమైనా కొత్త పద్ధతి అనుసరిస్తున్నారా అనుకుంటున్నారా! కాదండి. కోతుల బాధలు తప్పించుకునేందుకు నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని మున్యాల్ గ్రామ రైతులు చేసిన ప్రయత్నమిది. వానరాలు పంట పొలాలను నాశనం చేయడమే కాకుండా.. చేతికొచ్చిన ధాన్యంపై మూకుమ్మడిగా దాడి చేసి తినేస్తున్నాయి. రోజంతా వాటిని తరిమేందుకు ఓపిక లేక రైతులు ఇలా మైకులను వినియోగిస్తున్నారు. అందులో కుక్క, మనుషుల అరుపులు పెట్టడంతో విరామం లేకుండా మోగుతోంది. దీంతో రోజంతా కోతులు, రాత్రి సమయంలో పందులు ఒక్కటి కూడా రావడం లేదని రైతు ఎల్ల సుధాకర్ తెలిపారు. ఊరిలో 30 మందికి పైగా పొలాల వద్ద చిన్న చిన్న మైక్‌లను వినియోగిస్తూ పంటలు కాపాడుకుంటున్నామని ఆయన చెప్పారు. – న్యూస్‌టుడే, దస్తురాబాద్

రామగుండంలో 'జాలీ' మార్గం



పట్టణాలు, నగరాల్లో వర్షం కురిసిందంటే రహదారులపై నీళ్లు నిలుస్తాయి. కాలనీలు జలమయమవుతాయి. దీనికి ప్రధాన కారణం.. కాలువల్లో చెత్త, వ్యర్థాలు చేరి వరద సాఫీగా ప్రవహించకపోవడమే. ఈ సమస్య నివారణకు రామగుండం నగరపాలిక అధికారులు నడుం బిగించారు. కాలువలపై ప్రత్యేకంగా జాలీలతో కప్పు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని ప్రధాన మురుగు కాలువలన్నింటిపైనా రెండు కి.మీల పొడవునా జాలీలతో కప్పుల ఏర్పాటుకు నిర్ణయించి ప్రస్తుతం ఇందిరానగర్‌లో సుమారు 250 మీటర్ల పొడవున పనులు పూర్తిచేశారు. దీంతో చెత్త, వ్యర్థాలు వేసేందుకు ఆస్కారం లేదు. మరోవైపు వీలైన చోట కాలువ పక్కన పాదచారుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. –న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

సెయింట్ బసిలికా @ 400 ఏళ్లు





క్యాథలిక్కులకు పవిత్రమైన సెయింట్ పీటర్స్ బసిలికా చర్చి నేడు నాలుగు వందల సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. వాటికన్ సిటీలో 1506 ఏప్రిల్ 18న మొదలైన ఈ నిర్మాణం 120 ఏళ్లపాటు కొనసాగి 1626 నవంబరు 18న భక్తులకు అందుబాటులోకి వచ్చింది. క్రీస్తుకు అత్యంత సన్నిహిత 12 మంది శిష్యుల్లో ఒకరైన పీటర్ సమాధిపై దీనిని నిర్మించారు. 4వ శతాబ్దంలో కాన్‌స్టాన్‌టైన్ చక్రవర్తి నిర్మించిన పాత బసిలికాను తొలగించి ఈ అద్భుత కట్టడాన్ని తీర్చిదిద్దారు. ప్రపంచ ప్రఖ్యాత కళలు, ఆర్కిటెక్చర్‌కు అద్దంపట్టే ఈ నిర్మాణంలో అప్పటి ప్రముఖ కళాకారులు మైఖెలెంజిలో, బెర్నిని తదితరులు పాలుపంచుకున్నారు. పోప్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించే ఈ చర్చిని ఏటా లక్షల మంది సందర్శిస్తారు. బసిలికా అంటే ప్రాచీన రోమ్‌లో ప్రజాపరిపాలన భవనం. పోప్‌తో ప్రత్యేక హోదా పొందిన చర్చి అని అర్థం. – ఈనాడు, హైదరాబాద్